॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ దశమోఽధ్యాయః - విభూతియోగః

## (పదియవ అధ్యాయము - విభూతియోగము)

రెండవ షట్కములో కృష్ణపరమాత్మ ఈశ్వరస్వరూపాన్ని వర్ణిస్తున్నాడు. రెండవ షట్కములో 7-12 అధ్యాయాలు వస్తాయి. ఏడవ అధ్యాయంనుంచి ఈశ్వరస్వరూపాన్ని ఒక క్రమపద్ధతిలో వర్ణించుకుంటూ వస్తున్నాడు. 7 నుండి 9 వరకూ ఈశ్వరస్వరూపాన్ని వర్ణించాడు, 10 నుంచి 12 వరకూ కూడా అదే అంశం కొనసాగుతుంది.

గడచిన మూడు అధ్యాయాలలోనూ భగవంతుణ్ణి కృష్ణపరమాత్మ జగత్కారణబ్రహ్మగా వర్ణించాడు. అంటే సృష్టికర్తగా వర్ణించాడు. అంతేకాకుండా భగవంతునియొక్క రెండు స్వరూపాలను కూడా వర్ణించాడు. అవి **పరాప్రకృతి, అపరాప్రకృతి**.

పరాప్రకృతి భగవంతునియొక్క ఉన్నతస్థాయి, అపరాప్రకృతి భగవంతునియొక్క వ్యవహారిక స్థాయి. ఇంకో విధంగా చెప్పాలంటే పరాప్రకృతి చైతన్యం అయితే, అపరాప్రకృతి పదార్థం. ఆ విధంగా - **చైతన్యం + మాయ = చైతన్యం + పదార్థం = భగవంతుడు**.

పరాప్రకృతి, అపరాప్రకృతిలలో సమానంగా ఉన్న అంశాలు, భిన్నంగా ఉన్న అంశాలు కూడా చూశాము.

**సమాన అంశాలు** - చైతన్యం అనాది, పదార్థం లేదా మాయ అనాది. అందువల్ల చైతన్యాన్ని కాని పదార్థాన్ని కాని సృష్టించలేము. ఈ అనాది సృష్టించబడలేని చైతన్య-పదార్థ సమ్మేళనాన్ని **ఈశ్వరుడు** అంటారు.

**భిన్న అంశాలు - నిర్వికార-సవికారాలు** - పరాప్రకృతి అయిన చైతన్యం మార్పు చెందదు. కాని పదార్థం మార్పు చెందుతుంది. పదార్థం మార్పు చెంది ఈ జగత్తుగా వ్యక్తమవుతుంది; మళ్ళీ మార్పు చెంది అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. ఆ విధంగా పదార్థం అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి, వ్యక్తంనుంచి అవ్యక్తంలోకి మారుతూ ఉంటుంది. వ్యక్తంలోకి వచ్చినప్పుడు నానాత్వం కనబడుతుంది. ఈ విధంగా పరాప్రకృతి నిర్వికారం; అపరాప్రకృతి సవికారం.

**నిర్గుణ-సగుణాలు** - పరాప్రకృతి నిర్గుణం. పరాప్రకృతికి ఏ గుణాలూ లేవు. అందువల్ల దానిని అధ్యయనం చెయ్యటానికి అందదు. అంటే లౌకిక ప్రమాణాలకు అందదు. కాని అపరాప్రకృతికి అనేక గుణాలున్నాయి. అందువల్ల అది సగుణం. ఈ విధంగా పరాప్రకృతి నిర్గుణం; అపరాప్రకృతి సగుణం.

**సత్యం-మిథ్యలు** - ఈ అంశం ఇక్కడ మనకు పెద్దగా అవసరం లేదు కాని ఈ సందర్భంలో గుర్తు తెచ్చుకుంటే మంచిది. పరాప్రకృతి అయిన చైతన్యానికి ఉనికి విడిగా ఉంది. అందువల్ల అది స్వతంత్రం. స్వతంత్రం కాబట్టి సత్యం. కాని పదార్థానికి విడిగా ఉనికి లేదు. అది పరతంత్రం. పరాప్రకృతిమీద ఆధారపడివుంది. స్వతంత్రంగా ఉనికి లేని దాన్ని మిథ్య అంటారు. ఈ విధంగా పరాప్రకృతి సత్యం; అపరాప్రకృతి మిథ్య.

ఈ విధంగా చేతన–అచేతన; నిర్వికార–సవికార; నిర్గుణ–సగుణ; సత్య–మిథ్య; చైతన్యం–పదార్థాల మేలుకలయికను భగవంతుడు అంటారు. ఈ పరాప్రకృతి–అపరాప్రకృతులను కలిపి జగత్తుయొక్క మాతాపితలు అంటారు. అంటే ఈ రెండూ విడదీయలేని, విడిపోని, విడరాని జంట.

**వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే**
**జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ** – రఘువంశం ప్రార్థనాశ్లోకం 1.1

**వాగర్థావివ** – వాక్, దాని అర్థం అంటే ఒక పదం, దాని అర్థాన్ని ఎలా విడదీయలేమో అలా పరాప్రకృతి, అపరాప్రకృతిది విడదీయలేని బంధం. అటువంటి భగవంతుడు జగత్కారణబ్రహ్మ. అంటే ఈ జగత్తును సృష్టించాడు.

భగవంతునియొక్క జగత్కారణ హోదాని మూడు దశల్లో వర్ణిస్తారు. భగవంతునియొక్క ఈ స్థాయీ భేదాలు, భక్తునియొక్క స్థాయీ భేదాలను దృష్టిలో పెట్టుకుని చెప్పబడ్డాయి. అంటే మందభక్తులు, మధ్యమభక్తులు, ఉత్తమభక్తులను దృష్టిలో పెట్టుకుని చెప్పబడ్డాయి.
నిమిత్తకారణం – మందభక్తులకు భగవంతుడు ఈ జగత్తును సృష్టించాడు అని చెబుతుంది శాస్త్రం. ఒక వడ్రంగి కుర్చీలను సృష్టించినట్టుగా, ఒక కంసాలి నగలను సృష్టించినట్టుగా, భగవంతుడు ఈ జగత్తును సృష్టించాడు. ఈ స్థాయిలో భగవంతుణ్ణి నిమిత్తకారణం అంటుంది శాస్త్రం

ఇంతకుముందు చూసిన ఉదాహరణలలో వడ్రంగి, కంసాలి, కుమ్మరులు నిమిత్తకారణాలు. వారివారి రంగాల్లో వారి మేధస్సును ఉపయోగించి ఆయా వస్తువులను సృష్టిస్తారు. అందువల్ల జగత్తును సృష్టించిన భగవంతుణ్ణి కూడా ఒక వ్యక్తిగా ఊహించుకుంటాము. ఎప్పుడైతే భగవంతుణ్ణి ఒక వ్యక్తిగా ఊహిస్తామో అప్పుడు ఆయనకొక చిరునామా ఉండాలి. ఎక్కడ ఉంటాడు ఆ మేధావి? ఆయనకు భూలోకంలోని చిరునామా ఇవ్వలేము. మద్రాసులోనో, హైదరాబాద్‌లోనో ఉన్నాడనలేము. అందువల్ల ఎక్కడున్నాడు అంటే కైలాసంలో ఉన్నాడు అంటాము.

**ఛాయాయాం పారిజాతస్య హేమసింహాసనోపరి**
**ఆసీనమంబుదశ్యామమ్ ఆయతాక్షమలఙ్కృతమ్**
**చంద్రాననం చతుర్బాహుం శ్రీవత్సాఙ్కితవక్షసమ్**
**రుక్మిణీ సత్యభామాభ్యాం సహితం కృష్ణమాశ్రయే** – ధ్యానశ్లోకం 7

ఎక్కడున్నాడు భగవంతుడు?

**పారిజాతస్య ఛాయాయాం** – పారిజాత చెట్టు నీడలో. వైకుంఠంలో పారిజాతవృక్షం ఉంది; **హేమసింహాసనోపరి ఆసీనమ్** – సువర్ణ సింహాసనంమీద ఆసీనుడైయున్నాడు; **అంబుదశ్యామమ్** – నల్ల మేఘంలాగా ఉన్నాడు; **ఆయతాక్షమ్**– అందమైన విశాలనేత్రాలు కలవాడు; **అలఙ్కృతమ్** – అనేక ఆభరణాలు అలంకారంగా కలవాడు; **చన్ద్రాననం** – చంద్రుని వంటి అందమైన మొహం కలవాడు; **చతుర్బాహుం** – నాలుగు భుజాలు కలవాడు; **శ్రీవత్సాఙ్కితవక్షసమ్**–

శ్రీదేవిని వక్షస్థలంలో కలవాడు; **రుక్మిణీ సత్యభామాభ్యాం సహితం కృష్ణమాశ్రయే** – రుక్మిణీ, సత్యభామల సహిత కృష్ణపరమాత్మ ఉన్నాడు.

ఇది సృష్టికర్త విష్ణుమూర్తి వర్ణన. ఇటువంటి విష్ణుమూర్తి ఎలా సృష్టించాడు? ఆయన నాభినుంచి కమలంలో బ్రహ్మ వెలిశాడు. జగత్తును విష్ణుమూర్తి ప్రత్యక్షంగా సృష్టించలేదు. ఆయన బ్రహ్మను సృష్టిస్తే బ్రహ్మ జగత్తును సృష్టించాడు. ఇది భగవంతునియొక్క మొదటిస్థాయి. ఇలా ఒక ఆకారంలో ఊహించుకోవటంవల్ల ధ్యానం చెయ్యటానికి వీలుగా ఉంటుంది. అందువల్లనే ఇది ధ్యానశ్లోకంలో చొప్పించబడింది. ఈ స్థాయిని **ఏకరూప దర్శనం** అంటారు.

2. **ఉపాదాన కారణం** – కొంతకాలం భగవంతుణ్ణి ఆ స్థాయిలో కొలిచాక, మనస్సు కొంత పరిపక్వత చెందాక, బుద్ధి కొన్ని సందేహాలను కలుగజేస్తుంది. భగవంతుడు సర్వవ్యాపకుడు అంటున్నారు కదా, సర్వవ్యాపకుడు అయితే ఆయన వైకుంఠంలో మాత్రమే ఎలా ఉంటాడు? ఆయనే మొట్టమొదట ఉంటే, మరి ఈ సృష్టికి కావాల్సిన ముడిసరుకులు ఎక్కడనుంచి వచ్చాయి? ఇలాంటి ప్రశ్నలు చోటుచేసుకుంటాయి.

అప్పుడు శాస్త్రం రెండవ స్థాయిని వివరిస్తుంది. మొదటేమంది? భగవంతుడు **జగత్తును సృష్టించాడు** అంది. ఇప్పుడేమంటున్నది? **భగవంతుడు తానే జగత్తు అయ్యాడు** అంటున్నది. ముందు చూసిన ఉదాహరణలలో వడ్రంగికి చెక్క బయట దొరుకుతుంది; కంసాలికి బంగారం బయట దొరుకుతుంది; కుమ్మరికి మట్టి బయట దొరుకుతుంది. కాని సృష్టికి పూర్వం పదార్థం లేదు; చైతన్యం మాత్రమే ఉంది. అంటే భగవంతుడు మాత్రమే ఉన్నాడు; ముడిసరుకు లేదు. అందువల్ల ముడిసరుకు కూడా ఆయన నుంచే వచ్చింది. సృష్టికి పూర్వం ఆకాశం లేదు; ఆకాశంతో కూడిన పంచభూతాలు లేవు. అవి కూడా ముందు సూక్ష్మరూపంలో, తర్వాత వాటి పంచీకరణం జరిగి స్థూలభూతాలుగా సృష్టించబడ్డాయి. అందువల్ల ముడిసరుకు కూడా ఆయననుంచే వచ్చింది. అదెలా సాధ్యం? శాస్త్రం దానికి ఉదాహరణను కూడా ఇస్తుంది.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ** – ముండకం 1.1.7

ఎలాగైతే సాలెపురుగు తనలోంచే దారాన్ని తీసుకుని సాలెగూడు కడుతుందో, అలా భగవంతుడు కూడా తనలోంచే ముడిసరుకుని తీసుకుని జగత్తును సృష్టిస్తాడు. అలా ఎలా సృష్టించగలడు అంటే ఇంతకుముందే చూశాము, భగవంతుడు పరాప్రకృతి, అపరాప్రకృతిల మేలుకలయిక అని. అంటే ఆయనే చైతన్యతత్త్వం, ఆయనే పదార్థతత్త్వం కూడా. అందువల్ల భగవంతుడు తానే జగత్తు అయ్యాడు అంటుంది శాస్త్రం. దానికి వాడే పదం ఈశ్వరుడు. **జగత్తు ఉపాదాన కారణం**.

భగవంతుడు తానే జగత్తుగా అయ్యాడు అని తెలుసుకుంటే, భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అని అడగము. భగవంతుడు ఎక్కడున్నాడు అని ఎవరైనా అడిగితే, ఈ స్థాయిలో జవాబు చెప్పకుండా, భగవంతుడు ఎక్కడ లేడు అనగలగాలి. జగత్తు అంతటా భగవంతుడు ఉన్నాడు. ఇంతకు ముందు ఆకాశాన్ని, వాయువును భగవంతుడు సృష్టించాడని చెపితే, ఇప్పుడేమంటాము? ఆకాశం భగవంతుడే, వాయువు భగవంతుడే. ఇది ఏడవ అధ్యాయంలో చూశాము.

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥** – 7.8

భగవంతుడు, సూర్యకాంతిని సృష్టించలేదు; భగవంతుడే సూర్యకాంతిరూపంలో ప్రకటితమవుతున్నాడు. అందువల్ల ఉదయిస్తున్న సూర్యునికి నా నమస్కారములు.

**అసౌ యస్తామ్రో అరుణ ఉత బభ్రు స్సుమంగలః ।**
**యే చేమాగ్ం రుద్రా అభితో దిక్షు శ్రితాః**
**సహస్రశో వైషాగ్ం హేడ ఈమహే ॥**
**అసౌ యోఽవసర్పతి నీలగ్రీవో విలోహితః ।**
**ఉతైనం గోపా అదృశన్నదృశన్నుదహార్యః ।** – నమకం

రుద్రంలో ఎంత అద్భుతమైన మంత్రం ఇది! పరమేశ్వరుడు అద్భుతంగా సూర్యభగవానునిలాగా అనేక రంగులలో ప్రకటితమవుతున్నాడు. ముందుగా ఎర్రటి ఎరుపు, తర్వాత మేలిమి పసుపు, తర్వాత తెల్లటి తెలుపు రంగులలో మారుతూ ఉంటాడు. ఈ దర్శనం గోపికలకూ, గోపబాలికలకూ అవుతుంది అంటుంది రుద్రం. వారికి వారివారి పనులతో క్షణం తీరిక లేకుండా ఉంటుంది, గుడికి వెళ్ళే తీరిక ఉండదు. అందువల్ల వారి గోవులను తీసుకు వెళతూండగానే వారికి దైవదర్శనం అవుతుంది.

అలాగే **ఉదహార్యః** అంటే నీళ్ళు తీసుకెళ్ళే స్త్రీలకు కూడా సూర్యుని రూపంలో దర్శనం ఇస్తాడు. వారు మూడేసి కుండలు ఒకదానిమీద ఒకటి పేర్చి, నెత్తిమీద పెట్టుకుని, ముచ్చట్లాడుకుంటూ, కొండకచో పోట్లాడుకుంటూ, నడుస్తూ ఉంటారు. ఆ కుండలలోని నీళ్ళు కొంచెం కూడా చిందవు. వారు కూడా గుడికి వెళ్ళనవసరం లేదు; సూర్యభగవానుని రూపంలో భగవంతుడు వారికి దర్శనమిస్తాడు. అలా నిరక్షరాస్యులకే కాదు, ద్విజుడికి కూడా సూర్యభగవానుని రూపంలో దర్శనమిస్తాడు.

అలా రెండవస్థాయి భక్తికి వస్తే ఈశ్వరదర్శనం అంతటా అవుతుంది. ఏమిటా రెండవ స్థాయి? ఈశ్వరుడు జగత్తు అయ్యాడు. అంటే భగవంతుడు ఉపాదానకారణం. ఈ భగవంతునికి శరీరం ఏమిటి?

**భూఃపాదౌ యస్యనాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే**

భగవంతుడు ఈ జగత్తు అంతటా ఉన్నాడు. నేను ఆయనకోసం పెద్దపెద్ద క్యూలలో నిలుచోనవసరం లేదు. కళ్ళు తెరిస్తే చాలు, నా ఎదురుగా ఉన్నాడు. ఈ స్థాయిని విశ్వరూపదర్శనం లేదా అనేకరూపదర్శనం అంటారు. అనేకరూపం అంటే అనేక దేవుళ్ళుగా కాదు, విశ్వమంతటా అనేకరూపాల్లో ఉన్నాడని అర్థం. ఇది మధ్యమ అధికారికి. ఈ విశ్వరూప ఈశ్వరవర్ణనను 7, 9, 10, 11 అధ్యాయాల్లో చూస్తాము.

ఈ విశ్వరూపదర్శనంవల్ల జగత్తును బ్రహ్మగా చూస్తాము.

**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే బ్రహ్మ, బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే జగత్తు**

మొదటిదశలో భగవంతుడు అలవైకుంఠపురంలో ఉన్నాడు అనుకుంటాము. భగవంతుడు వేరు, జగత్తు వేరు ఆ స్థాయిలో. కాని రెండవ దశకు వచ్చేసరికి భగవంతుడు వేరు, జగత్తు వేరు కాదు. ఎందుకంటే భగవంతుడే జగత్తు అయ్యాడు; బంగారమే ఆభరణాలు అయ్యింది; చెక్కే సామాగ్రి అయ్యింది; మట్టే కుండలు అయ్యింది. భగవంతుడు మరియు జగత్తు అనలేము. అలా అంటే రెండూ రెండు భిన్నవస్తువులు అయ్యాయి. బంగారం మరియూ ఆభరణాలు అనగలమా?

3. **నిర్గుణబ్రహ్మ** – మూడవస్థాయిలో ఈ విశ్వరూపదర్శన స్థాయినుంచి భగవంతుని ఉన్నతస్థాయికి ఎదగటం. ఆ స్థాయికి అంత తేలికగా అందరూ చేరుకోలేరు. భగవంతుడు జగత్తును సృష్టి చేశాడు అన్నాము మొదటిదశలో; భగవంతుడు తానే జగత్తు అయ్యాడు అన్నాము రెండవదశలో; ఇప్పుడు మూడవదశలో భగవంతుడు జగత్తును సృష్టి చెయ్యలేదు, జగత్తు తానే అవలేదు అంటాము. జగత్తు తానే అయ్యాడు అంటే భగవంతుడు మార్పు చెందినట్టు అవుతుంది. భగవంతుడు నిర్గుణబ్రహ్మ. అందువల్ల జగత్తు వచ్చినట్టుగా అనిపిస్తుంది. అంటే **బ్రహ్మ సత్యం, జగత్ మిథ్యా**. జగత్తు అవ్యక్తంనుంచి వ్యక్తమయింది, మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. అందువల్ల **బ్రహ్మ కార్యకారణ విలక్షణం** అంటాము. దీన్ని అరూపభక్తి అంటాము. అంటే నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందాలి భక్తుడు. ఇది పారమార్థిక స్థాయి. దీనికి రావటానికి సమయం పడుతుంది. దీన్ని 13వ అధ్యాయంనుంచి చూస్తాము.

**ఈశావాస్యమిదగ్ం సర్వమ్** – ఈశావాస్యోపనిషత్తు

రెండవస్థాయి భక్తిలో, సృష్టిలో ఏ గొప్పతనాన్ని చూసినా అది భగవంతుని గొప్పే అవుతుంది. యు.పి.యస్. అంటే అన్‌ఇంటరప్టెడ్ పవర్ సప్లై. దీన్ని మనం వ్యవహారంలో వాడతాము. కాని మనకు యు.పి.యస్. ఎవరు? సూర్యభగవానుడు. కొన్ని వందలవేల సంవత్సరాలుగా, నిరాఘాటంగా మనకు శక్తిని, కాంతిని ఇస్తున్నాడు. పైగా ఏప్రిల్, మే నెలలలో చండప్రచండంగా వెలుగుతాడు. అలా ప్రకృతిలో ఏ అంశాన్ని తీసుకున్నా భగవంతుని విభూతి కనిపిస్తుంది. భూమి గొప్పతనం, నీటి గొప్పతనం – ఒకటేమిటి అన్నిటి గొప్పతనమూ ఆయనదే.

అయితే నా గొప్పతనం మాటేమిటి? అసలు గొప్పతనం ఉందా అన్నది ప్రశ్న. ఒకవేళ ఉంటే అది కూడా భగవంతునికే చెందుతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? మనిషిగా మనం కూడా పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయికే. పరాప్రకృతి అంటే చైతన్యతత్త్వం, అపరాప్రకృతి అంటే పదార్థతత్త్వం. రెండూ భగవంతునియొక్క అంశాలే. అందువల్ల మనమంటూ విడిగా ఎక్కడున్నాము? అంటే మన గొప్పతనం కూడా భగవంతునికే చెందుతుంది.

ఇలా అన్ని విభూతులనూ భగవంతుని విభూతిగా చూడటాన్ని విభూతిదర్శనం అంటారు. దీనివల్ల మనం పొందే గొప్ప ప్రయోజనం ఏమిటి? మనం వినయసంపన్నులం అవుతాము. ఏ విజయం సాధించినా, నా గొప్పతనం ఏం లేదు, అంతా భగవంతునిదే అంటాము. కేనోపనిషత్తులో దేవతలకు విజయగర్వం కలిగితే, భగవంతుడు వారి ముందు యక్షుని రూపంలో ప్రత్యక్షమయి, వారికి గర్వభంగం కలిగించాడు. అలా పురాణాలలో

ఎన్నో గర్వభంగాల కథలున్నాయి. మనలో అలా గర్వం నాట్యం చెయ్యకుండా ఉండాలంటే, ఈ విభూతియోగం అధ్యాయాన్ని జీర్ణించుకోవాలి.

అంతేకాదు, ఎదుటివ్యక్తిలో ఏదైనా గొప్ప లక్షణం చూస్తే, మామూలుగా అయితే ఈర్ష్య పడతాము. కాని విభూతియోగం నేర్చుకుంటే అది కూడా ఈశ్వరవిభూతి అని తెలుసుకుంటాము. ఒక్కోసారి నేను గొప్పా, అతను గొప్పా అనే పోటీ కలుగుతుంది. ఇప్పుడు రెండూ భగవంతుని విభూతులే అంటే నేనూ గొప్పవాడిని కాదు, అతనూ గొప్పవాడు కాదు అని అర్థమవుతుంది. ఇంక ఈర్ష్యకు చోటేది?

అందువల్ల విశ్వరూపభక్తునికి అహంకారం కాని, ఈర్ష్య కాని ఎన్నడూ చోటు చేసుకోదు. ఎందుకంటే అంతటా ఈశ్వరవిభూతినే చూస్తాడు అతను. అటువంటి మార్పును మనలో తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నాడు కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో. అంతటా ఈశ్వరవిభూతిని చూస్తాము కాబట్టి ఈ అధ్యాయాన్ని **విభూతియోగః** అన్నారు. సర్వత్ర ఈశ్వరవిభూతిదర్శనం ఈ అధ్యాయం యొక్క సారాంశం. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగుపెడదాము.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 1 **భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచః ।**
**యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥**
భూయః, ఏవ, మహాబాహో, శృణు, మే, పరమమ్, వచః,
యత్, తే, అహమ్, ప్రీయమాణాయ, వక్ష్యామి, హితకామ్యయా ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో | = ఓ అర్జునా! | భూయః | = ఇంకా |
| యత్, వచః | = ఏ మాట(ల)ను | అహమ్ వక్ష్యామి | = నేను చెప్పబోవుచున్న |
| ప్రీయమాణాయ | = నాపై ప్రేమాదరములు, భక్తి విశ్వాసములు గలవాడవైన | మే | = నాయొక్క |
| | | తత్ | = ఆ |
| తే | = నీకు | పరమమ్, వచః, ఏవ | = సర్వశ్రేష్ఠములైన మాటలనే |
| హితకామ్యయా | = హితమును చేయు కోరికతో | శృణు | = వినుము |

**హే మహాబాహో! భూయః ఏవ మే పరమమ్ వచః శృణు ।**
**ప్రీయమాణాయ తే యత్ అహమ్ హిత-కామ్యయా వక్ష్యామి ॥**

తా: ఓ అర్జునా! నాపై ప్రేమాదరములు, భక్తి విశ్వాసములు గలవాడవైన నీకు హితమును చేయు కోరికతో ఏ మాటలను నేను ఇంకా చెప్పబోవుచున్నానో ఆ సర్వశ్రేష్ఠములైన మాటలనే వినుము.

**1. ఈశ్వరస్వరూపజ్ఞానం: శ్లోకాలు 1-11** ఈ అధ్యాయం అర్జునుని ప్రశ్నతో మొదలవదు. భగవంతుడే స్వయంగా ఈశ్వరస్వరూపం గురించి మరికొన్ని వివరాలు ఇవ్వదలుచుకున్నాడు. నువ్వు నాకు ప్రియశిష్యుడివి కాబట్టి నీకు ఇంకా చెబుతాను అంటున్నాడు. శిష్యులకు ఎలాగైతే మంచి గురువులు నచ్చుతారో, గురువులకు కూడా అలాగే మంచి శిష్యులు నచ్చుతారు. ఎందుకంటే మంచి శిష్యుడు దొరికితే, గురువు తన సృజనాత్మకతను, బోధనాపటిమను బయటకుతీసుకురాగలుగుతాడు. శిష్యుడు శ్రద్ధగా వింటే గురువులో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. అదే శిష్యుడు ఆముదం తాగిన మొహం పెట్టి, గడియారాన్ని చూసుకుంటూ ఉంటే, గురువు చెప్పేది కూడా మర్చిపోతాడు.

కఠోపనిషత్తులో నచికేతుణ్ణి మెచ్చుకుంటాడు యమధర్మరాజు. అలాంటి శిష్యులు నాకు రావాలని కోరుకుంటాడు కూడా. అలాగే అర్జునుడులాంటి శిష్యుడు దొరికినందుకు కృష్ణపరమాత్మ కూడా మురిసి పోతున్నాడు. ఓ అర్జునా, నేను ఇంకా చెప్పబోతున్నాను అంటున్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ** – కృష్ణపరమాత్మ చెపుతున్నాడు.

**మహాబాహో** – గొప్ప బాహువులుగల ఓ అర్జునా! గొప్ప బాహువులు పరాక్రమానికి ప్రతీక.

**భూయ ఏవ మే పరమం వచః శృణు** – మళ్ళీ ఒకసారి నేను చెప్పబోయే సర్వశ్రేష్ఠములైన మాటలను విను. సర్వశ్రేష్ఠమైన మాటలు అంటే ఏమిటి? మాటలు అన్నీ ఒకటే. అవి ఎప్పుడు సర్వశ్రేష్ఠములు అవుతాయి? సర్వశ్రేష్ఠములైన విషయాల గురించి చెపితే. అంటే శ్రేష్ఠమైన భగవంతుని గురించి చెప్పబోతున్నాను అంటున్నాడు. ఎందుకు చెప్పబోతున్నాడు?

**ప్రీయమాణాయ తే** – నువ్వు నాకు ప్రియమైనవాడవు కాబట్టి. ప్రీయమాణాయ అంటే నాకు ఇష్టమైన శిష్యుడివి అని అర్థం. నిజానికి గురువుకు ఇష్టమైన శిష్యుడు, ఇష్టంలేని శిష్యుడు అని ఉండకూడదు. ఇక్కడ ఇష్టమైన శిష్యుడు అంటే శ్రద్ధాభక్తులతో వింటున్నాడు అని అర్థం. నువ్వు శ్రద్ధతో వింటున్నందుకే కాదు; ఇంకో కారణంవల్ల కూడా చెబుతున్నాను.

**హితకామ్యయా అహం వక్ష్యామి** – నీకు హితమైన వచనాలు చెబుతాను. అంటే అవి నీకు మేలు చేస్తాయి. అంటే దీని ఉద్దేశం, ఈ మాటలు చెప్పటం నా మంచికోసం కాదు, నీ మంచికోసం చెపుతున్నాను అని. కృష్ణపరమాత్మకు ఏమీ అవసరం లేదు.

> **న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।**
> **నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥** – 3.22

నేను పొందాల్సింది ఏమీ లేదు అన్నాడు అందులో. అందువల్ల అర్జునునిమీద ప్రేమ కొద్దీ మంచిమాటలు చెప్పబోతున్నాను అంటున్నాడు.

శ్లో. 2 **న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః ।**
**అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥**
న, మే, విదుః, సురగణాః, ప్రభవమ్, న, మహర్షయః,
అహమ్, ఆదిః, హి, దేవానామ్, మహర్షీణామ్, చ, సర్వశః ॥

| | | | |
|---|---|---|---|
| మే | = నాయొక్క | అహమ్ | = నేను |
| ప్రభవమ్ | = పుట్టుక అంటే లీలావతారములు | సర్వశః | = అన్ని విధములుగను |
| సురగణాః | = దేవతలకు | దేవానామ్, చ | = దేవతలకును |
| న, (విదుః) | = తెలియదు | మహర్షీణామ్, చ | = మహర్షులకును |
| మహర్షయః | = మహర్షులకు | ఆదిః | = ఆది మూలకారణమైనవాడను |
| న, విదుః | = తెలియదు | | |
| హి | = ఎందుకంటే | | |

**సుర–గణాః మహర్షయః చ మే ప్రభవమ్ న విదుః, అహమ్ హి**
**దేవానామ్ మహర్షీణామ్ (చ) సర్వశః ఆదిః (అస్మి) ॥**

తా: నాయొక్క పుట్టుకలను అంటే లీలావతారములు దేవతలకు తెలియదు, మహర్షులకు తెలియదు. ఎందుకంటే నేను అన్ని విధములుగను దేవతలకును, మహర్షులకును ఆది మూలకారణమైనవాడను.

మొదటి మూడు శ్లోకాలను ఉపోద్ఘాత శ్లోకాలు అనవచ్చు. ఈ అధ్యాయంలో చర్చించబోయే అంశం ఈశ్వరస్వరూపజ్ఞానం, ఈశ్వరవిభూతిజ్ఞానం అని చూశాము. ఇందులో ఈ అంశాన్ని వేరే ఎవరి దగ్గరా నేర్చుకోలేవు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరికీ తన గొప్పతనం తెలియదు. ఎందుకు? వారు తర్వాత పుట్టారు అనేది ఒక కారణం. ఇంకొక కారణం, వారంతా అల్పజ్ఞులు. అలాంటి అల్పజ్ఞులు సర్వజ్ఞుడైన భగవంతుని గురించి ఎలా తెలుసుకోగలరు? అందువల్ల నా దగ్గరనుంచే నువ్వు పూర్తి జ్ఞానం పొందగలవు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సురగణాః మే ప్రభవం న విదుః** – దేవతలకు కూడా నా గురించి పూర్తిగా తెలియదు. కేనోపనిషత్తులో దేవతలకు గర్వభంగం చేశాడని చూశాము.

దాన్ని ఒక కథలాగా చెబుతుంది ఉపనిషత్తు. ఒకసారి దేవదానవ యుద్ధంలో దేవతలు గెలిచారు. చాలాసార్లు గెలుస్తారు కాని ఆసారి ఎందుకో దేవతలకు గర్వం వచ్చింది. నా గొప్పతనంవల్లనే గెలిచామంటే నా గొప్పతనంవల్లనే గెలిచామని అందరూ అనుకుంటుంటారు. అందులో ఇంద్రుడు, వాయుదేవుడు, అగ్నిదేవుడు ప్రథమంగా ఉన్నారు. వారికి గర్వభంగం కలిగించటానికి భగవంతుడు యక్షుని రూపంలో వారికి కనీకనపడకుండా కొంచెం దూరంలో ప్రత్యక్షమయ్యాడు. ఆయనెవరో తెలుసుకోవాలని ముందు అగ్నిదేవుడు వెళ్ళాడు. నేను అన్నీ దహనం చేస్తానంటే, ఆ యక్షుడు అన్నీ అవసరం లేదు, ఈ గడ్డిపోచను దహనం చెయ్యమన్నాడు. అగ్ని దాని కొసను కూడా దహనం చెయ్యలేకపోయాడు. వాయువు అదే గడ్డిపోచను కొంచెం కూడా లేపలేకపోయాడు. ఇద్దరికీ ఆ విధంగా గర్వభంగమయింది. తర్వాత ఇంద్రుడు వెళితే, యక్షుడు మాయమైపోయాడు. అప్పుడు ఇంద్రుడు తన తప్పు గ్రహించి, ప్రార్థన చేస్తే ఉమాదేవి రూపంలో భగవంతుడు ప్రత్యక్షమై జ్ఞానబోధ చేశాడు. దీన్నిబట్టి దేవతలకు కూడా భగవంతుని గురించి పూర్తిగా తెలియదని తెలుస్తున్నది.

సురగణాః అంటే దేవతలు; న విదుః అంటే వారికి తెలియదు; మే ప్రభవం – నా శక్తి, నా స్వరూపం గురించి తెలియదు.

**మహర్షయః (అపి న విదుః)** – మహర్షులకు కూడా తెలియదు. ఎందుకు? కృష్ణపరమాత్మే దానికి కారణం కూడా చెబుతున్నాడు.

**అహమ్ ఆదిః హి** – వారి సృష్టికర్తను నేను. వారు నా తర్వాత వచ్చారు. వారికి పరిమితమైన మనస్సు, పరిమితమైన బుద్ధి ఉంది. అహమ్ ఆదిః హి అంటే నేను కారణం.

**దేవానాం మహర్షీణాం** – దేవతలు, మహర్షులు కార్యం. నేను వారి కారణం. అంటే నేనే వారిని సృష్టించాను. బ్రహ్మదేవుణ్ణి కూడా విష్ణుమూర్తి సృష్టించాడని పురాణాలలో చదువుతాము. బ్రహ్మదేవుడు ఉద్భవించాక, చుట్టూ చూస్తే అంతా చీకటిగా ఉందిట. తను తప్ప వేరే ఎవరూ లేరు. బ్రహ్మదేవుడు ముందు భయపడ్డాడుట. అప్పుడు తపస్సు చేస్తే విష్ణుమూర్తి బ్రహ్మకు జ్ఞానాన్ని ప్రసాదించాడు.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతితస్మై**

అందువల్ల భగవంతుడు బ్రహ్మదేవునికి కూడా సృష్టికర్త.

**సర్వశః** – అన్ని విధాలుగా. నేను కారణం అంటే నిమిత్తకారణమే కాదు, ఉపాదానకారణం కూడా. అంటే నేను వారిని సృష్టించటమే కాదు, వారిద్వారా ప్రకటితమవుతున్నాను.

శ్లో. 3 **యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।**
**అసమ్మూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥**
యః, మామ్, అజమ్, అనాదిమ్, చ, వేత్తి, లోకమహేశ్వరమ్,
అసమ్మూఢః, సః, మర్త్యేషు, సర్వపాపైః, ప్రముచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | వేత్తి | = తెలుసుకొనునో |
| మామ్ | = నన్ను | మర్త్యేషు | = మానవులలో |
| అజమ్ | = జన్మరహితునిగా | అసమ్మూఢః | = జ్ఞానియైన |
| అనాదిమ్ | = అనాదియైన వానినిగా | సః | = అతడు |
| చ | = ఇంకా | సర్వపాపైః | = సర్వపాపములనుండి |
| లోకమహేశ్వరమ్ | = సకలలోక మహేశ్వరునిగా | ప్రముచ్యతే | = విముక్తుడగును |

**యః మామ్ అజమ్ అనాదిమ్ లోక–మహేశ్వరమ్ చ వేత్తి,**
**సః మర్త్యేషు అసమ్మూఢః (భూత్వా) సర్వ–పాపైః ప్రముచ్యతే ॥**

తా: ఏ పురుషుడు నన్ను జన్మరహితునిగా, అనాదియైన వానినిగా ఇంకా సకలలోక మహేశ్వరునిగా తెలుసుకొనునో మానవులలో జ్ఞానియైన అతడు సర్వపాపములనుండి విముక్తుడగును.

తెలివైన వ్యక్తి జగత్ కారణం ఈశ్వరుని గురించి తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాడు. ఇప్పటి పరుగు పందెంలో ఎంతసేపూ ధనార్జనకోసం మ్రొగ్గు చూపుతున్నారే తప్ప ఆధ్యాత్మికత వైపు తిరగటం లేదు.

**కస్త్వం కోఽహం కుత ఆయాతః**
**కా మే జననీ కో మే తాతః ॥**

నేనెవరు? ఎక్కడినుంచి వచ్చానులాంటి ప్రశ్నలను ఉత్తమ అధికారి మాత్రమే వేసుకుంటాడు.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి** – ముండకం

ఏ ఒక్కటి తెలుసుకుంటే అన్నీ తెలిసినట్టు అవుతుందో ఆ విద్యను బోధించు నాకు అంటాడు శౌనకుడు, అంగిరస ఋషిని.

**అసమ్మూఢః** – అటువంటి ఉత్తమ అధికారి.

**యః మాం వేత్తి** – జగత్కారణం బ్రహ్మ గురించి తెలుసుకోవాలని అనుకుంటాడు. అందువల్ల అతను నన్ను తెలుసుకుంటాడు. అంటే జగత్కారణమైన నన్ను తెలుసుకుంటాడు. ఎటువంటి కారణం?

**అజమ్ అనాదిం చ** – పుట్టుక లేదు, ఆది లేదు. అజం అంటే పుట్టుక లేదు. జగత్కారణం అయిన భగవంతునికి కూడా పుట్టుక ఉంటే, అప్పుడు భగవంతుడు అంతిమ కారణం కాదు. ఆయన కారణం వేరే ఉంటాడు. భగవంతుడి సృష్టికర్త ఎవరనే ప్రశ్న ఉదయిస్తుంది. అందువల్ల భగవంతుడు కారణం లేని కారణం.

కారణం లేని కారణం అంటే పుట్టుక లేని కారణం. పుట్టుక ఉంటే దానికొక ఆది అంటే మొదలు ఉంటుంది. పుట్టుక లేదు కాబట్టి ఆది లేదు. ఈ రెండూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. పుట్టుక లేదు కాబట్టి ఆది లేదు; ఆది లేదు కాబట్టి పుట్టుక లేదు. పురాణాల్లో పార్వతీపరమేశ్వరలను ఆదిదంపతులుగా వర్ణిస్తారు. వారికి పుట్టుక లేదు.

**లోకమహేశ్వరమ్** – ఇక్కడ స్థితి కారణంగా చూస్తాము. లోకానికి మహేశ్వరుడు అంటే స్థితికారణం. సృష్టి స్థితి కారణాలు వచ్చాయి కాబట్టి లయకారణం కూడా కలుపుకోవాలి. సృష్టి స్థితి లయకారణమైన ఈశ్వరుణ్ణి;

**స మర్త్యేషు అసమ్మూఢః** – మనుష్యులలో కెల్ల తెలివైన వ్యక్తి తెలుసుకుంటాడు. అలా తెలుసుకోవటంవల్ల అతను పొందే లాభం ఏమిటి?

**సర్వపాపైః ప్రముచ్యతే** – సంసారంలోని పాపాలన్నీ తొలగిపోయి, మోక్షం పొందుతాడు.

కాని ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఇక్కడ వర్ణింపబడుతున్న ఈశ్వరుడు విశ్వరూప ఈశ్వరుడు. అంటే మధ్యమ అధికారి తెలుసుకునే ఈశ్వరుడు. ఇంకా అతను ఉత్తమ అధికారి అవలేదు. అతను అరూప ఈశ్వరుణ్ణి గురించి తెలుసుకోలేదు. కాని అతను త్వరలోనే ఉత్తమస్థాయికి వెళ్ళి, అరూప ఈశ్వరజ్ఞానం పొంది, అప్పుడు మోక్షం పొందుతాడని మనం కలుపుకోవాలి.

సృష్టిమాత్ర ఈశ్వరుడు నిమిత్తకారణం. అది మంద అధికారికి అర్థమవుతుంది. అప్పుడు భగవంతుణ్ణి ఏకరూప ఈశ్వరుడు అంటామని చూశాము. ఇక్కడ భగవంతుని మేధస్సును స్తుతిస్తున్నాము కాబట్టి ఆయనను చతుర్ముఖబ్రహ్మగానో, పంచముఖంగానో, షణ్ముఖంగానో, అష్టముఖంగానో, సహస్రశీర్ష పురుషునిగానో కొలుస్తాము. అటువంటి భగవంతుడు కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉన్నాడంటాము. ఇది మొదటి స్థాయి భక్తి.

తర్వాత సృష్టి, స్థితి, లయకారకుడు ఈశ్వరుడని తెలుసుకోవటం రెండవ స్థాయి భక్తి. ఇందులో ఈశ్వరుడు అనేకరూప ఈశ్వరుడు. అప్పుడు ఈశ్వరుణ్ణి ఉపాదానకారణం అంటామని చూశాము. ఉన్నదంతా భగవంతుడే అని తెలుసుకుంటాము. ఏకమేవాద్వితీయమ్. అంటే భగవంతుడే జగత్తు అయ్యాడు.

మూడవ స్థాయిలో భగవంతుడు అనంతం. అంటే దేశకాల అతీతం. అందువల్ల భగవంతుడు జగత్తుగా మారే అవకాశం లేదు అంటాము. ఇందులో ఈశ్వరుడు అరూప ఈశ్వరుడు.

**అజాయమానో బహుధా విజాయతే** –పురుషసూక్తమ్

అంటే పుట్టుకలేని భగవంతుడు, తను ఏమీ మార్పు చెందకుండా, ప్రపంచంగా వ్యక్తమవుతున్నాడు. కలలుకనే వ్యక్తి మంచంమీద అలాగే పడుకుని ఉంటాడు. స్వప్నంలో ఉన్న వ్యక్తికి గాయమైనా, అతను పరుగులు పెడుతున్నా, ఇతనికేమీ అవదు. ఒకవేళ కలలు కంటున్న ఈ జాగ్రత్ పురుషునికి ఏమైనా అయితే, అతను నిద్రనుంచి లేవలేడు. దీన్ని వివర్త ఉపాదానకారణం అంటారు. పాలు తోడుపెడితే పెరుగు అవుతుంది. పాలు దాని క్షీరత్వాన్ని పూర్తిగా కోల్పోతుంది. దాన్ని పరిణామి ఉపాదానకారణం అంటారు. కాని భగవంతుడు వివర్త ఉపాదనకారణం. ఇది మూడవ దశ.

ఈ మూడు దశలూ మళ్ళీ ఒకసారి చూస్తే –

1. **భగవంతుడు జగత్తును సృష్టించాడు – నిమిత్త కారణం.**
2. **భగవంతుడు జగత్తుగా తానే అయ్యాడు – ఉపాదాన కారణం.**
3. **భగవంతుడు జగత్తుగా ప్రకటితమవుతున్నాడు – వివర్త ఉపాదాన కారణం**

ముందే చూసినట్టుగా, ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ రెండవస్థాయి ఈశ్వరుణ్ణి వర్ణిస్తున్నాడు.

ఈ మూడవ శ్లోకంతో ఉపోద్ఘాతం అయింది. ఇప్పుడు 4 నుంచి 11 వరకూ ఈశ్వరస్వరూపాన్ని, ఈశ్వరవిభూతిని సూక్ష్మంగా చెబుతాడు. తర్వాత అర్జునుడు ఇంకా వివరంగా చెప్పమని కోరితే, అలాగే వివరంగా చెబుతాడు.

ఇప్పుడు రెండవస్థాయి ఈశ్వరుడు అంటే ఈశ్వరుడు జగత్తుగా తానే అయ్యాడు అన్నాము కదా. తానే చైతన్యం, తానే పదార్థం లేదా జడం అని చూశాము. జగత్తును వర్ణించటానికి వీలుగా, దానిని రెండుగా విభజించాడు. అవి బాహ్యప్రపంచంలోని వస్తువులు; ఆంతరప్రపంచంలోని ఆలోచనలు. బాహ్యప్రపంచమూ, ఆంతరప్రపంచమూ నానుంచే వచ్చాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

భగవంతుణ్ణి చూడాలంటే ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. కళ్ళు తెరిస్తే భగవంతుడు; కళ్ళు మూస్తే భగవంతుడు. ముందు ఆంతరప్రపంచాన్ని వర్ణించబోతున్నాడు.

శ్లో. 4 **బుద్ధిర్ జ్ఞానమసమ్మోహః క్షమా సత్యం దమః శమః ।**
**సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయమేవ చ ॥**
బుద్ధిః, జ్ఞానమ్, అసమ్మోహః, క్షమా, సత్యమ్, దమః శమః,
సుఖమ్, దుఃఖమ్, భవః, అభావః, భయమ్, చ, అభయమ్, ఏవ, చ ॥

శ్లో. 5 **అహింసా సమతా తుష్టిః తపో దానం యశోఽయశః ।**
**భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః ॥**
అహింసా, సమతా, తుష్టిః, తపః, దానమ్, యశః, అయశః,
భవంతి, భావాః, భూతానామ్, మత్తః ఏవ, పృథగ్విధాః ॥

| | | | |
|---|---|---|---|
| బుద్ధిః | = బుద్ధి అంటే నిశ్చయాత్మకశక్తి | సమతా | = సమత్వము |
| జ్ఞానమ్ | = యథార్థజ్ఞానము | తుష్టిః | = సంతోషము |
| అసమ్మోహః | = మోహరాహిత్యము | తపః | = తపస్సు |
| క్షమా | = క్షమ | దానమ్ | = దానము |
| సత్యమ్ | = సత్యము | యశః | = కీర్తి |
| దమః | = ఇంద్రియనిగ్రహము | అయశః | = అపకీర్తి |
| శమః, ఏవ | = మనోనిగ్రహము, అలాగే | ఏవమ్ | = ఈ మొదలగునవి |
| సుఖమ్, దుఃఖమ్ | = సుఖదుఃఖములు | భూతానామ్ | = ప్రాణులయొక్క |
| భవః, అభావః | = ఉత్పత్తి, ప్రళయములు | పృథగ్విధాః | = వివిధములగు |
| భయమ్ | = భయము | భావాః | = భావములన్నియును |
| అభయమ్ | = అభయము | మత్తః, ఏవ | = నా నుంచే |
| చ | = ఇంకా | భవంతి | = కలుగుచున్నవి |
| అహింసా | = అహింస | | |

**బుద్ధిః, జ్ఞానమ్, అసమ్మోహః, క్షమా, సత్యమ్, దమః,**
**శమః సుఖమ్, దుఃఖమ్, భవః అభావః, భయమ్ చ ఏవ అభయమ్ చ ॥**

**అహింసా, సమతా, తుష్టిః, తపః, దానమ్, యశః అయశః,**
**(ఇమే) భూతానామ్ పృథక్–విధాః భావాః మత్తః ఏవ భవన్తి ।**

తా: బుద్ధి అంటే నిశ్చయాత్మక శక్తి, యథార్థజ్ఞానము, మోహరాహిత్యము, క్షమ, సత్యము, ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహము, అలాగే సుఖదుఃఖములు, ఉత్పత్తి, ప్రళయములు, భయము, అభయము ఇంకా అహింస, సమత్వము, సంతోషము, తపస్సు, దానము, కీర్తి, అపకీర్తి ఈ మొదలగునవి ప్రాణుల వివిధములగు భావములన్నియును నానుంచే కలుగుచున్నవి.

ఆంతరప్రపంచంలో అనేక రకాల ఆలోచనలు ఉన్నాయి. వాటి పట్టికను ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటవి?

**బుద్ధిః** – తెలివితేటలు; **జ్ఞానమ్** – జ్ఞానము; **అసమ్మోహః** – మోహం లేకపోవటం, అంటే ఆలోచనలో స్పష్టత; **క్షమా** – క్షమాగుణం; **సత్యమ్** – సత్యం; **దమః** – ఇంద్రియనిగ్రహం; కాని ఇంద్రియాలను మనస్సు అదుపులో పెడుతుందని కఠోపనిషత్తులో చూస్తాము. **శమః ఏవ** – మనోనిగ్రహం; **సుఖం దుఃఖమ్** – సుఖదుఃఖాలు; **భావః అభావః** – భావాల రాకపోకలు; **భయం చ అభయమేవ చ** – భయం, అభయం.

ఇంకా పట్టిక కొనసాగుతున్నది.

**అహింసా** – మనస్సు స్థాయిలో అహింస; **సమతా** – సమభావన; **తుష్టిః** – సంతోషం; **తపః** – క్రమశిక్షణ; **దానమ్**– దానగుణం; **యశః** – కీర్తి; **అయశః** – అపకీర్తి.

ఇక్కడితో ఈ పట్టిక పూర్తి అవలేదు. ఉదాహరణకు కొన్నింటిని పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ. మనం ఇంకా కావాల్సినవి కలుపుకోవచ్చు.

**భూతానాం భావాః** – ఇవన్నీ ప్రాణులలో ఉన్న అనేక భావాలు. భూతానాం అంటే ప్రాణులు. ఈ భావాలన్నీ ఎక్కడనుంచి వస్తున్నాయి?

**మత్తః ఏవ భవంతి** – అన్నీ నానుంచే వస్తున్నాయి. ఎలా?

**పృథగ్విధాః** – వాటి విభిన్నస్వభావాల్లో.

ఈ విధంగా ప్రాణులలో ఉండే విభిన్నభావాలన్నీ నానుంచే వచ్చాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

తర్వాత వచ్చే శ్లోకాల్లో బాహ్యప్రపంచం కూడా నానుంచే వచ్చింది అంటాడు. అంటే ఈ రెండింటినీ కలిపితే, నేను సర్వజగత్కారణాన్ని. అందువల్ల ఉన్నదంతా నేనే అంటాడు. ఈ విధంగా ఈ వివరణ సాగుతుంది.

శ్లో. 6 **మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా ।**
**మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః ॥**
మహర్షయః, సప్త, పూర్వే, చత్వారః, మనవః, తథా,
మద్భావాః, మానసాః, జాతాః, యేషామ్, లోకే, ఇమాః, ప్రజాః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| లోకే | = | లోకమునందుగల | చత్వారః | = | సనకాది మహామునులు నలుగురును |
| ఇమాః, ప్రజాః | = | ఈ ప్రజలు | మనవః | = | మనువులును |
| యేషామ్ | = | ఎవరి సంతానమో | మద్భావాః | = | నాయందు భక్తిభావములు గల్గినవారై |
| పూర్వే | = | ప్రాచీనులైన | మానసాః, జాతాః | = | నా సంకల్పము వలననే జన్మించిరి |
| సప్తమహర్షయః | = | సప్తమహర్షులును | | | |
| తథా | = | అలాగే వారికంటెను పూర్వులైన | | | |

**పూర్వే సప్త మహర్షయః తథా చత్వారః మనవః మత్, భావాః,**
**మానసాః జాతాః యేషామ్ లోకే ఇమాః ప్రజాః ॥**

తా: లోకమునందుగల ఈ ప్రజలు ఎవరి సంతానమో అలాగే ప్రాచీనులైన సప్తమహర్షులును, అలాగే వారికంటెను పూర్వులైన సనకాది మహామునులు నలుగురును, మనువులును నాయందు భక్తిభావములు గల్గినవారై నా సంకల్పము వలననే జన్మించిరి.

ఇప్పుడు బాహ్యప్రపంచంయొక్క సృష్టి గురించి మాట్లాడబోతున్నాడు. మామూలు మనుష్యులు, జంతువులు వచ్చే ముందు భగవంతుడు సప్తఋషులను, వారికి ముందు సనకాది ఋషులను సృష్టించాడు. సనకాది ఋషులు సన్న్యాసపరంపరను అంటే నివృత్తిమార్గాన్ని సూచిస్తే, సప్తఋషులు గృహస్థపరంపరను అంటే ప్రవృత్తిమార్గాన్ని సూచిస్తారు. ఈ పదకొండు ఋషులనుంచి, తక్కిన మనుష్యులంతా వచ్చారు.

**సప్త మహర్షయః** – పురాణాల్లో వర్ణించే ఏడుగురు ఋషులు. కాకపోతే భిన్నపురాణాల్లో భిన్నఋషుల పేర్లు వస్తాయి. సంధ్యావందనంలో కూడా సప్తఋషులు వస్తారు.

**అత్రి భృగు కుత్స వశిష్ఠ గౌతమ కాశ్యప అంగిరస ఋషయః**

ఇంకొక చోట సప్తఋషులను ఈ పేర్లతో చూస్తాము –

**భృగుం మరీచిమ్ అత్రిం చ పులస్త్యం పులహం కృతుం వశిష్ఠం చ మహాతేజః సః సృజత మానససుతాన్**

మహాతేజః అంటే బ్రహ్మదేవుడు. ముందు బ్రహ్మదేవుణ్ణి విష్ణుమూర్తి సృష్టిస్తే, బ్రహ్మదేవుడు సప్తఋషులను సంకల్పమాత్రంగా సృష్టించాడు.

**మానసాః** – సంకల్పమాత్రంగా సృష్టించాడు కాబట్టి వారిని మానసపుత్రులు అంటారు. సంకల్పమాత్రంచేత ఎలా సృష్టించగలడని మనకు సందేహం అవసరం లేదు. ఎందుకంటే మన సంకల్పమాత్రంచేత మన స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాము. స్వప్నంలో ఉన్నంతసేపూ ఆ ప్రపంచం నిజమనే అనిపిస్తుంది.

ఈ సప్తఋషులు గృహస్థ పరంపరను సూచిస్తారని చూశాము. అంటే వారు సన్న్యాసులు కారు, వానప్రస్థంలో ఉంటారు.

**పూర్వే చత్వారః** – వారికి ముందు నలుగురు ఋషులను సృష్టించాడు. పూర్వే అంటే సప్తఋషుల సృష్టికి ముందు సనకాది మహర్షులను సృష్టించాడు. ఆ నలుగురు – సనక, సనందన, సనత్కుమార, సనత్ సుజాతలు.

నలుగురు ఋషులను సృష్టించాడు కదా, వారు చాలరా, మళ్ళీ సప్తఋషులను ఎందుకు సృష్టించాడు? ఈ నలుగురూ పెళ్ళిళ్ళు చేసుకుని పరంపరను తీసుకువస్తారు అనుకుంటే వారు బ్రహ్మచర్యంనుంచే సన్న్యాసం స్వీకరించారు. వారు గృహస్థులు కాలేదని బ్రహ్మదేవునికి కోపం వచ్చిందట. తన మాట వినలేదని కనుబొమలు ఎత్తి కోపంగా చూస్తే, ఆ కనుబొమలనుంచి ఏకాదశరుద్రులు వచ్చారుట. అందువల్ల మళ్ళీ ప్రవృత్తిమార్గాన్ని పాటించటానికి సప్తఋషులను సృష్టించాడు.

**మనవః** – పధ్నాలుగు మనువులను సృష్టించాడు. వారు పరిపాలించే కాలాన్ని మన్వంతరం అంటారు. ఒక్కొక్క మన్వంతరానికి 71 చతుర్యుగాలు ఉంటాయి. 71 సంవత్సరాలు కాదు, 71 చతుర్యుగాలు. అలా 14 మనువులు. అందువల్ల జంధ్యాల పౌర్ణమికి సంకల్పం చెప్పేటప్పుడు, ఆ మనువుల పేర్లు వస్తాయి. ఇప్పటి మనువు ఏడవ మనువు. వైవస్వత మన్వన్తరే అంటాము. 28వ చతుర్యుగం ఇది. మనిషి పదం మనువునుంచి వచ్చింది.

**మనుతే చింతయతి ఇతి మనుః – ఆలోచించే మనిషి అని అర్థం.**

**మద్భావాః** – మద్భావాః అంటే మత్స్వరూపః నా నుంచి పుట్టారు కాబట్టి, వారికి నా స్వరూపమే వచ్చింది. అందరూ సచ్చిదానంద స్వరూపులే. అందువల్లనే మనం అహం బ్రహ్మ అస్మి అనగలుగుతున్నాము. ఎలాగైతే అగ్నినుంచి పుట్టిన నిప్పురవ్వలకు అగ్నియొక్క వేడి, కాంతి అనే లక్షణాలు ఉంటాయో, అలాగే నానుంచి పుట్టినవారికి నా స్వరూపమే ఉంటుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల మద్భావాః అన్నాడు. భావః పదానికి ఇంకొక అర్థం కూడా ఉంది. అది భక్తి. వీరందరికీ నామీద భక్తి ఉంది అని కూడా అర్థం వస్తుంది.

**యేషాం లోక ఇమాః ప్రజాః** – యేషాం అంటే ఈ 11 ఋషులనుంచి, 14 మనువులనుంచి ఈ లోకంలో సమస్త ప్రాణులూ పుట్టాయి.

శ్లో. 7 **ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః ।**
**సోఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥**
ఏతామ్, విభూతిమ్, యోగమ్, చ, మమ, యః, వేత్తి, తత్త్వతః,
సః, అవికంపేన, యోగేన, యుజ్యతే, న, అత్ర, సంశయః ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | వేత్తి | = తెలుసుకొనునో |
| మమ | = నాయొక్క | సః | = ఆ పురుషుడు |
| ఏతామ్ | = ఈ | అవికంపేన | = నిశ్చలమైన |
| విభూతిమ్ | = పరమైశ్వర్యరూపవిభూతిని | యోగేన | = భక్తియోగముచేత |
| చ | = ఇంకా | యుజ్యతే | = యుక్తుడగును |
| యోగమ్ | = యోగశక్తిని | అత్ర | = ఈ విషయమున |
| తత్త్వతః | = యథార్థముగా | న, సంశయః | = సంశయము లేదు |

**యః మమ ఏతామ్ విభూతిమ్ యోగమ్ చ తత్త్వతః వేత్తి,**
**సః అవికమ్పేన యోగేన యుజ్యతే అత్ర సంశయః న ॥**

తా: ఏ పురుషుడు నా పరమైశ్వర్యరూపవిభూతిని ఇంకా యోగశక్తిని యథార్థముగా తెలుసుకొనునో ఆ పురుషుడు నిశ్చలమైన భక్తియోగముచేత యుక్తుడగును. ఈ విషయమున సంశయము లేదు.

ముందు శ్లోకంలో భగవంతుడు జగత్కారణం అని చూశాము. భగవంతుడు జగత్తుగా తానే అయ్యాడు అనేది తర్వాత దశ అని కూడా చూశాము. విత్తనంలో ఎలాగైతే అవ్యక్తరూపంలో చెట్టు ఉంటుందో, అలాగే భగవంతునిలో అవ్యక్తరూపంలో శక్తి ఉంటుంది. ఆ శక్తి జగత్తుగా వ్యక్తమవుతుంది. ఆ శక్తిని యోగః అంటారు. ఈ యోగశక్తిని మాయాశక్తి అని కూడా అంటారు.

భగవంతునికి మాయ అనే శక్తి ఉంది. మాయ నిర్వచనం ఏమిటి? అవ్యక్తశక్తి. అవ్యక్తంలో ఉన్న ఏ శక్తి అయినా నిద్రాణస్థితిలో ఉంటుంది. అందువల్ల అది ఉన్నట్టు తెలియదు. ఉదాహరణకు పాలలో వెన్న ఉంటుంది కాని వెన్న ఉన్నట్టు తెలియదు. అందువల్ల శక్తిని అనుమేయం అనీ, ఈశ్వరయోగం అనీ అంటారు.

ఎప్పుడైతే ఈ అవ్యక్తశక్తి వ్యక్తమవుతుందో, అప్పుడది ప్రకాశం అవుతుంది. విజ్ఞానశాస్త్రంలో పొటెన్షియల్ ఎనర్జీ, కైనటిక్ ఎనర్జీ అంటారు. పొటెన్షియల్ ఎనర్జీ అవ్యక్తంగాను, కైనటిక్ ఎనర్జీ ప్రకాశవంతంగానూ ఉంటుంది. విత్తనంలో అవ్యక్తంగా శక్తి ఉన్నట్టు తెలియదు. దాన్నించి మొలక వస్తేనే తెలుస్తుంది. **అవ్యక్తంగా ఉన్నదాన్ని యోగం అంటే, వ్యక్తమయ్యేదాన్ని విభూతి అంటారు.**

ఉదాహరణకు స్వామీజీ బోధ చేసే ముందు, ఆ రోజు ఆయన చేసే బోధ అవ్యక్తరూపంలో ఉంటుంది. అప్పుడు దాన్ని యోగం అంటారు. యోగరూపేణ వర్తతే. ఎప్పుడైతే మాట్లాడటం మొదలుపెడతారో, అప్పుడే అవి మాటల రూపంలో బయటకు వస్తాయి. అవి అందరికీ అందుబాటులో ఉంటాయి. అంటే అప్పుడు ఆయన బోధ విభూతి అవుతుంది. ఆ విభూతి అప్పుడు వినే శిష్యులకే ప్రకటితమవదు, తర్వాత తరాలవారికి కూడా ఆడియో రూపంలో అందుబాటులో ఉంటుంది.

శంకరాచార్యులవారు ఎప్పుడో వందల సంవత్సరాల క్రిందట భాష్యం రాశారు. కానీ ఈరోజు కూడా మనం ఆయన భాష్యాలు అధ్యయనం చెయ్యగలుగుతున్నామంటే అది ఆయన విభూతి కాక మరేమిటి? అదే విధంగా ఇప్పుడు మనం చూస్తున్న జగత్తు విభూతి. కాని అదే జగత్తు ప్రళయకాలంలో యోగం రూపంలో ఉంటుంది. భగవంతుడు యోగనిద్రలో ఉన్నాడు అంటాము. అంటే జగత్తు యోగం రూపంలో ఉందని అర్థం.

**విభూతిం యోగం చ మమ** – నాకు వ్యక్త, అవ్యక్త మహిమలు రెండూ ఉన్నాయి. యోగమహిమను కారణశక్తి అనీ, విభూతిని కార్యం అనీ అనవచ్చు. యోగం నిర్వికల్పం, విభూతి సవికల్పం; యోగం అవ్యక్తం, విభూతి వ్యక్తం; యోగం తార్కికం, విభూతి ప్రత్యక్షం.

**యః వేత్తి** – ఎవరైతే ఈ రెండు విభూతులను తెలుసుకుంటారో;

**తత్త్వతః** – అది కూడా సమగ్రంగా తెలుసుకుంటారో;

వారికి కలిగే లాభమేమిటి? అటువంటి వ్యక్తికి భగవంతుడు ఎక్కడో వైకుంఠంలో లేడు. భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అని అడిగితే అతను దానికి జవాబు చెప్పడు. భగవంతుడు ఎక్కడ లేడు అని ఎదురు ప్రశ్నిస్తాడు. **భగవంతుడు ఎక్కడా లేడు** అని ఎవరో రాస్తే, ఒక భక్తుడు దానికి చిన్న మార్పు చేశాడు – **భగవంతుడు ఎక్కడ లేడు**?

ఆ విధంగా సర్వం విష్ణుమయం జగత్తు అవుతుంది. ఇటువంటి దర్శనాన్ని విరాట్ ఈశ్వరదర్శనం, విశ్వరూప ఈశ్వరదర్శనం లేదా అనేకరూప ఈశ్వరదర్శనం అంటారు. అంతకు ముందు ఏమన్నాం? ఏకరూప దర్శనం

**రుక్మిణీ సత్యభామాభ్యాం సహితం కృష్ణమాశ్రయే**

రుక్మిణీ సత్యభామల మధ్యలో ఉన్నాడు. అలా అనటంలో తప్పేంలేదు. అక్కడ మొదలుపెట్టాలి కాని దాన్నుంచి రెండవ స్థాయికి రావాలి.

**భూఃపాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే**

ఇది విశ్వరూప దర్శనం. ఎవరైతే ఈ విశ్వరూప దర్శనాన్ని అర్థం చేసుకుంటారో అతను –

**యోగేన యుజ్యతే** – ఈశ్వరునియొక్క తరువాత స్థాయికి తీసుకువెళ్ళబడతాడు. విశ్వరూప దర్శనం రెండవ స్థాయి మాత్రమే అనీ దానిపైన ఇంకొకటి ఉందనీ చూశాము కదా. ఏమిటది? అరూప ఈశ్వరుడు. భగవంతుడు తానే జగత్తు అయ్యాడని రెండవ స్థాయిలో అంటే భగవంతునికి ఏ రూపమూ లేదని మూడవస్థాయి అంటుంది. యోగః అంటే అరూప ఈశ్వరజ్ఞానం పొందుతాడు; అంటే నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందుతాడు. రెండవస్థాయిలో పరిణామి ఉపాదాన కారణం అయితే, మూడవస్థాయిలో వివర్త ఉపాదాన కారణం అవుతాడు భగవంతుడు. మాయద్వారా సృష్టి చేస్తాడు అని చూశాము కదా. మాయ మార్పు చెందుతుంది. అందువల్ల మాయ పరిణామి ఉపాదాన కారణం అవుతుంది.

**సః అవికంపేన** – అరూప ఈశ్వరజ్ఞానం పొందిన ఆ వ్యక్తికి నిశ్చలజ్ఞానం కలుగుతుంది. అరూప ఈశ్వరుడు, భక్తుని స్థాయినిబట్టి ఏకరూపం దాల్చటమో, విశ్వరూప ఈశ్వరునిగా ప్రకటితమవటమో చేస్తాడని తెలుసుకుంటాడు. కాని ఆయన అసలు స్వరూపం నిర్గుణం లేదా అరూపం. ఈ అరూప ఈశ్వరుని గురించిన దృఢజ్ఞానాన్ని అవికంపః అంటారు.

అరూపజ్ఞానం పొందుతాడు అంటే దాని అర్థం ఏకరూప ఈశ్వరుణ్ణి, అనేకరూప ఈశ్వరుణ్ణి తిరస్కరిస్తాడని కాదు; మూడు రూపాలలోనూ ఈశ్వరుణ్ణి కొలుస్తాడు. అతనికి అందుబాటులో మూడు ఛానెళ్ళు ఉన్నాయి. కావాలంటే అరూప ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోవచ్చు; లేదా ప్రకృతిని చూసి పులకించిపోయినప్పుడు, అనేకరూప ఈశ్వరుణ్ణి ధ్యానించవచ్చు; లేదా కావాలనిపిస్తే ఏకరూప ఈశ్వరుణ్ణి ప్రార్థించవచ్చు. శంకరాచార్యుల స్తోత్రాల్లో మూడు దశలనూ చూస్తాము.

**సారూప్యం తవ పూజనే శివ మహాదేవేతి సంకీర్తనే**
**సామీప్యం శివభక్తిధుర్యజనతాసాఙ్గత్యసమ్భాషణే ।**
**సాలోక్యం చ చరాచరాత్మకతనుధ్యానే భవానీపతే**
**సాయుజ్యం మమ సిద్ధమత్ర భవతి స్వామిన్ కృతార్థోఽస్మ్యహమ్ ॥** – శివానందలహరి – 28

**చరాచరాత్మకతను** – ఓ దేవా, నిన్ను చరాచరాత్మకప్రపంచంగానూ ధ్యానిస్తాను;

**భవానీపతే** – పార్వతీపతిగా, సాంబశివునిగా కూడా నిన్నే పూజిస్తాను. నిన్ను ప్రకృతిగా లేదా సృష్టిగా ఆరాధించవచ్చు, లేదా ఒక వ్యక్తిగా ఊహించుకుని నీతో మాట్లాడవచ్చు, లేదా కళ్ళు మూసుకుని నీ నిర్గుణరూపాన్ని గుర్తు తెచ్చుకోవచ్చు అంటున్నాడు.

అందువల్ల యుజ్యతే అంటే ఈ మూడు రూపాలూ అతను తెలుసుకుంటాడు. నిశ్చయజ్ఞానం పొందుతాడు. నిశ్చయజ్ఞానం పొందుతాడని నిశ్చయం ఏమిటి? కృష్ణపరమాత్మ దానికి గ్యారంటీ కార్డు ఇస్తున్నాడు.

**న అత్ర సంశయః** – అందులో ఏమాత్రం సందేహం లేదు. ఏకరూప ఈశ్వరునితో మొదలుపెడితే, చివరికి నా దగ్గరికి వస్తావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 8 **అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।**
**ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః ॥**
అహమ్, సర్వస్య, ప్రభవః, మత్తః, సర్వమ్, ప్రవర్తతే,
ఇతి, మత్వా, భజంతే, మామ్, బుధాః, భావసమన్వితాః ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేనే | ఇతి, మత్వా | = అని తెలుసుకొని |
| సర్వస్య | = సమస్త జగత్తుయొక్క | భావసమన్వితాః | = భక్తిశ్రద్ధలతో కూడిన |
| ప్రభవః | = ఉత్పత్తికి మూలకారణమును | బుధాః | = బుద్ధిమంతులైన భక్తులు |
| మత్తః | = నావలననే | మామ్ | = నన్నే |
| సర్వమ్ | = జగత్తంతయు | భజంతే | = నిరంతరము సేవింతురు |
| ప్రవర్తతే | = నడచుచున్నది | | |

**అహమ్ సర్వస్య ప్రభవః (అస్మి), మత్తః సర్వమ్ ప్రవర్తతే,**
**ఇతి మత్వా బుధాః భావ–సమన్వితాః మామ్ భజన్తే ॥**

తా: నేనే సమస్త జగత్తుయొక్క ఉత్పత్తికి మూలకారణమును, నావలననే జగత్తంతయు నడచుచున్నది అని తెలుసుకొని భక్తిశ్రద్ధలతో కూడిన బుద్ధిమంతులైన భక్తులు నన్నే నిరంతరము సేవింతురు.

ముందు శ్లోకంతో ఈశ్వరస్వరూపం అంశం అయిపోయింది. 4–7 వరకూ చూశాము. 8 నుంచి అనేకరూప ఈశ్వరభక్తుని గురించి మాట్లాడుతున్నాడు. వీరు మధ్యస్థాయిలో ఉన్నారు. ప్రాథమికస్థాయి ఇష్టదేవతా స్వరూపం, ఉత్తమస్థాయి అరూప ఈశ్వరుడు. మధ్యమస్థాయి అనేకరూప ఈశ్వరస్వరూపం.

ఈ అనేకరూప ఈశ్వరభక్తివల్ల సాధకుడు అనేక మంచి విలువలు పెంపొందించుకోగలుగుతాడు. ఇందులో ముఖ్యమైన విలువ రాగద్వేషాలు తగ్గుతాయి. మనం ప్రపంచాన్ని ఈ రెండు కళ్ళతో చూస్తాము. కొన్నింటి మీద రాగం ఏర్పడితే, మరికొన్నిటిమీద ద్వేషం ఏర్పడుతుంది. ఆ విధంగా ప్రపంచాన్ని రెండుగా విభజించి చూస్తాము. ఇష్టమైన వస్తువులు, అయిష్టమైన వస్తువులు.

ఎప్పుడైతే భగవంతుడు తానే ప్రపంచంగా మారాడని నేర్చుకుంటామో అప్పుడు దేన్నైనా ఎలా ద్వేషించగలము? భగవంతునిలోని ఒక భాగాన్ని ప్రేమించి, ఇంకొక భాగాన్ని ద్వేషించగలమా? జగత్తు మొత్తం ఈశ్వరుడే ఉన్నాడు, అందువల్ల జగత్తు పవిత్రమవుతుంది. జీవితంలో ఏ అనుభవం కలిగినా చిరునవ్వుతో స్వీకరిస్తాము.

మనకు మనస్సు ఎందుకు ఒత్తిడికి లోనవుతుంది? కొన్ని అనుభవాలను ఇష్టపడతాము, కొన్నింటిని ద్వేషిస్తాము. మనం ద్వేషించే అనుభవాలు వస్తాయంటేనే భయపడిపోతాము. వాటిని ఊహలో కూడా భరించలేము. అనుకున్న పని జరగదేమోననే శంక కూడా భయపెడుతుంది. కాని అనేకరూపభక్తుడు అన్నింటినీ చిరునవ్వుతో స్వీకరిస్తాడు. దేన్నీ ద్వేషించడు. ఎందుకు? జగత్తును భగవంతునియొక్క విరాట్‌రూపంగా లేదా విశ్వరూపంగా చూస్తాడు కాబట్టి. ప్రతి ఒక్కటీ భగవంతుణ్ణుంచి వస్తుందని సిద్ధపడతాడు కాబట్టి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతిదానినీ ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తాడు.

**అహం సర్వస్య ప్రభవః** – ఈ విరాట్ భక్తుడు అన్నీ నానుంచే వస్తాయి అనుకుంటాడు. సుఖం–దుఃఖం; చావు–పుట్టుకలు; ఆరోగ్యం–అనారోగ్యం; బంధం–విడిపోవటం; గెలుపు–ఓటమి. అన్నీ అహం అంటే నానుంచే వస్తాయని తెలుసు ఆ భక్తునికి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ నేను ఎవరు? ఇక్కడ విరాట్‌రూప ఈశ్వరుడు.

అందువల్ల ఈ భక్తుడు ప్రతిదాన్నీ ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తాడు. అంటే అద్భుతమైన కర్మయోగిగా మారతాడు. కర్మయోగి ఎవరు? తనకు వచ్చే ఫలాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించేవాడని చూశాము.

ఉదాహరణకు మనం గుడికి వెళితే అక్కడ నేతిలో వేయించిన ఘుమఘుమలాడే చక్కెర పొంగలి దొరుకుతుందో తెలియదు, పుట్టమన్ను దొరుకుతుందో తెలియదు. పత్రం, పుష్పం, ఫలం, తోయంలో ఏది మనకు ఈశ్వరప్రసాదంగా వస్తుందో మనకు తెలియదు. కాని గుడిలో ఏది ఇచ్చినా భక్తిగా కళ్ళకద్దుకుంటాము కాని, ఇది వద్దు అనము.

**మత్తః సర్వం ప్రవర్తతే ఇతి మత్వా** – అంతా నానుంచే వస్తుందనే ఈ ప్రసాదబుద్ధితో,

**మాం భజంతే** – నా విశ్వరూపాన్ని కొలుస్తాడు ఈ భక్తుడు.

ఇలా ప్రసాదబుద్ధితో స్వీకరించగలగటం అత్యంత ఆరోగ్యకరమైన అలవాటు. ఎందుకు? మనకు వచ్చే కర్మఫలం మన చేతిలో లేదు. భవిష్యత్తులో జరగబోయే అనుభవాన్ని మనం కొంచెం మార్చగలము కాని గతంలో జరిగిపోయిన అనుభవాన్ని మార్చలేము; వర్తమానంలో జరుగుతున్న అనుభవాన్నీ మార్చలేము. అందువల్ల గతం, వర్తమానం మన చేతిలో లేవు; భవిష్యత్తు విషయంలోనే మనకు కొంత అవకాశం ఉంది.

మనం భగవద్గీత బోధ వినటానికి వెళ్ళాము. ఇది వర్తమానం. ఈ నిముషం జరుగుతున్నది. ఇందులో మనకు ఛాయిస్ లేదు. కాకపోతే తర్వాత నిముషం కూర్చోవాలా, లేచి బయటకు వచ్చేయాలా అనే విషయంలో మనకు ఛాయిస్ ఉంది. కాని జరిగిపోయిన విషయంలో లేదు, జరిగిపోయింది కాబట్టి; వర్తమానంలోనూ ఛాయిస్ లేదు, అది వచ్చింది కాబట్టి. రాబోయే విషయంలోనే ఉంది ఛాయిస్.

మన చేతుల్లో లేని అనుభవాల విషయంలో మనం ఒక్కటే చెయ్యగలము. ఏమిటది? వచ్చినదాన్ని చిరునవ్వుతో స్వీకరించటం. ఏక్సెప్ట్ అండ్ ఎకామడేట్ అంటారు ఇంగ్లీషులో. చిరునవ్వుతో స్వీకరించు. వచ్చినదాన్ని ఈశ్వరప్రసాదంగా భావిస్తేనే, దాన్ని చిరునవ్వుతో స్వీకరించగలము. అందువల్ల గొప్ప కర్మయోగి ఎవరు అంటే విరాట్ భక్తుడు. అందువల్ల వారు మాం భజంతే అంటున్నాడు. అంటే వారు నా విశ్వరూప ఈశ్వరరూపాన్ని కొలుస్తారు. జగత్తులో ఏ అనుభవం కలిగినా అది భగవంతునినుంచి వచ్చినదే అనుకుంటారు. ఎందుకంటే భగవంతునికి భిన్నంగా జగత్తులో ఏ మూల కూడా లేదు.

**బుధా** – బుధా అంటే తెలుసుకున్న భక్తులు. కాని వీరు నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందిన భక్తులు కాదు. వీరు విరాట్ రూపాన్ని కొలిచే భక్తులు. అంటే భగవంతుడు నిమిత్తకారణం, ఉపాదానకారణం కూడా అని తెలుసు వీరికి.

**భావసమన్వితాః** – వారి మనస్సు ఎప్పుడూ భక్తిలో మునిగి తేలుతూ ఉంటుంది. అందువల్ల వారికి ఎటువంటి భయాందోళనలూ ఉండవు. వారికి స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు అవసరం లేదు. మంచిని ఆశించు, చెడు వచ్చినా స్వీకరించు అంటారు.

**ఆగతే స్వాగతం కుర్యాత్ గచ్ఛంతం న నివారయేత్**

వచ్చిందా స్వాగతం పలుకు, వెళ్ళిపోతోందా ఆపటానికి ప్రయత్నించకు.

అంతేకాదు, ఎవరిలో ఏ ప్రత్యేకత ఉన్నా, ఎక్కడ ఏ అద్భుతాన్ని చూసినా అది ఈశ్వరవిభూతిగా చూస్తారు వారు. అందువల్ల వారి ప్రతి అనుభవం కూడా భక్తిలో, ఆరాధనలో మునిగి తేలుతుంది.

ఒకసారి టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఒక వ్యోమగామి అనుభవం గురించి ఒక వ్యాసం వచ్చింది. అతను చందమామమీద అడుగుపెట్టి, అక్కడనుంచి భూలోకాన్ని చూస్తే అతనికి కలిగిన అద్భుతమైన భావనను వర్ణిస్తాడు అందులో. 'ఒక సృష్టికర్త ఉండి ఉండాలి; ఆ సృష్టికర్త అన్ని మతాలకూ అతీతంగా ఉండి ఉండాలి. అతను సృష్టించిన ఈ విశ్వంలో కేవలం ఒక భాగాన్ని చూసే అదృష్టం నాకు కలిగింది,' అన్నాడు. ఒక భాగాన్ని అంటే భూలోకాన్ని చూశాడు అతను.

మనం భూలోకంలో ఉన్నాం కాబట్టి దాన్ని ఆబ్జెక్టుగా చూడలేము. ఆ వ్యోమగామి చంద్రునిమీద ఉన్నాడు కాబట్టి అక్కడనుంచి భూలోకాన్ని చూశాడు. అతను చంద్రునిమీదకు వెళ్ళకముందు భగవంతుని గురించిన ఆలోచన అంతగా లేదు. కాని ఎప్పుడైతే అక్కడ్నుంచి సృష్టిని చూశాడో, ఇంత అద్భుతాన్ని సృష్టించిన సృష్టికర్త ఉన్నాడనే విషయం కొట్టొచ్చినట్టుగా, చాలా స్పష్టంగా తెలిసింది. అక్కడికెళితే భగవంతుడు ఉన్నాడా లేడా అనే ప్రశ్నకు తావులేదు. దానిమీద వాదనకు చోటు లేదు.

అక్కడ చంద్రునిమీద ఉన్నప్పుడు అతనికి అనేక బాధ్యతలు ఉంటాయి, అనేక బెంగలు కూడా కలుగుతాయి. బాధ్యత – తన పనిని తను సక్రమంగా నిర్వర్తించాలి; బెంగ – మళ్ళీ క్షేమంగా వెనక్కి తిరిగి వెళ్ళగలుగుతాడో లేదో. కొంతమంది భక్తి ఉంటే మనం చేస్తున్న పనులన్నీ మానేసి పూజలు చేస్తూ కూర్చోవాలి అనుకుంటారు.

కాని ఆ వ్యోమగామి అదేం అవసరం లేదు, చేస్తున్న పని మధ్యలో ఒక్కక్షణం భూమిని చూసినా, నీ చుట్టూ ఉన్న పరిసరాలను చూసినా భగవంతుణ్ణి చూసినట్టే అన్నాడు.

భగవంతుణ్ణి ఆరాధించాలంటే మన కర్తవ్యాన్ని విస్మరించనవసరం లేదు. కొంత సూక్ష్మబుద్ధి ఉంటే చాలు. చిన్న చీమను చూసినా భగవంతుడు తెలుస్తాడు. అంతదాకా ఎందుకు, మనం దీక్షగా ఒక పుస్తకం చదువుతుంటే, ఆ అక్షరాలమీదగా చాలా సూక్ష్మమైన క్రిమి పరుగుతీస్తుంది. గట్టిగా ఒక సూదికొన అంత ఉండదు అది. దాన్ని అలా సుతారంగా పక్కకి తోసినా కూడా చచ్చిపోతుంది అది. అంత చిన్నగా ఉంటుంది. కాని అంత చిన్న క్రిమికి కూడా మనస్సు ఉంటుంది, తనను తాను ఎలా రక్షించుకోవాలో తెలుసు, వంశాభివృద్ధి ఎలా చెయ్యాలో తెలుసు, ఏం తినాలో తెలుసు. మనం ఇలా వేలు చూపిస్తే మనకు అందకుండా పారిపోతుంది. దేవుని సృష్టి ఎంత విచిత్రం! అందమైన గులాబీని చూస్తే దేవుని సృష్టి ఎంత అద్భుతం అనిపిస్తుంది. విశాలమైన ఆకాశాన్ని చూస్తే దేవుని సృష్టి ఎంత మేరకు విస్తరించింది అనిపిస్తుంది. అంత చిన్న సూక్ష్మక్రిమినుంచి అంత పెద్ద ఆకాశాన్ని సృష్టించిన దేవుని సృష్టి ఎంత అద్భుతం అనుకోకుండా ఉండలేము. ఈ అద్భుతాన్ని ఆస్వాదించడానికి, మన ఉద్యోగధర్మాన్ని మానుకోనవసరం లేదు, చూసే కనులకు మనస్సు ఉంటే చాలు.

అటువంటి సూక్ష్మమైన మనస్సు ఉన్న విరాట్ భక్తులను కృష్ణపరమాత్మ భావసమన్వితాః అంటున్నాడు. ప్రతి చెట్టూ, ప్రతి పురుగు, ప్రతి నక్షత్రం, ప్రతి వృక్షం, ప్రతి నదీ వారిలో ఆరాధనాభావం పెల్లుబికేలా చేస్తుంది. అంత ఆరాధనా భావనలో మునిగినవారు, మామూలు పిచ్చాపాటీ ఎలా మాట్లాడగలరు? వారి మనస్సు ఎప్పుడూ పరమాత్మ సృష్టిని చూసి పురివిప్పిన నెమలిలా ఆడుతూనే ఉంటుంది. అలాంటి మనస్సు ప్రాపంచిక విషయాలమీదకు పోదు. అందువల్ల విరాట్ భక్తులు ప్రపంచమంతా ఈశ్వరమయం అని మైమరచి పోతుంటారు అంటాడు కృష్ణభగవానుడు. ఈ భావననే తర్వాత వచ్చే శ్లోకంలో వివరించబోతున్నాడు.

శ్లో. 9 **మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।**
**కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥**
మచ్చిత్తాః, మద్గతప్రాణాః, బోధయంతః, పరస్పరమ్,
కథయంతః, చ, మామ్, నిత్యమ్, తుష్యంతి, చ, రమంతి, చ ॥

| | | | |
|---|---|---|---|
| మచ్చిత్తాః | = నిరంతరము నాయందే చిత్తములను నిల్పినవారును | చ | = అలాగే నా స్వరూపమును |
| మద్గత ప్రాణాః | = తమ జీవితములను నాకే అంకితమొనర్చిన వారును, అగు భక్తులు | కథయంతః, చ | = కథలు కథలుగా చెప్పుకొనువారై |
| పరస్పరమ్, బోధయంతః | = నా విభూతి గూర్చి పరస్పరము తెలుపుకొనుచు | నిత్యమ్ | = ఎల్లప్పుడూ |
| | | తుష్యంతి | = సంతుష్టులగుదురు |
| | | చ | = ఇంకా |
| | | మామ్, రమంతి | = నాయందే రమింతురు |

**మత్ చిత్తాః మత్ గత-ప్రాణాః పరస్పరమ్ మామ్ బోధయన్తః**
**కథయన్తః చ నిత్యమ్ తుష్యన్తి చ ॥**

తా: నిరంతరము నాయందే చిత్తములను నిల్పినవారును, తమ జీవితములను నాకే అంకితమొనర్చిన వారును, అగు భక్తులు నా విభూతి గూర్చి పరస్పరము తెలుపుకొనుచు, అలాగే నా స్వరూపమును కథలు కథలుగా చెప్పుకొనువారై ఎల్లప్పుడూ సంతుష్టులగుదురు ఇంకా నాయందే రమింతురు.

విరాట్ భక్తులు వారికి కలిగే ప్రతి అనుభవంలోనూ భగవంతుణ్ణే చూస్తారు. చూస్తారు అంటే మామూలు కంటితో కాదు. కన్ను జడపదార్థాన్నే చూపిస్తుంది. ఆ వ్యోమగామి విషయమే తీసుకోండి. అతని కన్ను భూమిని చూపించింది. అతని సూక్ష్మమైన మనస్సు భగవంతుణ్ణి చూపించింది. చూస్తాడు అంటే ఇంద్రియంతో చూడటం కాదు; పరిపక్వత చెందిన మనస్సుతో, సంసిద్ధమైన మనస్సుతో భగవంతుణ్ణి తెలుసుకోవటం. ఆ సూక్ష్మమైన మనస్సుతో కంటికి కనబడని, సర్వజ్ఞుడైన భగవంతుని సృష్టిలోని వైవిధ్యాన్ని, క్రమబద్ధతని, అందాన్ని సమతుల్యతను చూడగలుగుతాడు.

**మచ్చిత్తాః** – అటువంటి భక్తుడు నిరంతరం నా ఆలోచనలోనే ఉంటాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏదో ఒక పరిమితమైన సమయంలో కాదు, ఎల్లవేళలా. నన్ను క్షణం కూడా మర్చిపోడు.

**మద్గతప్రాణాః** – ప్రాణాః అంటే ఇంద్రియాలు. వారి ఇంద్రియాలను కూడా నామీదే నిలిపినవారు.

అంటే వారు భగవత్‌సన్నిధినుంచి కొంచెం కూడా దూరమవరు. ఆ వ్యోమగామి విషయమే తీసుకోండి, అతను దేని గురించైనా మాట్లాడి ఉండవచ్చు, కాని భగవంతుని సృష్టియొక్క అద్భుతాన్ని వర్ణించాడు.

**పరస్పరం బోధయంతః** – అలా వారు ఎప్పుడూ వారికి కలిగిన దైవానుభూతులనే వర్ణిస్తారు. వారికి ప్రాపంచిక విషయాలమీద మక్కువ ఉండదు. అందరిలా ఇచ్చకపు మాటలు మాట్లాడరు.

**కథయంతశ్చ** – పిల్లలకు చెప్పే కథలు కూడా దైవం గురించే ఉంటాయి. మనం బోధించే విద్య ఎలా ఉండాలి? కంటికి కనబడే జగత్తునుంచి కంటికి కనబడని బ్రహ్మను తెలుసుకునేలా మనస్సును తీర్చిదిద్దాలి.

### జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ

అలా లోతుగా విశ్లేషించటానికి పరిపక్వత చెందిన మనస్సు ఉండాలి. కెమిస్ట్రీ కాని ఫిజిక్స్ కాని నేర్చుకోవటం తేలిక, కాని తోటి మనిషి హృదయాన్ని చదవటం తేలిక కాదు.

ఒక భర్త కెమిస్ట్రీలో దిట్ట. ఏది చూసినా, దాన్ని లోతుగా పరిశీలించి, దానిమీద పరిశోధనలు జరుపుతాడు. ఒకరోజు భార్య ఎందుకో కళ్ళనీళ్ళు పెట్టుకుంటోంది. భర్త దృష్టికి అది చేరలేదు. అన్నీ పరిశోధించే భర్త ఆమె కన్నీళ్ళకు కారణాన్ని శోధించలేదు. అసలు కన్నీళ్ళు తెలిస్తే కదా, వాటిని శోధించేది. భార్యే ఉండబట్టలేక అడిగింది, 'నేను ఏడుస్తున్నాను, నా కన్నీళ్ళు తెలియటం లేదా?'

దానికి ఆ మహానుభావుడు, 'ఎందుకు తెలియటం లేదు. కన్నీళ్ళ గురించి నాకు చాలా తెలుసు. వాటిని $NaclH_2O$ అంటారు. అంటే సోడియం క్లోరైడ్‌తో కలిసిన నీళ్ళు,' అంటే అతనికి కన్నీళ్ళ గురించిన జ్ఞానం ఉంది కాని, కన్నీళ్ళ వెనకనున్న బాధాతప్తహృదయం తెలియటం లేదు. ఆమె సున్నితమైన మనస్సు, నేనున్నానని ఓదార్చే, కన్నీళ్ళు తుడిచే చెయ్యికోసం ఆరాటపడుతోందని అర్థం కాలేదు ఆ మేధావికి. కెమిస్ట్రీ చెప్పని, విశ్లేషించని భావనను తెలుసుకోవటానికి స్పందించే మనస్సు ఉండాలి.

అలాగే భగవంతునియొక్క విరాట్ రూపాన్ని చూడటానికి కూడా స్పందించే మనస్సు ఉండాలి. అది నిర్వికారంగా చూసే కన్నుకు అందదు. ఆ కన్నుకు మనస్సు కూడా తోడవ్వాలి. అందువల్ల కథయంతశ్చ అంటే కంటికి కనిపించే జగత్తు వెనక కనబడని అద్భుతమైన హస్తం ఉందని చెప్పి, దాన్ని తెలుసుకోగలిగే సూక్ష్మబుద్ధిని పిల్లలకు కలుగజేయాలి.

**మాం నిత్యమ్** – అలా ఎప్పుడూ నన్నే తలుచుకునే మనస్సు, అంతకన్నా చిన్న విషయాల వైపుకు చలించదు. నిత్యం అంటే ఎప్పుడూ. ఎప్పుడూ తలుచుకుంటారు అంటే వారు నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని వదిలేసి, భగవంతుణ్ణే స్మరిస్తూ కూర్చోరు. వ్యోమగామి తను చంద్రునిమీదకు ఎందుకు వెళ్ళాడో మర్చిపోలేదు. తన కర్తవ్యాన్ని నెరవేరుస్తూనే, భగవంతునియొక్క విశ్వరూపదర్శనాన్ని చేసుకోకుండా ఉండలేకపోయాడు. అటువంటి దర్శనం చేస్తే కలిగే లాభమేమిటి?

**తుష్యంతి చ రమంతి చ** – ఈ భావన వల్లనే పరిపూర్ణతను అనుభవిస్తారు. సంసార విషయంలో ఓటమి పొందవచ్చు; ఉద్యోగపర్వంలో ఓటమి పొందవచ్చు, కాని ఈ విశ్వరూపదర్శనం చెయ్యగలిగితే, జీవితంలో ఓడిపోయిన భావన ఎన్నడూ కలగదు. ఈ భావన జీవితాన్ని విజయవంతం చేస్తుంది. అంతటా భగవద్దర్శనం కలగటమే పరిపూర్ణభావనను కలుగజేస్తుంది.

సంతుష్టి పొందటమే కాదు, రమిస్తారు కూడా. భగవంతునిమీద ఎప్పుడూ కృతజ్ఞతాభావనతో ఉంటారు. విరాట్‌రూపదర్శనం చేయించినందుకు భగవంతునిమీద కృతజ్ఞత కలుగుతుంది. అప్పుడు వారికేమవుతుంది?

శ్లో. 10 **తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥**
తేషామ్, సతతయుక్తానామ్, భజతామ్, ప్రీతిపూర్వకమ్,
దదామి, బుద్ధియోగమ్, తమ్, యేన, మామ్, ఉపయాంతి, తే ॥

| | | | |
|---|---|---|---|
| సతత | = నిరంతరము | యేన | = ఏ జ్ఞానయోగముద్వారా |
| యుక్తానామ్ | = నా ధ్యానమునందే నిమగ్నులైన వారును | తే | = వారు |
| | | మామ్ | = నా స్వరూపమను |
| ప్రీతిపూర్వకమ్ | = ప్రీతితో | ఉపయాంతి | = తెలుసుకొనెదరో |
| భజతామ్ | = నన్నే భజించువారు | తమ్, బుద్ధి యోగమ్ | = వారికి జ్ఞానయోగమును |
| తేషామ్ | = అటువంటి నా భక్తులకు | దదామి | = ప్రసాదింతును |

**(ఏవం) సతత-యుక్తానామ్ ప్రీతి-పూర్వకమ్ భజతామ్ తేషామ్**
**తమ్ బుద్ధి-యోగమ్ దదామి యేన తే మామ్ ఉపయాన్తి ॥**

తా: నిరంతరము నా ధ్యానమునందే నిమగ్నులైన వారు, ప్రీతితో నన్నే భజించువారు అటువంటి నా భక్తులకు ఏ జ్ఞానయోగముద్వారా నా స్వరూపమును తెలుసుకొనెదరో వారికి అట్టి జ్ఞానయోగమును ప్రసాదింతును.

**సతతయుక్తానామ్** – ఈ భక్తులు నిరంతరం నా ధ్యానంలోనే ఉంటారు. తక్కినవారితో అనుబంధం కొనసాగిస్తున్నా కూడా నాతో ఉన్న అనుబంధాన్ని మర్చిపోరు అంటున్నాడు. అంతకు ముందు కూడా చూశాము, ఒక అలకు సముద్రంతో ఉండే అనుబంధం ప్రాథమిక అనుబంధం. ఎందుకు? ఆ అల సముద్రంనుంచే పుట్టింది, సముద్రంవల్లనే స్థితి పొందుతుంది, మళ్ళీ సముద్రంలోనే లయమయిపోతుంది. అందువల్ల అలకూ–సముద్రానికీ మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రాథమిక అనుబంధం అంటారు.

ఆ అల తనతో పాటు ఎగసిపడే మరొక కెరటాన్ని చూసి ముచ్చటపడి దానితో ప్రేమలో పడి పెళ్ళి కూడా చేసుకోవచ్చు. వారి పెళ్ళివల్ల వారికి పిల్ల అల పుడుతుంది. ముగ్గురూ కలిసి ముచ్చటగా సముద్రంలో ఎగిరెగిరి పడుతుంటాయి. కాని మనకు తెలుసు ఆ ఆనందం మూనాళ్ళ ముచ్చటే అని. అంతేకాదు, రెండు అలలు కూడా ఎన్నడూ ఒకేసారి పుట్టవు, ఒకేసారి లయమవవు. అందువల్ల అలకూ–అలకూ మధ్యనున్న సంబంధం తాత్కాలిక అనుబంధం; వచ్చిపోయే అనుబంధం. కాని అలకు సముద్రంతో ఉన్న అనుబంధం శాశ్వత అనుబంధం, స్వాభావిక అనుబంధం.

విరాట్ భక్తునికి ఈ విషయం బాగా అర్థమవుతుంది. తనకూ–భగవంతునికీ మధ్యనున్న అనుబంధం అలకూ–సముద్రానికీ మధ్యనున్న అనుబంధంలాంటిది. అది శాశ్వతం, స్వాభావికం. అదే తనకు–తోటి మనుష్యులకు మధ్యనున్న అనుబంధం ఏమిటి? అలకు–అలకు మధ్యనున్న అనుబంధం లాంటిది. అతనికి అనేకమందితో అనేక బంధాలు ఉండవచ్చు గాక, అందులో కొన్ని పవిత్రమైనవీ, ఆత్మీయమైనవీ, ప్రాథమికమైనవీ అవచ్చు గాక; కాని భగవంతునితో ఉన్న అనుబంధం వీటికన్నా పవిత్రమైనదీ, వీటికన్నా లోతైనదీ, వీటికన్నా ప్రాథమికమైనదీ. అన్నింటినీ మించి వీటికన్నా విశాలమైనది.

ఈ జన్మలో తోటిమనుష్యులతో అనుబంధం ఈ జన్మతోనే సమసిపోతుంది. కొంతమంది భార్యాభర్తలు మనది విడదీయరాని అనుబంధం, జన్మజన్మల అనుబంధం అనుకుంటారు, లేదా వచ్చే జన్మలో కూడా నువ్వే భార్యగా రావాలి అంటాడు భర్త ( వారు మోక్షం జోలికి పోరు). మోక్షం మాట పక్కన పెడితే, వచ్చే జన్మలో కూడా భార్యాభర్తలు అవటం సంగతి దేవుడెరుగు, అసలు మనుష్యులుగా పుడతారా అనేదే పెద్ద సందేహం. ఒకరు పిల్లిగా, ఇంకొకరు ఎలుకగా పుట్టవచ్చు. ఈ జన్మలోనే పిల్లి, ఎలుకగా జీవితం గడిపే భార్యాభర్తలు ఉన్నారు అది వేరే విషయం.

ఇంతకీ చెప్పొచ్చినది మానవమాత్రులతో ఎంత గొప్ప అనుబంధం అయినా, ఈ జన్మతోనే ముగిసిపోతుంది. కాని భగవంతునితో ఉన్న అనుబంధం మాత్రం మరింత పవిత్రమైనది. అంటే తక్షణం మానవ అనుబంధాలను

వదులుకోమని బోధించటం లేదు శాస్త్రం. శాస్త్రం చెప్పేదేమిటంటే, ఈ మానవ అనుబంధాలు భగవంతునితో ఉన్న శాశ్వత అనుబంధాన్ని మర్చిపోయేటంత మైకం కలుగజేయకూడదు.

అందువల్ల భగవంతునితో అనుబంధాన్ని ఎప్పుడూ గుర్తు తెచ్చుకుంటూ ఉండాలి. భగవంతునికి చేసే ప్రార్థనల్లో ఈ ప్రార్థనను జోడించాలి, 'ఓ దేవా! నావారితో ఉన్న అనుబంధపు మాయలో పడి, నీతో ఉన్న అనుబంధాన్ని మర్చిపోకుండా ఉండేలాగా చెయ్యి. మనుష్యులతో నా అనుబంధం ఆగంతుకం, నీతో నా అనుబంధం స్వాభావికం.'

సంగీత విద్వాంసునికి తంబూర శ్రుతి చాలా ముఖ్యం. అతను పాడే పాటల్లో ఎంతగా తన్మయత్వం చెందినా, వాటిల్లో ఎంతగా లీనమైనా కూడా, తంబూర శ్రుతిని మాత్రం మర్చిపోడు. మర్చిపోతే తన పాట అపశ్రుతి అయిపోతుంది. అదే విధంగా విరాట్ భక్తునికి, ఈశ్వర అనుబంధం తంబూర శ్రుతి లాంటిది. అతనికి ఎన్ని అనుబంధాలు వచ్చిపోయినా కూడా భగవంతునితో మాత్రం చెక్కు చెదరని అనుబంధం ఉంటుంది.

అందువల్ల అటువంటి భక్తుణ్ణి సతతయుక్తానామ్ అన్నాడు. సతతయుక్తానామ్ పదం చాలా లోతైన, గంభీరమైన పదం. సతతయుక్తానామ్ అంటే భగవంతునితో తన అనుబంధం ఎన్నటికీ మర్చిపోనివాడు. ఈ అనుబంధం కూడా ఎవరో బలవంతపెడితే వచ్చినది కాదు.

**ప్రీతిపూర్వకం భజతామ్** – తనంతట తాను నన్ను ప్రేమతో పూజిస్తాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇది భగవంతుణ్ణి అర్థం చేసుకోవటంవల్ల ఆయనమీద ఏర్పడిన ప్రేమ. అసలు ముక్కూ మొహం తెలియని వ్యక్తిని ప్రేమించలేము. అంతేకాదు, అతన్ని తీసుకొచ్చి పరిచయం చేసి, ఇదిగో రేపు పొద్దున్న 7.30నుంచి అతన్ని గాఢంగా ప్రేమించాలి అంటే హఠాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చేయదు. కొంతమంది తుపాకి చూపించి నన్ను ప్రేమిస్తావా లేదా, లేకపోతే నిన్ను చంపేస్తాను అని బెదిరిస్తారు కూడా. ప్రేమంటే మనం చేసే ఒక పని కాదు, ఫలానా అప్పుడు, ఫలానా పద్ధతిలో చెయ్యమంటే చెయ్యటానికి. ప్రేమ ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకోవటంవల్ల దానంతట అదే పుడుతుంది.

శాస్త్రాన్ని అధ్యయనం చేసినకొద్దీ, భగవంతుని స్వరూపం అంతకంతకూ తేటతెల్లమవుతుంది. భగవంతుని స్వరూపం తెలిసినకొద్దీ, మనకు తెలియకుండానే ఆయనమీద ఆరాధనాభావం అంతకంతకూ వెల్లువై ప్రవహిస్తుంది. ఈ అసంకల్పిత ప్రేమభావనకు ప్రత్యేకించి ప్రయత్నమేమీ చెయ్యనవసరం లేదు. అందువల్ల కృష్ణపరమాత్మ వారిని భజతాం ప్రీతిపూర్వకమ్ అంటున్నాడు. వారంతట వారు ఇష్టంగా ఆయననే కొలుస్తారు.

ఈ భక్తిలో కూడా మూడు స్థాయీభేదాలు ఉన్నాయని ఏడవ అధ్యాయంలో చూశాము.

1. **మందభక్తి** – మొదటిస్థాయి మందస్థాయి. ఆ స్థాయిలో భగవంతుణ్ణి మనకు కావాల్సిన లక్ష్యాలు పొందటానికి తోడ్పడే మార్గంగా భావిస్తాము. అంటే ఒక విధంగా దీన్ని వ్యాపారబుద్ధి అనవచ్చు. భగవంతునితో కూడా ఒప్పందం కుదుర్చుకుంటాము అన్నమాట. నువ్వు ఇది చేస్తే, నేను అది చేస్తాను, అది కూడా చేస్తేనే సుమా!

ఎందుకంటే అన్నప్పుడూ మన కోరిక తీరదు. అందువల్ల భగవంతునితో కూడా నిర్మోహమాటంగా చెప్పేస్తాము, 'నువ్వు ఇది చేస్తేనే నీ మొక్కు చెల్లిస్తాను, లేకపోతే లేదు.' దీన్ని మందభక్తి అంటారు.

2. **మధ్యమభక్తి** – ఈ స్థాయిలో భగవంతుణ్ణి మార్గంగా చూడకుండా, లక్ష్యంగా చూస్తాడు భక్తుడు. భగవంతుడు పరిపూర్ణుడు అని నేర్చుకుంటాడు. తనకు కూడా అటువంటి పరిపూర్ణత్వం కావాలంటే, అటువంటి భగవంతుని మీద గట్టినమ్మకం, శ్రద్ధ ఉండాలి. దీన్ని అవ్యభిచారిణీభక్తి అంటారు. ఇప్పుడు మనం చూస్తున్నది ఈ అవ్యభిచారిణీభక్తుల గురించి. ప్రీతిపూర్వకం అంటే వారు భగవంతుణ్ణి లక్ష్యంగా చూస్తారు.

అటువంటి వారికి భగవంతుడు ఏం చేస్తాడు? కృష్ణపరమాత్మ అంటున్నాడు, 'నేను వారిని వారి సాధనలో తర్వాత స్థాయికి తీసుకువెళతాను.'

3. **ఉత్తమభక్తి** – కృష్ణపరమాత్మ వారిని ఉత్తమ భక్తి స్థాయికి తీసుకువెళతాను అంటున్నాడు. మొదటిది ఏకరూపభక్తి, రెండవది అనేకరూపభక్తి. కాని ఈ రెండూ అంతిమలక్ష్యాలు కాదనీ, అరూప ఈశ్వరజ్ఞానం పొందాలనీ చూశాము. అందువల్ల కృష్ణపరమాత్మ హామీ ఇస్తున్నాడు. 'వారిని నేను అనేకరూప ఈశ్వరునినుంచి అరూప ఈశ్వరునికి అంటే విరాట్ ఈశ్వరునినుంచి నిర్గుణబ్రహ్మకు తీసుకువెళతాను.'

ఆ నిర్గుణబ్రహ్మను తెలుసుకోవటమెలా? దానికి ఒక్కటే మార్గముంది. దాన్ని జ్ఞానయోగం అంటారు. నిర్గుణబ్రహ్మను జ్ఞానయోగంద్వారానే తెలుసుకోగలము. అందువల్ల వారిని నేను జ్ఞానయోగానికి తీసుకువెళతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**దదామి బుద్ధియోగం తమ్** – బుద్ధియోగం అంటే జ్ఞానయోగం. జ్ఞానయోగం అంటే అరూప ఈశ్వరుణ్ణి తెలుసుకోవటం.

**బుద్ధియోగమ్ అహం దదామి, శ్రవణ మనన నిదిధ్యాసనమ్ అహం దదామి**

దానిద్వారా వారు పొందే ఫలమేమిటి?

**యేన మాముపయాంతి తే** – ఆ జ్ఞానయోగంద్వారా వారు నా అంతిమ స్వరూపాన్ని తెలుసుకుంటారు. ఆ స్వరూపం ఏకరూపం కాదు, అనేకరూపం కాదు, అరూపం. నా పారమార్థిక స్థాయి నిర్గుణబ్రహ్మ.

**అశబ్దమస్పర్శ మరూపమవ్యయమ్**
**తథాఽరసం నిత్యమగంధవత్ చ యత్** – కఠ 1.3.15

ఈ అరూప ఈశ్వరజ్ఞానం పొందటానికి ఆ భక్తునికి గురువు కావాలంటే నేను ఏర్పాటు చేస్తాను, శాస్త్రం కావాలంటే నేను ఏర్పాటు చేస్తాను; నేర్చుకునే అవకాశం కావాలంటే నేను కలుగజేస్తాను; దానికి కావాల్సిన అర్హత తక్కువైతే, నేను ఆ అర్హతను పెంపొందిస్తాను. దానికి సంబంధించిన బాధ్యత అంతా నేనే తీసుకుంటాను. దేనికి సంబంధించినది? అనేకరూప ఈశ్వరభక్తుణ్ణి, నిర్గుణబ్రహ్మజ్ఞానిగా మలచటానికి కావాల్సిన ఏర్పాట్లను. ఈ విషయాన్ని తర్వాత వచ్చే శ్లోకంలో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 11 **తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః ।**
**నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥**
తేషామ్, ఏవ, అనుకంపార్థమ్, అహమ్, అజ్ఞానజమ్, తమః,
నాశయామి, ఆత్మభావస్థః, జ్ఞానదీపేన, భాస్వతా ॥

| | | | |
|---|---|---|---|
| తేషామ్ | = వారిని | అజ్ఞానజమ్, తమః | = వారి అజ్ఞాన జనితమైన అంధకారమును |
| అనుకంపార్థమ్ | = అనుగ్రహించుటకోసము | భాస్వతా | = ప్రకాశించుచున్న |
| ఆత్మభావస్థః | = వారి అంతఃకరణము లందు స్థితుడనైయున్న | జ్ఞానదీపేన | = తత్త్వజ్ఞానరూప దీపముద్వారా |
| అహమ్, ఏవ | = నేనే | నాశయామి | = నశింప జేయుదును |

**తేషామ్ ఏవ అనుకమ్పార్థమ్ అహమ్ ఆత్మ-భావస్థః (సన్)**
**భాస్వతా జ్ఞాన-దీపేన అజ్ఞానజమ్ తమః నాశయామి ॥**

తా: వారిని అనుగ్రహించుటకోసము వారి అంతఃకరణముల యందు స్థితుడనై యున్న నేనే వారి అజ్ఞానజనితమైన అంధకారమును ప్రకాశించుచున్న తత్త్వజ్ఞానరూప దీపముద్వారా నశింప జేయుదును.

విరాట్ భక్తునిలో జ్ఞానజ్యోతిని నేను వెలిగిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞానజ్యోతి అంటే జ్ఞానం. దేని గురించిన జ్ఞానం? ఈశ్వరజ్ఞానం. ఎటువంటి ఈశ్వరుడు? ఏకరూప ఈశ్వరుడో, అనేకరూప ఈశ్వరుడో కాదు; అరూప ఈశ్వరుడు అంటే నిర్గుణ పరబ్రహ్మ. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం లేదా అద్వైతజ్ఞానం. అదీ జ్ఞానజ్యోతి. అద్వైతజ్ఞానదీపాన్ని వెలిగిస్తాడు కృష్ణపరమాత్మ.

కృష్ణపరమాత్మ ఎలా వెలిగిస్తాడు ఈ జ్ఞానజ్యోతిని? ఒక్కొక్కరినీ దగ్గరికి పిలిచి, తలలో కన్నం ఏర్పరచి, దీపం వెలిగిస్తాడా? లేదు. జ్ఞానజ్యోతిని వెలిగించటం అంటే అక్షరాలా ఒక జ్యోతిని వెలిగించటం కాదని అర్థం చేసుకోవాలి. ఆ మాటకొస్తే అద్వైతజ్ఞానమే కాదు, ఏ జ్ఞానం కూడా అలా దీపం వెలిగిస్తే వచ్చేయదు. ఒక ఫిజిక్స్ ప్రొఫెసరు ఫిజిక్స్ జ్ఞానజ్యోతిని మనలో వెలిగించాలి అనుకోండి. ఏం చేస్తాడు అతను? ఏం చెయ్యగలడు? మనను దగ్గరకు పిలిచి, తల ముట్టుకుని స్పర్శదీక్షను ఇవ్వగలడా? లేక దర్శనదీక్షను ఇవ్వగలడా? అంటే చూపులతోనే జ్ఞానాన్ని ప్రసరించగలడా? లేదా అతనికి క్రమం తప్పకుండా పాదపూజ చేస్తేనో, గురవేనమః అని లక్షలసార్లు జపం చేస్తేనో ఫిజిక్స్ జ్ఞానం వచ్చేస్తుందా? రాదు.

ఫిజిక్స్ ప్రొఫెసరు ఫిజిక్స్ జ్ఞానజ్యోతిని వెలిగించాలంటే దానికి ఒక్కటే పద్ధతి ఉంది. క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో, కొంతకాలం పాటు విద్యను బోధించాలి. ఏ జ్ఞానాన్ని అందజేయాలన్నా కూడా గురువు క్రమం తప్పకుండా, కొంతకాలం పాటు బోధించాలి. గురువు క్రమం తప్పకుండా, కొంతకాలం పాటు బోధించాలి అంటే శిష్యుడు కూడా క్రమం తప్పకుండా, అంత కాలమూ వినాలి. శిష్యుడు లేకపోతే గురువు ఎవరికి చెబుతాడు? అందువల్ల జ్ఞానజ్యోతి అంటే ఇలా క్రమం తప్పకుండా చేసే బోధ.

ఈ బోధ ఎన్నాళ్ళు కొనసాగాలి? శిష్యునికి అర్థమయ్యేదాకా; అతనికి ఉన్న సంశయాలు తొలగి, నిస్సంశయజ్ఞానం కలిగేదాకా. అందువల్ల నేను జ్ఞానజ్యోతిని వెలిగిస్తాను అని కృష్ణపరమాత్మ చెపితే, శాస్త్రాన్ని క్రమం తప్పకుండా, క్రమపద్ధతిలో బోధించే గురువును ఏర్పాటు చేస్తాడని అర్థం. భగవంతుని దగ్గర ఒక గురుబోర్డు ఉంటుంది. అందులోనుంచి ఏదో ఒక గురువును మన దగ్గరకు పంపగలడు. ఏ గురువూ అందుబాటులో లేకపోతే భగవంతుడే స్వయంగా గురువుగా వస్తాడు.

అర్జునునికి గురువు అవసరం అయినప్పుడు కృష్ణపరమాత్మ ఏం చేశాడు? తనే స్వయంగా గురువు అయ్యాడు. తనే బోధ చేశాడు. దానికి కూడా ఏమీ దగ్గర మార్గం ఉపయోగించలేదు. కృష్ణపరమాత్మ అర్జునుని తలమీద చెయ్యి వేస్తే, కృష్ణపరమాత్మనుంచి ఒక కాంతి అర్జునునివైపు ప్రయాణంచేసి వెళ్ళటం లాంటివేమీ జరగలేదు. అటువంటి జిమ్మిక్కులు చెయ్యలేదు కృష్ణపరమాత్మ. టూకీగానూ చెప్పేయలేదు. ఒక క్రమపద్ధతిలో, కొంతసేపు బోధించాడు. ఆ విధంగా తనన్నా బోధిస్తాడు, లేదా సమర్థవంతమైన గురువునైనా ఏర్పాటు చేస్తాడు. ఇదంతా ఎందుకు చేస్తాడు?

**అనుకంపార్థమ్** – వారిమీద దయ కొద్దీ చేస్తాడు. ఒక గురువును ఏర్పాటుచేసి, శిష్యుడు ఒక క్రమపద్ధతిలో నేర్చుకునేలా చేస్తాడు. అంటే శ్రవణ,మనన,నిదిధ్యాసనలద్వారా జ్ఞానజ్యోతి వెలిగేలా చేస్తాడు.

**ఆత్మభావస్థః** – శిష్యుల అంతఃకరణంలో ఉండి చేస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. సర్వవ్యాపకుడైన భగవంతునికి శిష్యుని మనస్సులో కూడా ఉండటం పెద్ద కష్టమైన పనేం కాదు. అలా వారి మనస్సులో ఉండి, వారు జ్ఞానం పొందేలా చేస్తాడు. అది ఎటువంటి జ్యోతి?

**భాస్వతా జ్ఞానదీపేన** – అది శక్తివంతమైన జ్ఞానజ్యోతి. ఒక దీపాన్ని వెలిగించినప్పుడు మొదట్లో ఆ జ్యోతి చాలా చిన్నగా ఉంటుంది. దాన్ని జాగ్రత్తగా కాపాడాలి. అప్పుడు అది పెద్ద జ్యోతిగా మారుతుంది. ఎప్పుడైతే అది పెద్ద జ్యోతిగా మారుతుందో, అప్పుడు ఇంక దాన్ని రక్షించనవసరం లేదు.

అదే విధంగా శ్రవణం సమయంలో జ్యోతి వెలుగుతుంది కాని అప్పుడు ఏర్పడిన జ్ఞానజ్యోతి చాలా బలహీనంగా వెలుగుతుంది. జీవితంలో ఒక చిన్న కష్టమనే గాలి వీస్తే ఈ వేదాంతజ్యోతి ఆరిపోతుంది. అందువల్ల శ్రవణం వెంట మననం చెయ్యాలి. నేర్చుకున్నదాన్ని మళ్ళీ గుర్తు తెచ్చుకోవాలి. మననంతో పాటు నిదిధ్యాసనం కూడా చేస్తే నేర్చుకున్న జ్ఞానం జ్ఞాననిష్ఠగా మారుతుంది. ఎప్పుడైతే జ్ఞానం, జ్ఞాననిష్ఠగా మారుతుందో, అప్పుడు ఇంక జీవితంలో ఎటువంటి ఆటుపోట్లు ఎదురైనా, ఎంత గాలి వీచినా, జ్ఞానజ్యోతి చెక్కు చెదరకుండా భాసిల్లుతుంది. కృష్ణపరమాత్మ ఏం చేస్తాడు?

**తమః నాశయామి** – మనస్సులో అజ్ఞానంవల్ల ఏర్పడిన చీకటిని నాశనం చేస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ లోపల ఉన్న చీకటి మొహంలో ప్రతిఫలిస్తుంది. ఒక వ్యక్తి సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడా లేదా తెలుసుకోవాలంటే, అతనిని ప్రత్యేకించి అడిగి తెలుసుకోనవసరం లేదు. ఆముదం తాగినట్టున్న అతని మొహం చెబుతుంది. అయినా 'ఎలా ఉన్నావు?' అని అతన్ని మొహమాటానికి అడిగితే, 'ఏదో ఇలా ఉన్నాను,' అంటాడు.

దీన్ని 'చల్ రహా హై,' అంటారు హిందీలో. అది సంసారానికి అత్యంత చిన్న జవాబు. ఒకవేళ మీరు జాలివేసి ఏమైంది అని అడిగితే, మిమ్మల్ని కూర్చోబెట్టి తన సీరియల్ విప్పుతాడు. అది మీరు చూసే సీరియల్ కన్నా చాలా పెద్దదిగా ఉంటుంది. ఎందుకంటే అతని కథ ఎప్పుడో 1915నుంచీ మొదలవుతుంది. జ్ఞానం పొందితే ఇటువంటి ఆముదం తాగిన మొహం పోయి, కాంతితో మెరిసిపోతుంది. అంటే అతనికి కష్టాలు తొలగిపోతాయా అంటే, తొలగిపోవు కాని, ఆ సమస్యలు అతన్ని పట్టి వేధించే శక్తిని కోల్పోతాయి.

అందువల్ల అజ్ఞానంవల్ల ఏర్పడిన చీకటిని కృష్ణపరమాత్మ పోగొట్టి, బ్రహ్మజ్ఞాని అయ్యేటట్టు చేస్తాడు. బ్రహ్మజ్ఞాని అవకుండా మోక్షం పొందే అవకాశమే లేదు. ఈ శ్లోకాలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే చాలా మందికి ఒక అపోహ ఉంది. బ్రహ్మజ్ఞానానికి రాకుండా, జ్ఞానమార్గం చుట్టూ తిరిగి, భక్తిమార్గంద్వారా భగవంతుణ్ణి చేరవచ్చు అనుకుంటారు. అలాంటి దగ్గర దారులు ఏమీ లేవు అని భగవంతుడు చాలా స్పష్టంగా చెప్పేస్తున్నాడు.

అలాగని బెంబేలెత్తి పోవాల్సిన అవసరం కూడా లేదు. భగవంతుణ్ణి శరణు వేడితే, జ్ఞానం పొందటానికి అవసరమైన ఏర్పాట్లు కూడా ఆయనే చేస్తాడు. ఆ విధంగా విరాట్ భక్తుడు భగవంతుని సహాయంతో బ్రహ్మజ్ఞాని అవుతాడు అనే సారాంశం వస్తుంది ఈ శ్లోకాల వరకూ.

ఆ విధంగా విభూతియోగంయొక్క సారాంశాన్ని ఈ పదకొండు శ్లోకాల్లో చెప్పాడు కృష్ణపరమాత్మ. భగవంతుడే ఈ జగత్తుగా భాసిల్లుతున్నాడు అని గ్రహించటమే విశ్వరూపదర్శనం లేదా విరాట్‌దర్శనం అంటారు.

**విశ్వమ్ ఏవ రూపం శరీరం యస్య సః విశ్వరూపమ్**

భగవంతుని శరీరం ఈ విశ్వం. విశ్వరూపాన్ని విరాట్ అని కూడా అంటారు.

**వివిధం రాజతే ఇతి విరాట్**

అనేక రూపాల్లో ప్రకటితమవుతాడు విరాట్. బంగారాన్ని విరాట్ అనవచ్చు; ఎందుకంటే బంగారమే నగగా, గాజుగా, రింగుగా అనేక రూపాల్లో కనిపిస్తుంది. అలాగే భగవంతుడు కూడా ఆకాశంగా, వాయువుగా, అగ్నిగా అలా అనేక రూపాలతో కనిపిస్తాడు. అటువంటి విశ్వరూపాన్ని చూసిన భక్తుణ్ణి విరాట్ భక్తుడు అంటారు.

అటువంటి విరాట్ భక్తునికి ఎల్లవేళలా భక్తి ఉంటుంది. నిత్యమూ భగవంతుని ధ్యాసలో ఉంటాడు. అటువంటి వ్యక్తికి నిర్గుణబ్రహ్మజ్ఞానం ఎంతో దూరంలో లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ విరాట్‌భక్తి ఏకరూపభక్తినుంచి అరూపభక్తికి వెళ్ళేముందు, మధ్య దశగా తోడ్పడుతుంది. అంతటా భగవద్దర్శనం చేస్తేనే, భగవంతుణ్ణి ఈ జగత్తుకు అధిష్ఠానదేవతగా గుర్తించగలుగుతాడు. అందువల్ల అటువంటి భక్తునికి నేనే అవకాశాలు కలుగజేస్తాను అని కూడా హామీ ఇస్తున్నాడు.

నిజానికి ఇక్కడితో ఈ అధ్యాయం అయిపోయి ఉండేది. జగత్తంతా ఈశ్వరవిభూతి అనేది సారం అని చూశాము. కాని అర్జునుడు ఇంకొంచెం వివరంగా ఈశ్వరవిభూతి గురించి తెలుసుకోవాలనుకున్నాడు.

**2. అర్జునుని కోరిక: శ్లోకాలు 12-18**

అర్జునుడు ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మను ప్రశ్నలు వేస్తాడు. జగత్తు అంటే నీ విభూతి అని తెలుసు కాని, ఓ కృష్ణా! నీ విభూతుల గురించి ఇంకా తెలుసుకోవాలని ఉంది అంటాడు. కాని ఆ ప్రశ్న అడిగేముందు, కృష్ణపరమాత్మను స్తుతిస్తున్నాడు అర్జునుడు. ఇది ఒక జీవిత సత్యం. ఎవరినైనా ఏదైనా సహాయం చెయ్యమని కోరేముందు, వెళ్ళిన వెంటనే సహాయం కోరకుండా, ముందు వారిని స్తుతించాలి.

రుద్రం చదివినా ఈ విషయమే తేటతెల్లమవుతుంది. రుద్రంలో నమకం, చమకం అని రెండు భాగాలుంటాయి. నమకంలో ముందు శివుణ్ణి స్తుతిస్తాము. నమః నమః అంటూ నమస్కారాలు పెడుతూ వస్తాము.

**నమో భవాయ చ రుద్రాయ చ నమః శర్వాయ చ పశుపతయే చ**
**నమో నీలగ్రీవాయ చ శితికంఠాయ చ**
**నమః కపర్ధినే చ వ్యుప్తకేశాయ చ** - 5.1

అలా అనేక విధాలుగా నమస్కరించాక, పరమశివుడు ఆనందంలో ఉండగా, మన కోరికల పొట్లాలు విప్పుతాము. అందువల్ల నమకం వెంటనే చమకం వస్తుంది. అది కూడా రాజధాని ఎక్స్‌ప్రెస్ వేగంతో పఠిస్తాము, భగవంతుడు మనం చేసిన స్తుతివల్ల కలిగిన ఆనందంలో మునిగితేలుతుండగానే ఆలశ్యం చెయ్యకుండా ఆ కోరికలు తీర్చేసుకోవాలి.

**వాజశ్చ మే ప్రసవశ్చ మే ప్రయతిశ్చ మే ప్రసితిశ్చ మే**

అలా గుక్క తిప్పుకోకుండా గడగడా చదివేస్తాము.

అర్జునునికి కూడా ఈ పద్ధతి తెలుసు. ముందు కృష్ణపరమాత్మని స్తుతించి, తర్వాత విభూతి వర్ణన చెయ్యమని అడగబోతున్నాడు.

జగత్తులో ఉన్న ప్రతి ఒక్క గొప్పతనం కూడా తనకే చెందుతుంది అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ గొప్పతనాన్ని విభూతి అంటారు. చిన్న వస్తువునుంచి, పెద్ద విశ్వం దాకా అంతా ఈశ్వరవిభూతే అనేసరికి ఇంకా వివరాలు తెలుసుకోవాలనుకున్నాడు అర్జునుడు.

**అర్జున ఉవాచ**

శ్లో. 12 **పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ ।**
**పురుషం శాశ్వతం దివ్యమ్ ఆదిదేవమజం విభుమ్ ॥**
పరమ్, బ్రహ్మ, పరమ్, ధామ, పవిత్రమ్, పరమమ్, భవాన్,
పురుషమ్, శాశ్వతమ్, దివ్యమ్, ఆదిదేవమ్, అజమ్, విభుమ్ ॥

శ్లో. 13 **ఆహుస్త్వామ్ ఋషయః సర్వే దేవర్షిర్నారదస్తథా ।**
**అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే ॥**
ఆహుః, త్వామ్, ఋషయః, సర్వే, దేవర్షిః, నారదః, తథా,
అసితః, దేవలః, వ్యాసః, స్వయమ్, చ, ఏవ, బ్రవీషి, మే ॥

| | | | |
|---|---|---|---|
| భవాన్ | = పూజ్యుడవైన నీవు | విభుమ్ | = సర్వవ్యాపివనియు |
| పరమ్, బ్రహ్మ | = నిర్గుణపరబ్రహ్మవు | ఆహుః | = అంటారు |
| పరమ్, ధామ | = పరంధాముడవు | తథా | = అలాగే |
| పరమమ్, పవిత్రమ్ | = పరమపవిత్రుడవు | దేవర్షిః | = దేవర్షియైన |
| సర్వే, ఋషయః | = మహర్షులందరును | నారదః | = నారదుడును |
| త్వామ్ | = నిన్ను | అసితః | = అసితుడును |
| శాశ్వతమ్ | = సనాతనుడవనియు | దేవలః | = దేవలుడును |
| దివ్యమ్ | = దివ్య | వ్యాసః, చ | = వ్యాసమహర్షియును చెప్పారు |
| పురుషమ్ | = పురుషుడవనియు | స్వయమ్, ఏవ | = నీవే స్వయముగా |
| ఆదిదేవమ్ | = దేవాది దేవుడవనియు | మే | = నాకు |
| అజమ్ | = జన్మరహితుడవనియు | బ్రవీషి | = తెలుపుచున్నావు |

**భవాన్ పరమ్ బ్రహ్మ, పరమ్ ధామ, పరమమ్ పవిత్రమ్ (అస్తి) ।**
**సర్వే ఋషయః త్వామ్ శాశ్వతమ్ దివ్యమ్ ఆదిదేవమ్ అజమ్ ॥**

**విభుమ్ పురుషమ్ ఆహుః । తథా దేవర్షిః నారదః అసితః దేవలః**
**వ్యాసః (కథయతి) (త్వం) చ స్వయమ్ ఏవ మే బ్రవీషి ॥**

తా: పూజ్యుడవైన నీవు నిర్గుణపరబ్రహ్మవు, పరంధాముడవు, పరమపవిత్రుడవు, మహర్షులందరును నిన్ను సనాతనుడవనియు, దివ్యపురుషుడవనియు, దేవాది దేవుడవనియు, జన్మరహితుడవనియు, సర్వవ్యాపివనియు అంటారు. అలాగే దేవర్షియైన నారదుడును, అసితుడును, దేవలుడును, వ్యాసమహర్షియును చెప్పారు. నీవే స్వయముగా నాకు తెలుపుచున్నావు.

**అర్జున ఉవాచ** – అర్జునుడు ప్రశ్న అడగబోతున్నాడు.

**పరం బ్రహ్మ** – కృష్ణపరమాత్మను పరం బ్రహ్మ అని సంబోధిస్తున్నాడు. నువ్వే సగుణబ్రహ్మగా ప్రకటితమవుతున్న నిర్గుణబ్రహ్మవు.

అంతకుముందు కూడా చూశాము. నిర్గుణబ్రహ్మ వేషం వేసుకుంటే సగుణబ్రహ్మ; సగుణబ్రహ్మ వేషం తీసేస్తే అది నిర్గుణబ్రహ్మ. అందువల్ల ఈశ్వరుడు, బ్రహ్మ పరస్పరం భిన్నం కాదు.

**బ్రహ్మ + విభూతి = ఈశ్వరుడు**

**పరం ధామ** – నువ్వు పరంధాముడవు. అంటే శుద్ధ చైతన్యానివి; జ్యోతులకే జ్యోతివి. ధామం అంటే రెండు అర్థాలు వస్తాయి. జ్యోతి, నిలయం. రెండూ సరిపోతాయి. నువ్వు జ్యోతులకే జ్యోతివి; జగత్తుకు నిలయానివి. అంతేకాదు,

**పరమం పవిత్రమ్** – నువ్వు చాలా పవిత్రమైనవాడివి. ఎందుకు? తక్కినవన్నీ కూడా భగవంతునివల్లనే పవిత్రతను పొందుతాయి. ఉదాహరణకు ఒక భవంతిని తీసుకుంటే, ఆ భవంతికి పవిత్రత లేదు. అది కేవలం సిమెంటు, కొన్ని ఇటుకల మేలుకలయిక అంతే. దానికి ఎవరూ ఆగి నమస్కారం చెయ్యరు. కాని అదే భవంతిలో ఒక భగవంతుణ్ణి తీసుకువచ్చి ప్రతిష్ఠ చేస్తే భగవంతుడు ఉండటంవల్ల ఆ భవంతికి కూడా పవిత్రత చేకూరుతుంది. ఈశ్వరునికి స్వతఃసిద్ధంగా ఆ పవిత్రత ఉంది.

ఒక సాధువును సాధువుగా ఎందుకు కొలుస్తాము? అతను తనలోని భగవంతుణ్ణి గుర్తించినందువల్ల. అలాగే ఒక అరటిపండును పండుగా భావిస్తే, మామూలుగా తినేస్తాము. అదే అరటిపండును మనం భగవంతునికి అర్పించి, మళ్ళీ పూజ అయ్యాక తీసుకుని తింటే, దాన్ని భక్తిగా స్వీకరిస్తాము. ముందు భక్తిగా ఆ పండును కళ్ళకద్దుకుని, తర్వాతే తింటాము.

అంటే ఒక ప్రదేశానికి పవిత్రత భగవంతునితో సంబంధంవల్ల వచ్చింది; ఒక వ్యక్తికి పవిత్రత భగవంతునితో అనుబంధంవల్ల వచ్చింది; ఒక వస్తువుకు పవిత్రత భగవంతునికి అర్పించటంవల్ల వచ్చింది. భగవంతుణ్ణి ఎవరికి అర్పించాలి? ఎవరికీ అవసరం లేదు. ఆయన పరమం పవిత్రం.

**పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం మంగళమ్**

**పురుషమ్** – నువ్వు అందరిలోనూ నివసిస్తావు.

**శ్రోత్రస్య శ్రోతం మనసో మనోయద్**
**వాచోహ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః** – కేన 1.2

చెవి, మనస్సు, వాక్కు, ప్రాణాలకు వాటియొక్క శక్తిని నువ్వే ఇస్తావు. పురు అంటే శరీరం; ష అంటే ఉండే వ్యక్తి; పురుష అంటే శరీరంలో ఉండే వ్యక్తివి నువ్వు. అందువల్లనే మన హిందూ సాంప్రదాయం ఎదుటి మనిషికి నమస్కారం పెట్టమంటుంది. ఆ నమస్కారం ఆ వ్యక్తికి కాదు, అతనిలో ఉన్న పరమాత్మకు.

**శాశ్వతమ్** – నువ్వు నిత్యుడివి. ముందుమాట పురుషం అని వచ్చింది. అంటే శరీరంలో శరీరిగా ఉంటాడు అంటే, శరీరం పోతే భగవంతుడు కూడా మాయమైపోతాడా అంటే లేదు. ఇల్లు పోయినా, ఇంటి యజమాని పోడు. అలాగే శరీరం పడిపోయినా, శరీరంలో ఉన్న పరమాత్మ పోడు. ఆయన నిత్యం, ఆయన శాశ్వతం.

**నిత్యోఽ నిత్యానాం చేతనశ్చేతనానామ్**
**ఏకో బహూనాం యో విదధాతి కామాన్** – కఠ 2.2.13

నిత్య ఈశ్వరుడు, అనిత్య శరీరంలో ఉన్నాడు.

**దివ్యమ్** – నువ్వు చేతనతత్త్వానివి. శరీరం జడం, ఇంద్రియాలు జడం, మనస్సు కూడా జడమే. ఈ అంగాలు పని చేస్తున్నాయంటే అది ఈ చైతన్యంవల్లనే. అందువల్ల భగవంతుడు దివ్యమ్. స్వయం ప్రకాశస్వరూపుడు, స్వయంజ్యోతి.

**ఆదిదేవమ్** – దేవతలు పుట్టకముందు ఉన్నావు. బ్రహ్మదేవుడు పుట్టకముందు కూడా నువ్వు ఉన్నావు. పురాణాల్లో విష్ణుమూర్తికి బ్రహ్మదేవుడు పుట్టినట్లు చూస్తాము. బ్రహ్మదేవునినుంచి ఇంద్రుడు, వరుణుడు లాంటి దేవతలు పుట్టారు. అంటే నువ్వు కారణదేవతవు, తక్కిన వారందరూ కార్యదేవతలు. అందువల్ల నువ్వు ఆదిదైవం.

**అజమ్** – నీకు పుట్టుక లేదు. దేవతలకు భగవంతుడు కారణం అయితే, ఆయనకు కారణం ఎవరు? పిల్లలు కూడా ఈ ప్రశ్న వేస్తూ ఉంటారు. భగవంతునికి తల్లిదండ్రులు ఎవరు? ఆయనకు తల్లిదండ్రులు లేరు, అజం అంటే పుట్టుక లేదు. అంటే ఆయన కారణం లేని కారణం. తండ్రి లేని తండ్రి. తల్లి లేని తల్లి. ఆయనే జగత్తుకు తల్లీ, తండ్రీ కూడా.

**విభుమ్** – నువ్వు సర్వవ్యాపకుడవు. భగవంతుడు అంతటా ఉన్నాడు.

అర్జునునికి ఇంకా నిర్గుణబ్రహ్మజ్ఞానం పూర్తిగా కలుగలేదు. ఎందుకంటే ఇంకా కృష్ణపరమాత్మ బోధ పూర్తి కాలేదు. అందువల్ల అతను పూర్తి జ్ఞాని కాలేదు. అందువల్ల అర్జునుడు ఏం చేస్తున్నాడు? భగవంతునియొక్క ఈ లక్షణాలన్నిటినీ వర్ణించి, ఇదంతా ఋషులు చెప్పారు అంటున్నాడు. అది వచ్చే శ్లోకంలో చూస్తాము.

**సర్వే ఋషయః ఆహుః** – ఋషులందరూ అంటారు. **ఋషతి జానాతి ఇతి ఋషిః**

ఋషి అంటే జ్ఞాని. ఋషి అంటే అడవిలో ఉండే జటాధారే అవనవసరం లేదు. అందువల్ల జ్ఞానం ఉన్న వ్యక్తిని ఋషి అంటారు. ఆ మాటని ముందు శ్లోకంతో కలుపుకోవాలి. అంటే ముందు శ్లోకంలో భగవంతుణ్ణి కీర్తిస్తూ చెప్పిన పలుకులన్నీ అర్జునుడు ఋషులద్వారా విన్నవి.

**దేవర్షిర్నారదస్తథా** – స్వర్గలోకానికి చెందిన నారదుడు కూడా చెబుతాడు. ఋషులు అంటే భూలోక జ్ఞానులు. దేవర్షి అంటే దేవలోక ఋషి. దేవలోకంలో అనేకఋషులు ఉన్నారు, వారిలో గొప్పఋషి నారదుడు. నారం అంటే జ్ఞానం; ద అంటే ఇచ్చేవాడు – దదాతి ఇతి దః; అందువల్ల నారద అంటే –

**నారం జ్ఞానం దదాతి ఇతి నారదః**

సంచారం చేసే గురువు. అంటే ఆయన సంచారం చేస్తూ జ్ఞానబోధ చేస్తాడు. నారదుణ్ణి కలహభోజనుడు అని కూడా అంటారు కాని ఆ కలహం వెనక లోకకళ్యాణం ఉంటుంది. అలా ఆయన జ్ఞానప్రదాత.

**అసితః దేవలః వ్యాసః** – నారదుల వారే కాదు, తక్కిన ఋషులు కూడా అన్నారు. అసితుడు ఒక ఋషి. ఆయన పుత్రుడు దేవలుడు. వ్యాసుడు అంటే మహాభారత కర్త, గీతకర్త.

వ్యాసుడు వీటిని రాస్తూ, వ్యాసుడు చెప్పాడు అని తన గురించి తాను ఎలా చెప్పగలడు? గుర్తుంచుకోండి, ఇది వ్యాసుడు స్వయంగా చెప్పటం లేదు. అర్జునుడు చెబుతున్నాడు ఈ మాటను.

**స్వయం చ ఏవ బ్రవీషి మే** – నువ్వే నాకు స్వయంగా చెబుతున్నావు. నాకు నీమీద శ్రద్ధ ఉంది. నువ్వు సత్యమే పలుకుతావు. నువ్వు నన్ను సరైన దారిలో నడిపిస్తావు.

**పరంబ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్**

ఇదంతా కృష్ణుణ్ణి స్తుతిస్తూ అర్జునుడు చెబుతున్నాడు. కృష్ణుడు ఈ మెప్పుకోలుకు పొంగిపోతాడని కాదు, తన తృప్తికోసం తను కీర్తిస్తున్నాడు.

శ్లో. 14 **సర్వమేతద్ ఋతం మన్యే యన్మాం వదసి కేశవ ।**
**న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥**
సర్వమ్, ఏతత్, ఋతమ్, మన్యే, యత్, మామ్, వదసి, కేశవ,
న, హి, తే, భగవన్, వ్యక్తిమ్, విదుః, దేవాః, న, దానవాః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కేశవ! | = | ఓ కేశవా! | తే | = | నీ |
| యత్ | = | దేనిని | వ్యక్తిమ్ | = | లీలామయస్వరూపము |
| మామ్ | = | నాకు | దానవాః | = | దానవులకు |
| వదసి | = | చెప్పుచున్నావో | న, విదుః | = | తెలియదు |
| ఏతత్, సర్వమ్ | = | ఇది యంతయును | దేవాః, హి | = | దేవతలకును |
| ఋతమ్, మన్యే | = | సత్యమని తలంతును | న (విదుః) | = | తెలియదు |
| భగవన్ | = | ఓ దేవా! కృష్ణా! | | | |

**హే కేశవ! యత్ మామ్ (త్వం) వదసి, (తత్) ఏతత్ సర్వమ్ (అహం) ఋతమ్ మన్యే ।**
**హే భగవన్! న దేవాః న దానవాః (వా) తే వ్యక్తిమ్ హి విదుః ॥**

తా: ఓ కేశవా! దేనిని నాకు చెప్పుచున్నావో ఇది యంతయును సత్యమని తలంతును. ఓ దేవా! కృష్ణా! నీ లీలామయస్వరూపము దానవులకు ఇంకా దేవతలకును తెలియదు.

**ఏతత్ సర్వం ఋతమ్** – నేను ఇంతవరకూ చెప్పినదంతా సత్యం. అంటే పన్నెండవ శ్లోకంలో చెప్పిందంతా సత్యం. ఎందుకు?

**యత్ మాం వదసి కేశవ** – నువ్వే స్వయంగా ఈ విషయాలు చెప్పావు నాకు. నువ్వు అబద్ధాలు చెప్పవు. నువ్వు ప్రమాణం నాకు. నీ బోధను నిజమా, కాదా అని వేరే ఋషుల మాటలతో పోల్చిచూడను. వారు మనుష్యులు. నీ విభూతులు వారికి పూర్తిగా తెలియవు. నువ్వే సర్వజ్ఞుడివి, వారు అల్పజ్ఞులు.

**దేవాః దానవాః తే వ్యక్తిం న విదుః** – దేవతలకు కూడా నీ శక్తి తెలియదు. ఈ అధ్యాయంలోనే కృష్ణపరమాత్మే ఆ విషయం స్వయంగా చెప్పాడు.

**న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః** –10.2

ఆ సందర్భంలో కేనోపనిషత్తులోని కథ కూడా చూశాము. ఎలా దేవతలకు కూడా భగవంతుని శక్తి తెలియలేదో అందులో చూశాము. దేవతల గర్వభంగంద్వారా మనకున్న జ్ఞానం పరిమితం అయినదని తెలుస్తుంది. మన బుద్ధి దేశ,కాలపరిమితులను ఉన్నదానినే తెలుసుకోలేదు. నిజం చెప్పాలంటే దాన్ని కూడా పూర్తిగా తెలుసుకోలేదు. అలాంటప్పుడు దేశకాలాలకు అతీతంగా ఉన్న నిర్గుణబ్రహ్మను ఎలా తెలుసుకోగలదు? అంటే పౌరుషేయప్రమాణం సరిపోదు బ్రహ్మజ్ఞానం పొందటానికి.

కేనోపనిషత్తులో అది గ్రహించిన ఇంద్రుడు ఈశ్వరునికి ప్రార్థన చేశాడు. అప్పుడు ఉమాదేవి ప్రత్యక్షమై అతనికి జ్ఞానబోధ చేసింది.

దేవతలకే భగవానుని స్వరూపం అర్థం కాకపోతే ఇంక దానవులకు ఎలా తెలుస్తుంది? సత్త్వగుణప్రధానులైన దేవతలకే తెలియకపోతే, రజోగుణప్రధానులైన దానవులకు తెలియటం కష్టం.

అందువల్ల భగవంతుని విభూతి ఎవరికి తెలుస్తుంది? భగవంతుడైన కృష్ణపరమాత్మకే తెలుస్తుంది. ఎవరినో అడగటం ఎందుకు? సాక్షాత్తూ భగవంతుడే తన ముందు ఉండగా.

**భగవన్ తే (వ్యక్తిమ్)** – ఓ భగవంతుడా! నీ విభూతి గురించి నువ్వే స్వయంగా నాకు చెప్పు.

శ్లో. 15 **స్వయమేవాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।**
**భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥**
స్వయమ్, ఏవ, ఆత్మనా, ఆత్మానమ్, వేత్థ, త్వమ్, పురుషోత్తమ,
భూతభావన, భూతేశ, దేవదేవ, జగత్పతే ॥

| | | | |
|---|---|---|---|
| భూతభావన! | = ఓ జగదుత్పత్తి కారకా! | త్వమ్ | = నీవు |
| భూతేశ! | = ఓ సర్వభూతేశా! | ఆత్మానమ్ | = నీ స్వస్వరూపమును గూర్చి |
| దేవదేవ! | = ఓ దేవాదిదేవా! | స్వయమ్ | = సంపూర్ణముగా |
| జగత్పతే | = ఓ జగన్నాథా! | ఆత్మనా, ఏవ | = నీకు మాత్రమే |
| పురుషోత్తమ! | = ఓ పురుషోత్తమా! | వేత్థ | = తెలుసును |

**హే పురుషోత్తమ! భూత–భావన, భూత–ఈశ, దేవ–దేవ,**
**హే జగత్–పతే! త్వమ్ స్వయమ్ ఏవ ఆత్మనా ఆత్మానమ్ వేత్థ ॥**

తా: ఓ జగదుత్పత్తి కారకా, ఓ సర్వభూతేశా, ఓ దేవాదిదేవా, ఓ జగన్నాథా, ఓ పురుషోత్తమా! నీకు మాత్రమే పూర్తిగా నీ స్వస్వరూపమును గురించి తెలుసును.

ఇక్కడ కృష్ణపరమాత్మను ఇంకా కొత్తనామాలతో పిలుస్తున్నాడు అర్జునుడు. ముందేమో కేశవ, భగవంతుడా అన్నాడు. ఇప్పుడేమో పురుషోత్తమ, భూతభావన, భూతేశ, దేవదేవ, జగత్పతే అంటున్నాడు. అంటే ఒక చిన్న తరహా అర్చన చేస్తున్నాడు. ఇవన్నీ భగవంతుని గొప్పతనాన్ని స్తుతించే పదాలు.

**పురుషోత్తమ** – పురుషోత్తమ పదం ఒక సాంకేతిక పదం. దీన్ని కృష్ణపరమాత్మే స్వయంగా 15వ అధ్యాయంలో వివరిస్తాడు. అక్కడ మొత్తం విశ్వాన్ని మూడుగా విభజిస్తాడు. అవి – క్షరపురుషుడు, అక్షరపురుషుడు, ఉత్తమపురుషుడు.

**క్షరపురుషుడు – వ్యక్తప్రపంచం**
**అక్షరపురుషుడు – అవ్యక్తప్రపంచం**
**ఉత్తమపురుషుడు – చైతన్యం**

అంటే మొత్తం విశ్వంలో మూడే ఉన్నాయి – అవ్యక్త జగత్తు, వ్యక్త జగత్తు, వీటికి భిన్నంగా ఉన్న చైతన్యం. వ్యక్తప్రపంచాన్ని మూర్తప్రపంచం అనీ, అవ్యక్తప్రపంచాన్ని అమూర్తప్రపంచం అనీ చెప్పవచ్చు. మూర్తామూర్త ప్రపంచానికి భిన్నంగా ఉంది శుద్ధచైతన్యం. మూర్తప్రపంచం క్షరపురుషుడు, అమూర్తప్రపంచం అక్షరపురుషుడు, శుద్ధచైతన్యం ఉత్తమపురుషుడు. ఉత్తమపురుషుణ్ణి తిరగేస్తే ఏం వస్తుంది? పురుషోత్తమ. అందువల్ల పురుషోత్తమ అంటే వ్యక్తావ్యక్తప్రపంచానికి భిన్నంగా ఉన్న చైతన్యం.

అందువల్ల ఓ కృష్ణా! నువ్వు నేను చూస్తున్న మానవాకారంలో ఉన్న కృష్ణుడివి కావు, ఇది నువ్వు వేసుకున్న వేషం మాత్రమే. నీ అసలు స్వరూపం చైతన్యస్వరూపం లేదా చిద్రూపం.

**భూతభావన** – భూత అంటే అన్ని జీవరాశులూ వస్తాయి; భావన అంటే సృష్టికర్త. అందువల్ల భూతభావన అంటే సృష్టికర్తవు నువ్వు.

నువ్వే జగత్కారణం బ్రహ్మవు. నీ నుంచే జగత్తు వ్యక్తమయి, మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. అందువల్ల భూతభావనః.

**భూతేశ** – నువ్వు సృష్టికర్తవే కాదు, స్థితికర్తవు కూడా. మనం ఎన్నిటినో సృష్టిస్తాము కాని వాటిని అదుపులో పెట్టే శక్తి ఉండదు. పిల్లలను కంటాము కాని, ఒక్కో దయనీయ పరిస్థితిలో ఎందుకు వీరికి జన్మనిచ్చామా అని వాపోయే పరిస్థితి వస్తే రావచ్చు. అందువల్ల సర్వశక్తిమంతుడు అంటే సృష్టికర్తే కాదు, స్థితికర్త కూడా. ఓ దేవా, నువ్వు సృష్టికర్త, స్థితికర్తా కూడా.

**దేవదేవ** – ఈ పదాన్ని ముందు కూడా చూశాము. నువ్వు దేవతలకే దేవుడవు. దేవతలు అంటే ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, వాయువులాంటివారు. వారిని కూడా నువ్వు అదుపులో పెడతావు.

**భయాదాస్యాగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః**
**భయాదింద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః** – కఠ 2.3.3

అగ్ని, సూర్యుడు, ఇంద్రుడు, వాయువు, యమధర్మరాజు భగవంతునిమీద భయంచేతనే వారి పనిని వారు సక్రమంగా చేస్తున్నారని యమధర్మరాజే స్వయంగా చెప్పాడు. అందువల్ల నువ్వు దేవదేవుడివి. **దేవానాం దేవః.**

**జగత్పతే** – జగత్తును భక్షించాలని చూసేవారినుంచి జగత్తును నువ్వు రక్షిస్తావు.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥** – 4.8

ఎప్పుడైతే ఈ జగత్తు ప్రమాదంలో పడిపోతుందో, అప్పుడు నువ్వే జగత్తును రక్షించటానికి అవతరిస్తావు.

భగవంతుని గురించి కృష్ణపరమాత్మనే ఎందుకు అడుగుతున్నాడు? దానికి కారణం మొదటి పాదంలో చెబుతున్నాడు.

**స్వయమేవాత్మనాత్మానం వేత్థ** – నీ గురించి నీకు మాత్రమే పూర్తిగా తెలుసు. తక్కినవారికి నీ గొప్పతనం తెలియదు. నీకు ఎలా తెలుసు? స్వయంవేత్త. స్వయంగా తెలుసు. భగవంతునికి ఇంకొక గురువు ఉండుంటే ఆ గురువు ఎవరు అనే ప్రశ్న ఉదయిస్తుంది. అందువల్ల అర్జునుడు ఆత్మనా వేత్థ అంటున్నాడు. భగవంతుడు సర్వజ్ఞుడు. మనం అజ్ఞానులుగా పుట్టాము. అజ్ఞానాన్ని పారద్రోలటానికి గురువు దగ్గరికి వెళ్ళి నేర్చుకోవటానికి అవస్థలు పడుతున్నాము. కాని భగవంతుడు ముందే జ్ఞాని. ఆయన సర్వజ్ఞుడు. అందువల్ల నీ గురించి నీకే తెలుసు. పైగా నీ గురించి పూర్తిగా నీకు మాత్రమే తెలుసు. అందువల్ల నువ్వే నీ గురించి సంపూర్ణముగా చెప్పగల గొప్ప ఆచార్యుడవు.

శ్లో. 16 **వక్తుమర్హస్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః ।**
**యాభిర్విభూతిభిర్లోకాన్ ఇమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి ॥**
వక్తుమ్, అర్హసి, అశేషేణ, దివ్యాః, హి, ఆత్మవిభూతయః,
యాభిః, విభూతిభిః, లోకాన్, ఇమాన్, త్వమ్, వ్యాప్య, తిష్ఠసి ॥

| | | | |
|---|---|---|---|
| యాభిః | = ఏ | ఆత్మ విభూతయః | = నీ విభూతులను గూర్చి |
| విభూతిభిః | = దివ్యవిభూతులవల్ల | అశేషేణ | = సంపూర్ణముగా |
| ఇమాన్, లోకాన్ | = ఈ లోకములను | వక్తుమ్ | = చెప్పుటకు |
| వ్యాప్య | = వ్యాపించి | త్వం, హి | = నీవే |
| తిష్ఠసి | = స్థితుడవై ఉన్నావో అటువంటి | అర్హసి | = అర్హుడవు |
| దివ్యాః | = దివ్యములైన | | |

**(అతః) యాభిః విభూతిభిః త్వమ్ ఇమాన్ లోకాన్ వ్యాప్య తిష్ఠసి,**
**(తాః) దివ్యాః ఆత్మ–విభూతయః హి అశేషేణ వక్తుమ్ అర్హసి ॥**

తా: ఏ దివ్యవిభూతులవల్ల ఈ సమస్త లోకములను వ్యాపించి స్థితుడవై ఉన్నావో అటువంటి దివ్యములైన నీ విభూతులను సంపూర్ణముగా చెప్పుటకు నీవే అర్హుడవు.

ముందు శ్లోకం వరకూ స్తుతి చేశాడు. ఇప్పుడు కోరిక కోరుతున్నాడు. అంటే ముందు నమకం చేశాడు, ఇప్పుడు చమకానికి వస్తున్నాడు.

**వక్తుమ్ అర్హసి** – నువ్వు నాకు బోధించాలి. అర్హసి అనే పదం వినయంగా ఆజ్ఞాపిస్తుంది. నువ్వు నాకు బోధించాలి. ఏం బోధించాలి?

**ఆత్మవిభూతయః** – నీ విభూతుల గురించి చెప్పాలి. ఆత్మ అంటే నీ అని అర్థం ఇక్కడ. అంటే నీ గురించి నువ్వు చెప్పు. అది కూడా ఎటువంటి విభూతుల గురించి?

**దివ్యాః** – అసాధారణమైన విభూతుల గురించి చెప్పాలి. ఎందుకంటే మనం చేసే ప్రతి పని కూడా ఒక విభూతే. మనం నడవటం కూడా ఒక విభూతే. అది విభూతి అని మనకు ఎప్పుడు తెలుస్తుంది? అడుగు తీసి అడుగు వెయ్యటం కష్టమైన వారిని చూస్తే తెలుస్తుంది. ఫిజియోథెరపీ జరిగేచోటుకెళ్ళి చూస్తే తెలుస్తుంది మనమెంత గొప్పవారిమో.

ఊపిరి పీల్చటం ఒక విభూతి; మూత్రపిండాలు సరిగ్గా పని చెయ్యటం ఒక విభూతి; పాంక్రియాస్ సరిగ్గా పని చెయ్యటం ఒక విభూతి. వెంటిలేటర్స్‌మీద ఉన్నప్పుడు ఊపిరితిత్తుల విలువ తెలుస్తుంది; డయాలిసిస్ తీసుకోవాల్సి వస్తే మూత్రపిండాల విలువ తెలుస్తుంది. ఇన్సులిన్ ఇంజక్షను తీసుకోవాల్సి వస్తే పాంక్రియాస్ విలువ తెలుస్తుంది. ఏ ఒక్క అంగం దెబ్బ తిన్నా, దాన్ని మార్చాలంటే లక్షలకు లక్షలు ఖర్చు పెట్టాల్సివుంటుంది. అంటే మనం ఎన్ని లక్షల విలువ చేస్తామో ఒక్కసారి ఆలోచించండి. ప్రపంచంలోనే అత్యంత గొప్ప ఐశ్వర్యవంతులం మనము, కాని మనకు మన శరీరం విలువ తెలియటంలేదు. ఎందుకు? పుట్టినప్పటినుంచి అవి ఉండి, వాటి పని అవి నిశ్శబ్దంగా చేసుకుపోతున్నాయి కాబట్టి.

అర్జునుడు అంటున్నాడు, నాకు లౌకిక విభూతుల గురించి అవసరం లేదు. నాకు దివ్యమైన విభూతుల గురించి చెప్పు.

**యాభిః విభూతిభిః** – ఏ విభూతులతో అయితే,

**ఇమాన్ లోకాన్ వ్యాప్య తిష్ఠసి** – నువ్వు ఈ సృష్టినంతా వ్యాపించి ఉన్నావో అవి చెప్పు అంటున్నాడు అర్జునుడు. ఈ విభూతులు ఒక్కచోట లేవు. అవి విశ్వమంతా ఏదో ఒక రూపంలో వ్యాపించివున్నాయి. యాభిః విభూతిభిః అంటే అటువంటి అసాధారణ విభూతులతో నువ్వు విశ్వమంతా వ్యాపించి ఉన్నావు. నాకు అటువంటి విభూతుల గురించి వినాలనివుంది. ఎందుకు? ఎందుకో రాబోయే శ్లోకంలో చెప్పబోతున్నాడు అర్జునుడు.

శ్లో. 17 **కథం విద్యామహం యోగిన్ త్వాం సదా పరిచింతయన్ ।**
**కేషు కేషు చ భావేషు చింత్యోఽసి భగవన్ మయా ॥**
కథమ్, విద్యామ్, అహమ్, యోగిన్, త్వామ్, సదా, పరిచింతయన్,
కేషు, కేషు, చ, భావేషు, చింత్యః, అసి, భగవన్, మయా ॥

| | | | |
|---|---|---|---|
| యోగిన్ | = ఓ యోగీశ్వరా! | చ | = ఇంకా |
| అహమ్ | = నేను | భగవన్ | = ఓ దేవా! |
| కథమ్ | = ఏ విధముగా | కేషు, కేషు | = ఏయే |
| సదా | = నిరంతరము | భావేషు | = భావములద్వారా |
| పరిచింతయన్ | = బాగుగా చింతన చేయుచు | మయా | = నాచే |
| త్వామ్ | = నిన్ను | చింత్యః, అసి | = చింతన చేయదగినవాడవు? |
| విద్యామ్ | = తెలుసుకోగలను | | |

**హే యోగిన్! సదా పరిచిన్తయన్ అహమ్ త్వామ్ కథమ్ విద్యామ్?**
**హే భగవన్! కేషు కేషు చ భావేషు (త్వం) మయా చిన్త్యః అసి?**

తా: ఓ యోగీశ్వరా! నేను ఏ విధముగా నిరంతరము బాగుగా చింతన చేయుచు నిన్ను తెలుసుకోగలను? ఇంకా ఓ దేవా! ఏయే భావములద్వారా నాచే చింతన చేయదగినవాడవు?

ఈ శ్లోకంలో అర్జునుడు కృష్ణపరమాత్మను తన విభూతుల పట్టిక ఇవ్వమని ఎందుకు కోరుతున్నాడో వివరిస్తున్నాడు. అది ఈశ్వరధ్యానం చెయ్యటంకోసం. నువ్వు చెప్పే విభూతులలో నాకు ఏది నచ్చితే దానిమీద నేను ధ్యానం చేస్తాను.

ఇష్టాయిష్టాలు మనిషినిబట్టి మారుతుంటాయి. కొంతమందికి విరబూసిన పువ్వులు నచ్చితే, కొంతమందిని అప్పుడే తొంగిచూస్తున్న సూర్యుడు ఆకట్టుకుంటే, మరికొంతమందిని ఎగసి పడుతున్న సముద్రం ఆకర్షిస్తుంది.

ఆ విధంగా అద్భుతమైన వస్తువు ఏదైనా ధ్యానం చెయ్యటానికి ఆలంబనం అవుతుంది. ఆలంబనం అంటే ప్రతీక. అందువల్ల మన సాంప్రదాయంలో దేనిమీదైనా ధ్యానం చెయ్యవచ్చు. అంటే సూర్యుడు, చంద్రుడు, సర్పం, నది, దేనిమీద చేసినా, ఆ వస్తువును ధ్యానం చెయ్యము. ఆ వస్తువును ప్రతీకగా తీసుకుని, దానిమీద భగవంతుణ్ణి ఆవాహన చేస్తాము.

**కేషు కేషు చ భావేషు** – ఏ వస్తువులమీద నిన్ను ధ్యానం చెయ్యవచ్చో చెప్పు అంటున్నాడు అర్జునుడు.

**చింత్యః** – ఉపాసన చెయ్యవచ్చో, ఆ పట్టిక చెప్పు నాకు. నువ్వు చెప్పే వాటిలోంచి నాకిష్టమైన దానిని తీసుకుంటాను.

అటువంటి ఉపాసనను విరాట్ ఉపాసన అంటారు. విరాట్ అంటే ఈశ్వరధ్యానం అవుతుంది కాని విరాట్‌కి చిహ్నంగా ఒక చిన్న ప్రతీకను తీసుకుంటాము. ఆ ప్రతీక ఆవు కూడా కావచ్చు. ఆవు బొమ్మమీద అనేక దేవతల

బొమ్మలు వేస్తారు. దాని అర్థం ఆవు, ఈ దేవతలందరికీ ప్రతీక. అలా ఒక వస్తువును ఆలంబనంగా తీసుకుని, సమష్టి ఈశ్వరునిమీద ఉపాసన చేస్తాము.

బృహదారణ్యకోపనిషత్తు అశ్వధ్యానంతో మొదలవుతుంది. అంటే గుర్రంమీద ధ్యానం. అక్కడ కూడా గుర్రంలోని ఒక్కొక్క భాగం తీసుకుని ఆ భాగంలో సమష్టి అంశాన్ని చూడమంటుంది.

**ఓమ్ ఉషా వా అశ్వస్య మేధ్యస్య శిరః । సూర్యశ్చక్షుర్వాతః ప్రాణో**
**వ్యాత్తమగ్నిర్వైశ్వానరస్సంవత్సర ఆత్మాఽ శ్వస్యమేధ్యస్య** – బృహదారణ్యకం 1.1.2

అలా మనకు నచ్చిన ఏ వస్తువునైనా తీసుకుని దానిలో సమష్టిప్రపంచాన్ని చూడాలి. అలాంటి విరాట్ ఉపాసన చెయ్యటంవల్ల కలిగే లాభం ఏమిటి?

**సదా త్వాం పరిచింతయన్** – అలా ఏ వస్తువును చూసినా, అందులో విశ్వరూప ఈశ్వరుణ్ణి దర్శించటంవల్ల తర్వాత నీ పారమార్థిక స్థాయిని తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

సంధ్యావందనం చేసేటప్పుడు కూడా నీళ్ళు చేతిలోకి తీసుకుని, నీళ్ళను చూస్తూ ఈ క్రింద మంత్రాన్ని పఠిస్తారు.

**ఆపో వా ఇదగ్ం సర్వం విశ్వాభూతాన్యాపః ప్రాణా వా ఆపః పశవ ఆపోన్నమాపోమృతమాపఃస్స్రమాడాపో విరాడాపః స్వరాడాపశ్ఛందాగ్ం స్యాపో జ్యోతీగ్ం ష్యాపో యజూగ్ం ష్యాపస్సత్యమాప స్సర్వాదేవతా ఆపో భూర్భువస్సువరాప ఓమ్** – మహానారాయణోపనిషత్తు 4.29

సృష్టిలో అద్భుతమైన వాటిలో నీరు ఒకటి. అందువల్ల ఆ నీరును చేతిలోకి తీసుకుని సకలదేవతలను, వేదాలను, పశువులను, సకలప్రాణులను అందులోకి ఆవాహన చేస్తాము. అప్పుడు అది మామూలు నీరు కాదు, ఈశ్వరుడు అవుతుంది. అప్పుడు ఆ నీళ్ళలోకి ఆవాహన చేసిన భగవంతుని దీవెనలను కోరుతాము. అలా చెయ్యటం వల్ల ఏమవుతుంది?

**త్వామ్ అహం విద్యామ్** – నాకు నీ ఉన్నతస్వరూపం తెలుస్తుంది. విశ్వరూప ఈశ్వరుని కన్నా ఉన్నతస్వరూపం ఏమిటి? అరూప ఈశ్వరుడు లేదా నిర్గుణబ్రహ్మ. విశ్వరూప ఈశ్వరుడు అంటే సగుణబ్రహ్మ. ఆ సగుణబ్రహ్మ నుంచి నేను నిర్గుణబ్రహ్మజ్ఞానానికి వస్తాను. ఎందుకంటే నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందుకుండా, మోక్షం పొందే మార్గమే లేదు. నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందటాన్ని వాయిదా వేయవచ్చేమో కాని, దాన్ని పూర్తిగా తప్పించుకోలేము.

అందువల్ల నీ విశ్వరూపాన్ని ఊహించుకోవటంవల్ల నేను ఎప్పుడో అప్పుడు నీ నిర్గుణజ్ఞానానికి వస్తాను అంటున్నాడు అర్జునుడు.

ఒక మామూలు చీరె కొనటానికే కొన్ని రంగుల చీరలే ఉన్న దుకాణాన్ని వదిలేసి, ఒక్క రంగులోనే అనేక వేలచీరెలు ఉన్న దుకాణానికి వెళతాము. అలా నాకు అనేక ప్రతీకలను గురించి చెప్పు అంటున్నాడు అర్జునుడు.

కొంతమంది మన హిందూమతాన్ని విమర్శిస్తారు. మనకు అనేకమంది దేవతలు ఉన్నారని వారి విమర్శ. నిజానికి అది తప్పు కాదు, మనకు ప్రత్యేకమైన అవకాశం. వారికి ఇష్టమైనా లేకపోయినా ఒక్కరే దేవుడు ఉన్నాడు, మనకు అలా కాదు. మనకు ఏ దేవుడు ఇష్టమైతే ఆ దేవుణ్ణి పూజించి, తద్వారా జ్ఞానయోగ్యతాప్రాప్తి పొంది, చివరికి నిర్గుణబ్రహ్మజ్ఞానానికి వచ్చి, తద్వారా మోక్షం పొందవచ్చు. అందువల్ల ఉపాసన చెయ్యటంకోసం కావాలి అంటున్నాడు అర్జునుడు. ఉపాసన ఎందుకు? జ్ఞానం పొందటానికి.

ఉపాసన చెయ్యటంవల్ల పొందే ఫలమేమిటి? ప్రత్యక్షంగా మోక్షం రాదు కాని మనస్సు విశాలమవుతుంది. ఒక నదిని చూసినా అందులో భగవంతుణ్ణి చూస్తాము. నదిని చూడగానే చెంగుమని నీళ్ళలోకి దూకకుండా, ఆగి దానికి నమస్కారం పెట్టుకుని, నీళ్ళతో ప్రార్థన చేసి, అప్పుడు నీటిలోకి అడుగు పెడతాము. ఏదైనా ఆహారవస్తువును చూసినా అంతే. చటుక్కున నోటిలో వేసేసుకోకుండా, భగవంతుణ్ణి తలచుకుని, భక్తిపూర్వకంగా కళ్ళకద్దుకుని, అప్పుడు నోట్లో వేసుకుంటాము. ఇటువంటి మార్పు రావటంకోసం అర్జునుడు కృష్ణపరమాత్మను సహాయం కోరుతున్నాడు. అలాగే ఒక పెద్దపట్టికను ఇస్తాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 18 **విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।**
**భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥**
విస్తరేణ, ఆత్మనః, యోగమ్, విభూతిమ్, చ, జనార్దన,
భూయః, కథయ, తృప్తిః, హి, శృణ్వతః, న, అస్తి, మే, అమృతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| జనార్దన! | = ఓ జనార్దనా! | హి | = ఎందుకంటే |
| ఆత్మనః | = పరమాత్మవైన నీయొక్క | అమృతమ్ | = నీ అమృతమయ వచనములను |
| యోగమ్ | = యోగశక్తిని గూర్చియు | | |
| విభూతిమ్, చ | = విభూతుల వైభవములను గూర్చియు | శృణ్వతః | = వినుచున్న |
| భూయః | = ఇంకా | మే | = నాకు |
| విస్తరేణ | = వివరముగా | తృప్తిః | = ఇంక చాలు |
| కథయ | = తెలుపుము | న, అస్తి | = అనిపించుట లేదు |

**హే జనార్దన! ఆత్మనః యోగమ్ విభూతిమ్ చ భూయః విస్తరేణ కథయ ।**
**(ఏతత్) అమృతమ్ శృణ్వతః హి మే తృప్తిః న అస్తి ।**

తా: ఓ జనార్దనా! పరమాత్మవైన నీయొక్క యోగశక్తిని గూర్చియు విభూతుల వైభవములను గూర్చియు ఇంకా వివరముగా తెలుపుము. ఎందుకంటే నీ అమృతమయ వచనములను వినుచున్న నాకు ఇంక చాలు అనిపించుట లేదు.

ముందంతా కృష్ణపరమాత్మను స్తుతించి, ఈ శ్లోకంలో తనకు కావాల్సిందేమిటో చెప్పబోతున్నాడు. పరంబ్రహ్మ, పరంధామ, పరమం పవిత్రం శాశ్వతం, ఆదిదేవం లాంటి పదాలతో భగవంతునికి అర్చన చేశాడు. ఇప్పుడు కోరిక. ఏమిటది?

**జనార్దన** – జనులందరూ పూజించే మహానుభావుడు.

**జనైః హి అర్ద్యతే యజ్యతే ఇతి జనార్దనః.**

**కథయ** – నువ్వు నాకు వివరంగా చెప్పుము. ఏమిటది?

**ఆత్మనః యోగమ్** – ఇక్కడ ఆత్మనః అంటే నీయొక్క. నీ యోగశక్తి గురించి వివరించు. యోగశక్తి అంటే అవ్యక్తశక్తి అని చూశాము. మామిడిటెంకలో మామిడిచెట్టు అయ్యే నిగూఢశక్తి ఉంటుంది. అది కొబ్బరిచెట్టు అవదు. అలాగే పాలనుంచి వెన్న వస్తుంది కాని నూనె రాదు. అలా సృష్టిలో ఏ వస్తువును తీసుకున్నా కూడా, దానిలో ఆ వస్తువుకు సంబంధించిన నిగూఢశక్తి ఉంటుంది. కాని భగవంతుని నిగూఢశక్తి ఏమిటి? ఆయనలో మొత్తం జగత్తును వ్యక్తపరిచే నిగూఢశక్తి ఉంది.

భగవంతునినుంచి ముందు ఆకాశం వచ్చింది. ఆకాశ సంభూతః – ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీటినుంచి పృథివి, పృథివినుంచి చెట్లు, చెట్లనుంచి అన్నం, అన్నంనుంచి మనుషులు వచ్చారని తైత్తిరీయోపనిషత్తులో చూస్తాము.

**విభూతిం యోగం చ మమ** – 10.7

కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు. తనకు రెండు శక్తులు ఉన్నాయని. అవి యోగం, విభూతి. వాటిని వ్యక్త, అవ్యక్త మహిమలు అనవచ్చు. లౌకికవిషయంలో ఒక వ్యక్తికి యోగం ఉన్నట్టు మనకు అతన్ని చూస్తే తెలియదు. అంటే ఒక వ్యక్తి బాగా పాడగలడో లేడో అతని మొహం చూస్తే తెలియదు. అతను పాడితేనే తెలుస్తుంది. అందువల్ల యోగం ఎప్పుడు అనుమేయం, తార్కికంగా తెలుసుకునేది.

భగవంతునికి యోగం ఉంది. ఎలా తెలుసు? ఆయన ఈ జగత్తును సృష్టించాడు. ఈ జగత్తు ఆయన చేసిన సంతకం. అలా జగత్తును చూస్తే మనకు భగవంతుని యోగశక్తి గురించి తెలుస్తుంది. యోగశక్తి అంటే వేరే ఏదో కాదు, అది మాయాశక్తి.

యోగం అంటే ఇక్కడ కలయిక. మాయను యోగం అని ఎందుకంటారంటే మాయలో కూడా మూడు విషయాలున్నాయి. అంటే మాయ మూడు వరుసలున్న గొలుసులాంటిది. ఆ మూడు వరుసలూ – సత్త్వ, రజ, తమోగుణాలు. యోగం అంటే –

**గుణానాం మిశ్రః ఇత్యర్థః**

అలా నీకు మాయాశక్తి నిగూఢంగా ఉంది. అంతేకాదు,

**విభూతిం చ** – నీకు విభూతి కూడా ఉంది. విభూతి అంటే వ్యక్తమైన శక్తి అని, కార్యప్రపంచం అనీ చూశాము. యోగం కనపడని శక్తి అయితే, విభూతి కనపడే శక్తి; యోగం అనుమేయం అయితే విభూతి ప్రత్యక్షం. అందువల్ల నీ యోగం గురించి విభూతిల గురించి నాకు బోధించు. ఎలా బోధించాలి?

**విస్తరేణ** – వివరంగా.

నిజానికి కృష్ణపరమాత్మ తన విభూతుల గురించి ఏడవ అధ్యాయంలో చెప్పాడు.

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥** – 7.8

మళ్ళీ తొమ్మిదవ అధ్యాయంలో కూడా చెప్పాడు.

**అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।**
**మంత్రోఽహమహమేవాజ్యమ్ అహమగ్నిరహం హుతమ్ ॥** – 9.16
**పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః ।** – 9.17

అంతా వివరంగా చెప్పాక, దాని గురించి చెప్పమని శిష్యుడు అడిగితే, గురువుకు ఎలా ఉంటుంది? దీని గురించి పూజ్య స్వామీజీ హాస్యంగా చెబుతారు. ఒక పెళ్ళిలో సంగీతకచేరీ పెట్టారు. అంతా ఎవరి హడావుడిలో వారున్నారు. ఒక్క ఆయన మాత్రం ముందు వరుసలో కూర్చుని ఈయన పాట శ్రద్ధగా తల ఊపుతూ విన్నాడు. ఈ సంగీత విద్వాంసుడు మోహనరాగంలో రాగం, తానం, పల్లవులు, సంగతులు వేసి మరీ పాడాక, ఈ వ్యక్తి లేచి 'నాది ఒక చిన్న విన్నపం, దయచేసి మీరు మోహనరాగంలో పాడతారా?' అన్నాడుట. ఆ సంగీత విద్వాంసునికి ఎలా అనిపించి ఉంటుంది?

అలాగే కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలో, మళ్ళీ తొమ్మిదవ అధ్యాయంలో కూడా తన విభూతుల గురించి చెప్పాక, అర్జునుడు మళ్ళీ అవే అడిగితే కృష్ణపరమాత్మకు ఎంత బాధవేస్తుంది? అది ముందే గ్రహించినట్లుగా అర్జునుడు ఒక మాట వేశాడు. ఏమిటది?

**భూయః కథయ** – మళ్ళీ చెప్పు అంటున్నాడు.

పూర్వం నాటకాలు వేసినప్పుడు, ఎవరైనా నటుడు ఒక పెద్ద సంభాషణను గుక్క తిప్పుకోకుండా చెపితేనో, పెద్ద పద్యాన్ని రాగయుక్తంగా బాగా పాడితేనో, ఒన్స్‌మోర్ అని సభలోని ఎవరో అరిచేవారు. ఆ నటుడు మళ్ళీ సంభాషణను చెప్పటమో, మళ్ళీ పద్యాన్ని పాడటమో చేసేవారుట. ఎవరైనా కిందపడి మరణించటం సహజంగా చేసినా ఒన్స్‌మోర్ అనేవారు. అతను మళ్ళీ లేచి కిందపడాలి. ఆ విధంగా అర్జునునికి కూడా ఎంత విన్నా తనివి తీరటం లేదు.

**తృప్తిః మే న అస్తి** – ఎంతవిన్నా నాకు తృప్తిగా లేదు అంటున్నాడు అర్జునుడు. అంటే మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తోంది. లౌకికవిషయాలలో అలా కాదు, మనకు ఇష్టమైన స్వీటు ఏదైనా ఒకటి తింటే చాలా బాగుంటుంది; రెండు తింటే బాగుంటుంది; మూడు, నాలుగు, ఐదు, ఆరు తింటే వాంతి వస్తుంది. అలాగే పాటలు. మనకు నచ్చిన పాటలు మళ్ళీ మళ్ళీ విందామని క్యాసెట్టు కొనుక్కుని భద్రపరుస్తాము. కాని కొన్నిసార్లు విన్నాక మొహం మొత్తేస్తుంది. తీసుకునివెళ్ళి ఎక్కడో పెట్టేస్తాము. అవి అలా మట్టి కొట్టుకునిపోయి ఉంటాయి కాని, వాటిని మళ్ళీ వినము. అలా ఇంట్లో ఎన్ని క్యాసెట్లు మట్టి కొట్టుకుపోయి ఉన్నాయో ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. కాని ఈశ్వరవిభూతి శ్రవణం అలా కాదు. విన్నకొద్దీ వినాలనిపిస్తుంది. అందువల్ల,

**మే శృణ్వతః** – నాకు తృప్తిలేదు కాబట్టి మళ్ళీ వినాలనివుంది అంటున్నాడు అర్జునుడు. ఎందుకు తృప్తిలేదు? అది అమృతం కాబట్టి. నేను వింటాను, అందువల్ల మళ్ళీ చెప్పు. కాని అంతకుముందు కేవలం ఒక్కొక్క శ్లోకంలో చెప్పావు. అది చాలదు నాకు. విస్తరేణ – విస్తారంగా, విపులంగా చెప్పు. కృష్ణపరమాత్మ అలాగే విపులంగా చెబుతాడు.

ఆ విధంగా అర్జునుడు కృష్ణపరమాత్మను తన విభూతుల గురించి చెప్పమని 12నుంచి 18 శ్లోకాల వరకూ అడిగాడు. నిజానికి కృష్ణపరమాత్మ ఈ సృష్టిలో ఉన్న ప్రతిదీ భగవంతుని వ్యక్తరూపమేనని ఒక్కమాటలో చెప్పేశాడు.

**భగవంతుడు + నామరూపం = సృష్టి**

అన్నీ భగవంతుని సృష్టే అయినా, కొన్నింటిని చూస్తే వాటి వైపు ఆకర్షించబడతాము, కొన్నింటిని చూస్తే చీదరించుకుంటాము. ఒక గున్నఏనుగును చూస్తే ముచ్చటేసి అలాగే చూస్తూండిపోతాము. అదే బొద్దింకను చూస్తే దాన్ని అసహ్యించుకుంటాము. ఒక పెద్ద అణుబాంబు విస్ఫోటన జరిగితే, మనమంతా మరణిస్తాము కాని బొద్దింక మరణించదు. దానికి అలాంటి గొప్ప నిర్మాణం ఉంది. అది కూడా మరి భగవంతుని విభూతే, కాని దాన్ని అలా స్వీకరించటానికి మన మనస్సు ఒప్పుకోదు.

అందువల్ల అర్జునుడు స్వయంగా కృష్ణపరమాత్మనుంచే అటువంటి ఆకర్షణీయమైన, అందమైన వస్తువుల గురించి వినాలనుకుంటున్నాడు. నిజానికి అలాంటి అందమైన వస్తువులను చెప్పమంటే మనమే ఒక పెద్ద పట్టిక చెప్పగలము. పువ్వుల్లోకెల్లా అందమైన పువ్వు, పక్షుల్లోకెల్లా అందమైన పక్షి, జంతువుల్లోకెల్లా అందమైన జంతువు, క్రికెట్ ఆటగాళ్ళలో గొప్ప ఆటగాడు, మన గురువుల్లో గొప్ప గురువు, భగవద్గీతలో గొప్ప అధ్యాయం– ఇలా ఎన్నో చెప్పుకుంటూపోవచ్చు. కాకపోతే ఒక్కొక్కరి అభిప్రాయం ఒక్కొక్కలాగా ఉంటుంది. భగవద్గీతనే తీసుకుంటే అందరికీ ఒకటే అధ్యాయం నచ్చదు.

అలా అందమైన వస్తువును తీసుకుంటే, దానిమీద ధ్యానం చెయ్యవచ్చు అంటున్నాడు అర్జునుడు. మనస్సు మనకు తెలియకుండా అందమైన వస్తువు వైపు, అద్భుతమైన వస్తువు వైపుకు వెళ్ళిపోతుంది. మనం ఆ అందమైన వస్తువును ఈశ్వరునికి ప్రతీకగా తీసుకోవచ్చు. దానిద్వారా సమష్టి ఈశ్వరధ్యానం చెయ్యవచ్చు. మనస్సు ఒక్కసారి ఒక్క వస్తువు గురించే ఆలోచించగలదు; కళ్ళు ఒక్కసారి ఒక్క వ్యక్తినే చూడగలవు. అందువల్ల ఒక పరిమితి ఉన్న వస్తువును ఆలంబనంగా తీసుకుని దానిమీద ఆ సర్వవ్యాపకుడైన భగవంతుణ్ణి ఆవాహన చేస్తాము. దాన్ని ఆలంబనం అంటారు.

**ఏతదాలంబనం శ్రేష్ఠం ఏతదాలంబనం పరమ్** – కఠ

ఈ ఆలంబనం రెండు రకాలు. అవి ప్రతిమా ఆలంబనం, ప్రతీక ఆలంబనం. ప్రతిమ అంటే మానవరూపం ఉన్న ఆలంబనం. ఉదాహరణకు రాముడు, కృష్ణుడు. సర్వవ్యాపకమైన భగవంతునికి ఒక మానవాకారం ఇస్తాము.

కాని మానవరూపం లేనిదాన్ని ప్రతీక అంటారు. ఉదాహరణకు సాలగ్రామం, శివలింగం, పసుపుముద్ద. పసుపుముద్దని వినాయకునిగా చేసి, దానిమీద వినాయకుణ్ణి ఆవాహనం చేస్తాము. అలా తోటి మనిషిని కూడా ఆరాధించవచ్చు కాని, అది అతనికి తెలిస్తే అతనిలో అహంకారం పెరుగుతుంది. అయినా మనం తల్లి, తండ్రి, గురువులను భగవంతునిగా కొలుస్తాము.

**మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ**

అందువల్ల మనుష్యులు కూడా ఆలంబనం కావచ్చు. కాని అర్జునునికి భగవంతుడు చెప్పే ఆలంబనలు కావాలి. తనే ఒక పట్టిక తయారుచేసుకోగలడు కాని, కృష్ణపరమాత్మను విస్తారంగా చెప్పమంటున్నాడు. కృష్ణపరమాత్మ కూడా విసుక్కోకుండా చెప్పబోతున్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 19 **హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః ।**
**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే ॥**
హంత, తే, కథయిష్యామి, దివ్యాః, హి, ఆత్మవిభూతయః,
ప్రాధాన్యతః, కురుశ్రేష్ఠ, న, అస్తి, అంతః, విస్తరస్య, మే ॥

| | | | |
|---|---|---|---|
| హంత | = బాగుగా పలికితివి | హి | = అందువలన |
| కురుశ్రేష్ఠ! | = ఓ అర్జునా! | దివ్యాః | = ఆ దివ్యములైన |
| మే | = నా | ఆత్మ విభూతయః | = నా విభూతులను |
| విస్తరస్య | = విభూతుల విస్తృతికి | ప్రాధాన్యతః | = ముఖ్యమైన కొన్నింటిని మాత్రము |
| అంతః | = అంతము | తే | = నీకోసము |
| న, అస్తి | = లేదు | కథయిష్యామి | = తెలుపుదును |

**హే కురు-శ్రేష్ఠ! హన్త, దివ్యాః ఆత్మ-విభూతయః ప్రాధాన్యతః**
**తే కథయిష్యామి, మే విస్తరస్య హి అన్తః న అస్తి ।**

తా: బాగుగా పలికితివి ఓ అర్జునా! నా విభూతుల విస్తృతికి అంతము లేదు. అందువలన ఆ దివ్యములైన నా విభూతులను ముఖ్యమైన కొన్నింటిని మాత్రము నీకోసము తెలుపుదును.

**3. ఈశ్వరవిభూతి జ్ఞానం: శ్లోకాలు 19-41**

ముందు శ్లోకంతో విభూతి వర్ణనం చెయ్యమని అర్జునుడు కోరటం అయిపోయింది. ఇప్పుడు కృష్ణపరమాత్మ అర్జునుడు కోరినట్టే విస్తారంగా చెప్పబోతున్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ** – శ్రీభగవానుడు పలికాడు.

**హంత** – బాగా చెప్పావు.

**ఆత్మవిభూతయః తే కథయిష్యామి** – నేను తప్పకుండా నీకోసం నా విభూతులను వివరిస్తాను. ఆత్మ అంటే ఇక్కడ 'నా' అని అర్థం. అంటే కృష్ణపరమాత్మ నా విభూతులను చెబుతాను అంటున్నాడు. అది కూడా ఎటువంటి విభూతి?

**దివ్యాః** – అసాధారణమైన విభూతులను గురించి చెబుతాను అంటున్నాడు.

ఇంతకు ముందు చూసినట్టుగా, ప్రతిదీ భగవంతుని విభూతే. మనం నోరు తెరిచి మాట్లాడగలగటం కూడా భగవంతుని విభూతే. నోరే తెరవలేని వ్యక్తిని చూస్తే కాని ఆ విషయం మనకు గ్రహింపుకు రాదు.

'నేను బూట్లకోసం విలపించాను, అసలు కాళ్ళే లేని వ్యక్తిని చూసేదాకా.' అలా మనం చేస్తున్న ఏ పనైనా చెయ్యలేని వ్యక్తిని చూస్తేగాని అది కూడా ఒక విభూతే అని మనకు తెలియదు. వీటన్నిటినీ లౌకిక విభూతి అంటారు. కళ్ళలో ఉండాల్సిన నీరు ఉండటం కూడా ఒక విభూతే. అలాంటి లౌకిక విభూతులు చెప్పుకుంటూ పోతే దానికి అంతూపొంతూ ఉండదు. అందువల్ల తైత్తిరీయోపనిషత్తులో ప్రతి అంగంమీద ఉపాసన వస్తుంది. అప్పుడు ఏ అంగాన్నీ నిర్లక్ష్యం చెయ్యము.

**య ఏవం వేద। క్షేమ ఇతి వాచి। యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః।**
**కర్మేతి హస్తయోః। గతిరితిపాదయోః। విముక్తిరితి పాయౌ।** – భృగువల్లీ 10.2

పాయువుమీద కూడా ఉపాసన. దాని గురించి ఆలోచించటానికే ఇష్టపడము. కాని మలము అసలు రాకపోతేనో, విరోచనాలు ఝూడించి కొడితేనో పాయువుయొక్క విలువ తెలుస్తుంది. అందువల్ల ఉపనిషత్తు వీటిమీద ఉపాసనను సూచిస్తుంది.

**తస్యైష ఆదేశో యదేతత్ విద్యుతో వ్యద్యుతదా3**
**ఇతీన్యమీమిషదా3 ఇత్యధిదైవతమ్** – కేన 4.4

కనురెప్ప మూసి తెరవటంమీద ఉపాసన వస్తుంది కేనోపనిషత్తులో. అంటే కళ్ళు తెరచి, మూయగలగటం కూడా భగవంతుని అద్భుతమైన కానుక మనకు. దేన్నీ తేలికగా తీసుకోకూడదు. అలా అర్థం చేసుకునే మనస్సు ఉంటే ప్రతిదీ భగవంతుని విభూతే. కాని ఇక్కడ అసాధారణ విభూతులను చూడబోతున్నాము. అసాధారణ విభూతులు కూడా అంతులేనన్ని ఉన్నాయి. వాటన్నిటినీ చెప్పుకుంటూ పోతే ఈ పదవ అధ్యాయం ఒక పట్టాన ముగింపుకు రాదు.

**ప్రాధాన్యతః** – అందువల్ల ప్రధానమైనవి మాత్రమే చెబుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకో తనే కారణం కూడా చెబుతున్నాడు.

**(మమ) విస్తరస్య అంతః న అస్తి** – నా విభూతులకు అంతం లేదు. నా విభూతులు విశ్వమంతా వ్యాపించివున్నాయి కాబట్టి వాటికి అంతం లేదు. అవి 14 లోకాలకు వ్యాపించివున్నాయి.

**కురుశ్రేష్ఠ** – ఓ అర్జునా. ఇక్కడే కృష్ణపరమాత్మ సూచిస్తున్నాడు. ఏమని? నువ్వు కురువంశంలోని వారందరిలోకి

శ్రేష్ఠుడవు. అంటే నీమీద కూడా ఉపాసన చెయ్యవచ్చు. ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు మనకు భయం వేస్తే అర్జునుణ్ణి తలచుకుంటాము – అర్జునా, ఫల్గుణా, పార్థా, కిరీటి, ధనంజయా అంటూ అతని నామాలను వల్లెవేస్తాము. అంటే అతను భగవంతుని విభూతులలో ఒక విభూతి. కృష్ణపరమాత్మే స్వయంగా మళ్ళీ చెబుతాడు.

**పాండవానాం ధనంజయః (అస్మి) –** 10.37

నేను పాండవులలో అర్జునుణ్ణి అంటాడు. అందువల్ల ఆ అర్థం వచ్చేలాగా ఇక్కడ కురుశ్రేష్ఠా అని సంబోధించాడు.

శ్లో. 20 **అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ॥**
అహమ్, ఆత్మా, గుడాకేశ, సర్వభూతాశయస్థితః,
అహమ్, ఆదిః, చ, మధ్యమ్, చ, భూతానామ్, అంతః, ఏవ, చ ॥

| | | | |
|---|---|---|---|
| గుడాకేశ! | = ఓ అర్జునా! | ఆదిః | = ఆదియు |
| సర్వభూతాశయ స్థితః | = సమస్త ప్రాణుల హృదయములందున్న | మధ్యమ్ | = మధ్యస్థితియు |
| ఆత్మా | = ఆత్మను | చ | = ఇంకా |
| అహమ్ | = నేను | అంతః, చ | = అంతమునూ అంటే ప్రాణుల సృష్టి స్థితి లయముల కారణము |
| చ | = ఇంకా | | |
| భూతానామ్ | = సకల ప్రాణులకు | అహమ్, ఏవ (అస్మి) | = నేనే |

**హే గుడాకా–ఈశ! అహమ్, సర్వ–భూత–ఆశయ–స్థితః ఆత్మా,**
**భూతానామ్ ఆదిః చ మధ్యమ్ చ అన్తః చ అహమ్ ఏవ ।**

తా: ఓ అర్జునా! సమస్త ప్రాణుల హృదయములందున్న ఆత్మను నేను ఇంకా సకల ప్రాణులకు ఆదియు, మధ్యస్థితియు ఇంకా అంతమునూ అంటే ప్రాణుల సృష్టి స్థితి లయముల కారణము నేనే.

ఇక్కడనుంచి కృష్ణపరమాత్మ విభూతుల పట్టిక మొదలవుతుంది. అది 38వ శ్లోకంవరకూ కొనసాగుతుంది. ముందుగా కృష్ణపరమాత్మ నిర్గుణబ్రహ్మ గురించి మాట్లాడబోతున్నాడు. నిర్గుణబ్రహ్మ పారమార్థిక స్థాయికి చెందినదని చూశాము.

నిర్గుణబ్రహ్మ అంటే శుద్ధచైతన్యం. అది భగవంతుని స్వరూపం, ప్రాథమిక విభూతి. ఎందుకంటే ఆ చైతన్యమే మొత్తం జీవరాశికి ప్రాణం పోస్తుంది. చెట్టులో ప్రాణం ఉంటే, జంతువులో ప్రాణం ఉంటే, మనిషిలో ప్రాణం ఉంటే, అదంతా ఈ చైతన్యం వల్లనే.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసోమనః** – కేన

చెవి చెవిలా పని చేస్తోందంటే, మనస్సు మనస్సులా పని చేస్తోందంటే దానికి కారణం చైతన్యమే. అంటే భగవంతుడు **చైతన్యస్వరూపం, చిత్‌రూపం**. అందువల్లనే లలితాసహస్రనామంలో లలితాదేవియొక్క అనేక గుణాలను కీర్తించినా కూడా నిర్గుణరూపాన్ని కూడా స్తుతిస్తారు.

**సచ్చిదానందరూపిణీ**

సత్, చిత్, ఆనందరూపాన్ని వర్ణిస్తారు అక్కడ. ఇప్పుడు కృష్ణపరమాత్మ చైతన్యవిభూతితో ఆరంభిస్తున్నాడు.

ఇప్పుడు మన ఉపాసన దేనిమీద? చైతన్యతత్త్వంమీద. మనం జీవించి ఉన్నామంటేనే అది ఈశ్వరవిభూతి. అందువల్ల మన జీవితాన్ని గౌరవించాలి. అందువల్లనే మనకు అహింస పరమధర్మం అయింది. భగవంతుడు అన్ని జీవాల్లోనూ ఉన్నప్పుడు ఆ మూగజీవిని హింసించే హక్కు మనకెక్కడ ఉంది? మూగజీవుల్లో కూడా భగవంతుడు ఉంటే వాటిని చంపి ఎలా తినగలము? అందువల్ల మొట్టమొదటి విభూతి చైతన్యం.

చివరి విభూతిగా కూడా మళ్ళీ నిర్గుణ ఈశ్వరవిభూతి గురించే వర్ణిస్తున్నాడు. అప్పుడు సద్రూపం లేదా సత్తా స్వరూపాన్ని వర్ణిస్తాడు. ఇప్పుడు చైతన్యం అయితే, అప్పుడు ఉనికి. ది బుక్ ఈజ్, ది పాట్ ఈజ్, ది పెన్ ఈజ్ అని చెప్పేటప్పుడు ఆ ఈజ్‌నెస్సే ఉనికి. ఈ వస్తువులకు స్వతహాగా ఉనికి లేదు. అవి ఈశ్వరునినుంచి అరువు తెచ్చుకున్నాయి. కార్యమంతటా కారణం ఉంటుంది. కార్యానికి కారణం లేకుండా విడిగా ఉనికి లేదు. బంగారం లేకుండా నగకు విడిగా ఉనికి లేదు. ఒక నగ తీసుకుంటే అక్కడ బంగారమూ ఉంటుంది, నగా ఉంటుంది. నగ ఉంటే, బంగారం ఉండి తీరాలి.అందువల్ల ఎప్పుడూ కారణం, కార్యంగా భాసిల్లుతుంది. కారణం ఉనికిగా ప్రకటితమవుతుంది. దాన్నే ఇంగ్లీషులో **ఈజ్‌నెస్** అంటారు.

ఈ జగత్తు అంతా భగవాన్‌యొక్క ఉనికి. జగత్తు లయమయినప్పుడు, నామరూపాలు లయమయిపోతాయి. ఉనికి ఉంటుంది. నగలను కరిగిస్తే, నగలు అనే నామరూపాలు లయమయిపోతాయి, కాని బంగారం ఉనికి ఉంటుంది. అంటే ఆభరణాలు పుట్టినప్పుడు వాటి ఉనికిని బంగారంనుంచి అరువు తెచ్చుకుంటాయి, మళ్ళీ లయమయినప్పుడు వాటి ఉనికిని బంగారానికి వెనక్కి ఇచ్చేస్తాయి. అందువల్ల భగవంతుడు అంతటా ఉన్నాడు.

**యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్‌కల్పార్థకం భాసతే** – దక్షిణామూర్తి స్తోత్రం 3

అలా కృష్ణపరమాత్మ రెండు ముఖ్యమైన విభూతులను చెబుతున్నాడు. అవి చిద్రూపవిభూతి, సద్రూపవిభూతి. 20వ శ్లోకంలో చిద్రూపవిభూతితో మొదలుపెట్టి, 39వ శ్లోకంలో సద్రూపవిభూతితో ముగిస్తున్నాడు. అందువల్ల అన్నిటికన్నా ఉత్తమమైన ధ్యానం సత్‌చిత్‌రూప ధ్యానం. భగవంతుడు అంతటా, చైతన్యతత్త్వంగా ఉన్నాడు.

చైతన్యంగా, ఉనికిగా ఎందులో ఉన్నాడు? ఎవరైనా ఈ ప్రశ్న అడిగితే, మీరు జవాబు చెప్పకూడదు. ఎదురు ప్రశ్నించాలి. ఎందులో లేడు? ఎవరు నువ్వు అని ఎవరైనా ఇంగ్లీషులో అడిగితే, మనం **ఐ యామ్** అని మొదలుపెడతాము. నేను అంటే చైతన్యతత్త్వం, యామ్ అంటే ఉనికి. అంటే నేను ఉన్నాను. ఇది అందరికీ వర్తిస్తుంది.

కాని అందరూ దీన్నంత తేలిగ్గా అర్థం చేసుకోలేరు. ఉనికి, చైతన్యం పదాలు కంటికి కనపడేవి కావు. వస్తువుకు భిన్నంగా ఉనికి కాని, చైతన్యం కాని లేదు. చైతన్యం, ఉనికి – ఇవి రెండూ సూక్ష్మమైన విషయాలు. సత్, చిత్‌లమీద ధ్యానం చేస్తే బ్రహ్మాండంగా ఉంటుంది కాని ఎవరి మనస్సైనా అంత సూక్ష్మవిషయాలను అర్థం చేసుకునేటంత సూక్ష్మంగా లేకపోతే, నేను మీ స్థాయికి దిగివచ్చి, కంటికి కనపడే విషయాలలో నా విభూతిని చూపిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నిర్గుణమహిమతో మొదలుపెట్టి, సగుణమహిమను వర్ణించుకొచ్చి, మళ్ళీ నిర్గుణమహిమతో ముగిస్తాడు. ఇది కృష్ణపరమాత్మ వివరించబోయే పద్ధతి. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**గుడాకేశ** – ఓ సత్త్వగుణసంపన్నుడా. ఓ అర్జునా, నిన్ను సూక్ష్మబుద్ధి ఉన్న తెలివైన విద్యార్థిగా భావిస్తున్నాను. అటువంటి సూక్ష్మబుద్ధి ఉన్న విద్యార్థికి గొప్ప ఉపాసన ఏమిటి? నిర్గుణబ్రహ్మ ఉపాసన. చైతన్యబ్రహ్మ ఉపాసన.

సాక్షిచైతన్యం స్వభావం ఏమిటి? అది శుద్ధచైతన్యం. దానికి 5 లక్షణాలు. వాటిని మళ్ళీ చూద్దాము.

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువుగాని కాదు.
2. చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపచేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. తదనంతరం కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

అటువంటి నిర్వికార నిర్గుణపరిమితి లేని చైతన్యంమీద ఉపాసన చెయ్యవచ్చు.

అర్జునుణ్ణి గుడాకేశ అని సంబోధించాడు. గుడాక అంటే తమోగుణం లేదా నిద్ర; ఈశః అంటే దాని యజమాని; అందువల్ల గుడాకేశ అంటే తమోగుణాన్ని జయించినవాడు; అంటే సత్త్వగుణాన్ని పెంపొందించుకున్నవాడు. అటువంటి అర్జునుడు భగవంతుణ్ణి చైతన్యస్వరూపంగా అర్థం చేసుకోగలడు. ఈ చైతన్యస్వరూపం ఎక్కడ ఉంది?

**అహమాత్మా సర్వభూతాశయస్థితః** – అన్ని ప్రాణుల మనస్సుల్లోనూ ఉంది. ఆశయ అంటే మనస్సు; స్థితః అంటే ఉంది. సర్వభూతః అంటే మనష్యులే కాదు, ప్రతి ప్రాణిలోనూ ఉంది. అంటే జంతువులలోనూ, చెట్లలోనూ కూడా. అంటే నా మనస్సులో, మీ మనస్సులో కూడా భగవంతుడు ఆత్మరూపంలో ఉన్నాడు. అంటే సాక్షిచైతన్యంగా ఉన్నాడు. దేన్ని సాక్షిగా చూస్తుంది ఆత్మ? ఆలోచనలు ఉన్న, ఆలోచన లేని మనస్సును సాక్షిగా చూస్తుంది. నాకు ఆలోచనలు కలిగితే, ఆలోచనలు వచ్చాయని తెలుస్తున్నది; ఆలోచనలు లేకుండా, మనస్సు శూన్యంగా ఉంటే, ఆ శూన్యభావన కూడా తెలుస్తున్నది. దేనికి తెలుస్తున్నది? సాక్షిచైతన్యానికి. ఆ సాక్షిచైతన్యాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అది చిద్రూప విభూతి.

చైతన్యం లేకపోతే ఈ శరీరం జడం అవుతుంది. ఎందుకంటే అది పంచభూతాలతో చెయ్యబడింది. ఈ చిద్రూపవిభూతి పారమార్థిక స్థాయికి చెందినది. దీన్ని జ్ఞాని మాత్రమే అర్థం చేసుకోగలడు. వేదాంతజ్ఞానం లేనిదే, నిర్గుణవిభూతిని అర్థం చేసుకోవటం కష్టం. అందువల్ల అజ్ఞానులకు ఈ చిద్రూప ఈశ్వర ఉపాసన కష్టం.

అందువల్ల సగుణవిభూతులను రెండవ పాదంనుంచి వివరించబోతున్నాడు. సగుణవిభూతులు వ్యావహారిక స్థాయికి చెందినవి. అంటే ఆ విభూతులు మాయకు చెందినవి.

**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ** – సృష్టి అంతటికీ ఆది, మధ్యమ, అంతాలను నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే సమస్త ప్రాణుల సృష్టి, స్థితి, లయకర్త. ఆది అంటే సృష్టికారణం, మధ్యమం అంటే స్థితికారణం, అంతః అంటే లయకారణం.

కుండ విషయం తీసుకుంటే మట్టి, కుండయొక్క ఆది, మధ్యం, అంతం అని చెప్పవచ్చు. అంటే మట్టి, కుండయొక్క సృష్టి ముందూ ఉంది, కుండగానూ ఉంది, కుండ పగిలిపోతే, మళ్ళీ మట్టిగానూ ఉంటుంది. అంటే మనం కుండను పట్టుకున్నా కూడా, మనం పట్టుకున్నది కుండను కాదు, మట్టినే.

ఆ విధంగా కారణం భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో ఉంటుంది. అందువల్ల కృష్ణపరమాత్మ తనను జగత్కారణంగా అభివర్ణించుకుంటున్నాడు. నేను అంతకు ముందు ఉన్నాను; ఇప్పుడు ఉన్నాను; ఇకముందు కూడా ఉంటాను. మనుష్యులు వచ్చిపోతారు కాని, నేను శాశ్వతం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మనకు భద్రత కావాలంటే పరమాత్మ ఒక్కడే శరణ్యం. భగవంతుడుకాక, వేరే ఎవరిని పట్టుకున్నా కూడా, వారు ఏదో ఒకరోజు మరణిస్తారు; వస్తువును పట్టుకుంటే వస్తువు నాశనమయిపోతుంది. మనుష్యులను ప్రేమించాలి, వస్తువులను అభిమానించాలి కాని శాంతిభద్రతలను ఇచ్చేదెవరు అంటే భగవంతుడు అనగలగాలి. ఆయన ఒక్కడే శాశ్వతమైన భద్రతను ఇవ్వగలడు.

ఈ ప్రాథమిక సూత్రాన్ని తెలుసుకోవాలి. భగవంతుణ్ణి కాక, వేరే ఎవరిని పట్టుకున్నా దుఃఖమే. కొడుకుమీద ఆధారపడితే, దుఃఖమే కలుగుతుంది. మా అబ్బాయి మంచివాడే కాని, కోడలు వచ్చాక వాణ్ణి మార్చేసింది అని అనవసరంగా ఆ అమ్మాయిని ఆడిపోసుకోవాల్సి వస్తుంది. అదే భగవంతునిమీద భారం వేస్తే ఈ గొడవ ఉండదు. అందువల్ల కారణాన్ని పట్టుకోవాలి. ఆ కారణం ఏమిటి? అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ. అందువల్ల సమస్త ప్రాణులకూ పరమాత్మ సృష్టి, స్థితి, లయ కారణం.

శ్లో. 21 **ఆదిత్యానామహం విష్ణుః జ్యోతిషాం రవిరంశుమాన్ ।**
**మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ ॥**
ఆదిత్యానామ్, అహమ్, విష్ణుః, జ్యోతిషామ్, రవిః, అంశుమాన్,
మరీచిః, మరుతామ్, అస్మి, నక్షత్రాణామ్, అహమ్, శశీ ॥

| | | | |
|---|---|---|---|
| ఆదిత్యానామ్ | = ఆదిత్యులలో | మరుతామ్ | = వాయుదేవతలలో |
| విష్ణుః | = విష్ణువును | మరీచిః | = మరీచిని |
| జ్యోతిషామ్ | = జ్యోతిర్మయస్వరూపులలో | నక్షత్రాణామ్ | = నక్షత్రములకు అధిపతియైన |
| అంశుమాన్ | = గొప్ప కిరణములుగల | శశీ | = చంద్రుడును |
| రవిః | = సూర్యుడను | అహమ్, అస్మి | = నేనే |
| అహమ్, అస్మి | = నేనే | | |

**ఆదిత్యానామ్ విష్ణుః అహమ్, జ్యోతిషామ్ అంశుమాన్ రవిః,**
**మరుతామ్ మరీచిః, నక్షత్రాణామ్ శశీ (చ) అహమ్ అస్మి।**

తా: ఆదిత్యులలో విష్ణువును, జ్యోతిర్మయస్వరూపులలో గొప్ప కిరణములుగల సూర్యుడను నేనే. నలభై తొమ్మిది మంది వాయుదేవతలలో మరీచిని, నక్షత్రములకు అధిపతియైన చంద్రుడును నేనే.

ఇప్పుడు కృష్ణపరమాత్మ సృష్టిలో ఉన్న అనేక వస్తువులను చెప్పబోతున్నాడు. ఆ గొప్ప వస్తువులు మనకు తెలిసినవే. కాకపోతే వాటి గొప్పతనం ఎక్కడిది? అవి నా విభూతులే అంటున్నాడు. వాటిని వరుసగా చూద్దాము.

**ఆదిత్యానామహం విష్ణుః –** ఆదిత్యులలో నేను విష్ణువును. కృష్ణపరమాత్మ చెప్పబోయే అనేక అంశాలలో కొన్ని లౌకిక విభూతులు. అంటే ఇహలోక విభూతులు. కాని చాలామటుకు పురాణాలు, తక్కిన గ్రంథాలమీద ఆధారపడి చెప్పినవి.

శాస్త్రంలో స్వర్గాది లోకాలలో అనేక దేవతలు ఉన్నట్టు వస్తుంది. అందులో ముఖ్యంగా పేరుగాంచిన దేవతలు ఆదిత్యులు. ద్వాదశ ఆదిత్యులు అంటారు. అంటే పన్నెండు నెలల్లో కనిపించే సూర్యుని ఆకారాలను ద్వాదశ ఆదిత్యులు అంటారు. ఉన్నది ఒకటే సూర్యుడు అయినా, ఆయన కాంతి ఒక్కొక్క నెలలో ఒక్కొక్కలా ఉంటుంది. జనవరిలో సూర్యకాంతి కొంచెం తక్కువగా ఉంటే, ఏప్రిల్, మే నెలల్లో ప్రచండరూపం దాలుస్తాడు. ద్వాదశ ఆదిత్యులు అంటే పన్నెండు నెలల్లో పన్నెండు సూర్యులయొక్క అధిష్ఠానదేవతలు.

బృహదారణ్యకోపనిషత్తులో ముప్పయి ముగ్గురు దేవతలే ముక్కోటి దేవతలుగా భాసిల్లుతారు అని వస్తుంది. ఆ ముప్పయి ముగ్గురు దేవతలు ఎవరంటే ద్వాదశ ఆదిత్యులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, ఇంద్రుడు, హిరణ్యగర్భుడు. 12+11+8+1+1=33. ఈ దేవతలు యజ్ఞయాగాదులలో ఆహుతులను అందుకుంటారు. వీరి గురించి ఎక్కువగా వేదంలోని కర్మకాండలోనూ, పురాణాలలోనూ చూస్తాము. ఇప్పుడు ఈ ముప్పయి ముగ్గురిలోంచి, ద్వాదశ ఆదిత్యుల గురించి ముందు చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

వీరిని ఆదిత్యులని ఎందుకు అంటారు? పురాణగాథల ప్రకారం వీరు అదితి అనే స్త్రీకి పుట్టారు. విష్ణుమూర్తి వామనావతారం ఎత్తినప్పుడు అదితికి పుట్టాడు, ఈ పన్నెండు ఆదిత్యులలో విష్ణుదేవతను నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ఆదిత్యులలో పరమాత్మ విష్ణువు.

**జ్యోతిషాం రవిరంశుమాన్** – జ్యోతిస్వరూపులలో సూర్యుణ్ణి. ఆకాశంలో జ్యోతులు నక్షత్రాలు, గ్రహాలు, సూర్యుడు. రవి అంటే సూర్యుడు. అందువల్ల జ్యోతులలో నేను సూర్యుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎటువంటి రవి? అంశుమాన్ – గొప్ప కిరణాలుగల రవిని.

**రశ్మిమంతం సముద్యంతం దేవాసుర నమస్కృతమ్** – 6

సంధ్యావందనంలో సూర్యభగవానునికి నమస్కారం చేస్తారు. సూర్యుడు లేకపోతే గ్రహాలకు ఉనికి లేదు. జీవరాశికి ఉనికి లేదు. ఆదిత్యహృదయంలో సూర్యుని స్తుతి ఉంటుంది. రామాయణంలో అగస్త్యముని శ్రీరామునికి ఆదిత్యహృదయం ఉపదేశించాడని వస్తుంది. అది లౌకికవిజయంతోపాటు ఆధ్యాత్మిక ఎదుగుదలకు కూడా తోడ్పడుతుంది. ఏ రంగంలో విజయం కావాలన్నా కూడా ఆదిత్యహృదయం పఠిస్తే, విజయం చేకూరుతుంది. ఆ విధంగా మన సాంప్రదాయంలో సూర్యుణ్ణి బాగా స్తుతిస్తారు. నేను ప్రత్యక్ష ఈశ్వరుణ్ణి అంటున్నాడు. అందువల్ల జ్యోతిస్వరూపులలో పరమాత్మ సూర్యుడు.

అలా సాక్షాత్తూ ప్రత్యక్ష ఈశ్వరుడు మనను దీవించటానికి స్వయంగా వస్తున్నాడు కాబట్టి, మనం సూర్యోదయానికి ముందే లేచి, శుచిగా, శుభ్రంగా ఉండి, ఆయనకు స్వాగతం పలకాలి. అందువల్ల పూర్వకాలం త్వరగా పడుకుని, త్వరగా లేవాలి అనేవారు. ఇప్పుడు ఈ సిద్ధాంతం పూర్తిగా మారిపోయింది. ఆలశ్యంగా పడుకుని, ఆలశ్యంగా లేస్తున్నారు. కాని త్వరగా లేవాలనే సిద్ధాంతం వెనకనున్న రహస్యం ఇది. సూర్యుడు ప్రత్యక్ష ఈశ్వరుడు కాబట్టి, ఆయనను స్వాగతించాలి.

**మరీచిర్మరుతామస్మి** – దేవతలలో ఇంకొక రకం దేవతలు మరుత్ దేవతలు. స్వర్గలోకంలో కూడా అనేక ప్రాంతాలు ఉన్నాయి. వాటిల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. ఆ జీవి చేసుకున్న పుణ్యం స్థాయినిబట్టి ఆయా దేవతగా పుడతాడు.

ఈ మరుత్ దేవతలు 49 మంది ఉన్నారు. సప్తసప్తాః అంటారు. అంటే మరుత్తులు ఏడు గుంపులు ఉంటే, ఒక్కొక్క దానిలోనూ మళ్ళీ ఏడుగురు ఉన్నారు. వీరంతా వాయుదేవతలు. వాయుతత్త్వానికి అధిష్ఠానదేవతలు. వీరిని మరుత్ గణాలు అంటారు. ఈ మరుత్ గణాలలో నేను మరీచిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే మరీచినుంచి వచ్చే గాలి చాలా ఆహ్లాదకరంగా, మనస్సుకు ప్రశాంతతను చేకూర్చేదిగా ఉంటుంది. అందువల్ల వాయుదేవతల్లో పరమాత్మ మరీచి.

**నక్షత్రాణామహం శశీ** – నక్షత్రాలలో నేను చంద్రుణ్ణి. రాత్రి మిలమిల మెరిసే నక్షత్రాలకన్నా మెరిసిపోతాడు చంద్రుడు. నిండుపున్నమి రాత్రి పండువెన్నెలను కురిపిస్తాడు. వెన్నెల పుచ్చపూవులా ఉందని వర్ణిస్తారు. అంత వెన్నెలను కురిపిస్తాడు కాబట్టి మాసపౌర్ణిమ రోజు ప్రత్యేకించి ప్రసాదాలు పెడతారు. ఇప్పుడు కారణం తెలియకపోయినా, పాయసం గుర్తుండిపోయింది చాలామందికి. అందువల్ల నక్షత్రాల్లో పరమాత్మ చంద్రుడు.

శ్లో. 22 **వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః ।**
**ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా ॥**
వేదానామ్, సామవేదః, అస్మి, దేవానామ్, అస్మి, వాసవః,
ఇంద్రియాణామ్, మనః, చ, అస్మి, భూతానామ్, అస్మి, చేతనా ॥

| | | | |
|---|---|---|---|
| వేదానామ్ | = వేదములలో | మనః, అస్మి | = మనస్సును నేను |
| సామవేదః, అస్మి | = సామవేదమును నేను | చ | = ఇంకా |
| దేవానామ్ | = దేవతలలో | భూతానామ్ | = ప్రాణులలో |
| వాసవః, అస్మి | = ఇంద్రుడను నేను | చేతనా, అస్మి | = చైతన్యమును నేను |
| ఇంద్రియాణామ్ | = ఇంద్రియములలో | | |

**వేదానామ్ సామవేదః (అహమ్) అస్మి, దేవానామ్ వాసవః అస్మి,**
**ఇన్ద్రియాణామ్ మనః అస్మి, భూతానామ్ చేతనా చ అస్మి ।**

తా: వేదములలో సామవేదమును నేను, దేవతలలో ఇంద్రుడను నేను, ఇంద్రియములలో మనస్సును నేను ఇంకా ప్రాణులలో చైతన్యమును నేను.

**వేదానాం సామవేదోఽస్మి** – వేదాలలో సామవేదాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి వేదాలన్నీ గొప్పవే. ఎందుకు? అవి సాక్షాత్తూ భగవంతునినుంచే వచ్చాయి. అయినా ఆ గొప్ప వేదాలలో ఇంకా గొప్పది సామవేదం, అది నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? సామవేదాన్ని గానం చేస్తారు కాబట్టి. తక్కిన వేదాల్లో మూడు స్వరాలే ఉంటే సామవేదంలో అన్ని స్వరాలూ ఉన్నాయి. సామవేదం గానం చేయటం చాలా కష్టం. ఎవరైనా చక్కగా నేర్చుకుని, సామగానం చేస్తే వీనులవిందుగా ఉంటుంది. అటువంటి సామవేదాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల వేదాలలో పరమాత్మ సామవేదం.

**దేవానామస్మి వాసవః** – దేవతలలో నేను ఇంద్రుడను అంటున్నాడు. ఈ దేవతలు వారు చేసుకున్న పుణ్యంవల్ల దేవలోకాలలో జన్మిస్తారు. దేవుడు అనే పదాన్ని మనం రెండు సందర్భాలలో ఉపయోగిస్తాము. పరమాత్మ ఒక్కడే. ఆయననే మాయాసహిత ఈశ్వరుడు అని కూడా అంటారు. ఆయనను సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, సృష్టి, స్థితి లయకర్త అంటారు.

దేవతలు అంటే వారు ఒక స్థాయికి చెందినవారు. వారు ఈశ్వరతత్త్వంలోకి రారు. ఈ దేవతలు కూడా సృష్టింపబడ్డవారే. వారు దేవలోకాలలో స్వర్గసుఖాలను అనుభవిస్తున్న పుణ్యజీవులు. వీరు కూడా సంసారుల కిందకే వస్తారు. వారి పుణ్యం క్షీణించగానే మళ్ళీ మనుష్యులగానో, జంతువులగానో పుడతారు. వీరు పుణ్యం చేసుకున్న జీవులు. కాని పరమాత్మ అలా కాదు. ఆయన పుణ్యపాప అతీత ఈశ్వరుడు.

అందువల్ల దేవానాం అంటే పుణ్యం చేసుకుని దేవతలు అయినవారిలో అని అర్థం. వాసవః అంటే ఇంద్రదేవత. ఎందుకు తను ఇంద్రదేవత అంటున్నాడు కృష్ణపరమాత్మ? ఇంద్రుడు దేవతలకందరికీ రాజు. దేవతలకు రాజైనా

కూడా, అది అతనికి అశాశ్వతమైన పదవే. ఇంద్రుడు అనేది పదవి, ఆ వ్యక్తి పేరు కాదు. దేవతలకు అధిపతి. ఎక్కువ పుణ్యం చేసుకుంటే ఇంద్రపదవి పొందుతాడు. అక్కడ ఆత్మజ్ఞానం పొందితే, మళ్ళీ జన్మ లేకుండా మోక్షం పొందుతాడు. లేకపోతే మాత్రం మళ్ళీ పుట్టాలి. దేవతలకు అధిపతి కాబట్టి, దేవతలలో పరమాత్మ ఇంద్రుడు.

**ఇంద్రియాణాం మనశ్చాస్మి** – ఇంద్రియాలలో నేను మనస్సును అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? ఇంద్రియాలలో ఒక్కొక్కదానికి కొంతమేరకు మాత్రమే శక్తి ఉంటుంది. కన్ను రంగు, రూపు మాత్రమే చూడగలదు; చెవి శబ్దాలను మాత్రమే వినగలదు. కన్ను శబ్దాలను వినలేదు; చెవి రూపాలను చూడలేదు. అలా శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలలో ఒక్కొక్క ఇంద్రియమూ ఒక్కొక్క రంగంలోనే పనిచెయ్యగలదు. కాని మనస్సు అన్ని ఇంద్రియాల వెనుక ఉంటుంది కాబట్టి మనస్సు అన్ని రంగాలలోనూ పనిచేస్తుంది.

అందువల్ల భగవంతుణ్ణి మనకున్న అంగాల్లో ఏదో ఒక అంగంమీద ఆవాహన చెయ్యాలంటే, అన్నింటికన్నా గొప్ప అంగం మనస్సు.

**స య ఏషోఽన్తర్హృదయ ఆకాశః తస్మిన్నయం పురుషో మనోమయః** – తైత్తిరీయం

మనస్సు గొప్పతనం అర్థం చేసుకోవటానికి ప్రయత్నించినకొద్దీ, భగవంతుని గొప్పతనం తేటతెల్లం అవుతుంది. అందువల్ల ఇంద్రియాలలో పరమాత్మ మనస్సు.

**భూతానామస్మి చేతనా** – సమస్త ప్రాణులలో నేను చైతన్యాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. విజ్ఞానశాస్త్రం ఎన్నో విషయాలను కనుగొంది కాని ఇంకా రెండు విషయాలు అంతుపట్టని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. అవి జీవితం, మరణం. ఈ జీవితం అంటే ఏమిటో తెలియదు. ఏ చేతనతత్త్వం ఈ జీవితాన్ని నడిపిస్తోంది? మనం పుస్తకం చదువుతుంటే అందులో దూరే చిన్న క్రిమిని చూస్తే దేవుని సృష్టి ఎంత విచిత్రం అనిపిస్తుంది. ఈ జీవిలో జీర్ణకోశం ఉంది, పునరుత్పత్తి చేసే శక్తి ఉంది, రక్షణ చేసుకునే శక్తి ఉంది – ఇంతా చేసి ఈ జీవి ఎంత ఉంది? ఒక చిన్న చుక్క అంత ఉంది. ఇటువంటి సూక్ష్మజీవులను మనం చిటికెలో చంపేస్తాము. చెయ్యి పెడితే చాలు చచ్చిపోతాయి, కాని వాటిని మనం సృష్టించగలమా? లేదు. ఇవన్నీ కూడా భగవంతుని లీలావిలాసాలకు చిహ్నం.

భగవంతుడు సృష్టించిన ఇలాంటి జీవరాశిని చంపే హక్కు మనకు లేదు. అందువల్లనే శాస్త్రం మనను శాకాహారం తినాలంటున్నది. శాకాహారంలో జీవనష్టం చాలా తక్కువ ఉంటుంది.

అసలు హింస చెయ్యకూడదు. తప్పని పరిస్థితిలో వీలున్నంత తక్కువ హింస చెయ్యాలి. మనం కూరలు తింటే, చెట్లను పూర్తిగా కొట్టివేయటం లేదు కదా. అందువల్ల వాటికి మనం చేసే హాని తక్కువ. ఇది కూడా చెయ్యటానికి ఇష్టపడరు ఋషులు. వారు కింద పడ్డ ఫలాలను ఏరుకుని తింటారు. ఎందుకు మన సాంప్రదాయం ఇంతగా అహింసను బోధిస్తోంది అంటే ఇందుకు. భగవంతుడు అన్ని జీవరాశుల్లోనూ చేతనతత్త్వంగా ఉన్నాడు కాబట్టి చిదాభాసః అహం అస్మి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల జీవులలో పరమాత్మ చైతన్యం.

శ్లో. 23 **రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్ ।**
**వసూనాం పావకశ్చాస్మి మేరుః శిఖరిణామహమ్ ॥**
రుద్రాణామ్, శంకరః, చ, అస్మి, విత్తేశః, యక్షరక్షసామ్,
వసూనామ్, పావకః, చ, అస్మి, మేరుః, శిఖరిణామ్, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| రుద్రాణామ్ | = ఏకాదశరుద్రులలో | వసూనామ్ | = అష్టవసువులలో |
| శంకరః, అస్మి | = నేను శంకరుడను | పావకః, అస్మి | = నేను అగ్నిని |
| చ | = ఇంకా | చ | = ఇంకా |
| యక్ష, రక్షసామ్ | = యక్ష, రాక్షసులలో | శిఖరిణామ్ | = పర్వతములలో |
| అహమ్, విత్తేశః | = నేను ధనాధిపతియైన కుబేరుడను | మేరుః (అస్మి) | = నేను మేరుపర్వతమును |

**రుద్రాణామ్ శఙ్కరః, యక్ష–రక్షసామ్ చ విత్త–ఈశః అస్మి,**
**వసూనామ్ పావకః, శిఖరిణామ్ మేరుః చ అహమ్ అస్మి ।**

తా: ఏకాదశరుద్రులలో నేను శంకరుడను ఇంకా యక్ష, రాక్షసులలో నేను ధనాధిపతియైన కుబేరుడను, అష్టవసువులలో నేను అగ్నిని ఇంకా పర్వతములలో నేను మేరు పర్వతమును.

ఇంతకు ముందు ద్వాదశ ఆదిత్యులను చూశాము. సూర్యనమస్కారంలో 12 నమస్కారాలు పెడతారు.

**మిత్ర రవి సూర్య భాను ఖగ పూష హిరణ్యగర్భ మరీచ ఆదిత్య సవిత్ర అర్క భాస్కరేభ్యో నమోనమః**

ఇప్పుడు ఏకాదశరుద్రుల గురించి చెప్పబోతున్నాడు.

**రుద్రాణాం శంకరశ్చాస్మి** – ఏకాదశరుద్రులలో నేను శంకరుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏకాదశ అంటే పదకొండు రుద్రులు. ఈ పదకొండు రుద్రులకు కూడా పేర్లు ఉన్నాయి. శంకర, నీలలోహితలాంటి పేర్లు. మధ్యలో ఒక రుద్రుణ్ణి పెట్టి, చుట్టూతా పది రుద్రులను పెట్టి ఏకాదశరుద్రాభిషేకం చేస్తారు. వారిలో నేను శంకరుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు?

**శం మంగలం కరోతి ఇతి శంకరః**

శం నో మిత్ర శం వరుణః అని ఉపనిషత్తుల్లో శాంతిపాఠంలో చూస్తాము. శం అంటే మంగళం. అందువల్ల శంకర అంటే మంగళకర్తా. మంగళం అంటే ఆనందం. అందువల్ల రుద్రం అంటే దుఃఖాన్ని పారద్రోలేవాడు.

**రుతం దుఃఖం ద్రావయతి ఇతి రుద్రః**

రుత్ అంటే దుఃఖం. కొన్ని ఇళ్ళల్లో దేనికో దానికి దుఃఖిస్తూనే ఉంటారు. రుద్రం ఆ ఇళ్ళల్లో ఉన్న దుఃఖాన్ని పారద్రోలుతుంది. అందువల్ల దుఃఖనాశకుడు అంటారు. దుఃఖాన్ని నాశనం చేస్తాడు అంటే ఆనందాన్ని తీసుకువస్తాడు. అందువల్ల రుద్రులలో పరమాత్మ శంకరుడు.

**విత్తేశో యక్షరక్షసామ్** – యక్షులు, రాక్షసులలో నేను కుబేరుణ్ణి. యక్షులు అంటే యక్ష, కిన్నెర, కింపురుష, గంధర్వులను కూడా కలుపుకోవాలి. దేవలోకాలలో వీరు అనేక స్థాయిల్లో ఉంటారు. విత్తేశః అంటే కుబేరుడు. యక్షులు, రాక్షసులలో నేను కుబేరుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. కుబేరుడు అంటే ధనానికి అధిపతి.

బద్రీనాథ్‌లో కుబేరుని గుడి ఉంది. అక్కడ ఒక నమ్మకం ఉంది. మన రూపాయి కాసు కుబేరుని చేతిలో పెట్టి, మళ్ళీ వెనక్కు తీసుకుని, మన బీరువాలో మన డబ్బులతో పాటు పెట్టుకుంటే, మన డబ్బు అక్షయంగా ఉంటుందని నమ్మకం. శాస్త్రం డబ్బు సంపాదనను ఖండించదు. డబ్బు కూడా ఉండాలి. అందువల్ల ధనానికి అధిపతి అయిన కుబేరుడు గొప్పవాడు. అందువల్ల యక్షులలో, రాక్షసులలో పరమాత్మ కుబేరుడు.

**వసూనాం పావకశ్చాస్మి** – వసువులలో నేను అగ్నిని. ఇంకో ముఖ్యమైన దేవతల సముదాయం వసువులు. ఈ అధ్యాయం మొదట్లో 33 దేవతలు ఉన్నారనీ, వారు 12 ఆదిత్యులు, 11 రుద్రులు, 8 వసువులు, ఇంద్రుడు, హిరణ్యగర్భుడు అనీ చూశాము. ఆదిత్యులలో సూర్యుడిననీ, రుద్రులలో శంకరుడిననీ చెప్పాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు వసువులలో అగ్నిదేవతను అంటున్నాడు. వసువులు ఎనిమిది దిక్కులకు అధిష్ఠానదేవతలు.

**పావయతి ఇతి పావకః**

అగ్ని పునీతులను చేస్తుంది కాబట్టి పావకః అనే పేరు వచ్చింది. వ్యావహారిక స్థాయిలో కూడా చూడండి, నీరును శుద్ధం చెయ్యాలంటే దాన్ని వేడి చేస్తాము. ఆపరేషన్లు చేసేముందు సర్జన్ వాడే పరికరాలను, దుస్తులను, అన్నిటినీ వేడి చేస్తారు. అలాగే శవాన్ని కూడా పూడ్చిపెట్టకుండా, కాలుస్తారు. అలా ఏ విధంగా చూసినా కూడా అగ్నిదేవత శుద్ధి చేస్తుంది.

శాస్త్రం ప్రకారం అగ్ని మనస్సును శుద్ధి చేస్తుంది. అందువల్ల అగ్నికి పూజ చేస్తాము. గొప్ప వేదమైన ఋగ్వేదంలో మంత్రాలు – **అగ్ని మీళే పురోహితమ్** అనే పదాలతో మొదలవుతాయి. అగ్ని మనకు చాలా ముఖ్యమైన అంశం. అందువల్ల లేవగానే దీపం వెలిగించాలి అన్నారు మన పెద్దవారు. బయట జ్యోతి సూర్యుడు; ఇంట్లో జ్యోతి అగ్ని. పొద్దున్నే దీపం వెలిగించటంలోని ఉద్దేశం బాహ్యంగా భగవంతునికి చిహ్నంగా ఆకాశంలో సూర్యుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తుంటే, ఇంట్లో భగవంతునికి చిహ్నంగా చిన్న దీపం ప్రకాశిస్తుంది. అందువల్ల వసువులలో పరమాత్మ అగ్ని.

**మేరుః శిఖరిణామహమ్** – పర్వతాలన్నింటిలోనూ నేను మేరుపర్వతాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ మేరుపర్వతాన్ని అటు పురాణాలలోను, ఇటు వేదాలలోను వర్ణిస్తారు. కాకపోతే దీని గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు మేరుపర్వతం హిమాలయాల్లో ఒకటి అంటే, మరికొందరు మేరుపర్వతం ఉత్తరధృవం అంటే, ఇంకా కొందరు అసలు మేరుపర్వతం కంటికి కనబడదు, అది స్వర్గలోకానికి చెందిన పర్వతం అంటారు. అందువల్ల మేరుపర్వతాన్ని మేరుపర్వతంగానే తీసుకుందాము.

మన శాస్త్రంలో మేరుపర్వత పరిక్రమం చెప్పబడింది. పర్వతాలలో పరమాత్మ మేరుపర్వతం.

శ్లో. 24 **పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।**
**సేనానీనామహం స్కందః సరసామస్మి సాగరః ॥**
పురోధసామ్, చ, ముఖ్యమ్, మామ్, విద్ధి, పార్థ, బృహస్పతిమ్,
సేనానీనామ్, అహమ్, స్కందః, సరసామ్, అస్మి, సాగరః ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | అహమ్ | = నేను |
| పురోధసామ్ | = పురోహితులలో | సేనానీనామ్ | = సేనాధిపతులలో |
| ముఖ్యమ్ | = ముఖ్యుడైన | స్కందః | = కుమారస్వామిని |
| బృహస్పతిమ్ | = బృహస్పతినిగా | చ | = ఇంకా |
| మామ్ | = నన్ను | సరసామ్ | = జలాశయములలో |
| విద్ధి | = తెలిసికొనుము | సాగరః అస్మి | = నేను సముద్రుడను |

**హే పార్థ! పురోధసామ్ చ ముఖ్యమ్ బృహస్పతిమ్ మామ్ విద్ధి,**
**సేనానీనామ్ స్కన్దః, సరసామ్ సాగరః అహమ్ అస్మి ।**

తా: ఓ పార్థా! పురోహితులలో ముఖ్యుడైన బృహస్పతినిగా నన్ను తెలిసికొనుము. నేను సేనాధిపతులలో కుమారస్వామిని ఇంకా జలాశయములలో నేను సముద్రుడను.

**పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్** – దేవపురోహితులలో బృహస్పతిని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. పురోహితులు రెండు రకాలు ఉంటారు. మనుష్యులకు పురోహితులు, దేవతలకు పురోహితులు. బృహస్పతి దేవతలకు పురోహితుడు. పురోధః అంటే పురః దత్తే – అంటే మన ముందు కూర్చుని, మనం యజ్ఞాలు చేసేటప్పుడు మనం ఎలా చెయ్యాలో చెప్పి చేయించేవాడు. అందువల్ల పురోహితులలో పరమాత్మ బృహస్పతి.

**సేనానీనామహం స్కందః** – సైనికులలో నేను కుమారస్వామిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆయన ఏ రంగాన్నీ వదలటం లేదు.

సైనికునికి కూడా ఉపాసన దేవత కావాలి కదా దేవతల సైన్యానికి సేనాధిపతి స్కందుడు. అంటే సుబ్రహ్మణ్యస్వామి. ఆయనను దేవసేనాధిపతి అంటారు. ఈ స్కందుడు శివుని మూడవకంటినుంచి ఉద్భవించాడు. అసాధారణశక్తులు ఉన్న కొందరు రాక్షసులను సంహరించటానికి శివుడు ఒక అవతారాన్ని తీసుకురావల్సి వచ్చింది. అప్పుడు తన మూడవనేత్రంనుంచి సృష్టించాడు. మూడవనేత్రాన్ని జ్ఞాననేత్రం అంటారు కాబట్టి, సుబ్రహ్మణ్యస్వామిని జ్ఞానసుబ్రహ్మణ్యస్వామి అనీ, జ్ఞానస్కందుడు అనీ అంటారు. అందువల్ల సైనికులలో పరమాత్మ స్కందుడు.

**సరసామస్మి సాగరః** – సరస్సులన్నిటిలో నేను సాగరుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

పురాణాల్లో ఒక పెద్ద గాథ ఉంది. ఈ భాగంలోనే అనేక శ్లోకాలు ఆ గాథమీద ఆధారపడి వచ్చినవే. దాన్ని పదేపదే తలుచుకోవాల్సి ఉంటుంది. అందువల్ల అది అందరికీ తెలిసిన కథే అయినా ఒకసారి ఇక్కడ చూద్దాము.

ఈ కథ చాలా పురాణాల్లో వస్తుంది, రామాయణంలో కూడా వచ్చింది. విశ్వామిత్రులవారు రామలక్ష్మణులను తనతోపాటు తీసుకువెళ్ళినప్పుడు, వారికి శ్రమ తెలియకుండా ఉండటానికి దోవలో అనేక కథలు చెప్పారు. అందులో ఒక కథ **గంగావతరణం**. అంటే దివినుంచి భువికి గంగ దిగిరావటం. చిన్నచిన్న మార్పులతో అనేక చోట్ల ఈ కథను చూస్తాము.

ఒకరాజు ఉండేవాడు. అతని పేరు సగరరాజు. ఈ సగరునికి 60001 పిల్లలు ఉండేవారు. వారిలో ఒక్కరిని మాత్రం అసమంజుడనే వారు. తక్కిన 60,000 మందిని సాగరులు అనేవారు. సగరుని పుత్రులు కాబట్టి సాగరులు అయ్యారు.

ఒకరోజు ఈ సగరుడు అశ్వమేధయాగం చెయ్యాలని సంకల్పించాడు. ఆ యాగంలో అశ్వాన్ని వదులుతారు. దాన్ని ఎవరైనా పట్టి బంధిస్తే, దాని వెనుక వెళ్ళే సైన్యం ఆ రాజును యుద్ధంలో ఓడించాలి. అలా చుట్టుపక్కల రాజులందరినీ ఓడిస్తేనే అతను అశ్వమేధయాగం చెయ్యగలడు.

అది వినగానే ఇంద్రుడు భయపడ్డాడు. ఇంద్రుడు అంటే అది కూడా ఒక పదవే, చాలా పుణ్యం చేసుకున్న వ్యక్తి ఇంద్రపదవి పొందుతాడని శాస్త్రంలో వస్తుంది. ఎవరైనా 100 యజ్ఞాలు చేస్తే ఇంద్రపదవికి అర్హుడవుతాడు. అందువల్ల ఎవరైనా యజ్ఞాలు చేస్తున్నారని తెలిస్తే, ఆ యజ్ఞాన్ని చెడగొట్టటానికి చూస్తాడు ఇంద్రుడు. అశ్వమేధయజ్ఞానికి అశ్వాన్ని బంధించాలి. ఇంద్రుడు మారువేషం వేసుకుని అశ్వాన్ని దొంగలించుకుని వెళ్ళిపోతుంటే 60,000 పుత్రులు ఆయన వెంటపడ్డారు. వారిని తప్పించుకోవటానికి ఆయన పాతాళలోకంలోకి వెళ్ళి దాక్కున్నాడు. అరవైవేల మంది పుత్రులూ కలిసి భూలోకాన్ని తవ్వటం మొదలుపెట్టారు. దానితో అంతటా నీరు వచ్చేసింది. దానికి సాగరం అని పేరు వచ్చింది. సాగరులు తవ్వారు కాబట్టి సాగరం అయింది.

అలా వారు కూడా పాతాళలోకానికి వెళ్ళారు. అప్పుడు ఇంద్రుడు వారిని తప్పించుకోవటం కష్టమని గ్రహించి, అశ్వాన్ని పాతాళలోకంలో వదిలేసి, తను వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు. అక్కడ కళ్ళు మూసుకుని తపస్సు చేసుకుంటున్న కపిలమునిని చూశాడు. అతనికి దగ్గరగా ఆ గుర్రాన్ని కట్టేసి, తను ఇంద్రలోకానికి వెళ్ళిపోయాడు. ఈ సాగరులు పాతాళలోకానికి వచ్చి చూసేసరికి, కపిలముని దగ్గర వారి అశ్వాన్ని చూశారు. సహజంగానే, ఆయనే తమ అశ్వాన్ని తీసుకువెళ్ళిపోయాడని భావించారు. అశ్వాన్ని తీసుకుపోయి, ఏమీ ఎరగనట్టు కళ్ళు మూసుకుని కూర్చున్నాడు అనుకున్నారు.

కపిలముని దగ్గరకు వెళ్ళి ఆయనమీద కోపంగా అరిచారు. తన తపోభంగం కలగటం భరించలేని ఆ ముని కోపంగా కళ్ళు తెరిచి వారిని తన క్రోధాగ్నితో భస్మం చేశాడు. ఇక్కడ అశ్వంకోసం వెళ్ళిన సాగరులు ఎంతకీ తిరిగిరాకపోవటంతో సగురుడు తన ఇంకొక పుత్రుడైన అసమంజుణ్ణి పంపించాడు. అసమంజుడు వారిని వెతుక్కుంటూ పాతాళలోకానికి వెళితే, అక్కడ తన సోదరులు భస్మమైవుండటం చూశాడు. కపిలమునిని

విషయం అడగగా, తనే భస్మం చేశాననీ, గంగాజలం తెచ్చి దానితో వారిని పునీతులను చేస్తే బ్రతుకుతారనీ చెప్పాడు.

అసమంజుడు వెనక్కి తిరిగివచ్చి, తండ్రితో జరిగిన విషయం వివరించాడు. అప్పుడు గంగానది కాశీలో లేదు, స్వర్గలోకంలో ఉంది. సగరుడు తాను వృద్ధుడైపోయానని, ఆ ప్రయత్నం తను చెయ్యలేననీ, అసమంజునినే ప్రయత్నించమనీ చెప్పాడు. కాని అతను గంగను తీసుకురాలేకపోయాడు. అతనికి ఒక పుత్రుడు ఉన్నాడు. అతని పేరు అంశుమానుడు. అతనికి అప్పచెప్పాడు ఆ బాధ్యతను. అతను కూడా సాధించలేకపోయాడు.

అంశుమానునికి ఒక పుత్రుడు ఉన్నాడు. అతని పేరు భగీరథుడు. అతను ఎలాగైనా గంగను భూలోకానికి తీసుకురావాలని నిశ్చయించుకుని, గంగాదేవికి తీవ్రమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన గంగాదేవి, 'నాకు రావటానికి అభ్యంతరం లేదు, కాని నేను దివినుంచి భువికి దిగివచ్చేటప్పుడు, నా వేగం చాలా ఉధృతంగా ఉంటుంది. నా ధాటికి భూదేవి తట్టుకోలేదు,' అంది. మరి దానికి ఏమిటి మార్గం అంటే ఎవరైనా తన ధాటిని తట్టుకుని నిలబడగలగేవారు, తనను స్వీకరించాలి అంది. అంతటి ధీశాలి సాక్షాత్తూ ఈశ్వరుడే.

అందువల్ల మళ్ళీ ఈశ్వరునికోసం తపస్సు చేశాడు. ఈశ్వరుడు అతని తపస్సుకు మెచ్చి, అలాగే గంగను తన జటాఝూటాలలో స్వీకరిస్తానని చెప్పాడు. అలాగే గంగ కిందకు దిగివచ్చింది. శివుడు స్వీకరించాడు. అంతవరకూ బాగానే ఉంది. కాని గంగకు తన ప్రవాహంమీద అహంకారం ఉంది, తనకు గర్వభంగం చెయ్యాలన్న ఉద్దేశంతో గంగను మళ్ళీ కిందకు వదలకుండా తన జటాఝూటంలో బంధించేశాడు. అంత మహానది అంత చిన్న జటాఝూటంలో చిక్కుకుపోయింది. ఆవిడను బంధించేసి, శివుడు మళ్ళీ తపస్సులోకి వెళ్ళిపోయాడు.

తన ప్రయత్నం వృథా అయిపోయిందని బాధపడ్డ భగీరథుడు మళ్ళీ శివుని గురించి ఘోరతపస్సు చేశాడు. అటు గంగాదేవి కూడా శివుని జటాఝూటంలో ఉక్కిరిబిక్కిరి అయిపోతుండటంతో తనను విడవమని పరిపరి విధాల వేడుకుంది. ఇద్దరి తపస్సులకు మెచ్చిన ఈశ్వరుడు, వదులుతానన్నాడు. కాని పూర్తి గంగను కాదు, గంగలో ఒక భాగాన్ని వదులుతానన్నాడు.

ఈ కథను కథలాగానే తీసుకోకుండా, దీనిలోని అంతరార్థాన్ని గమనిస్తే, గంగాదేవి బ్రహ్మవిద్యను సూచిస్తుంది. గంగాదేవి ఎక్కడ్నుంచి బయటకు వచ్చింది? సాక్షాత్తూ శివుని శిరస్సునుంచి. అంటే ఈ బ్రహ్మవిద్య భగవంతునినుంచి మనుష్యులకు వచ్చింది. గంగాదేవి భూలోకానికి ఎందుకు వచ్చింది. భగీరథుని తాతలను బ్రతికించటానికి వచ్చింది. అంటే బ్రహ్మవిద్య మనుష్యులను శాశ్వతం చేస్తుంది.

ఇంతకీ గంగాదేవియొక్క ఒక భాగాన్ని విడుదల చేశాడు శివుడు. ఆ గంగాదేవిని పాతాళలోకానికి రమ్మని వేడుకున్నాడు భగీరథుడు. కాని ఇక్కడితో అతని కష్టం తీరలేదు. ఆవిడ ఒక పర్ణశాలవైపుగా ప్రవహిస్తున్నప్పుడు ఆ పర్ణశాలలో ఉన్న మహర్షికి కోపం వచ్చింది. ఆయన పేరు జహ్నుమహర్షి. ఆయనకు కోపం వచ్చి ఏం చేశాడు? గంగానదిని మొత్తం త్రాగేశాడు.

మళ్ళీ కథ మొదటికి వచ్చింది. ముందు శివుడు బంధించేశాడు. ఇప్పుడేమో జహ్నుమహర్షి గంగను మింగేశాడు. కోపం తెచ్చుకుని, పోట్లాడే సమయం కాదిది. అందువల్ల మళ్ళీ భగీరథుడు తపస్సు చేశాడు, జహ్నుమహర్షిని శాంతింపజేయటానికి. అప్పుడాయన నోటినుంచి కాకుండా, చెవినుంచి వదిలాడు గంగాదేవిని.

ముందేమన్నాము? సాక్షాత్తూ పరమాత్మనుంచే బ్రహ్మవిద్య వచ్చిందన్నాము. కాని ఇప్పుడు అదే బ్రహ్మవిద్య మన ఋషులకు కర్ణపరంపరగా వచ్చింది. అంటే ఆ బ్రహ్మవిద్య తలనుంచి చెవులకు వస్తుంది, మళ్ళీ చెవులనుంచి శిష్యుని తలకు వెళుతుంది. అలా కొనసాగుతుంది బ్రహ్మవిద్య పరంపర. అంతేకాదు గంగాదేవి, జహ్నుమహర్షి చెవులనుంచి వచ్చింది కాబట్టి, గంగానదికి ఇంకొక పేరు జాహ్నవి. ఆ విషయం మళ్ళీ ఇదే అధ్యాయంలో వస్తుంది. '**స్రోతసామస్మి జాహ్నవీ**'. అందువల్ల ఈ కథను ఇక్కడ వివరంగా చూశాము. ఆ సందర్భంలో కేవలం తలుచుకుంటే చాలు.

చివరికి గంగాదేవి పాతాళలోకానికి వచ్చింది. 60,000 సగరపుత్రులకు జీవం పోసింది. ఇదీ గంగావతరణ కథ. సగరుపుత్రులు భస్మమైన చోటును కపిలారణ్యం అంటారు. ఇది పాతాళలోకంలో ఉంది. కాని ఇప్పుడు ఆ కపిలారణ్యమే అమెరికాలో ఉన్న నేటి కాలిఫోర్నియా అంటారు. అంటే కాలిఫోర్నియా పాతాళలోకంలో ఉందా అనకండి. దానికి కారణం, కాలిఫోర్నియాలో **ఏష్ ఐలాండ్** ఉందిట. సాగరులు ఇక్కడే కాలి బూడిద అయిపోయారు అంటారు కొందరు.

అది నిజమో కాదో మనకు అనవసరం. కాని సాగరుడు అనే పేరు ఈ సాగరులు తవ్వటంవల్ల వచ్చింది. అందువల్ల సరస్సులలో పరమాత్మ సాగరుడు. భగీరథుడులాంటి వారిని మెచ్చుకుంటూ భర్తృహరి శ్లోకం ఉంది–

**ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః।**
**ప్రారభ్య విఘ్నవిహితాః విరమంతి మధ్యాః।**
**విఘ్నైః పునఃపునరపి ప్రతిహన్యమానాః।**
**ప్రారబ్ధముత్తమజనాః న పరిత్యజంతి॥**

మూడు రకాల మనుష్యుల గురించి వివరిస్తున్నాడు. కొంతమంది ఏ పనినీ చేపట్టరు. ఎందుకంటే వారికి ఓటమి అంటే భయం. పైపెచ్చు నా జీవితంలో నేను ఎన్నడూ ఓడిపోలేదు అని గొప్పగా చెప్పుకుంటారు. ఏదైనా ప్రయత్నిస్తే కదా గెలవటమో, ఓడటమో జరిగేది. వీరిని మంద పురుషులు అంటారు.

ఇంకోరకం పురుషులు ఉన్నారు. వారు ఉత్సాహంగా ఆరంభిస్తారు కాని, చిన్న ఆటంకం ఎదురయితే చాలు డీలా పడిపోతారు. చేసే ప్రయత్నం ఆపేస్తారు. వీరిని మధ్యమ పురుషులు అంటారు. ఉత్తమపురుషులు ఎన్ని ఆటంకాలు ఎదురైనా, విజయం సాధించేదాకా, నిద్రపోరు. ఒక ఆటంకం రాగానే కృంగిపోరు. అలా ముందుకు సాగుతూనే ఉంటారు.

భగీరథుడు అలాంటి ఉత్తమపురుషులలోకి వస్తాడు. గంగాదేవికోసం తీవ్రమైన తపస్సు చేశాడు, మళ్ళీ శివునికోసం తపస్సు చేశాడు, శివుడు గంగాదేవిని బంధించేశాడు, మళ్ళీ జహ్నుమహర్షి మింగేశాడు. అలా ఎన్ని ఆటంకాలు ఎదురైనా భగీరథుడు తన ప్రయత్నాన్ని విరమించలేదు. అలా ఎవరైనా అంత తీవ్రంగా చేస్తే భగీరథయత్నం అంటారు మనవారు.

శ్లో. 25 **మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్ ।**
**యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః ॥**
మహర్షీణామ్, భృగుః, అహమ్, గిరామ్, అస్మి, ఏకమ్, అక్షరమ్,
యజ్ఞానామ్, జపయజ్ఞః, అస్మి, స్థావరాణామ్, హిమాలయః ॥

| | | | |
|---|---|---|---|
| మహర్షీణామ్ | = మహర్షులలో | యజ్ఞానామ్ | = యజ్ఞములన్నింటిలో |
| భృగుః, అహమ్ | = భృగువును నేను | జపయజ్ఞః | = జపయజ్ఞమును |
| గిరామ్ | = శబ్దములలో | స్థావరాణామ్ | = స్థావరములలో |
| ఏకమ్ | = ఏకాక్షరమైన | హిమాలయః, అస్మి | = హిమాలయమును నేనే |
| అక్షరమ్, అస్మి | = ఓంకారమును నేను | | |

**మహర్షీణామ్ భృగుః, గిరామ్ ఏకమ్ అక్షరమ్ అహమ్ అస్మి,**
**యజ్ఞానామ్ జప-యజ్ఞః, స్థావరాణామ్ హిమాలయః (చ) అస్మి ।**

తా: మహర్షులలో భృగువును నేను, శబ్దములలో ఏకాక్షరమైన ఓంకారమును నేను, యజ్ఞములన్నింటిలో జపయజ్ఞమును, స్థావరములలో హిమాలయమును నేనే.

**మహర్షీణాం భృగురహం** – మహర్షులలో నేను భృగుమహర్షిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. సప్తఋషులు బ్రహ్మదేవునినుంచి పుట్టారు. వారిని బ్రహ్మమానసపుత్రులు అంటారు.

**మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా** – 10.6

అక్కడ ఈ సప్తఋషుల పేర్లు చూశాము. ఈ సప్తఋషుల్లో గొప్ప ఋషి భృగుమహర్షి. ఆయన గొప్పతనం గురించి పురాణాల్లో అనేక కథలున్నాయి. అందులో ఒకటి ఆయన త్రిమూర్తులలో ఎవరు గొప్పవారో తెలుసుకోవాలనుకున్న కథ.

ముందుగా ఆయన బ్రహ్మలోకానికి వెళ్ళాడు, బ్రహ్మ ఆయనను పట్టించుకోలేదు; భృగుమహర్షికి కోపం వచ్చి, అక్కడనుంచి కైలాసం వెళ్ళాడు. శివుడు తన నృత్యంలో మైమరచిపోయి, భృగుమహర్షిని పట్టించుకోలేదు. అక్కడనుంచి కూడా కోపంగా వైకుంఠానికి వచ్చాడు. అక్కడా విష్ణుమూర్తి లక్ష్మీదేవితో మాట్లాడుతూ తనను పట్టించుకోకపోతే, తన కాలితో విష్ణుమూర్తి వక్షస్థలంమీద తన్నాడు. విష్ణుమూర్తి కోపం తెచ్చుకోకుండా, చాలా శాంతంగా 'అయ్యో, మీ లేతపాదం కందిపోయి ఉంటుంద'ని అతని పాదాన్ని సుతారంగా నొక్కాడు.

ఏది ఏమైనా త్రిమూర్తులనే పరీక్షించటానికి వెళ్ళిన ఋషి అందరిలోకి గొప్పవాడు. అందువల్ల మహర్షులలో పరమాత్మ భృగుమహర్షి.

**గిరామస్మ్యేకమక్షరమ్** – పదాలలో నేను ఏకాక్షరం అయిన ఓంకారాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఓంకారం ఎందుకు గొప్పది? అది ఏకాక్షరం. అంతేకాదు, అది మొత్తం వేదాల సారం.

**యశ్ఛందసామృషభో విశ్వరూపః**

**ఛందోభ్యోఽధ్యమృతాత్సంబభూవ**

**సమేంద్రో మేధయా స్పృణోతు** – తైత్తిరీయం

పాలసముద్రాన్ని చిలికి దేవతలు అమృతాన్ని పొందినట్టు, బ్రహ్మదేవుడు వేదాలను చిలికి ఓంకారం అనే అమృతాన్ని తెప్పించాడు. అందువల్ల ఓంకారాన్ని వేదాల సారం అంటారు. అంతేకాదు, ఇది చాలా శక్తివంతమైన మంత్రం. కర్మకాండలో అన్ని యజ్ఞాలలోనూ వాడతారు.

**ఓమితి సామాని గాయన్తి ఓం శోమితి శస్త్రాణి శంసన్తి ।** శీక్షావల్లీ, తైత్తిరీయం

వేదాపారాయణం చేసేటప్పుడు మొట్టమొదటి పదం ఓం శ్రీగురుభ్యోనమః. యజ్ఞాలలో పలికే మొట్టమొదటి పదం 'ఓం', ఉపాసనల్లో వాడే ఆలంబనం ఓం. జ్ఞానకాండలో ఓంకార విశ్లేషణ చేస్తారు. మాండూక్యోపనిషత్తులో ఈ ఓంకార విశ్లేషణను వివరంగా చూస్తాము. ఆ విధంగా ఓంకారానికి కర్మకాండలో, ఉపాసనాకాండలో, జ్ఞానకాండలో కూడా ప్రాముఖ్యత ఉంది.

**ఓమిత్యేతదక్షరమిదగ్ం సర్వం తస్యోపవ్యాఖ్యానమ్** – మాండూక్యం 1

మాండూక్యోపనిషత్తు ఈ పాదంతో మొదలవుతుంది. ఓంకారం ఒక్క వేదాల సారమే కాదు; మొత్తం సృష్టియొక్క సారం కూడా.

**భూతం భవత్ భవిష్యదితి సర్వమ్ ఓంకార ఏవ** – మాండూక్యం 1

అలా ఓంకారం అన్ని కాండలలోనూ ముఖ్యమైనది. అందువల్లనే మనం ఓంకారంతో మొదలుపెట్టి, ఓంకారంతో ముగిస్తాము. గిరామ్ అంటే పదాలు. పదాలలో పరమాత్మ ఓంకారం.

**యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి** – యజ్ఞాలలో నేను జపయజ్ఞాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? జపయజ్ఞాన్ని ఎవరైనా చెయ్యవచ్చు. దీనికి వర్ణాశ్రమధర్మాలతో పనిలేదు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రులలో ఏ వర్ణానికి చెందినవారైనా జపయజ్ఞం చెయ్యవచ్చు. అలాగే బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థాశ్రమానికి చెందిన వ్యక్తి, సన్న్యాసి – ఎవరైనా జపయజ్ఞం చెయ్యవచ్చు.

మొదటి ప్రయోజనం – మిగతా యజ్ఞాలు అలాకాదు. ఉదాహరణకు అగ్నిహోత్రం గృహస్థ మాత్రమే చెయ్యాలి; బ్రహ్మచారి కాని, సన్న్యాసి కాని చెయ్యకూడదు. అలాగే రాజసూయయాగాన్ని క్షత్రియుడు మాత్రమే చెయ్యాలి; బ్రాహ్మణుడు చెయ్యకూడదు. అలా కొన్ని ఆశ్రమధర్మాలమీద ఆధారపడి ఉంటే, మరికొన్ని

వర్ణధర్మాలమీద ఆధారపడి ఉంటాయి. అలాగే కొన్ని మగవారే చెయ్యాలి, ఆడవారు చెయ్యకూడదు. కాని జపయజ్ఞానికి వర్ణాశ్రమధర్మాల నిబంధనలేవీ వర్తించవు.

రెండవ ప్రయోజనం – అంతేకాదు, ఈ జపయజ్ఞం ఎప్పుడైనా, ఎక్కడైనా చెయ్యవచ్చు. దానికి దేశకాల నియమాలు కూడా లేవు. అదే ఒక హోమం చెయ్యాలంటే – దాన్ని ఒక ప్రత్యేకమైన ప్రదేశంలో చెయ్యాలి, ప్రత్యేకమైన దిక్కువైపు చెయ్యాలి. జపయజ్ఞానికి ఇవేవీ అవసరం లేదు. ఇది రెండవ లాభం.

మూడవ ప్రయోజనం – జపయజ్ఞంలో జీవహింస ఉండదు. కొన్ని యజ్ఞాల్లో పశువులను బలి ఇస్తారు. ఇది చాలామందికి బాధాకరంగా ఉంటుంది. యజ్ఞం చేసే యజమాని కూడా చాలా శారీరక శ్రమకు లోనుకావాల్సి ఉంటుంది. పదిసార్లు లేచి నించోవాల్సి ఉంటుంది. అనేకసార్లు నమస్కారాలు చెయ్యాల్సి ఉంటుంది. జపయజ్ఞంలో శారీరకశ్రమ ఉండదు.

నాలుగవ ప్రయోజనం – ధనవ్యయం ఉండదు. ఏ యజ్ఞం చెయ్యాలన్నాకూడా అది చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. అందులో వేసే అర్ఘ్యం ఖరీదే చాలా ఉంటుంది. అదికాక, బ్రాహ్మణునికి దక్షిణ ఇవ్వాలి. కాని జపయజ్ఞంలో పైసా ఖర్చులేదు. కేవలం వాగింద్రియం ఉపయోగించాలి అంతే. వాగింద్రియాన్ని ఉపయోగించటంలో మనం ఎలాగూ ఆరితేరాము. అనవసరమైన మాటలతో కాలక్షేపం చేసే బదులు, ఓం నమశ్శివాయః అనో ఓం నమోనారాయణ అనో జపం చేస్తే మంచిది.

ఆ విధంగా జపయజ్ఞానికి నాలుగు ప్రయోజనాలు చూశాము. దానికి వర్ణాశ్రమనిబంధనలు లేవు, దేశకాల నిబంధనలు లేవు, జీవహింస లేదు, అన్నింటినీ మించి ధనవ్యయం లేదు. అందువల్లనే, వైదికసాంప్రదాయంలో పుట్టిన వ్యక్తి కనీసం ఒక నామాన్ని అయినా జపించాలి అంటారు. ఆరోగ్యరీత్యా ఉపవాసాలు ఉండలేకపోవచ్చు; ఉద్యోగరీత్యానో, ఆర్థికబాధవల్లనో యజ్ఞాలు చెయ్యలేకపోవచ్చు, కాని జపం చెయ్యగలరు. అందువల్ల శాస్త్రం ప్రతి ఒక్కరూ నామజపం చెయ్యగలరనీ, చేసి తీరాలనీ నిర్దేశిస్తున్నది. ఏ నామజపం చేసినా అథమపక్షం 108సార్లు చెయ్యాలి. ఒక్క జపయజ్ఞంవల్లనే పూర్తి సాధనచతుష్టయసంపత్తిని పొందవచ్చు.

**జకారో జన్మ విచ్ఛేదః పకారః పాపనాశనః**
**జన్మపాప హరో యస్మాత్ జప ఇతి ఉచ్యతే బుధైః ॥**

ఇదీ జపంయొక్క నిర్వచనం. జప పదంలో రెండు అక్షరాలు ఉన్నాయి. అవి జ, ప. జ అంటే జన్మ విచ్ఛేదః– అంటే జననమరణాలవృత్తినుంచి తప్పిస్తుంది. ప అంటే పాపనాశనః – పాపాలను నశింప జేస్తుంది. జన్మపాప హరో యస్మాత్ – ఈ సాధన పాపాలన్నీ తొలగించి, తద్వారా సంసారచక్రానికి ముగింపు పలుకుతుంది కాబట్టి దీనిని జప ఇతి ఉచ్యతే బుధైః – దీన్ని మేధావులు జపం అని అంటారు. అందువల్ల జపం గొప్ప సాధన.

ఇంతకీ జపం అంటే ఏమిటి? జపం గొప్పది అని అంటున్నాము కాని జపం అంటే ఏమిటో తెలియకపోతే లాభం లేదు. జపం అంటే ఒకే నామాన్ని పదేపదే పఠించటం. జపానికీ, పారాయణానికీ మధ్య ఉన్న భేదం ఏమిటి? పారాయణంలో పదేపదే పఠించటం ఉండదు. ఉదాహరణకు గీతాపారాయణం అంటే మొత్తం భగవద్గీతను

ఒకసారి పఠించటమో, లేదా రోజుకొక అధ్యాయాన్ని పఠించటమో అవుతుంది. కాని జపయజ్ఞంలో ఒక నామం తీసుకుని, దాన్ని పదేపదే ఉచ్చరించటం. ఉదాహరణకు ఓం నమశ్శివాయ తీసుకుంటే, ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ అని జపించుకుంటూ పోవటం.

**మంత్ర ఆవృత్తిః జపః**

ఆవృత్తి అంటే పునరావృత్తి అంటే పదేపదే చెప్పటం. అందువల్ల యజ్ఞాలలో పరమాత్మ జపయజ్ఞం.

**స్థావరాణాం హిమాలయః** – ఒక అంశంనుంచి ఇంకో అంశంలోకి వెళ్ళిపోతున్నాడు కృష్ణపరమాత్మ. తనకే ఆలోచన వస్తే, దాని గురించి చెబుతున్నాడు. పర్వతాలలో నేను హిమాలయాలను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ప్రపంచంలో కెల్లా అత్యంత పవిత్రమైన కొండలు హిమాలయాలు. ఎందుకంటే అవి శివుడు నెలకొని ఉండే ప్రదేశం అయిన కైలాసపర్వతాలు.

అందువల్లనే ఎవరో చమత్కారంగా అన్నారు, 'భూమ్మీద అత్యంత గొప్ప ప్రదేశం ఏమిటంటే మామగారిల్లు.' దానికి ఉదాహరణలు శివుడు, విష్ణువు. ఇద్దరూ వారివారి మామగారిళ్ళయిన కైలాసంలోనూ, పాలసముద్రంమీదా ఉన్నారు. అది పక్కనపెడితే, పర్వతాలలో పరమాత్మ హిమాలయం.

శ్లో. 26 **అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః ।**
**గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః ॥**
అశ్వత్థః, సర్వవృక్షాణామ్, దేవర్షీణామ్, చ, నారదః,
గంధర్వాణామ్, చిత్రరథః, సిద్ధానామ్, కపిలః, మునిః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వవృక్షాణామ్ | = | సమస్తవృక్షములలో | చిత్రరథః | = | చిత్రరథుడను |
| అశ్వత్థః | = | రావిచెట్టును నేను | చ | = | ఇంకా |
| దేవర్షీణామ్ | = | దేవర్షులలో | సిద్ధానామ్ | = | సిద్ధులలో |
| నారదః | = | నారదమునిని | కపిలః, మునిః | = | కపిలమునిని |
| గంధర్వాణామ్ | = | గంధర్వులలో | (అస్మి) | = | నేనే |

**సర్వ–వృక్షాణామ్ అశ్వత్థః, దేవర్షీణామ్ చ నారదః,**
**గన్ధర్వాణామ్ చిత్రరథః, సిద్ధానామ్ కపిలః మునిః (అహం అస్మి) ।**

తా: సమస్తవృక్షములలో రావిచెట్టును నేను, దేవర్షులలో నారదమునిని, గంధర్వులలో చిత్రరథుడను ఇంకా సిద్ధులలో కపిలమునిని నేనే.

**సర్వవృక్షాణామ్ అశ్వత్థః** – వృక్షాలన్నిటిలోకి నేను అశ్వత్థవృక్షాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి వృక్షాలన్నీ కూడా పరమాత్మ విభూతులే, కాని వాటిల్లో ఒక్క వృక్షాన్ని పేర్కొనాలంటే అది అశ్వత్థవృక్షం.

అశ్వత్థవృక్షానికి హిందువులు పూజ చేస్తారు. ఎందుకంటే త్రిమూర్తులు అందులో కొలువై ఉంటారు అంటారు. అందువల్ల అశ్వత్థవృక్షానికి ప్రదక్షిణం చేస్తే, త్రిమూర్తులకు ప్రదక్షిణం చేసినంత పుణ్యం కలుగుతుంది.

**మూలతో బ్రహ్మరూపాయః మధ్యతో విష్ణురూపిణే**
**అగ్రతః శివ రూపాయ వృక్షరాజాయ తే నమః ॥**

ఓ వృక్షరాజా నీకు నమస్కారం. ఎందుకు వృక్షాలలో రాజువంటివి? అశ్వత్థవృక్షంయొక్క వేరులో బ్రహ్మదేవుడు; మధ్యభాగంలో విష్ణుమూర్తి; పైభాగంలో మహేశ్వరుడు కొలువైవున్నారు కాబట్టి.

కాని ఇక్కడ ఒక విషయం గమనించాలి. పదిహేనవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ అశ్వత్థవృక్షాన్ని సంసారవృక్షంతో పోలుస్తాడు. సంసారం అంటే బంధం. ఆ అర్థాన్ని ఇక్కడ తీసుకోకూడదు. ఇక్కడ త్రిమూర్తులు కొలువైవున్న వృక్షంగా తీసుకోవాలి. అందువల్ల వృక్షాలలో పరమాత్మ అశ్వత్థవృక్షం.

**దేవర్షీణాం చ నారదః** – దేవర్షులలో నేను నారదఋషిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇంతకు ముందు శ్లోకంలో మహర్షులలో నేను భృగుమహర్షిని అన్నాడు. అంటే అక్కడ భూలోకఋషులు అయితే ఇక్కడ దేవలోక ఋషులుగా తీసుకోవాలి. నారదులవారిని త్రిలోక సంచారి అంటారు. నారదులవారి ప్రసక్తి లేకుండా, ఏ పురాణం లేదు. ఆయనకు కలహభోజనుడు అనే బిరుదు కూడా ఉంది. చివరకు ఉపనిషత్తులో కూడా వస్తారు నారదుల వారు. అక్కడ ఆత్మవిద్య నేర్చుకోవటానికి వస్తారు.

ఛాందోగ్యోపనిషత్తులో చూస్తాము నారదుల వారిని. అందులో ఏడవ అధ్యాయంలో నారదులవారు సనత్కుమారులను సమీపించి తనకు ఆత్మవిద్య బోధించమని వేడుకుంటారు. అప్పుడు సనత్కుమారులు బోధించిన విద్యను భూమవిద్య అంటారు. అది నేర్చుకోవటం వల్ల నారదులవారు జ్ఞాని కూడా అయ్యారు.

నారదులవారు తాను జ్ఞాని అవటమే కాదు, అందరికీ తన జ్ఞానాన్ని పంచుతారు కూడా. నిజానికి ఆయన పేరులోనే ఉంది ఆ అర్థం –

**నారం దదాతి ఇతి నారదః**

నారం అంటే జ్ఞానం; ద అంటే ఇచ్చేవాడు. నారద అంటే జ్ఞానాన్ని ఇచ్చేవాడు అని అర్థం. అలా దేవర్షులలో నారదుల వారు గొప్పవారు. అందువల్ల దేవర్షులలో పరమాత్మ నారదుడు.

**గంధర్వాణాం చిత్రరథః** – గంధర్వులలో నేను చిత్రరథుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉన్నత లోకాల్లో గంధర్వులు, యక్షులు, కిన్నెరులు, కింపురుషులు – అంటూ అనేక రకాల దేవపురుషులు ఉన్నారు. గంధర్వలోకం లలితకళలకు పుట్టినిల్లు. అందులో సంగీతం, నృత్యం, చిత్రలేఖనం లాంటివి ఎప్పుడూ ఉంటూ ఉంటాయి. గంధర్వుల రాజు పేరు చిత్రరథుడు. మహాభారతంలో పాండవులు అడవిలో ఉన్నప్పుడు, గంధర్వరాజు వారి ముందు రావటం సందర్భాన్ని చూస్తాము. అలా గంధర్వులలో పరమాత్మ చిత్రరథుడు.

**సిద్ధానాం కపిలో మునిః** – సిద్ధులలో నేను కపిల మునిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. సిద్ధులంటే అద్భుతమైన శక్తులు ఉన్నవారు. దానికీ ఆధ్యాత్మిక జ్ఞానానికీ సంబంధం లేదు. నాలుగు రకాల మనుష్యులు ఉన్నారు. వారు–

**సిద్ధులు ఉండి, ఆత్మజ్ఞానం లేనివారు**
**ఆత్మజ్ఞానం ఉండి, సిద్ధులు లేనివారు**
**ఆత్మజ్ఞానం ఉండి, సిద్ధులు కూడా ఉన్నవారు**
**ఆత్మజ్ఞానమూ లేక, సిద్ధులూ లేనివారు.**

వీరిలో ఎవరికి మోక్షం లభిస్తుంది? మోక్షానికి జ్ఞానం ఉండితీరాలని తెలుసు కాబట్టి రెండూ, మూడూ రకం మనుష్యులు మోక్షం పొందుతారు. అంటే సిద్ధులు లేనివారు, సిద్ధులు ఉన్నవారు కూడా ఆత్మజ్ఞానం ఉంటే మోక్షం పొందుతారు. ఎందుకంటే మోక్షం పొందటానికి సిద్ధులు అవసరం లేదు. ఇదే నియమం ప్రకారం సిద్ధులు ఉండి, ఆత్మజ్ఞానం లేనివారు సంసారుల క్రిందకే వస్తారు. నిజానికి రాక్షసులకు సిద్ధులు ఉంటాయి కాని, వారికి ఆత్మజ్ఞానం ఉండదు. కపిలఋషి మూడవరకం మనుష్యుల్లోకి వస్తారు. ఆయనకు ఆత్మజ్ఞానమూ ఉంది, సిద్ధులూ ఉన్నాయి.

నిజానికి భాగవతపురాణంలో కపిలమునిని భగవంతుని అవతారంగా కీర్తిస్తారు. కపిలముని తన తల్లి దేవహూతికి వేదాంతాన్ని బోధించారు. కపిల–దేవహూతి సంవాదం భాగవత పురాణంలో వస్తుంది. అంతేకాదు, ఈ కపిలమునిని గంగావతరణ కథలో కూడా చూశాము. ఆయన తపస్సు చేసుకుంటుంటే సాగరులు ఆయనని రెచ్చగొట్టటంతో, వారందరినీ ఆయన భస్మం చేశారని చూశాము.

కాని ఇక్కడ ఇంకొక విషయం గుర్తుంచుకోవాలి. మనం ఇంకొక కపిలఋషి గురించి కూడా నేర్చుకుంటాము. ఆయన సాంఖ్యదార్శనికుడు. ఆయన దర్శనం, అద్వైతవేదాంతదర్శనానికి భిన్నంగా ఉంటుంది. ఆ ఋషి గురించి ఇక్కడ మాట్లాడటం లేదు. ఇక్కడ భగవంతుని అవతారం, సిద్ధులు ఉన్న కపిలముని గురించి మాట్లాడుతున్నాము.

సిద్ధులు అనేకపద్ధతులద్వారా పొందవచ్చు. అవి డబ్బు, ఔషధం, మంత్రజపం, ధ్యానం, జన్మతః. డబ్బు అంటే కొన్ని విలువైన రత్నాలు ఉంటే కొన్ని శక్తులు వస్తాయి అంటారు. అలాగే కొన్ని ఔషధాలు ఉంటే కొన్ని శక్తులు వస్తాయి అంటారు. అలాగే కొన్ని మంత్రాలను పునశ్చరణం చేస్తే కొన్ని సిద్ధులు వస్తాయంటారు.

పునశ్చరణం అంటే ఏమిటి? మీరు చేసే నామజపంలో ఎన్ని అక్షరాలు ఉన్నాయో చూడాలి. ఉదాహరణకు ఓం నమశ్శివాయ తీసుకుంటే న, మ, శి, వా, య – ఐదు అక్షరాలున్నాయి. వాటిలో ఒక్కొక్క అక్షరాన్నీ లక్షతో హెచ్చవేయాలి. అంటే ఓం నమశ్శివాయ జపం అథమపక్షం ఐదులక్షల సార్లు చెయ్యాలి. ఎనిమిది అక్షరాలు ఉన్న నామం అయితే ఎనిమిది లక్షల సార్లు, పన్నెండు అక్షరాలున్నదయితే పన్నెండు లక్షల సార్లు చెయ్యాలి. ఇది అథమపక్షం.

ఎక్కువగా చెయ్యాలంటే ఏం చెయ్యాలి? కోటితో హెచ్చవేయాలి. అంటే ఐదుకోట్ల సార్లు, పది కోట్ల సార్లు,

పదిహేను కోట్ల సార్లు చెయ్యాలి. అప్పుడు ఆ మంత్రశక్తి విడుదల అవుతుంది. దానికి అణుబాంబుకు ఉన్నంత శక్తి ఉంటుంది. దానివల్ల కూడా మనిషికి సిద్ధులు వస్తాయి.

అలాగే ధ్యానం చేసినా అంటే యోగాభ్యాసన చేసినా కూడా శక్తులు వస్తాయి. మనస్సును దేనిమీదైనా ఏకాగ్రత చూపగలిగేలా చెయ్యగలిగితే, చిత్త ఏకాగ్రత అలవడుతుంది. దానివల్ల కూడా కొన్ని సిద్ధులు వస్తాయి.

కొంతమందికి జన్మతః కొన్ని సిద్ధులు వస్తాయి. అంటే వారికి అసాధారణ పూర్వజన్మ సుకృతం ఉంటుంది. అప్పుడప్పుడు ఇలాంటి సిద్ధుల గురించి చదువుతూ ఉంటాము. ఒకసారి ఒక వ్యక్తికి తనలో విద్యుచ్ఛక్తి ఉందనీ, అతను ఒక బల్బు పట్టుకుంటే అది వెలుగుతుందనీ చెప్పారు. అలా ఇంకొక వ్యక్తి తనమీద అనేక రకాల ఆసిడ్‌లను పోసుకునేవాడు; అతని బట్టలు కాలాయి కాని, అతని శరీరం కాలేది కాదు. ఇలాంటివెన్నో ఉన్నాయి.

ఈ శ్లోకంలో సిద్ధపురుషులు అంటే జన్మతః సిద్ధులు; ఏదో సాధనవల్ల సిద్ధి పొందినవారు కాదు. అలాంటి సిద్ధపురుషులలో పరమాత్మ కపిలముని.

శ్లో. 27 **ఉచ్చైఃశ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్ ।**
**ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥**
ఉచ్చైఃశ్రవసమ్, అశ్వానామ్, విద్ధి, మామ్, అమృతోద్భవమ్,
ఐరావతమ్, గజేంద్రాణామ్, నరాణామ్, చ, నరాధిపమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అశ్వానామ్ | = గుర్రములలో | నరాణామ్ | = మానవులలో |
| అమృతోద్భవమ్ | = అమృతముతోపాటు ఉత్పన్నమైన | నరాధిపమ్ | = రాజును |
| ఉచ్చైఃశ్రవసమ్ | = 'ఉచ్చైఃశ్రవము'ను | మామ్ | = నన్నుగా |
| గజేంద్రాణామ్ | = భద్రగజములలో | విద్ధి | = తెలిసికొనుము |
| ఐరావతం, చ | = ఐరావతమును | | |

**అశ్వానామ్ అమృత-ఉద్భవమ్ ఉచ్చైఃశ్రవసమ్, గజేన్ద్రాణామ్**
**ఐరావతమ్, నరాణామ్ నరాధిపమ్ చ మామ్ విద్ధి ।**

తా: గుర్రములలో అమృతముతోపాటు ఉత్పన్నమైన 'ఉచ్చైఃశ్రవము'ను, భద్రగజములలో ఐరావతమును, మానవులలో రాజును నన్నుగా తెలిసికొనుము.

ఈ శ్లోకంలో ఇంకొక కథను గుర్తుకు తెచ్చుకోవాలి. అది సాగరమథనం కథ. ఇంతకుముందు గంగావతరణం కథ చూశాము. రెండు కథలలోనూ మనం నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠం ఒకటుంది. జీవితంలో ఏదైనా సాధించాలంటే పట్టువదలని దృఢచిత్తం ఉండాలి. ప్రతిదీ ఒక సవాలుగా తీసుకోవాలి. చిన్న ఓటమి ఎదురైతే బెంబేలెత్తిపోకూడదు. ఓటమి ఎదురవగానే, నా చేతిలో ఏమీ లేదు, అంతా దైవాధీనం అనుకోకూడదు, నిరాశపడి ప్రయత్నాన్ని మానకూడదు; రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్ళాలి.

క్షీరసాగరమథనం కథలో దేవతలు, అసురులు పాలసముద్రాన్ని చిలుకుదామనుకున్నారు. ఇది అందరికీ తెలిసిన కథే అయినా, ఈ సందర్భంలో మనం దానిని గుర్తు తెచ్చుకోవాలి. అంత పెద్ద సముద్రాన్ని చిలకటానికి వారు మంథరపర్వతాన్ని ఎన్నుకున్నారు. దాని చుట్టూ తాడులాగా కట్టటానికి వాసుకి అనే గొప్ప సర్పాన్ని ఉపయోగించారు. వాసుకిని ఎవరు ఎటువైపు పట్టుకోవాలి అనేది పెద్ద చర్చ. ఎలాగో ఆ సమస్యని అధిగమించారు. ఇదంతా ఎందుకు చేస్తున్నారు? అమృతం పొందటంకోసం.

కాని మంథరపర్వతాన్ని కవ్వంగా చేసి చిలుకుతుంటే, పర్వతం కిందికి వెళ్ళిపోయింది. అప్పుడు విష్ణుమూర్తిని ప్రార్థించారు. అప్పుడు విష్ణుమూర్తి కూర్మావతారాన్ని ఎత్తి, మంథరపర్వతాన్ని పైకి తెచ్చాడు. అది చిలుకుతుంటే 14 వస్తువులు వచ్చాయి. మంచి, చెడు రెండూ వచ్చాయి.

ఈ పాలసముద్రమథనం కూడా బ్రహ్మవిద్యను సూచిస్తుంది. గంగావతరణం కథలో బ్రహ్మవిద్య సాక్షాత్తూ ఈశ్వరునినుంచి కిందికి వచ్చింది అని చూశాము. పాలసముద్రమథనంలో పాలసముద్రాన్ని మథించినట్టుగా, బ్రహ్మవిద్య అధ్యయనంలో మన మనస్సును కూడా మథించాలి. మనస్సును పాలసముద్రంతో పోల్చవచ్చు. పాలసముద్రం ఎలా తెల్లరంగులో ఉంటుందో, అలా మనస్సు తెల్లరంగుకు ప్రతీక అయిన సత్త్వగుణానికి ప్రతీక. అలా సత్త్వగుణప్రధానమైన మనస్సును వేదాంతశాస్త్రమనే కవ్వంతో చిలికితే, వేదాంతవాక్యాలు బయటకు వస్తాయి.

ఇప్పుడు పాలసముద్రం విషయానికి వస్తే, కాళిదాస కవి దానిలోంచి బయటకు వచ్చిన 14 అంశాలను మంగళాష్టకం అనే ప్రార్థనలో వివరించాడు. ఆ ప్రార్థన పొద్దున్న చేస్తే మంచిది. అందులో మనం గుర్తుంచుకోవాల్సిన అనేక మంగళకరమైన నదులను, దేవతలను పేర్కొంటూ వస్తాడు. అవి చతుర్దశరత్నాణి అంటే పాలసముద్రంలోంచి వచ్చిన 14 రత్నాలు.

**లక్ష్మీః కౌస్తుభపారిజాతకుసుమాః ధన్వంతరిశ్చంద్రమాః**
**గావః కామదుఘాః సురేశ్వరగజో రంభాది దేవాంగనాః**
**అశ్వః సప్తముఖో సుధా హరిధనుః శంఖోవిషం చాంబుధేః**
**రత్నానీతి చతుర్దశ ప్రతిదినం కుర్వన్తు నో మంగలమ్ ॥**

ఈ 14 రత్నాలలో మొట్టమొదట వచ్చినది లక్ష్మీదేవి. ఆమె పాలసముద్రంనుంచి వచ్చింది కాబట్టి సముద్రరాజతనయ అయింది.

ఒక కవిహృదయం చూడండి, సముద్రరాజు లక్ష్మీదేవికి తగ్గ వరుణ్ణి వెతుకుతున్నాడుట. శివునికిచ్చి పెళ్ళి చెయ్యాలా, విష్ణుమూర్తికిచ్చి పెళ్ళి చెయ్యాలా అని ఆలోచించి, చివరికి విష్ణువుకే ఇచ్చి పెళ్ళి చెయ్యటానికి నిశ్చయించుకున్నాడుట. ఎందుకు? విష్ణుమూర్తి మంచి దుస్తులు ధరిస్తాడు కాబట్టి.

**కిం వాససా తత్ర విచారణీయమ్**
**వాసః ప్రధానం ఖలు యోగ్యతాయాః**

వేషధారణ ముఖ్యం. ఎందుకంటే అది యోగ్యతను నిర్ణయిస్తుంది.

**పీతాంబరం వీక్ష్య దత్ స్వకన్యామ్**
**చర్మాంబరం వీక్ష్య విషం సముద్రః**

సముద్రరాజు పీతాంబరం ధరించిన విష్ణుమూర్తికేమో తన కుమార్తెను ఇచ్చాడు; చర్మాంబరం ధరించిన శివునికేమో విషాన్ని ఇచ్చాడు.

ఇక్కడ మనం గమనించాల్సిన విషయం దేవతలు, అసురులు అమృతంకోసం పాలసముద్రాన్ని చిలుకుతుంటే ముందుగా వచ్చిన లక్ష్మీదేవి, కౌస్తుభరత్నం, ఐరావతంలాంటి రత్నాలకు ప్రలోభపడకుండా, వారి అంతిమలక్ష్యం అయిన అమృతంకోసం మొక్కవోని దృఢనిశ్చయంతో సాగిపోయారు. అది ఆదర్శంగా తీసుకోవాలి మనం.

మన సాత్త్విక మనస్సు పాలసముద్రం లాంటిది, జపం, పూజలాంటి ఆధ్యాత్మిక సాధనతో దాన్ని చిలకటానికి ప్రయత్నిస్తాము. అప్పుడు కూడా లక్ష్మీదేవి, కౌస్తుభరత్నాలలాంటివి వచ్చినట్టుగా లౌకిక విజయాలు కొన్ని కలుగుతాయి. అలాగే కొన్ని సిద్ధులు కూడా వస్తాయి. చాలామంది ఆ సిద్ధులతోనే తృప్తిపడిపోతారు. ఆదిశంకరాచార్యులు ఎందుకు గొప్పవారు అని అడిగితే ఆయన నిలబెట్టిన అద్వైతవేదాంతం గురించి ఎవరూ చెప్పరు. ఆయన ఒక సందర్భంలో లక్ష్మీదేవిని స్తుతించి, బంగారు ఉసిరికాయలు కురిపించారు అంటారు. ఆ స్తోత్రం పేరు కనకధారా స్తోత్రం.

దేవతలు వీటితో ఎలా ప్రలోభపడలేదో, అలా మనం కూడా ఇలాంటి సిద్ధులతో ప్రలోభపడకూడదు. దేవతలు ఎట్టి పరిస్థితిలోనూ అమృతం కావాలనుకున్నారు. అమృతం అంటే మోక్షం. అందువల్ల ఆకర్షణీయమైన వస్తువులు వచ్చినా లొంగలేదు. మనం కూడా ఆకర్షణీయమైన వస్తువులు వచ్చినా లొంగకూడదు.

అంతేకాదు, పాలసముద్రం చిలుకుతుంటే, ఆకర్షణీయమైన వస్తువులే కాక, చివర్లో హాలాహలవిషం వచ్చింది. దీన్ని మానసిక సమస్యలతో పోల్చవచ్చు. కొంతమంది వారి మనస్సును ప్రాపంచిక సమస్యలనుంచి విడదీసుకుని, అంతర్ముఖులై, తీవ్రంగా ధ్యానం చేస్తుంటే, అప్పుడు కూడా మనస్సు ప్రశాంతంగా ఉండదు. ఎక్కడో వారి సుప్తచేతనంలో నిక్షిప్తమై ఉన్న చిన్ననాటి సమస్యలేవో బయటకు వచ్చి వారిని ఇబ్బంది పెడతాయి. అంటే వారు చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు వారు పడ్డ బాధలో, తల్లిదండ్రులు సరిగా చూడకపోవటమో, యాభై ఏళ్ళ క్రిందట మనస్సును పట్టి పీడించిన సమస్యో – ఏదో ఒకటి సుప్తచేతన మనస్సునుంచి చేతనావస్థకు వస్తుంది.

మాండూక్య కారికలలో గౌడపాదుల వారు ఇటువంటి సమస్యను చర్చిస్తారు. ఎవరైనా ధ్యానం చేస్తుంటే నాలుగు రకాల ఆటంకాలు కలుగుతాయట – ఆ నాలుగు ఆటంకాలలో ఒక ఆటంకం పేరు కషాయం. కషాయం అంటే మన సుప్తచేతన మనస్సులో నిక్షిప్తమై ఉన్న సమస్యలు. ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యల ధాటికి ఆ పాత సమస్యలు తట్టుకోలేక, మనస్సులో ఎక్కడో అట్టడుగు పొరల్లో నిక్షిప్తమై ఉంటాయి. సాధకుడు ఇప్పటి సమస్యలను పక్కకు నెట్టి సాధనలో కూర్చుంటే, ఈ అణిగి ఉన్న సమస్యలు ఒక్కసారిగా నోరు తెరుచుకుని బయటకు వస్తాయి. అందరికీ అలా అవుతుందని చెప్పలేము.

అలా బయటకు వచ్చినవారికి కూడా ఆ సమస్యలు స్పష్టంగా తెలియవు. ఏదో తెలియని భయం, ఆందోళన, ఆదుర్దా, నిరాశానిస్పృహలు మనస్సును క్రుంగదీస్తాయి. అలా ఎందుకు మనస్సు డీలా పడుతుందో కూడా అర్థం కాదు. ఇటువంటి స్థితిని స్తబ్ధీభావన అంటారు ఒక ఆచార్యులవారు. స్తబ్ధీభావన అంటే మనస్సు చలనం లేకుండా అలా ఆగిపోతుంది. అటు ముందుకూ వెళ్ళలేదు, ఇటు వెనక్కీ రాలేదు. అటువంటి భావనను కషాయం అంటారు గౌడపాదులవారు.

ఈ విధంగా ఒక సాధకుడు అంతర్గత సమస్యను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పూర్వకాలపు గురుకులవాసంలో సాధకునికి ప్రత్యేకించి ఏమీ సమస్య ఉండదు. అతను డబ్బు సంపాదించనవసరం లేదు, గురువుగారే పోషిస్తారు. వంట చేసుకోనవసరం లేదు, గురువుగారే భోజనం పెడతారు. కుటుంబ బాధ్యత లేదు, కుటుంబాన్ని వదిలి వెళతారు. టీవీలు, సినిమాలులాంటి ప్రలోభాలు లేవు. ఆశ్రమంలో అలాంటివి ఉండవు, కొత్త స్నేహితులు ఉండరు. అందరూ ఒకటే ఆలోచనతో ఉంటారు. కాబట్టి అలాంటి గురుకులవాసంలో ప్రలోభాలు లేవు, బెంగలు లేవు, కాని అంతర్గత సమస్యలు పైకి వస్తాయి. సముద్రాన్ని చిలికితే హాలాహలవిషం బయటికి వచ్చినట్టుగా, మనస్సును శాస్త్రవిచారణతో చిలికితే కూడా కషాయం బయటకు వస్తుంది.

అక్కడ పాలసముద్రంలో విషం వస్తే వారేం చేశారు? ఈశ్వరుణ్ణి ప్రార్థించారు. ఆయన ఆ హాలాహలవిషాన్ని తన కంఠంలో పెట్టుకున్నాడు. అందువల్ల ఆయనను గరళకంఠుడు అంటారు. అలాగే సాధకునికి కూడా కషాయం వస్తే, దానికి కూడా ఒక్కటే పరిష్కారం. భగవంతుణ్ణి వేడుకోవటమే. ఆ గరళకంఠుడే మన విషాన్ని కూడా స్వీకరిస్తాడు. మనకు వచ్చిన సమస్య ఏమిటో మనకు తెలిస్తే, దాన్ని మనమే అధిగమించగలము. కాని చాలా మానసిక ఆందోళనలకు అసలైన కారణం తెలియదు మనకు. అలాంటప్పుడు శరణాగతి ఒక్కటే మార్గం.

లక్ష్మీదేవి, కౌస్తుభం లాంటి ఆకర్షణీయమైన వస్తువులు వచ్చినా దేవతలు ప్రలోభపడలేదు; హాలాహలంలాంటి కాలకూటవిషం వచ్చినా బెంబేలెత్తిపోయి ప్రయత్నం ఆపలేదు. వారి ప్రయత్నంలో విజయం సాధించారు. అదీ మన లక్ష్యం. సిద్ధులు వచ్చినా ప్రలోభపడకూడదు, కషాయం వచ్చినా బెంబేలెత్తిపోయి సాధన ఆపకూడదు. విజయం సాధించాలంటే ఈ రెండింటికీ అతీతంగా ఎదగాలి. అమృతం పొందాలంటే ఆత్మజ్ఞానం పొందాలి.

ఈ 14 రత్నాలమీద ఇంకొక కవి ఇంకొక అద్భుతమైన కవిత రాశాడు. రవి గాంచనిచో కవి గాంచున్ అని ఊరికే అనలేదు.

**భారతః పంచమో వేదః సుపుత్రః సప్తమో రసః।**
**దాతా పంచదశో రత్నః జామాత దశమో గ్రహః॥**

భారతః పంచమో వేదః – నాలుగు వేదాలు ఉన్నాయి కదా, భారతం ఐదవ వేదం లాంటిది; సుపుత్రః సప్తమో రసః – షడ్రుచులు ఉన్నాయి మనకు, సుపుత్రుడు కలిగితే అతను ఏడవ రుచిలాంటి వాడు; దాత పంచదశో రత్నః– పాలసముద్రం చిలికితే పధ్నాలుగు రత్నాలు వచ్చాయి, దానగుణం ఉన్న వ్యక్తిని పదిహేనవ రత్నంగా

కీర్తించవచ్చు; మనకు నవగ్రహాలు ఉంటే అల్లుడు దశమగ్రహం అన్నాడు ఆ కవి. నవగ్రహాలు ఎలా మనను నడిపిస్తాయో, అల్లుడు కూడా అలా మనను నడిపిస్తాడు.

ఇంతకీ పాలసముద్రంలోంచి వచ్చిన పధ్నాలుగు రత్నాల్లో ఒకటి గుర్రం.

**ఉచ్చైఃశ్రవసమశ్వానాం** – గుర్రాలలో పాలసముద్రంలో పుట్టిన ఉచ్చైఃశ్రవసాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. శ్రవః అంటే పేరున్న; ఉచ్చైఃశ్రవః అంటే చాలా గొప్ప పేరున్న అశ్వాన్ని నేను. ఎలా వచ్చింది ఈ గుర్రం?

**విద్ధి మామమృతోద్భవమ్** – అమృతం చిలుకుతున్నప్పుడు వచ్చింది. గుర్రాలలో పరమాత్మ ఉచ్చైఃశ్రవం

**ఐరావతం గజేంద్రాణామ్** – ఏనుగులలో నేను ఐరావతాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ ఐరావతం కూడా పాలసముద్రాన్ని చిలుకుతున్నప్పుడు వచ్చింది. తెల్ల ఏనుగు. దీనికి నాలుగు దంతాలు ఉన్నాయి. ఇంద్రుని వాహనం. ఏనుగులలో పరమాత్మ ఐరావతం.

**నరాణాం చ నరాధిపమ్** – మనుష్యులలో నేను రాజును అంటున్నాడు కృష్ణపరమాత్మ. మన సాంప్రదాయంలోనూ, అనేక సాంప్రదాయాలలోనూ రాజును భగవంతునిగా కొలుస్తారు. పరమాత్మే స్వయంగా చెబుతున్నాడు నేను మనుష్యులలో రాజును అని. అంతేకాదు, భగవంతుడు ఎలాగైతే శాశ్వత ధర్మరక్షకుడో అలా రాజు లౌకిక ధర్మరక్షకుడు. ఆ విధంగా రాజుని భగవంతునికి ప్రతీకగా తీసుకోవచ్చు. అందువల్ల మనుష్యులలో పరమాత్మ రాజు.

శ్లో. 28 **ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్ ।**
**ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణామస్మి వాసుకిః ॥**
ఆయుధానామ్, అహమ్, వజ్రమ్, ధేనూనామ్, అస్మి, కామధుక్,
ప్రజనః, చ, అస్మి, కందర్పః, సర్పాణామ్, అస్మి, వాసుకిః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆయుధానామ్ | = | ఆయుధములలో | కందర్పః, అస్మి | = | మన్మథుడను నేను |
| వజ్రమ్, అహమ్ | = | వజ్రాయుధమును నేను | చ | = | ఇంకా |
| ధేనూనామ్ | = | పాడియావులలో | సర్పాణామ్ | = | సర్పములలో |
| కామధుక్, అస్మి | = | కామధేనువును నేను | వాసుకిః, అస్మి | = | వాసుకిని నేను |
| ప్రజనః | = | సంతానోత్పత్తికి కారణమైన | | | |

**ఆయుధానామ్ వజ్రమ్ అహమ్, ధేనూనామ్ కామధుక్**
**(అహం) అస్మి, ప్రజనః కన్దర్పః అస్మి, సర్పాణామ్ వాసుకిః చ అస్మి ।**

తా: ఆయుధములలో వజ్రాయుధమును నేను, పాడియావులలో కామధేనువును నేను, సంతానోత్పత్తికి కారణమైన మన్మథుడను నేను ఇంకా సర్పములలో వాసుకిని నేను.

**ఆయుధానామహం వజ్రమ్** – ఆయుధాలలో నేను వజ్రాయుధాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. వజ్రాయుధం దేవేంద్రుడు ఉపయోగించే ప్రత్యేకమైన ఆయుధం. దీనికి కూడా పురాణకథ ఉంది. దధీచి మహర్షి గొప్ప తపశ్శాలి. అందువల్ల అతని శరీరం చాలా శక్తివంతంగా మారుతుంది. వృత్రాసురుడనే రాక్షసుణ్ణి సంహరించటానికి దధీచి మహర్షి తన జీవితాన్నే ధారపోస్తాడు. ఆయన వెన్నెముకనుంచి వజ్రాయుధాన్ని తయారుచేస్తారు. అంటే ఈ వజ్రాయుధం ఆధ్యాత్మిక శక్తివల్ల ఏర్పడింది కాబట్టి ఇది గొప్పది అయింది.

లౌకిక సంపదకన్నా ఆధ్యాత్మిక శక్తి ఎక్కువ. ఈ విషయాన్ని విశ్వామిత్రులవారు గ్రహించి తను కూడా బ్రహ్మర్షి అవాలనుకున్నారు. విశ్వామిత్రులవారు జన్మతః క్షత్రియులు. ఒకసారి విశ్వామిత్రునికి, వసిష్ఠుల వారికి పెద్ద యుద్ధం జరిగింది. వసిష్ఠులవారు ఏమీ చెక్కుచెదరకుండా, తన బ్రహ్మదండాన్ని తన ముందు ఉంచారు. విశ్వామిత్రులవారు బాణాల వర్షాలను కురిపిస్తున్నా కూడా అవి బ్రహ్మదండం ముందు వీగిపోతున్నాయి.

అప్పుడు విశ్వామిత్రులవారికి అర్థమయింది, తపశ్శక్తి ముందు లౌకికశక్తి నిలవదని.

**న క్షత్రియ బలం బ్రహ్మ తేజోబలం బలమ్**

బ్రహ్మతేజస్సు ముందు క్షత్రియబలం నిలవదని తేలిపోయింది. అందువల్ల తను క్షత్రియుడు అయినా కూడా ఘోరతపస్సు చేసి బ్రహ్మర్షి అయ్యాడు. దీన్ని బట్టి జాతిక్షత్రియుడు కూడా తపస్సు చేసి గుణపరంగా బ్రాహ్మణుడు అవచ్చు అని తెలుస్తున్నది. దీనంతటి సారం, ఆధ్యాత్మిక బలం గొప్పది. అందువల్ల ఆయుధాలలో పరమాత్మ వజ్రాయుధం.

**ధేనూనామస్మి కామధుక్** – పాడి ఆవులలో నేను కామధేనువును అంటున్నాడు కృష్ణపరమాత్మ. పాడి ఆవులను ధేనువు అంటారు. అటువంటి ఆవులలో నేను కామధేనువు అంటున్నాడు. తక్కిన ధేనువులు పాలు మాత్రమే ఇవ్వగలిగితే కామధేనువు ఏది కోరితే అది ఇస్తుంది.

**కామం కామం దోగ్ధి ఇతి కామధుక్**

ఏది కోరితే అది ఇస్తుంది కామధేనువు. కాఫీ కావాలంటే కాఫీ, ఇల్లు కావాలంటే ఇల్లు. ఈ కామధేనువు కూడా పాలసముద్రంలోంచి పుట్టింది. మన మనస్సు కూడా ఈ కామధేనువు లాంటిదే. ఏది కోరితే దాన్ని కామధేనువు ఎలా ఇస్తుందో, అలా మన మనస్సు కూడా దేన్ని కోరితే దాన్ని సృష్టించగలదు. మన బుద్ధి అంత పదునైనది. విజ్ఞానశాస్త్రం ఇంతలా అభివృద్ధి చెందటానికి కారణం ఏమిటి? మానవ మేధస్సు. ఇంటర్నెట్ ఎలా వచ్చింది? మానవ మేధస్సు అనే కామధేనువునుంచి. మనిషి తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏమీ లేదు. కావాలంటే పద్నాలుగు లోకాలనూ జయించగలడు; ఇంకా కావాలంటే, వాటికి అతీతమైన మోక్షాన్ని కూడా పొందగలడు. అందువల్ల ధేనువుల్లో పరమాత్మ కామధేనువు.

**ప్రజనశ్చాస్మి కందర్పః** – కోరికలలో నేను మన్మథుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. కందర్పః అంటే కోరిక. మన్మథుడు ప్రేమదేవత. ప్రేమ ఎందువల్ల వస్తుంది? కోరిక వల్ల. జగత్తులో ఏది సృష్టించబడ్డా, దాని వెనక దాని గురించిన కోరిక ఉంటుంది. మనం యాభై లక్షలు పెట్టి ఇల్లు కొనుక్కున్నామంటే కారణం, దాని

వెనకనున్న కోరిక. ఆ ఇల్లు మన మనస్సులో ముందు కోరిక రూపంలో రూపు దిద్దుకుంది. అందువల్ల జగత్తులో ఏది సృష్టించబడ్డా కూడా, దానికి మూలకారణం కోరిక. నిజానికి వేదాంతశాస్త్రం ప్రకారం పూర్వజన్మ కర్మవల్ల ఈ జన్మ పొందాము. పూర్వజన్మ కర్మ, మన కోరికవల్ల ఏర్పడింది.

నెసిసిటీ ఈజ్ ది మదర్ ఆఫ్ ఇన్వెన్షన్ అంటారు ఇంగ్లీషులో. అక్షరాలా చూస్తే అవసరం ఒక కొత్త వస్తువుకు తల్లి. అంటే ఒక అవసరం ఏర్పడితే, దానికి తగ్గ కొత్త వస్తువు వెలుగులోకి వస్తుంది. అవసరం ఎందుకు వస్తుంది? కోరికవల్ల. ఎండ వేడి తట్టుకోలేకపోయిన మనిషి మేధస్సు చల్లటిగాలి కావాలనుకుంది. దానివల్ల ఫ్యాను వెలుగులోకి వచ్చింది. అదీ చాలని మేధస్సు ఎ.సి.ని కనిపెట్టింది. ఎ.సి. ఉన్నా మండువేసవికాలంలో కరెంటుకోత పెడితే తట్టుకోలేని మేధస్సు జనరేటరును కనిపెట్టింది. అలా ఒకదాని తర్వాత ఒకటిగా కొత్త వస్తువులు వస్తూనే ఉన్నాయి. ఎందుకు? కోరికవల్ల. కోరికే అన్నిటికీ మూలం, ఆఖరికి పిల్లలు కావాలనుకునే కోరిక కూడా. అందువల్ల కోరికలలో పరమాత్మ కందర్పుడు.

**సర్పాణామస్మి వాసుకిః –** పాములలో, అది కూడా విషసర్పాలలో వాసుకిని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. పరమేశ్వరుడు వాసుకి సర్పాన్ని మెడలో వేసుకుంటాడు. వాసుకి పాము అహంకారానికి ప్రతీక. అన్నింటినీ మించిన గొప్ప విషం అహంకారం. ఎందుకంటే అహంకారంవల్ల నేను కర్తా, భోక్తా అనుకుంటాడు మనిషి. అది కర్మలకు, తద్వారా కర్మఫలాలకు దారితీస్తుంది. కర్మఫలాలను అనుభవించటానికి పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాడు మనిషి. దీన్ని సంసారం అంటారు.

అటువంటి విషపూరితమైన పామును మెడలో ఆభరణంగా ధరిస్తాడు పరమేశ్వరుడు. ఎందుకంటే దానిని ఎలా చూడాలో పరమేశ్వరునికి తెలుసు. అలాగే అహంకారాన్ని ఎలా అదుపులో పెట్టాలో తెలుసుకోగలిగితే, అది భూషణం అవుతుంది. అది తెలుసుకోవాలంటే ఆత్మజ్ఞానం పొందాలి. అందువల్ల ఆత్మజ్ఞానం పొందిన జ్ఞానికి అహంకారం భూషణం అవుతుంది. పరమేశ్వరునికి వాసుకి భూషణం అయితే, జ్ఞానికి అహంకారం భూషణం అవుతుంది. అందువల్ల పాములలో పరమాత్మ వాసుకి.

శ్లో. 29 **అనంతశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్ ।**
**పితౄణామర్యమా చాస్మి యమః సంయమతామహమ్ ॥**
అనంతః, చ, అస్మి, నాగానామ్, వరుణః, యాదసామ్, అహమ్,
పితౄణామ్, అర్యమా, చ, అస్మి, యమః, సంయమతామ్, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| నాగానామ్ | = నాగజాతి వారిలో | చ | = ఇంకా |
| అనంతః, అహమ్ | = ఆదిశేషుడను నేను | పితౄణామ్ | = పితరులలో |
| చ | = ఇంకా | అర్యమా | = అర్యముడను |
| యాదసామ్ | = జలచరములకు అధిపతియైన | సంయమతామ్ | = శాసించువారిలో |
| వరుణః | = వరుణుడను | (అహమ్) | = నేను |
| అహమ్, అస్మి | = నేను | యమః, అస్మి | = యముడను |

**నాగానామ్ అనన్తః, యాదసామ్ వరుణః చ అహమ్ అస్మి,**
**పితౄణామ్ అర్యమా చ, సంయమతామ్ యమః (చ) అహమ్ అస్మి ।**

తా: నాగజాతి వారిలో ఆదిశేషుడను నేను ఇంకా జలచరములకు అధిపతియైన వరుణుడను నేను ఇంకా పితరులలో అర్యముడను, శాసించువారిలో నేను యముడను.

**అనంతశ్చాస్మి నాగానాం** – నాగజాతికి చెందిన పాములలో ఆదిశేషువును నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. నాగ అన్నా పామే, సర్ప అన్నా పామే. రెండింటికీ మధ్య ఉన్న భేదమేమిటి? భాష్యకారులు వీటి మధ్య సూక్ష్మభేదాన్ని వివరిస్తున్నారు. సర్పాలు విషపూరితమైన పాములు అయితే, నాగులు విషం లేని పాములు.

వాసుకి శివుని మెడలో భూషణం అయితే, ఆదిశేషువు విష్ణుమూర్తికి శయ్య. అందువలన విష్ణుమూర్తిని అనంతశయనుడు అంటారు. అది చక్కగా మెత్తగానూ, చల్లగానూ కూడా ఉంటుంది. పాములను ముట్టుకుంటే మెత్తగా, చల్లగా ఉంటాయి.

అదే వేదాంతపరంగా చూస్తే అనంతం అంటే నిర్గుణబ్రహ్మ. అంటే సగుణ ఈశ్వరుడైన విష్ణుమూర్తి తన నిర్గుణస్వరూపమైన అనంతంలో నెలకొనివున్నాడు. ఆదిశేషుడు అన్నా కూడా నిర్గుణబ్రహ్మ అని అర్థం. శేషః అంటే అంతా నాశనమయ్యాక, ఏమి మిగులుతుందో అది శేషము. ఆహారవిషయంలో తినగా మిగిలినదాన్ని శేషము అంటారు. అలా ప్రళయంలో అంతా నాశనమయ్యాక ఏది మిగులుతుందో అది శేషము. అలా మిగిలేది నిర్గుణబ్రహ్మ. అందువల్ల శేషశాయి అయిన భగవంతుడు తన స్వరూపమైన శేషముగా అంటే నిర్గుణబ్రహ్మగా మిగులుతాడు. అందువల్ల నాగులలో పరమాత్మ ఆదిశేషువు.

**అహం వరుణః యాదసామ్** – జలదేవతలలో నేను వరుణుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. జలం అనేక రూపాలలో ఉంటుంది. నదులు, కొలనులు, సముద్రాలు, సరస్సులు, మేఘాలు, కన్నీరు. వీటన్నిటికీ దేవతలు ఉన్నారు. ఆ దేవతలందిరిలో నేను వరుణదేవతను అంటున్నాడు.

సూర్యదేవతను ఉదయం ప్రార్థిస్తే, వరుణదేవతను సాయంసంధ్యల్లో ప్రార్థిస్తాము. అందువల్ల వరుణదేవత మామూలు దేవత కాదు. వరుణదేవతను ఈశ్వరునికి ప్రతీకగా కొలుస్తాము. ఈ వరుణదేవత ప్రార్థన చాలా అద్భుతమైన ప్రార్థన. ఇందులో శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, బుద్ధిబలం, ఐశ్వర్యం కోరటమే కాక, మోక్షం కూడా కోరతాము.

**పశ్యేమ శరదశ్శతం జీవేమ శరదశ్శతం నందామ శరదశ్శతం**
**మోదామ శరదశ్శతం భవామ శరదశ్శతం శృణువామ శరదశ్శతం**
**ప్రబ్రవామ శరదశ్శతమజీతాస్యామ శరదశ్శతం జ్యోక్చ సూర్యం దృషే**

మనం జీవితంలో ఏమేమి కోరుకుంటామో అవన్నీ వస్తాయి. వరుణదేవునిమీద ప్రత్యేకమైన ప్రార్థన కూడా ఉంది. దాన్ని వరుణసూక్తము అంటాము. అందువల్ల జలాలలో పరమాత్మ వరుణుడు.

**పితౄణామర్యమా చాస్మి** – పితృదేవతలలో నేను అర్యముడను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఊర్ధ్వలోకాలలో ఒక లోకం పితృలోకం. ఆ పితృలోకానికి అధిపతి అర్యముడు. అర్యముడు, వరుణుడు, ఇంద్రుడు – వీరంతా వైదికదేవతలు.

మనం చేసే శ్రాద్ధకర్మలు, వదిలే తర్పణాలు సరాసరి అర్యమునికి వెళతాయి. మనం ఏదైనా ఉత్తరం రాస్తే, అది ముందుగా పోస్టాఫీస్‌కి వెళ్ళి అక్కడ్నుంచి అవసరమైన చోటికి వెళ్ళినట్టుగా, మనం మన పితృదేవతలకు పెట్టే శ్రాద్ధకర్మలు, వదిలే తర్పణాలు ముందుగా అర్యమునికి వెళతాయి. ఆయన 14 లోకాల్లో మన పితృదేవతలు ఏ లోకంలో, ఏ రూపంలో ఉంటే, ఆ లోకానికి, ఆ రూపానికి తగ్గ ఆహారాన్ని పంపుతాడు. ఈయన కూడా వైదికదేవత. అందువల్ల పితృదేవతలలో పరమాత్మ అర్యముడు.

**యమః సంయమతామహమ్** – శాసించేవారిలో నేను యమధర్మరాజుని అంటున్నాడు కృష్ణపరమాత్మ. యమధర్మరాజు కాలతత్త్వాన్ని సూచిస్తాడు. ఎందుకంటే కాలమే అన్నింటినీ అదుపులో పెడుతుంది. తరాల రాకపోకలు కూడా కాలమే నిర్ణయిస్తుంది. మనస్సును కూడా కాలం శాసిస్తుంది. ఒకప్పుడు యవ్వనమదంతో విర్రవీగిన మనం, ఎవరికీ తలవంచకుండా, వెన్ను విరుచుకుని తిరిగిన మనం, కాలంయొక్క విషపుకోరల్లో చిక్కుకుని, వినయవిధేయతలతో ఉండాల్సి వస్తుంది.

**మా కురు ధనజనయవ్వనగర్వమ్ హరతి నిమేషాత్కాలంః సర్వమ్** – భజగోవిందం

కాలం నిముషంలో మన గర్వాన్ని అణచగలదు. అందువల్ల, శాసించేవారిలో పరమాత్మ యమధర్మరాజు.

శ్లో. 30 **ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్ ।**
**మృగాణాం చ మృగేంద్రో౽హం వైనతేయశ్చ పక్షిణామ్ ॥**
ప్రహ్లాదః, చ, అస్మి, దైత్యానామ్, కాలః కలయతామ్, అహమ్,
మృగాణామ్, చ, మృగేంద్రః, అహమ్, వైనతేయః, చ, పక్షిణామ్ ॥

| | | | |
|---|---|---|---|
| దైత్యానామ్ | = రాక్షసులలో | మృగాణామ్ | = మృగములలో |
| అహమ్, ప్రహ్లాదః | = నేను ప్రహ్లాదుడను | మృగేంద్రః | = మృగరాజైన సింహమును నేను |
| చ | = ఇంకా | చ | = ఇంకా |
| కలయతామ్ | = గణకులలో | పక్షిణామ్ | = పక్షులలో |
| కాలః అస్మి | = నేను సమయమును | అహమ్ | = నేను |
| చ | = ఇంకా | వైనతేయః (అస్మి) | = గరుత్మంతుడను |

**దైత్యానామ్ ప్రహ్లాదః, కలయతామ్ కాలః చ అహమ్ అస్మి,**
**మృగాణామ్ మృగేన్ద్రః చ, పక్షిణామ్ వైనతేయః చ అహమ్ (అస్మి) ।**

తా: రాక్షసులలో నేను ప్రహ్లాదుడను ఇంకా గణకులలో నేను సమయమును ఇంకా మృగములలో మృగరాజైన సింహమును నేను ఇంకా పక్షులలో నేను గరుత్మంతుడను.

**ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం** – రాక్షసులలో నేను ప్రహ్లాదుడిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. కశ్యప ప్రజాపతియొక్క భార్య దితి. పురాణాల్లో ప్రజాపతుల గురించి చూస్తాము. బ్రహ్మదేవుడు సృష్టి చేసినప్పుడు, ముందుగా ఆయన పద్నాలుగు ప్రజాపతులను సృష్టించాడు. ఈ ప్రజాపతులనుంచి మొత్తం మానవజాతి వచ్చింది. అందువల్ల ప్రజాపతులు ముఖ్యమైనవారు; వారందరిలోనూ కశ్యపుడు శ్రేష్ఠుడు.

కశ్యపునికి ఇద్దరు భార్యలు – దితి, అదితి. అదితి పుత్రులను దేవతలనీ, దితి పుత్రులను అసురులనీ అంటారు. అంటే దేవతలకు, అసురులకు తల్లులు వేరు కాని, తండ్రి ఒక్కరే.

మన మనస్సు కూడా దేవతలకూ, అసురులకూ పుట్టినిల్లు. దేవతలు సానుకూల, ఆరోగ్యకరమైన ఆలోచనలను సూచిస్తే, అసురులు ప్రతికూల, అనారోగ్యకరమైన ఆలోచనలను సూచిస్తారు. ఇంకో విధంగా చెప్పాలంటే, మనకు దైవీసంపత్తి ఉంది, ఆసురీసంపత్తి ఉంది; సత్త్వగుణం ఉంది, రజోగుణం ఉంది. ఈ దైవీసంపత్తి, ఆసురీసంపత్తుల గురించి 16వ అధ్యాయంలో చూస్తాము.

అసురులకు ఆసురీసంపత్తి ఉంటుందని ఇప్పుడే అన్నాము కాని, వారిలో కూడా అప్పుడప్పుడూ మంచివారు ఉంటారు అనటానికి ప్రహ్లాదుడు ఒక ఉదాహరణ. ప్రహ్లాదుడు హరిద్వేషి అయిన హిరణ్యకశిపుని పుత్రుడు; రాక్షసవంశంలో పుట్టాడు. అలా రాక్షసవంశంలో పుట్టి, హరిద్వేషికి పుట్టినా కూడా ప్రహ్లాదుడు హరికి గొప్ప భక్తుడయ్యాడు. మనం పొద్దున్న లేవగానే గొప్ప భక్తులందరినీ తలచుకోవాలి. అందులో మొట్టమొదట నిలిచేది ప్రహ్లాదుడు.

**ప్రహ్లాద నారద పరాశర పుండరీక**
**వ్యాసాంబరీష శుక శౌనక భీష్మ దాల్భ్యాన్ ।**
**రుక్మాంగదార్జున వసిష్ఠ విభీషణాదీన్**
**పుణ్యానిమాన్ పరమ భాగవతాన్ స్మరామి ॥**

పొద్దున్నే వార్తాపత్రిక చదివి మనస్సును పాడు చేసుకునే ముందు ఇలాంటి భక్తులను తలచుకోవాలి. అందులో మొట్టమొదటి పేరు ప్రహ్లాదునిది అంటే ఎంత గొప్ప భక్తుడో చూడండి. పుట్టింది అసురవంశంలో అయినా, సత్త్వగుణాన్ని పెంపొందించుకున్నాడు.

దీన్నించి ఇంకొక గొప్ప సూత్రం నేర్చుకుంటాము మనం. జాతిపరంగా ఎవరినీ కించపరచకూడదు. జాతిపరంగా ఎవరూ గొప్పవారూ అవరు, తక్కువా అవరు. బ్రాహ్మణజాతిలో పుట్టినవారు గుణపరంగా బ్రాహ్మణులు కాకపోవచ్చు. ప్రహ్లాదుడు జాతిపరంగా అసురుడు కాని గొప్ప భక్తుడు; రావణాసురుడు జాతిపరంగా బ్రాహ్మణుడు. కాని రావణాసురుడు పూజ్యనీయుడు కాదు; ప్రహ్లాదుడే పూజ్యనీయుడు. అంటే జాతిని చూసి కాదు, గుణాన్ని చూసి గౌరవించాలి.

భాగవతంలో అనేక స్తుతులు లేదా స్తోత్రాలు ఉన్నాయి. ప్రహ్లాదస్తుతి, కుంతీస్తుతి, భీష్మస్తుతి లాంటివి. వీటిలో ఎంతో గొప్ప వేదాంతసారం ఉంది. నాలుగవ అధ్యాయంలో వర్ణాశ్రమధర్మాలు చూసినప్పుడు

జాతిబ్రాహ్మణుడు, కర్మబ్రాహ్మణుడు, గుణబ్రాహ్మణుల గురించి చూశాము. వీరిలో గుణబ్రాహ్మణుణ్ణి కీర్తించాలి అని కూడా చూశాము. ప్రహ్లాదుడు అలా గుణబ్రాహ్మణుడు అయ్యాడు. అందువల్ల రాక్షసులలో పరమాత్మ ప్రహ్లాదుడు.

**కాలః కలయతామహమ్** – గణించేవారిలో నేను చిత్రగుప్తుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మన పుణ్యపాప కర్మలన్నింటినీ రాసిపెట్టాలి చిత్రగుప్తుడు. పొద్దున్న మనం లేస్తూనే దోమను చంపిన దాన్నించీ, మనం చేసే అనేకానేక కర్మలను రాయాలి. కర్మ అంటే మనం కావాలని, ప్రయత్నపూర్వకంగా చేసే పని. ఈ కర్మలు ఈ జన్మలో చేసినవే కాదు, అనేక జన్మలలో చేసినవి కూడా వస్తాయి. మనం చేసే కర్మలను మూడు తెగల కింద విభజిస్తారు. అవి సంచితకర్మలు, ప్రారబ్ధకర్మలు, ఆగామికర్మలు. ఇవన్నీ చూడాలి. ఇదంతా ఒక్క వ్యక్తి గురించి.

అలా మొత్తం జగత్తులోని మానవజాతిని మొత్తం తీసుకుంటే ఆరువందల కోట్ల పైనే ఉంటారు. ఒక్క మన దేశంలోనే వందకోట్ల జనాభా ఉన్నారు. మళ్ళీ ఇదంతా కేవలం మనుష్యుల జనాభా గురించి. అదికాక అనేక లక్షల జీవరాశులు ఉన్నాయి. చిన్న చీమ, దోమ, బొద్దింకల దగ్గర్నుంచి పెద్ద జీవిదాకా అనేకం ఉంటాయి. ప్రతిజీవికీ సంచితకర్మ, ప్రారబ్ధకర్మలు ఉంటాయి. ఏ జీవి చేసిన కర్మ అయినా, అది అత్యంత చిన్నది అవనీ, అత్యంత పెద్దది అవనీ, దానికి తగ్గ ఫలం సరియైన సమయంలో ఇవ్వాలి. ఒక్క నిముషం ముందు ఇవ్వకూడదు, ఒక్క నిముషం ఆలశ్యంగా ఇవ్వకూడదు. ఇన్ని ఒక్కసారిగా పొందుపరచాలంటే ఎంత గొప్ప కంప్యూటర్‌లాంటి మేధస్సు ఉండాలో ఒక్కసారి ఆలోచించండి.

ఆ కర్మలను పొందుపరచటమే కాకుండా, వాటికి తగ్గ ఫలాన్ని తగిన సమయంలో ఇవ్వాలని చూశాము. అలా చెయ్యాలంటే కర్మసిద్ధాంతాన్ని పాటించాలి. అటువంటి కాలతత్వాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అంతేకాదు, ఒక కుటుంబమో, ఒక సంస్థనో లేక ఇలాంటి గీతాబోధనో ఉన్న ఒక సమూహం ఉందనుకోండి. అనేకమంది మనుష్యుల కర్మలకు ఒకేసారి ఫలాలను ఇవ్వాలి. అంటే గీతాబోధ విషయం తీసుకుంటే ఒకేసారి ఆ బోధకు వెళ్ళినవారికి కర్మఫలం వస్తుంది. తమాషా ఏమిటంటే అందరికీ ఒకే కర్మఫలం రాదు. కొంతమందికి పుణ్యఫలం వస్తే కొంతమందికి పాపఫలం వస్తుంది. గీతను విమర్శించిన వారికి పాపఫలం వస్తుంది.

అలాగే ఒక కుటుంబాన్ని తీసుకున్నా కూడా, ఆ కుటుంబంలో ఉన్నవారందరి కర్మలూ ఒకేసారి క్షయమవాలి. ఉదాహరణకు ఆ కుటుంబంలో ఒక వ్యక్తికి అనారోగ్యం కలిగి, మంచాన పడ్డాడనుకోండి. అతనికి అతని పాపఫలం కలుగుతున్నది. కాని అతను ఎక్కడో కొంత పుణ్యం కూడా చేసుకున్నాడన్నమాట. ఎందుకంటే అతను మంచాన పడ్డా కూడా, అతనికి సేవచేసి, బాగా చూసుకునే కుటుంబసభ్యులు దొరికారు. ఆ సేవ చేస్తున్న వ్యక్తికి అలా నిద్రలేని రాత్రులు గడిపి, సేవ చెయ్యాల్సి రావటం అతని పాపఫలం. అంటే ఒకేచర్య ఒకళ్ళకు పాపఫలాన్నిస్తే, ఇంకొకళ్ళకు పుణ్యఫలాన్ని ఇస్తున్నది. అలా ఇచ్చేలాగా వీరిద్దరినీ ఒకచోట చేర్చాలంటే భగవంతుడు ఎంత మాస్టర్‌ప్లాన్ వెయ్యాలో చూడండి.

ఎప్పుడెవరికి ఏ ఫలాన్ని ఇవ్వాలో అది యమధర్మరాజు చేస్తాడు. అందువల్ల ఆయనను ధర్మరాజు అంటారు. ఆయన కాలతత్త్వానికి ప్రతీక. ఆయన అలా చెయ్యటానికి తోడ్పడేది గణకుడైన చిత్రగుప్తుడు. గుప్తం అంటే రహస్యం. ఆయన మనమీద రాసింది రహస్యంగా ఉంచుతాడు కాబట్టి చిత్రగుప్తుడు అయ్యాడు.

వైశ్యులకు గుప్త పేరు ఉంటుంది ఎక్కువగా. ఎందుకంటే వ్యాపారం చేసేవారు, ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలి. క్షత్రియులకు వర్మ పేరు ఉంటుంది. వర్మ అంటే కవచం. వారు సమాజాన్ని అధర్మంనుంచి రక్షిస్తారు. బ్రాహ్మణులకు శర్మ పేరు ఉంటుంది. శర్మ అంటే శాంతి, ప్రశాంతత. బ్రాహ్మణులు సత్త్వగుణప్రధానంగా ఉంటారు.

ఆ విధంగా చిత్రగుప్తుడు మన కర్మలను గోప్యంగా ఉంచుతాడు. కాని మనం ఆయనను కూడా వదలము. ఒక ప్రత్యేకమైన రోజు చిత్రగుప్తునికి ప్రత్యేకంగా ఒక పూజ చేస్తాము. ఎందుకు? మన కర్మలు కొన్నింటిని క్షమించి వెయ్యాలనే ఆశతో ఆయనకు ఆశ చూపిస్తాము. గణకులలో పరమాత్మ చిత్రగుప్తుడు.

**మృగాణాం చ మృగేంద్రోఽహం** – జంతువులలో నేను మృగరాజుని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ప్రతి జంతువూ అందమైనదే. దేని ప్రత్యేకత దానికుంది. కాని వాటిల్లో మృగరాజుని అంటున్నాడు. మృగరాజు అంటే సింహం. సింహాన్ని జంతువులకు రాజు అంటారు. జంతువులలో పరమాత్మ మృగరాజు.

**వైనతేయశ్చ పక్షిణామ్** – పక్షులలో నేను గరుత్మంతుడను అంటున్నాడు కృష్ణపరమాత్మ. పక్షః అంటే రెక్క. పక్షి అంటే రెక్క ఉన్నది. రెండు రెక్కలు ఉంటాయి పక్షికి.

**పక్షే యస్య స్తః ఇతి పక్షిః**

పక్షులలో వైనతేయుణ్ణి అంటున్నాడు. వైనతేయుడు అంటే గరుత్మంతుడు. వినతపుత్రుడు కాబట్టి వైనతేయుడు అయ్యాడు. గరుడుడు విష్ణుమూర్తి వాహనం. విష్ణుమూర్తిని గరుడవాహనుడు, పక్షివాహనుడు అంటారు. అందువల్ల వైష్ణవసాంప్రదాయంలో గరుత్మంతుణ్ణి గరుడ ఆళ్వార్ అంటారు. ఆళ్వార్ అంటే గొప్ప భక్తుడు. అంటే భక్తిలో మునిగిన వ్యక్తి అని అర్థం. అందువల్ల పక్షులలో పరమాత్మ గరుత్మంతుడు.

శ్లో. 31 **పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్ ।**
**ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ ॥**
పవనః, పవతామ్, అస్మి, రామః, శస్త్రభృతామ్, అహమ్,
ఝషాణామ్, మకరః, చ, అస్మి, స్రోతసామ్, అస్మి, జాహ్నవీ ॥

| | | | |
|---|---|---|---|
| పవతామ్ | = పవిత్రమొనర్చువానిలో | మకరః, అస్మి | = మొసలిని నేను |
| పవనః, అహమ్ | = వాయువును నేను | చ | = ఇంకా |
| శస్త్రభృతామ్ | = శస్త్రధారులలో | స్రోతసామ్ | = నదులలో |
| రామః, అస్మి | = శ్రీరాముడను నేను | జాహ్నవీ, అస్మి | = గంగానదిని నేను |
| ఝషాణామ్ | = జలచరములలో | | |

**పవతామ్ పవనః అస్మి, శస్త్ర-భృతామ్ చ రామః అహమ్ (అస్మి),**
**ఝషాణామ్ మకరః అస్మి, స్రోతసామ్ జాహ్నవీ చ (అహం) అస్మి ।**

తా: పవిత్రమొనర్చువానిలో వాయువును నేను, శస్త్రధారులలో, శ్రీరాముడను నేను, జలచరములలో మొసలిని నేను ఇంకా నదులలో గంగానదిని నేను.

**పవనః పవతామస్మి** – శుద్ధి చేసేవాటిలో నేను వాయువును అంటున్నాడు కృష్ణపరమాత్మ. అలా శుద్ధి చేసేవాటిలోకి నీరు, అగ్ని, వాయువులు వస్తాయి. శుద్ధమైన నీటికి శుద్ధిచేసే లక్షణం ఉంది. అగ్నికి శుద్ధి చేసే లక్షణం ఉంది. అందువల్ల ఆపరేషన్ చేసేముందు, సర్జను వాడే పరికరాలను వేడి చేస్తారు. అలాగే ఒక గదిలో దుర్గంధం వస్తుంటే, ఆ గది కిటికీ తలుపులు తీస్తే, తాజా గాలి లోపలికి వచ్చి, ఈ దుర్గంధాన్ని పారద్రోలుతుంది. ఆ విధంగా వాయువు శుద్ధి చేస్తుంది.

**పవతే ఇతి పావనః** – కదిలేది వాయువు
**పునాతి ఇతి పావనః** – పునీతులను చేసేది వాయువు

వాయుపుత్రుడు కాబట్టి ఆంజనేయస్వామిని పవనసుతుడని, వాయుకుమారుడనీ స్తుతిస్తారు.

మన సాంప్రదాయంలో పంచభూతాలన్నిటినీ పూజిస్తాము. వాయువును కూడా పూజిస్తాము.

**నమో బ్రహ్మణే, నమస్తే వాయో త్వమేవ**
**ప్రత్యక్షం బ్రహ్మాసి త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి** – తైత్తిరీయం

అందువల్ల శుద్ధి చేసేవాటిలో పరమాత్మ వాయువు.

**రామః శస్త్రభృతామహమ్** – ఆయుధాలను ధరించిన దేవుళ్ళలో నేను శ్రీరాముణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. మన దేవుళ్ళందరికీ ఆయుధాలు ఉన్నాయి. పరమేశ్వరుని చేతిలో పినాకమనే విల్లు ఉండటంవల్ల ఆయనను పినాకపాణి అంటారు. రామచంద్రుని చేతిలో కోదండం అనే విల్లు ఉండటంవల్ల ఆయనను కోదండపాణి అంటారు. విష్ణుమూర్తిని శారంగపాణి అంటారు.

మన ధర్మాన్ని కొందరు ఈ కారణంగా విమర్శిస్తారు. వారి చేతుల్లో ఆయుధాలు ఉన్నాయి అంటే మీ దేవుళ్ళకు నిజంగా దయలేదు. వారికి మీమీద ప్రేమ లేదు అని మనను హడలగొట్టిస్తారు. వారి ప్రభావంలో పడి నిజంగా హడలిపోయేవారు ఉన్నారు. కాని అది అర్థం లేని భయం. ధర్మరక్షకునికి చేతిలో ఆయుధం ఉండి తీరాలి. ధర్మసంస్థాపనకోసం నేను మళ్ళీమళ్ళీ అవతారం ఎత్తుతాను అని కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు.

ధర్మరక్షణకు సామదానభేదదండోపాయాలు వాడాలి. మొదటి మూడూ అహింసా పద్ధతిలో సమస్యను పరిష్కరించటానికి తోడ్పడతాయి. అయినా వినకపోతే దండం తప్పదు. ధర్మరక్షణకోసం దండించటం తప్పు కాదు. అది తప్పుకాదు సరిగదా, అది సరియైన మార్గం కూడా. ఇంకా చెప్పాలంటే అది సరియైన మార్గమే కాదు, అది ఒక్కటే సరియైన మార్గం కూడా.

రామాయణంలో కూడా శ్రీరామచంద్రుడు రావణాసురునికి చివరిగా ఇంకొక అవకాశం ఇచ్చాడు. యుద్ధభూమిలో ఇవాళ వెళ్ళి, రేపు రా అన్నాడు. అలాగే మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధానికి ముందు, కృష్ణపరమాత్మే స్వయంగా సంధి కుదర్చటానికి వెళ్ళాడు. కాని సంధికి దిగిరాలేదు దుర్యోధనుడు.

**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే** – 2.31

క్షత్రియునికి ధర్మయుద్ధం చెయ్యటం అతని ధర్మం. ధర్మయుద్ధం పుణ్యాన్ని కలుగజేస్తుంది, స్వర్గలోకానికి వెళతాడు. అంతేకాని పాపం కలుగదు, నరకానికి వెళ్ళడు. అందువల్ల మన దేవుళ్ళు ఆయుధాలను ధరిస్తారు. శరీరంలో ఒక భాగం దెబ్బతింటే, డాక్టరు ముందు మందులతో తగ్గించటానికి ప్రయత్నిస్తాడు. అప్పటికీ తగ్గకపోతే, ఆ భాగాన్ని తీసివేస్తాడు. అలా తీయటంవల్ల తక్కిన శరీరం దెబ్బ తినకుండా బాగుంటుంది. అలాగే సమాజం దెబ్బతినకుండా ఉండాలంటే, అసురులు అనే ఒక భాగాన్ని తీసివేయాలి. అందువల్ల దేవుళ్ళు ఆయుధాలను ధరించటంలో తప్పులేదు.

దుష్టశిక్షణకోసం ఆయుధాలు ధరించటంలో తప్పులేదు కాని అవి శిష్టరక్షణకు ఎలా తోడ్పడతాయి? భక్తుల విషయంలో వారిలో ఉన్న అరిషడ్వర్గాలను సంహరిస్తాడు భగవంతుడు. అరిషడ్వర్గాలు అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. వీటన్నిటినీ నాశనం చేస్తాడు.

భగవంతుని చేతిలో ఉన్న చక్రాన్ని సుదర్శన చక్రం అంటారు. దర్శనం అంటే జ్ఞానం; సుదర్శనం అంటే సరియైన జ్ఞానం. సరియైన జ్ఞానం అంటే బ్రహ్మజ్ఞానం. ఈ బ్రహ్మజ్ఞానం అనే ఆయుధంతో అజ్ఞానమనే అంధకారాన్ని నాశనం చేస్తాడు. ఆ విధంగా భగవంతుడు బాహ్యంగా ఉన్న శత్రువులనూ, అంతర్గతంగా ఉన్న శత్రువులనూ కూడా నాశనం చేస్తాడు. అందువల్ల శస్త్రధారులలో పరమాత్మ శ్రీరామచంద్రుడు.

**ఝషాణాం మకరశ్చాస్మి** – జలచరాలలో నేను మకరాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి నేలమీద ఉన్న జీవరాశులకన్నా, నీటిలో ఉన్న జీవరాశులు చాలా ఎక్కువ. ఎందుకంటే మూడువంతుల జగత్తులో భూభాగం ఒక వంతు ఉంటే, రెండువంతులు నీరు ఉంది. అందువల్ల అందులో అనేక ప్రాణులు ఉన్నాయి. వాటిని ఝషః అన్నాడు. వాటిలో నేను మకరాన్ని అన్నాడు. మకరం అంటే కొంతమంది తిమింగలం అంటారు, కొంతమంది మొసలి అంటారు. ఏదేమైనా అన్నిటిలోకి అది పెద్దప్రాణి. అందువల్ల ఝషాలలో పరమాత్మ మకరం.

**స్రోతసామస్మి జాహ్నవీ** – నదులలో నేను గంగానదిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. స్రోతసామ్ అంటే ప్రవహించేది; అంటే నదులుగా తీసుకోవచ్చు. జాహ్నవి అంటే గంగాదేవి. గంగావతరణం కథలో చూశాము. జహ్నుమహర్షి గంగాదేవిని త్రాగేసి, మళ్ళీ చెవినుంచి వదిలాడని. జహ్నుమహర్షినుంచి వచ్చింది కాబట్టి జాహ్నవి అయింది.

నిజానికి ప్రతి నదీ పవిత్రమైనదే. కాని వాటిల్లో గంగానది ఇంకా పవిత్రమైనది. అఘంగ కాస్తా గంగ అయింది. అఘః అంటే పాపం, గమయతి అంటే తొలగించేది; అందువల్ల గంగానదిలో స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయి అంటారు.

**మలం నిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే**
**సకృత్ గీతాంభసి స్నానం సంసార మలమోచనం**

వేదాంతం ప్రకారం గంగానది బ్రహ్మవిద్యా ప్రవాహానికి ప్రతీక. ఎందుకు గంగను బ్రహ్మవిద్యా ప్రవాహంతో పోలుస్తారు? దానికి అనేక కారణాలు ఉన్నాయి.

1. **మూలం శివుడు** – గంగ స్వర్గలోకంనుంచి వచ్చినా, మనకు భూలోకంలో శివునినుంచి వచ్చింది. బ్రహ్మవిద్య కూడా మనం మన గురువునుంచి నేర్చుకున్నా కూడా, బ్రహ్మవిద్యకు ఆదిగురువు ఎవరు? పరమశివుడు.

**సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమామ్**

2. **క్రిందకు ప్రవాహం** – నది పైనుంచి కిందకు ప్రవహిస్తుంది. అలాగే బ్రహ్మవిద్య కూడా కిందకు ప్రవహిస్తుంది. గురువునుంచి శిష్యునికి ప్రవహిస్తుంది. మన సాంప్రదాయం ప్రకారం, గురువు ఉన్నతాసనంలో కూర్చుంటే శిష్యుడు క్రింద కూర్చుంటాడు. అందువల్ల ముండకోపనిషత్తులో పరావరం అని వస్తుంది. పరావరం అంటే పైనుంచి క్రిందకు ప్రవహించటం.

3. **జీవనది** – గంగానదిని జీవనది అంటారు. తక్కిన నదులు ఎండాకాలంలో ఎండిపోతాయి కాని గంగానదిలో నీరు నిరంతరం ఉంటూనే ఉంటుంది. అదే విధంగా బ్రహ్మవిద్య కూడా జీవనది లాంటిది. అది ఎన్నడూ ఆగిపోదు. నిరంతర ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది. ఆగలేదని ఏమిటి నిదర్శనం? అర్థం లేని ప్రశ్న.

నీ వంశం కొనసాగుతున్నదా లేదా అని అడగటం ఎంత అర్థం లేని ప్రశ్నో, ఇదీ అంతే. నేను ఉన్నాను అంటే నా వంశం ఉన్నట్టే కదా. అలాగే ఇవాళ మనం బ్రహ్మవిద్య నేర్చుకుంటున్నామంటే బ్రహ్మవిద్య ఇంకా కొనసాగుతున్నట్టే.

4. **శక్తిప్రదాత** – గంగానదిలో మునిగి స్నానం చేస్తే తాజాగా ఉన్నట్టు, కొండంత శక్తి వచ్చినట్టు అనిపిస్తుంది. ఆ రెట్టించిన శక్తితో గోముఖంనుంచి గంగోత్రి దాకా నడుస్తారు భక్తులు. అంటే ఇరవై కిలోమీటర్ల పైనే నడుస్తారు. అలా బ్రహ్మవిద్య బోధలో మునిగితే అంత తాజాగానూ, అంత శక్తి వచ్చినట్టూ అనిపిస్తుంది.

5. **పునీతులను చేస్తుంది** – గంగానదిలో స్నానం చేస్తే పాపాలను కడిగేసి, పునీతులను చేస్తుంది. అలాగే గీతలో జ్ఞానమనే స్నానం చేస్తే సంసార మలమోచనం కలుగుతుంది.

6. **ఘాట్‌లో స్నానం** – గంగానది గోముఖ్‌నుంచి కలకత్తావరకూ క్రిందకు ప్రవహించినా కూడా, ఎక్కడ కావాలంటే అక్కడ స్నానం చెయ్యలేము. ఎందుకంటే ఆ గంగా ప్రవాహం ఎంత తీవ్రంగా ఉంటుందంటే, ఎక్కడ రాళ్ళు ఉన్నాయో, ఎక్కడ సుడిగుండాలు ఉన్నాయో, నీరు ఎంత లోతుగా ఉంటుందో మనకు తెలియదు. అలా తెలియని చోట గంగలో మునిగితే, ఆ ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అందువల్ల కొన్నిచోట్ల ప్రత్యేకించి స్నానానికి వీలుగా ఘాట్‌లను ఏర్పరుస్తారు.

అలాగే బ్రహ్మవిద్యా స్నానం కూడా ఎలా పడితే అలా చెయ్యకూడదు. బ్రహ్మవిద్యా గురుఘాట్‌కి వెళ్ళాలి. అంటే బ్రహ్మవిద్యను శాస్త్రప్రకారం బోధించే గురువు దగ్గరకు వెళ్ళాలి. అలా కాకుండా, ఏదైనా ఉపనిషత్తు తీసుకుని స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నిస్తే అది సరిగ్గా అర్థం కాదు. అర్థం కాకపోయినా, ఫర్వాలేదు. పొరపాటుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. అందువల్ల బ్రహ్మవిద్యా స్నానానికి బ్రహ్మవిద్యా గురుఘాట్‌కే వెళ్ళాలి. ఇన్ని రకాలుగా బ్రహ్మవిద్యకూ, గంగానదికీ పోలికలు ఉన్నాయి. అందువల్ల నదులలో పరమాత్మ గంగానది.

శ్లో. 32 **సర్గాణామాదిరంతశ్చ మధ్యం చైవాహమర్జున ।**
**అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్ ॥**
సర్గాణామ్, ఆదిః, అంతః, చ, మధ్యమ్, చ, ఏవ, అహమ్, అర్జున,
అధ్యాత్మవిద్యా, విద్యానామ్, వాదః, ప్రవదతామ్, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | అధ్యాత్మవిద్యా | = బ్రహ్మవిద్యను నేను |
| సర్గాణామ్ | = సృష్టి పరంపరకు | ప్రవదతామ్ | = పరస్పర వాదవివాదములలో |
| ఆదిః, మధ్యమ్, అంతశ్చ | = ఆదిమధ్యాంతములు | వాదః, అహమ్ | = తత్త్వనిర్ణయమునకై చేయు వాదమును నేను |
| అహమ్, ఏవ | = నేనే | | |
| విద్యానామ్ | = విద్యలలో | | |

**హే అర్జున! సర్గాణామ్ ఆదిః మధ్యమ్ చ అన్తః చ ఏవ అహమ్**
**(అస్మి), విద్యానామ్ అధ్యాత్మ-విద్యా, ప్రవదతామ్ వాదః అహమ్ (అస్మి) ।**

తా: ఓ అర్జునా! సృష్టి పరంపరకు ఆదిమధ్యాంతములు నేనే. విద్యలలో బ్రహ్మవిద్యను నేను, పరస్పర వాదవివాదములలో తత్త్వనిర్ణయమునకై చేయు వాదమును నేను.

**సర్గాణామాదిరంతశ్చ మధ్యం చైవాహమ్** – సృష్టిలో సృష్టించబడిన వస్తువులన్నిటిలో నేను ఆదిమధ్యాంతాలను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆదిః అంటే ఆరంభం; అంతః అంటే చివర; మధ్యమ్ అంటే మధ్యలో. అంటే మొదటా, చివరా, మధ్యలో కూడా నేనే ఉన్నాను; ఈ విభూతుల గురించి చెప్పటం మొదలుపెట్టినప్పుడు మొదటి శ్లోకంలోనే ఇంచుమించు ఇదే భావన చెప్పాడు.

**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ** – 10.20

అక్కడ కూడా సకల ప్రాణులలోనూ ఆది, మధ్యస్థితి, అంతము నేను అన్నాడు. అదే భావన ఇక్కడ మళ్ళీ చెపితే అది పునరుక్తి దోషం కాదా అంటే కాదంటున్నారు భాష్యకారులు. ఆదిమధ్యాంతాలు నేనే అన్నప్పుడు ఒకదాన్ని దేశపరంగా తీసుకుంటే, ఇంకొకదాన్ని కాలపరంగా తీసుకోవచ్చు అంటున్నారు. ఆదిమధ్యాంతాలను కాలపరంగా తీసుకుంటే సృష్టిస్థితి లయకారణాలు భగవంతుడే. అవే ఆదిమధ్యాంతాలను దేశపరంగా తీసుకుంటే

పాతాళలోకం భగవంతుడే, అన్నిటికన్నా ఊర్ధ్వలోకం అయిన బ్రహ్మలోకమూ భగవంతుడే, మధ్యలోకం అయిన భూలోకమూ భగవంతుడే. అందువల్ల సృష్టి పరంపరకు పరమాత్మ ఆదిమధ్యాంతాలు.

**అధ్యాత్మవిద్యా విద్యానామ్** – విద్యలలో కెల్ల అధ్యాత్మవిద్యను నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. విద్యలే అనేకం ఉన్నాయి. మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జువాలజీ, ఎకనామిక్స్, కామర్స్ లాంటివి ఎన్నో ఉన్నాయి. కాని అవన్నీ అనాత్మకు చెందినవి. వాటిని అపరావిద్య అంటారు. పరావిద్య అంటే అధ్యాత్మవిద్య లేదా ఆత్మవిద్య. పరావిద్య కూడా చాలా విస్తారంగా ఉంది. వేదాలు, వేదాంగాలు ఉన్నాయి పరావిద్యలో. వేదాలు నాలుగు; వేదాంగాలు ఆరు. అవి – శీక్షా, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం. అపరావిద్య కన్నా పరావిద్య గొప్పది కాబట్టి దానిని భగవద్గీత తొమ్మిదవ అధ్యాయంలో రాజవిద్య అన్నారు. రాజవిద్య అంటే అన్ని రకాల విద్యలలో ఆత్మవిద్య రాజులాంటిది. ఎందుకు అధ్యాత్మవిద్యను రాజవిద్య అంటారు? దానికి అనేక కారణాలున్నాయి.

1. **ఆత్మ నిత్యం** – ఆత్మ ఒక్కటే సత్యం; అనాత్మ మిథ్య. తక్కిన విద్యలన్నీ మిథ్యావస్తువుల గురించి మాట్లాడితే, ఒక్క ఆత్మవిద్య మాత్రమే సత్యవస్తువు గురించి బోధిస్తుంది. ఉపనిషత్తులే అపరావిద్యను అవిద్య అంటాయి. లౌకికవిద్యలు ఎన్ని నేర్చుకున్నా కూడా అవి అజ్ఞానంతో సమానం. అందువల్ల అధ్యాత్మవిద్య గొప్పది.

2. **శాశ్వతఫలం** – ఒక్క ఆత్మవిద్యే మనిషిని పరిచ్ఛిన్న భావననుంచి విముక్తుణ్ణి చేస్తుంది. ఈ పరిచ్ఛిన్న భావన అనేక స్థాయిల్లో ఉంటుంది మనిషికి.

ఎ) **శరీరపరంగా** – మనిషి శరీరపరంగా తాను అల్పుణ్ణి అనుకోవటంవల్ల ఇంకా ఇంకా పొందాలనే కోరిక పెరుగుతూ వస్తుంది.

బి) **మనస్సు పరంగా** – మనస్సు పరంగా మనిషిని ఒంటరితనం పట్టి పీడిస్తుంది. నన్ను ఎవరూ ప్రేమించటం లేదు, నా పిల్లలకే నేనంటే లెక్కలేదు. నా ఆరోగ్యం ఎలా ఉందో ఎవరూ పట్టించుకోరు, ఆ మాటకొస్తే అసలు నేను జీవించి ఉన్నానో లేదో కూడా ఎవరికీ అక్కరలేదు అని వాపోతాడు మనిషి.

సి) **బుద్ధి పరంగా** – ఎంత జ్ఞానం పొందినా, తను పొందని జ్ఞానం ఇంకా ఎంతో ఉందని తెలుస్తుంది. లౌకికవిద్యలో ఏది తీసుకున్నా, తనకు తెలిసింది చాలా తక్కువనీ, తెలుసుకోవలసింది ఎంతో ఉందనే విషయం అంతకంతకూ తెలుస్తుంది మనిషికి.

ఫిజిక్స్‌లో ఎన్నో కొత్త విషయాలు కనుగొని, ఎన్నో సూత్రాలను ఇచ్చిన న్యూటన్ అంటాడు 'ఎంతో మంది మేధావులు సముద్రగర్భంలో రత్నాలను ఏరుతుంటే, నేను సముద్రపుటొడ్డున గులకరాళ్ళను ఏరుతున్నాను.' అందువల్ల లౌకికవిద్యలో ఎంత తెలిసినా, దీనితో ఇది ముగిసింది అనటానికి లేదు.

కాని ఆత్మవిద్యలో అలా కాదు. ఈ పరిచ్ఛిన్న భావన పోగొట్టి, పరిపూర్ణ భావాన్ని కలుగజేస్తుంది. పూర్ణమదః పూర్ణమిదం అని నేర్పిస్తుంది. అంటే భగవంతుడు పూర్ణం, నేను పూర్ణం అంటుంది.

3. **అరుదైన జ్ఞానం** – ఇది చాలా అరుదైన జ్ఞానం. ఈ ఆత్మజ్ఞానం పొందటానికి చాలామంది రానే రారు.

వచ్చినా చాలామందికి అర్థం కాదు. ఈ విషయాన్ని రెండవ అధ్యాయంలో చూశాము.

**ఆశ్చర్య వచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్** – 2.29

అందువల్ల విద్యలలో పరమాత్మ ఆత్మవిద్య.

**వాదః ప్రవదతామహమ్** – పరస్పర వాదవివాదాలలో నేను వాదాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. మన సాంప్రదాయంలో అనేక రకాల వాదప్రతివాదాలు ఉన్నాయి. అవి వాదం, జల్పం, వితండం, జాతి, చలం. వాదం లేదా సంవాదం గురుశిష్యుల మధ్య జరుగుతుంది. రెండింటి ఉద్దేశం ఒకటే. సత్యం తెలుసుకోవటం. కాని తక్కిన వాదోపవాదాలు అలా కాదు. వాటిలో ఎవరికి వారు, తామే గెలవాలనే పట్టుతో ఉంటారు.

ఎవరికి వారు గెలవాలనుకోవటంవల్ల, ఎవరూ ఎదుటి వ్యక్తి వాదనను పట్టించుకోరు. ఒకరు మాట్లాడుతుంటే రెండవవారు ఆ వాదనను వినే ప్రయత్నం చెయ్యకుండా, వారి వాదనను సిద్ధం చేసుకుంటూ ఉంటారు. రోజూ ఇంట్లో జరిగే తతంగం కూడా అంతే. ఎదుటివారు ఏదైనా చెబుతుంటే మనం వినం, వారూ అలాగే మనం చెబుతున్నది వినరు. మొదట ఏదో విషయం తెలుసుకోవటానికే ఈ వాదన మొదలైనా కూడా, కొంతదూరం సాగేసరికి వాతావరణం వేడెక్కిపోతుంది. అందువల్లనే హీటెడ్ ఆర్గ్యుమెంట్స్ అంటారు ఇంగ్లీషులో. లైటెడ్ ఆర్గ్యుమెంట్స్ అనరు ఎన్నడూ. అంటే కొత్తగా ఎవరికీ జ్ఞానం కలగదు, ఆవేశాల వేడి మాత్రమే పుడుతుంది.

కాని వాదం అలా కాదు. వేడి పుట్టించదు. సత్యం తెలుసుకోవటానికి జరుగుతుంది అది. అందులో ఒక వ్యక్తి తను తప్పు అని తెలుసుకుంటే, తన అహంకారాన్ని పక్కకు పెట్టి క్షమాపణ కోరగలడు. వేదాంతంలో గురుశిష్యుల మధ్య జరిగేదాన్ని సంవాదం అంటారు. ఇక్కడ కూడా కృష్ణార్జునుల సంవాదం అంటారు. శిష్యుడు వినయంగా గురువుకు నమస్కారం చేస్తాడు. నమస్కారం చేస్తున్నాడంటేనే తన అహాన్ని పక్కన పెట్టటానికి సిద్ధపడ్డట్టు అర్థం. అలా కాకుండా అహంకారంతో వింటే, ఎదుటి వ్యక్తి చెప్పింది అతనికి నచ్చితే స్వీకరిస్తాడు, లేకపోతే లేదు.

వాదోపవాదాల్లో జల్పం, వితండంలాంటివి కూడా ఉన్నాయి. వాటిల్లో ఎదుటి మనిషి వాదన వినే ప్రసక్తి లేదు. ఒకదాంట్లో తనదే పై చెయ్యిగా ఉండాలనుకుంటాడు. అంటే తన వాదనే చేస్తాడు కాని ఎదుటి వ్యక్తి వాదనను వినడు. ఇంకొకరకం దాంట్లో తనవైపు బలమైన వాదన ఉండదు. కాని ఎంతసేపూ ఎదుటి వ్యక్తిని కించపరచటమే ధ్యేయంగా ఉంటుంది. అతను ఏం చెప్పినా కాదనటమే ముఖ్యం. అతనికి కూడా అదే భావన ఉన్నా కూడా, అది ఎదుటి మనిషి చెప్పాడు కాబట్టి అది తప్పు. అలా రకరకాల వాదోపవాదాలు ఉన్నాయి. కాని వాదోపవాదాల్లో పరమాత్మ వాదం లేదా సంవాదం.

శ్లో. 33 **అక్షరాణామకారోస్మి ద్వంద్వః సామాసికస్య చ ।**
**అహమేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః ॥**
అక్షరాణామ్, అకారః, అస్మి, ద్వంద్వః, సామాసికస్య, చ,
అహమ్, ఏవ, అక్షయః, కాలః, ధాతా, అహమ్, విశ్వతోముఖః ॥

| | | | |
|---|---|---|---|
| అక్షరాణామ్ | = అక్షరములలో | అక్షయః, కాలః | = మహాకాలమును నేను |
| అకారః, అహమ్ | = 'అ' కారమును నేను | విశ్వతోముఖః | = సర్వతోముఖుడనైన విరాట్ పురుషుడను నేను |
| చ | = ఇంకా | ధాతా, అహమ్ | = ధరించి, పోషించువాడను |
| సామాసికస్య | = సమాసములలో | ఏవ (అస్మి) | = నేనే |
| ద్వంద్వః, అస్మి | = ద్వంద్వ సమాసమును నేను | | |

**అక్షరాణామ్ అకారః, సామాసికస్య చ ద్వన్ద్వః,**
**అక్షయః కాలః అహమ్ ఏవ, విశ్వతోముఖః ధాతా (చ) అహమ్ అస్మి ।**

తా: అక్షరములలో 'అ' కారమును నేను ఇంకా సమాసములలో ద్వంద్వ సమాసమును నేను. మహాకాలమును నేను, సర్వతోముఖుడనైన విరాట్ పురుషుడను నేను. ధరించి, పోషించువాడను నేనే.

**అక్షరాణామకారోస్మి** – అక్షరాలలో నేను 'అ'కారాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏ రంగమూ వదలటం లేదు కృష్ణపరమాత్మ. భారతీయ భాషలన్నీ 'అ'కారంతో మొదలవుతాయి. కాని ఇంగ్లీషులో 'అ' లేదు. ఎ, బి, సి, డి అంటారు. 'అ' శబ్దమే లేదు. అదే మన దేశభాషలు తీసుకుంటే అ, ఆ, ఇ, ఈ అంటూ సాగుతుంది.

'అ'కారం చాలా ప్రాథమిక అక్షరం లేదా ప్రాథమిక శబ్దం. ఎందుకు ప్రాథమిక శబ్దం అంటున్నాము? మనం నోరు తెరిచి గాలి వదిలితే 'అ' శబ్దం వస్తుంది. అది ఏ దేశస్థుడు నోరు తెరిచినా 'అ' శబ్దమే బయటకు వస్తుంది. అందువల్లనే పిల్లలు నోరు తెరవాలంటే ఏదమ్మా 'అ' అను అంటాము కాని ఎ, ఇ, యు, ఐ, అనమనము కదా. తక్కిన శబ్దాలన్నీ 'అ'యొక్క రూపాంతరాలే. ఒకటే మట్టిముద్దనుంచి అనేక ఆకారాలు చేసినట్టుగా, ఒకటే 'అ'కారంనుంచి అనేక శబ్దాలు వస్తాయి.

ఉదాహరణకు నోరు వెడల్పుగా తెరిచి, పళ్ళు చూపిస్తే 'ఈ' అవుతుంది. దంతవైద్యుడు నోరు తెరవండి అనటానికి 'ఈ' అనండి అంటాడు. అలా 'అ'నుంచి వచ్చిన శబ్దాలే ఉ, క, ఖ, లాంటి అక్షరాలు. శీక్షావల్లీలో నేర్చుకుంటాము. గొంతులో ఎనిమిది స్థానాలు ఉన్నాయి అక్షరాలు పలకటానికి. వేణువులో ఉన్న కొన్ని రంధ్రాలలోంచి సరిగమపదని వచ్చినట్టుగా, గొంతులోని ఎనిమిది స్థానాలలోంచి అనేక అక్షరాలు వస్తాయి.

'అ' కారణ అక్షరం, తక్కిన అక్షరాలన్నీ కార్య అక్షరాలు. అంటే ఇది తక్కిన అక్షరాలకు ఉపాదాన కారణం. వేదమే చెబుతున్నది ఈ విషయాన్ని; అక్షరాలను మనం అక్షరాలా సరస్వతీదేవిగా కొలుస్తాము.

వర్ణమాలలోని అక్షరాలుగా ఉన్న సరస్వతీదేవిని నేను కొలుస్తున్నాను అని అర్థం. వాటిల్లో అకారం తక్కిన అన్ని అక్షరాలకీ మూల కారణం. నిఘంటువులో ఉన్న అనేకానేక పదాలకు అదే కారణం. అందువల్ల శాస్త్రంలో **అకారః వై సర్వా వాక్** అంటారు. మన సాంప్రదాయంలో ఒక్కొక్క అక్షరానికీ ఒక అధిష్ఠానదేవత ఉంది. 'అ' కారానికి అదిష్ఠానదేవత సాక్షాత్తూ సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే.

**ఖం భూర్భువఃసువః బ్రహ్మణే పద్మహస్తాయ లోకాధిపతయే**
**హంసవాహనాయ సాంగాయా సాయుధాయ సశక్తి సపరివారాయ**
**ఉమామహేశ్వరాయ నమః అం బ్రహ్మణే నమః** – మహన్యాస మంత్రం

'అ'కారం బ్రహ్మదేవుడు. ఎందుకు? బ్రహ్మదేవుడు సృష్టికర్త. ఆయన వస్తువులనన్నింటినీ సృష్టించాడు. 'అ'కారం అక్షరాలన్నిటికీ ఉపాదాన కారణం. అకారానికి కారణం బ్రహ్మ. అందువల్ల అక్షరాలలో పరమాత్మ 'అ'కారం.

**ద్వంద్వః సామాసికస్య చ** – సమాసాలలో నేను ద్వంద్వసమాసాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. సంస్కృత వ్యాకరణంలో అనేక సమాసాలు వస్తాయి. కొన్ని పదాలను కలిపి సంయుక్త పదాలుగా చేయటాన్ని సమాసం అంటారు.

**సమ్యక్ అస్యతే ఇతి సమాసః**

అందంగా, ఒక పద్ధతిలో చేసే పదాల కూర్పుని సమాసం అంటారు. ఇంగ్లీషులో కూడా కాంపౌండ్ వర్డ్స్ ఉంటాయి కాని, సంస్కృతంలో వ్యాకరణసూత్రాలు చాలా ఉంటాయి. ఇలా కలపటంవల్ల విభక్తిని వాడనవసరం లేదు. తెలుగులో కొన్ని పదాలను చూద్దాము. నేను పూజా సామాగ్రిని కొన్నాను అంటే పూజ **కోసం** సామాగ్రిని కొన్నాను అని అర్థం. శివాలయానికి వెళ్ళాను అంటే శివుడు **ఉన్న** ఆలయానికి వెళ్ళాను అని అర్థం; గంగాజలం తెచ్చాను అంటే గంగ **నుంచి** జలాన్ని తెచ్చాను. అడయార్ క్లాసులకు వెళ్ళాను అంటే అడయార్**లో** జరుగుతున్న క్లాసులకు వెళ్ళానని అర్థం. వీటిలో ఉదాహరణకు గంగాజలం తీసుకుంటే గంగ ఒక పదం, జలం ఇంకొక పదం; రెండింటినీ కలిపి సమాసం చేశాము. దీనివల్ల పెద్ద వాక్యాన్ని చిన్నదిగా చేస్తాము.

ఇలా సంయుక్త పదాలను చెయ్యటంవల్ల విభక్తులను వాడే శ్రమ తప్పుతుంది. ఏ సందర్భంలో ఏ విభక్తి వాడాలో ఎలా తెలుస్తుంది? సందర్భాన్ని బట్టి తెలుస్తుంది. గంగాజలం అంటే గంగనుంచి నీరు అన్నాము; కాని పూజాసామాగ్రి అంటే పూజనుంచి సామాగ్రి అనము, పూజకోసం సామాగ్రి అంటాము. అలాగే అడయార్ క్లాసులు అంటే అడయార్‌కోసం క్లాసులు కాదు, అడయార్‌నుంచి క్లాసులు కాదు, అడయార్‌లో జరుగుతున్న క్లాసులు. అలాగే శివాలయానికి వెళ్ళాను అంటే శివుడు ఉన్న ఆలయానికి వెళ్ళాను కాని బిర్లామందిర్ అంటే బిర్లా ఉన్న ఆలయం కాదు; బిర్లా కట్టించిన ఆలయం. అలాగే కారప్పొడి అంటే మిరపకాయల పొడి, కాని పళ్ళపొడి అంటే పళ్ళను పొడిచేసి చేసిన పొడి కాదు.

ఇలా సమాసాలయొక్క విగ్రహవాక్యం చెయ్యటం ఒక అద్భుతమైన ప్రక్రియ. వీటికి అనేక సూత్రాలుంటాయి. ముఖ్యంగా ఐదు ప్రాథమిక సమాసాలు ఉన్నాయి. ఈ ఐదు సమాసాలను ఏడుగా పెంచుతారు; తర్వాత ఈ ఏడూ 35 రకాల సమాసాలు అవుతాయి. ప్రాథమిక సమాసాల పేర్లు తత్పురుష సమాసం, బహువ్రీహి సమాసం, కర్మధారయసమాసం, ద్విగుసమాసం, ద్వంద్వసమాసం. సంస్కృత గ్రంథాలలో ఒక పదం ఆ పేజీ మొదట్లో ఆరంభమై, ఆ పేజీ చివరదాకా సాగుతూనే ఉంటుంది. కాళిదాసుకవి రచించిన శ్యామలా దండకంలో అలాంటి అద్భుతమైన సమాసాలు ఉంటాయి.

**తారకారాజినీకాశహారావలిస్మేరచారుస్తనాభోగభారానమన్మధ్యవల్లీవలిచ్ఛేదవీచీసముద్యత్సముల్లాససందర్శి తాకారసౌందర్యరత్నాకరే వల్లకీభృత్కరే కింకరశ్రీకరే**

ఇదంతా ఒక్క పదం. ఇలా సంస్కృతభాషలో అనేక సమాసాలు ఉన్నాయి. వాటిలో ద్వంద్వ సమాసం ఒకటి. రెండు పదాలకు సమానస్థాయి ఉన్నవాటిని ద్వంద్వసమాసం అంటారు. ఉదాహరణకు తల్లిదండ్రులు, పార్వతీపరమేశ్వరులు, సుఖదుఃఖాలు, రాగద్వేషాలు మొదలైనవి. సమాసాల్లో పరమాత్మ ద్వంద్వసమాసం.

**అహమేవాక్షయః కాలః** – అన్నిటికీ ముగింపు చెప్పి, దానికి ముగింపు లేని కాలతత్త్వాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అక్షయః కాలః అంటే క్షయం కాని కాలతత్త్వం. కాలంలో అన్నీ క్షయమయిపోతాయి కాని కాలం ఎప్పటికీ ఉంటుంది. ప్రళయకాలంలో కూడా అన్నీ లయమవుతాయి కాని, కాలం అవ్యక్తంగా ఉంటుంది. కాలం అవ్యక్తంగా ఉండటంవల్లనే తర్వాత సృష్టి రాగలుగుతుంది. అందువల్ల పరమాత్మ అక్షయకాలతత్త్వం.

**ధాతాహం** – నేను కర్మఫలదాతను అంటున్నాడు కృష్ణపరమాత్మ. సరియైన వ్యక్తికి, సరియైన సమయంలో, సరియైన ఫలం ఇవ్వాలంటే ఎంత గొప్ప మేధాశక్తి ఉండి ఉండాలి? మన కంప్యూటర్ ఎందుకూ పనికి రాదు దాని ముందు. భగవంతుని కంప్యూటర్‌కు వైరస్ పట్టదు. ఆ కంప్యూటర్‌లో (ఆయన మేధాశక్తిలో) చీమ, దోమ, మనిషి, ప్రాణులు, దేవతలు, రాక్షసులు అలా మొత్తం జీవరాశులన్నింటియొక్క కర్మల రికార్డు పెట్టుకుని, దానికి తగ్గ కర్మఫలాలను ఇస్తూ వస్తాడు. అది ఎంత క్లిష్టమైన పని? అందువల్ల పరమాత్మ కర్మఫలదాత.

**విశ్వతోముఖః** – నేను విశ్వతోముఖుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే ఆయన ముఖం పది దిక్కుల వైపూ తిరిగి ఉంటుంది. ఒక్కసారి ఇంతమందికి ఇన్ని రకాల కర్మఫలాలను ఇవ్వాలంటే, ఆయన అన్ని వైపులా ఒక్కసారే చూడగలిగేలా ఉండాలి.

**విశ్వతో చక్షురుత విశ్వతో ముఖో విశ్వతో హస్త**
**ఉత విశ్వతస్పాత్**
**సం బాహుభ్యాం నమతి సంపత త్రైర్ద్యావా పృథివీ**
**జనయన్ దేవ ఏకః తన్మే మనః శివసంకల్పమస్తు**

అందువల్ల పరమాత్మ విశ్వతోముఖుడు.

శ్లో. 34 **మృత్యుః సర్వహరశ్చాహమ్ ఉద్భవశ్చ భవిష్యతామ్ ।**
**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా ॥**
మృత్యుః, సర్వహరః, చ, అహమ్, ఉద్భవః, చ, భవిష్యతామ్,
కీర్తిః, శ్రీః, వాక్, చ, నారీణామ్, స్మృతిః, మేధా, ధృతిః, క్షమా ॥

| | | | |
|---|---|---|---|
| సర్వహరః | = సర్వప్రాణులను హరించునట్టి | ఉద్భవః | = ఉత్పత్తి హేతువును నేను |
| మృత్యుః, అహమ్ | = మృత్యువును నేను | చ | = ఇంకా |
| భవిష్యతామ్ | = పుట్టబోవుచున్న సమస్త ప్రాణుల | నారీణామ్ | = స్త్రీలలో |

| | | | |
|---|---|---|---|
| కీర్తిః | = కీర్తిని | ధృతిః | = ధృతిని |
| శ్రీః | = లక్ష్మిని | చ | = ఇంకా |
| వాక్ | = వాక్కును | క్షమా | = క్షమను |
| స్మృతిః | = స్మృతిని | (అహమ్) అస్మి | = నేను |
| మేధా | = మేధను | | |

**సర్వ–హరః మృత్యుః, భవిష్యతామ్ ఉద్భవః చ అహమ్**
**నారీణామ్ చ కీర్తిః శ్రీః వాక్ స్మృతిః మేధా ధృతిః క్షమా చ (అహమ్ అస్మి) ।**

తా: సర్వప్రాణులను హరించునట్టి మృత్యువును నేను. పుట్టబోవుచున్న సమస్తప్రాణుల ఉత్పత్తి హేతువును నేను ఇంకా స్త్రీలలో కీర్తిని, లక్ష్మిని, వాక్కును, స్మృతిని, మేధను, ధృతిని ఇంకా క్షమను నేను.

**అహం సర్వహరః చ మృత్యుః (అస్మి)** – సర్వప్రాణులను హరించే మృత్యువును నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. దొంగ ఒక వ్యక్తినుంచి వస్తువులను మాత్రమే దొంగలించగలడు; కాని కాలం అన్నీ తీసేసుకుంటుంది. ఎందుకంటే మృత్యుబారిన పడ్డప్పుడు మనతో ఎవరూ రారు. ఆ విషయమై తమిళంలో ఒక అద్భుతమైన పద్యం ఉంది. దాని సారం –

**ఇంటి వరకు ఆస్తి; ఇంటి వాకిలి వరకు భార్య;**
**కాటి వరకు పిల్లలు; చివరి వరకు వచ్చేదెవరో?**

అలా ఒక వ్యక్తి మరణించినప్పుడు, అతనికున్నవన్నీ ఒక్కొక్కటీ వదులుకోవాల్సివస్తుంది. వాటిని తీసుకునేదెవరు? మృత్యువు – అంటే యమధర్మరాజు. అతనితో వచ్చేది అతను చేసిన పుణ్యపాపాలు మాత్రమే.

లియో టాల్‌స్టాయ్ కథ ఒకటి ఉంది. ఒక ధనవంతుడు ఒక చాటింపు వేయిస్తాడు. సూర్యోదయంనుంచి సూర్యాస్తమయం వరకూ ఒక ప్రదేశంలో ఎంతమేరకు పరిగెడితే అంతమేరకు ఆ ప్రదేశాన్ని, ఆ పరిగెత్తిన వ్యక్తికి రాసిస్తాను అంటాడు. ఒకతను వస్తాడు, చాలా ఆశగా పరిగెడతాడు. మొదట్లో చాలా ఉత్సాహంగా పరిగెడతాడు; పరుగు తీస్తూనే ఉంటాడు. సూర్యాస్తమయం దగ్గరకొస్తున్నకొద్దీ అతని శక్తి సన్నగిల్లుతూ వస్తుంది. ఇంక పరుగు ఆపమని ఎవరు సలహా ఇచ్చినా, ఇంకొంచెం వస్తుంది, ఇంకొంచెం వస్తుందని ఆఖరి క్షణం వరకూ పరుగెడుతూనే ఉన్నాడు. కాని ఆ ఆఖరి క్షణం అతని ఆఖరి ఊపిరి తీసుకుంటుందని ఊహించలేక పోయాడు. అక్కడే కుప్పకూలిపోయాడు; అప్పటికప్పుడే మరణించాడు. ప్రాణాలొడ్డి అంత కష్టపడి సంపాదించిన ఆ భూమిని తీసుకువెళ్ళగలిగాడా? లేదు. మృత్యువు హరించివేసింది దానిని. అందువల్ల ఎంత సంపాదించినా, దాన్నంతటినీ మృత్యువు హరించివేస్తుంది. అందువల్ల పరమాత్మ మృత్యువు.

**ఉద్భవశ్చ భవిష్యతామ్** – భవిష్యత్తులో పుట్టబోయే ఐశ్వర్యాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే, భవిష్యత్తులో ఏదైనా పుట్టించాలంటే, అది ఇప్పుడు అవ్యక్తరూపంలో నిక్షిప్తమై ఉండాలి. అవ్యక్తంగా లేనిదాన్ని

వ్యక్తంలోకి తీసుకురాలేము. అటువంటి అవ్యక్తాన్ని కూడా నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. భవిష్యత్తులో రాబోయే వాటికి ఇప్పుడు నేను బీజాన్ని. అందువల్ల పరమాత్మ ఉత్పత్తి హేతువు.

**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం** – స్త్రీ దేవతలలో కీర్తిని, లక్ష్మిని, వాక్కును నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. మనకు ముగ్గురమ్మలు అధిష్ఠానదేవతలుగా ఉన్నారు. లక్ష్మీదేవి సంపదకు అధిష్ఠానదేవత; సరస్వతీదేవి చదువుల తల్లి; పార్వతీదేవి శక్తిస్వరూపిణి. వీరు ముగ్గురూ ముగ్గురు అధిష్ఠానదేవతలు.

వీరే కాక, సృష్టిలో అనేక అధిష్ఠానదేవతలు ఉన్నారు. ఎందుకు? సృష్టిలో ఏది వచ్చినా, దానికి కొన్ని సూత్రాలు ఉంటాయి, కొన్ని ప్రకృతినియమాలు ఉంటాయి. ఉదాహరణకు భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతుంది. అంటే ఈ పని ప్రకృతినియమాలవల్ల జరుగుతున్నది.

ప్రకృతిలో ఎన్నో జరుగుతున్నాయి. ఉరుములు, మెరుపులు, భూమ్యాకర్షణ శక్తి – ఏది తీసుకున్నా దాని వెనక ప్రకృతినియమం ఉంది. ఈ నియమాలు ఇంత క్రమం తప్పకుండా పని చేస్తున్నాయంటే వాటి వెనక ఒక మేధాశక్తి ఉంది. ఎందుకంటే, ఏ నియమం పని చెయ్యాలన్నా కూడా, దాన్ని నియంత్రించే నియంత ఉండాలి. ప్రభుత్వం కొత్తగా ఒక నియమాన్ని ప్రవేశపెడితే దాన్ని ఆచరించేలా చూడటానికి ఒక ఆఫీసరు ఉండాలి. ఆ విధంగా ఈ సృష్టిలో ఏ వస్తువైనా కూడా, దానికి కొన్ని సూత్రాలు ఉంటాయి. ఆ సూత్రాలను ఒక తెలివైన తత్త్వం నియంత్రిస్తుంది. ఈ రెండూ కలిపితే, ప్రతి వస్తువుకూ ఒక అధిష్ఠానదేవత ఉంటుంది.

అంటే మనం రెండు అడుగులు పైకి వెయ్యాలి. వస్తువునుంచి వస్తువుకున్న సూత్రాన్ని చూడాలి; సూత్రంనుంచి దాన్ని నియంత్రించే తెలివైన తత్త్వాన్ని చూడాలి. అంటే ప్రతి వస్తువుకూ ఉన్న అధిష్ఠానదేవతను చూడాలి.

భూమికి భూదేవత ఉంది; జలానికి జలదేవత ఉంది; ప్రతి ఒక్క అక్షరానికీ అక్షరదేవత ఉంది; మన అంగాలు ఒక్కొక్కదానికీ ఒక అధిష్ఠానదేవత ఉంది. అంతే కాదు ఒక రేడియో కనుగొనబడితే దానికొక దేవత ఉంటుంది. ఈ అధిష్ఠానదేవతలందరికీ అధిష్ఠానదేవత ఈశ్వరుడు. ఆయన సమష్టిదేవత, సర్వజ్ఞుడు. ఆ విధంగా మనకు అనేక అధిష్ఠానదేవతలున్నారు. కీర్తిః అంటే పేరు ప్రతిష్ఠలు. దానికి కూడా కొన్ని సూత్రాలు ఉన్నాయి. దాని అధిష్ఠానదేవత కీర్తిదేవత.
శ్రీః – సంపద. దానికి అధిష్ఠానదేవత లక్ష్మీదేవి. వాక్ – వాక్కు. దానికి అధిష్ఠానదేవత వాగ్దేవి.

**వాగ్దేవి వదనాంభుజే వసతు మే త్రైలోక్యమాతా శుభా...**

**స్మృతిః** – స్మృతి అంటే జ్ఞాపకశక్తి. మనిషికున్న అనేక శక్తుల్లో జ్ఞాపకశక్తి ఒక శక్తి. మనస్సునుంచి అనేక నాళాలు వెళతాయి. ఎక్కడైనా ఏదో చిన్న పొరపాటు జరిగితే, అమ్నీషియా వస్తుంది. అంటే ఇది కూడా మెదడులో ఉన్న కొన్ని సూత్రాలవల్ల నియంత్రించబడుతుంది. దీనికి ఒక దేవత ఉంది.

**మేధా** – మేధా అంటే మేధస్సు, తెలివితేటలు. ఎందుకు కొంతమంది మెదడు చురుగ్గా ఉంటుందో, మరికొందరి మెదడు మట్టిసుద్దలా ఉంటుందో మనకు తెలియదు. ఇది అనుకోకుండా జరిగే అంశం కాదు; దానికి కూడా

కొన్ని సూత్రాలు ఉన్నాయి. వాటికి అధిష్ఠానదేవతను మేధాదేవత అంటారు. మేధాదేవికి చేసే ప్రార్థన మన వేదాల్లో మేధాసూక్తం పేరిట ఉంది.

**ఓం మేధాదేవీ జుషమాణా న ఆగాఽ ద్విశ్వాచీ భద్రా సుమనస్యమానా ।**
**త్వయా జుష్టా నుదమానా దురుక్తాన్ బృహద్వదేమ విదథే సువీరాః॥**

**ధృతిః** – ధృతి అంటే గట్టి పట్టుదల; విల్‌పవర్. అటువంటి గట్టి పట్టుదల ఉంటేనే మనిషి ఎన్ని ఓటములు ఎదురైనా వెనుకంజ వెయ్యడు. కిందపడ్డా, పైకి లేస్తాడు.

ఒకవేళ మట్టిముద్దను కింద వేస్తే అది కిందనే ఉండిపోతుంది, ఎన్నటికీ పైకి లేవదు. అదే రబ్బరుబంతిని కింద వేస్తే అది మళ్ళీ పైకి లేస్తుంది. ఎలా పైకి లేస్తుంది? ఛెంగుమని పైకి లేస్తుంది. దాన్ని ఎంత శక్తితో కిందకి వేస్తే, అంత శక్తితో అది పైకి లేస్తుంది.

అదే విధంగా, మనుష్యుల్లో రెండు రకాలు ఉన్నారు. ఒక రకం వారు ఒకసారి ఓడిపోతే, వారు మట్టిముద్దలా కింద ఉండిపోతారు, మళ్ళీ ప్రయత్నించరు. ఇంకొక రకం వారు రబ్బరుబంతిలాంటివారు; కిందపడ్డకొద్దీ రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ ప్రయత్నిస్తారు. ఇలా పట్టువదలని విక్రమార్కునిలా ప్రయత్నించే వారి శక్తిని ధృతి అంటారు. దీనికి అధిష్ఠానదేవతను ధృతిదేవత అంటారు.

**క్షమా** – క్షమకు అనేక అర్థాలున్నాయి. అవి ఓపిక, భరించటం, వేచి ఉండటం, క్షమించటం. ఈ మధ్య రోడ్డు మీద రెడ్ సిగ్నల్ పడ్డప్పుడు 'రిలాక్స్' అని కొత్తగా వేస్తున్నారు కొన్నిచోట్ల. అంటే ఓపిగ్గా వేచిచూడాలి. అదే లోపిస్తోంది నేడు. కొంచెం, కొంచెం ముందుకు వెళుతూ ఉంటారు. గ్రీన్ సిగ్నల్ పడేసరికి ఉన్న ఒక్క అడుగూ దాటేస్తారు. ఒకవేళ సరిగ్గా సిగ్నలు ముందు ఏదైనా కారు ఉండి, అది ఏ కారణం వల్లనైనా వెంటనే కదలకపోతే, వెనకనుంచి హారన్ల హెూరు వినిపిస్తుంది. ఆ ఒక్కక్షణం కూడా వేచిచూసే ఓపిక ఉండదన్నమాట ఎవరికీ. మనలో ఆ క్షమాగుణం ఉన్నా లేకపోయినా అది కూడా ఒక శక్తి. దాని అధిష్ఠానదేవత క్షమాదేవత.

**నారీణామ్ (అహమ్) అస్మి** – స్త్రీ దేవతలలో ఈ దేవతలన్నీ నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల స్త్రీదేవతలలో పరమాత్మ కీర్తి, శ్రీ, వాక్, స్మృతి, మేధా, ధృతి, క్షమా.

శ్లో. 35 **బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్ ।**
**మాసానాం మార్గశీర్షోఽహమ్ ఋతూనాం కుసుమాకరః ॥**
బృహత్సామ, తథా, సామ్నామ్, గాయత్రీ, ఛందసామ్, అహమ్,
మాసానామ్, మార్గశీర్షః, అహమ్, ఋతూనామ్, కుసుమాకరః ॥

| | | | |
|---|---|---|---|
| తథా | = అలాగే | బృహత్సామ | = బృహత్సామమును |
| సామ్నామ్ | = గానము చేయుటకు అనువగు శ్రుతులలో | ఛందసామ్ | = ఛందస్సులలో |
| | | గాయత్రీ | = గాయత్రీ ఛందస్సును |
| అహమ్ | = నేను | మాసానామ్ | = మాసములలో |

| | | | | | |
|---|---|---|---|---|---|
| మార్గశీర్షః | = మార్గశీర్షమును | | కుసుమాకరః | = | వసంతఋతువును |
| ఋతూనామ్ | = ఋతువులలో | | అహమ్ (అస్మి) | = | నేను |

**సామ్నామ్ బృహత్–సామ, తథా ఛన్దసామ్ గాయత్రీ అహమ్,**
**మాసానామ్ మార్గశీర్షః, ఋతూనామ్ కుసుమాకరః అహమ్ (అస్మి) ।**

తా: అలాగే గానము చేయుటకు అనువగు శ్రుతులలో నేను బృహత్సామమును, ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును, మాసములలో మార్గశీర్షమును, ఋతువులలో వసంతఋతువును నేను.

**బృహత్సామ తథా సామ్నామ్** – సామవేదం మంత్రాల్లో నేను బృహత్సామాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. సామ్నాం అంటే సామమంత్రాలు. సామమంత్రాలు అనే పదం ఒక సమాసం. సామవేదంయొక్క మంత్రాలు. అందులో బృహత్సామ నేను అంటున్నాడు. బృహత్సామ అంటే బృహత్ సామ; అది ఒక మంత్రం పేరు. అది చాలా మంగళకరమైన మంత్రం. ఇది భగవంతుణ్ణి స్తుతించే మంత్రం.

దీనికి బృహత్ సామ అని పేరు ఎందుకు వచ్చిందంటే మంత్రం పెద్దది అని కాదు, మంత్రం స్తుతించే భగవంతుడు గొప్పవాడు అని. మంత్రం పాడటానికి 2, 3 నిముషాలే పడుతుంది. కాని అది స్తుతించేది బృహదీశ్వరుణ్ణి. అందువల్ల ఇది గొప్ప మంత్రం. అందువల్ల సామమంత్రాల్లో పరమాత్మ బృహత్సామ.

**గాయత్రీ ఛందసామహమ్** – ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నిజానికి ఛందస్సుకు రెండు అర్థాలున్నాయి. ఛందస్సు అంటే ఛందస్సే ఒక అర్థం. అంటే పద్యభాగం రాయటానికి పాటించే సూత్రాలు. ఒక పద్యంలో ఎన్ని అక్షరాలు ఉండాలి, ఎలా ఉండాలిలాంటి నియమాలు కొన్ని ఉంటాయి. సంస్కృతంలో ఈ ఛందస్సుకు కొన్ని ఉదాహరణలు గాయత్రీ ఛందస్సు, అనుష్టుప్ ఛందస్సు, త్రిష్టుప్, జగతీ, బృహతీ మొదలైనవి. అలా గాయత్రీ ఛందస్సు ఒకటి.

అంతేకాకుండా వేదమంత్రాలను కూడా ఛందస్సు అంటారు. కాని ఇక్కడ ఛందస్సు అంటే ఛందస్సు అర్థమే సరిపోతుంది. అలాగే గాయత్రికి కూడా రెండు అర్థాలున్నాయి. ఒకటి గాయత్రీ ఛందస్సు. దానిలో మూడు పాదాలుంటాయి, పాదానికి ఎనిమిది అక్షరాలు ఉంటాయి, వెరసి 24 అక్షరాలు వస్తాయి. అష్టాక్షర త్రిపాద గాయత్రీ.

గాయత్రీ అంటే ఒక ప్రత్యేకమైన మంత్రం కూడా. గాయత్రీ మంత్రం తెలియనివారు ఉండరు. చాలామంది గాయత్రీ జపం చేస్తారు. అందువల్ల వేదమంత్రాలలో నేను గాయత్రీ మంత్రాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. గాయత్రీ మహిమ గురించి శాస్త్రంలో చాలా విస్తారంగా వస్తుంది. గాయత్రీ మహిమను వివరిస్తూ ఒక గ్రంథమే ఉంది.

గాయత్రీయొక్క ముఖ్యమైన మహిమ, ఈ మంత్రాన్ని వేదసారమంత్రం అంటారు. ఒకసారి బ్రహ్మదేవుడు వేదసారంకోసం వేదాలని చిలికాడుట.

**త్రిభ్య ఏవ తు వేదేభ్యః పాదంపాదమదూదుహత్ ।**
**తదిత్యర్చోఽ_స్యాః సావిత్ర్యాః పరమేష్ఠీ ప్రజాపతిః ॥** – మను 2.77

పరమేష్ఠీ ప్రజాపతిః అంటే బ్రహ్మదేవుడు. బ్రహ్మదేవుడు మూడు వేదాలను తీసుకున్నాడు. మనకు ఉన్నది నాలుగు వేదాలైనా కూడా ఎక్కువగా మూడు వేదాల గురించే చెబుతారు. అథర్వణవేదం ఎక్కువగా రాదు. అంటే ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదాలనే తీసుకుంటారు ఎక్కువగా. ఎందుకంటే వాటిల్లోనే యజ్ఞయాగాదులు, కర్మకాండ వస్తాయి.

వేదాలు చాలా పెద్దవి అవటంవల్ల వాటి సారాన్ని తీయదలచుకున్నాడు బ్రహ్మదేవుడు. అలా ఋగ్వేద సారంగా గాయత్రీ మొదటి పాదం, యజుర్వేద సారంగా రెండవ పాదం, సామవేద సారంగా మూడవ పాదం వచ్చాయి.

**ఋగ్వేద సారం – తత్సవితుర్వరేణ్యం**
**యజుర్వేద సారం – భర్గోదేవస్య ధీమహి**
**సామవేద సారం – ధియోయోనః ప్రచోదయాత్**

అలా ఒక్కొక్క పాదంగా వచ్చింది. ఈ గాయత్రీ మంత్రాన్ని సావిత్రీమంత్రం అంటారు అసలు. ఎందుకంటే ఈ మంత్రం వర్ణించేది సూర్యభగవంతుణ్ణి. సంస్కృతంలో సూర్యభగవానుణ్ణి సవితాదేవత అంటారు. సంధ్యావందనంలో ఈ సవితా పేరు వస్తుంది. ఈ సావిత్రీ మంత్రం గాయత్రీ ఛందస్సులో ఉండటంవల్ల దీనికి గాయత్రీమంత్రం అని కూడా పేరు వచ్చింది. అంటే ఛందస్సు పరంగా గాయత్రీ మంత్రం, దేవతా పరంగా సావిత్రీ మంత్రం.

బ్రహ్మచారికి ఉపనయనం చేసినప్పుడు అతను తండ్రికీ, గురువుకూ సాష్టాంగ నమస్కారం చేసి –

**సావిత్రీం భో అనుబ్రూహి**

అంటాడు. అక్కడ సావిత్రి అంటే గాయత్రీ మంత్రం. గాయత్రీ మంత్రం వేదాలసారం కాబట్టి, తండ్రి, తన పుత్రుడికి వేదాలు అధ్యయనం చెయ్యటానికి శ్రీకారం చుడుతున్నాడు కాబట్టి గాయత్రీమంత్రం ఉపదేశిస్తాడు.

అంటే మనం గాయత్రీ మంత్రం జపిస్తే, మొత్తం వేదాలను జపిస్తున్నట్టు అర్థం.

**ఆయాతు వరదాదేవి అక్షరం బ్రహ్మ సంహితమ్**

బ్రహ్మసంహితమ్‌లో బ్రహ్మ అంటే వేదాలు; సంహితం అంటే వేదాలకు సమానమైనది. అందువల్ల గాయత్రీ జపం చేస్తే ఒక్కటి కాదు, మూడు వేదాల పారాయణం చేసినంత ఫలం వస్తుంది. పైగా గాయత్రీ జపం చేస్తే పాపాలనుంచి రక్షింపబడతాడు.

**గాయత్రీ గాయంతాం త్రాయతే ఇతి గాయత్రిః**

గాయంతాం అంటే జపించే వ్యక్తి; త్రాయతే అంటే రక్షిస్తుంది. గాయత్రీ అంటే దేవత. అందువల్ల ఎవరైతే గాయత్రీ మంత్రాన్ని జపిస్తారో అతనికి గాయత్రీదేవి ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. కొంతమంది ఇంటి గుమ్మానికి కన్‌దృష్టి వినాయకుని ఫోటో అంటిస్తారు. గాయత్రీ అలాంటి రక్షణ కవచాన్ని ఇస్తుంది. మనకు రెండు రకాల గాయత్రీ మంత్రాలు ఉన్నాయి. అవి శ్రౌతగాయత్రీ, స్మార్తగాయత్రీ. శ్రౌత అంటే శ్రుతుల్లో (వేదాల్లో) వచ్చే మంత్రం. స్మార్త అంటే స్మృతి గ్రంథాల్లో వచ్చే మంత్రం. ఉపనయనంలో ఉపదేశించేది శ్రౌతగాయత్రీ మంత్రం. ఆ మంత్రం –

**తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్**

జపం చెయ్యటానికి వీలుగా ఓం భూర్భువస్సువః కలుపుతారు.

ఈ గాయత్రీ మంత్రం అర్థం చూద్దాము.

**సవితుః దేవస్య తత్ వరేణ్యం భర్గః వయం ధీమహి: వయం ధీమహి** – మేము ధ్యానం చేస్తున్నాము; తత్ వరేణ్యం భర్గః – ఆ పవిత్రమైన ప్రకాశంమీద. ఎవరి కాంతి? సవితుః దేవస్య – సూర్యభగవానునియొక్క. అంటే మేము సూర్యభగవానునియొక్క పవిత్రమైన ప్రకాశంమీద ధ్యానం చేస్తున్నాము.

ఎందుకు ధ్యానం చేస్తున్నాము? మాకు కలిగే ఫలమేమిటి? **యః నః ధియః ప్రచోదయాత్** – ధియః అంటే బుద్ధి. ఆ సూర్యభగవానుని తేజస్సు మా మేధాశక్తిని పెంపొందిస్తుంది కాబట్టి. అందువల్ల గాయత్రీ మంత్రం చదివితే మేధాశక్తి పెరుగుతుంది.

గాయత్రీ మంత్రం పఠించకుండా, తక్కిన మంత్రాలను పఠిస్తే అవి అంతగా ఫలించవనీ; గాయత్రీ మంత్రం పఠించి, తక్కిన మంత్రాలు పఠించకపోయినా ఫలం కలుగుతుందనీ, గాయత్రీ మహిమ అంత గొప్పదనీ శాస్త్రంలో చెబుతారు. గాయత్రీ గురించి అనేక శాస్త్రగ్రంథాలలో వస్తుందని చూశాము.

ఈ గాయత్రీ మంత్రాన్ని కూడా రెండు రకాలుగా పఠిస్తారు. తత్ సవితుః వరేణ్యం ఒక పద్ధతి; తత్ సవితుః వరే నియమ్ ఇంకొక పద్ధతి. వరేణ్యంగా పఠిస్తే 23 అక్షరాలు; వరే నియమ్‌గా పఠిస్తే 24 అక్షరాలు వస్తాయి. 24 అక్షరాలున్న గాయత్రీ మంత్రాన్ని గాయత్రీ మంత్రమనే అంటారు కాని, 23 అక్షరాలున్న గాయత్రీ మంత్రాన్ని నిచ్చృద్ గాయత్రీ అంటారు. సంధ్యావందనంలో నిచ్చృద్ గాయత్రీని పఠిస్తారు.

**విశ్వామిత్ర ఋషిః నిచ్చృద్గాయత్రీ ఛందః సవితా దేవతా।**

జపం చెయ్యాలన్నా, హోమం చెయ్యాలన్నా వరేణ్యం అనాలి. ఇదంతా శ్రౌత గాయత్రీ గురించి.

స్మార్త గాయత్రి మంత్రం వేరే ఉంది. శ్రౌత గాయత్రి, స్మార్తగాయత్రి అని రెండు రకాలు ఉంటాయని చూశాము కదా. రెండోది స్మృతి గ్రంథాలలో వస్తుంది. అది ఇలా వస్తుంది –

**యో దేవః సవితాస్మాకం ధియో ధర్మాతి గోచరః**
**ప్రేరయేత్ తస్య యత్ భర్గః తద్వరేణ్యముపాస్మహే**

గాయత్రీ మంత్రం ఇంత గొప్పది కాబట్టి గాయత్రీ ఉపదేశాన్ని బ్రహ్మోపదేశం అంటారు. బ్రహ్మోపదేశం అంటే అది వేదోపదేశంతో సమానం. అందువల్ల గాయత్రీ వేదంతో సమానం. అంతేకాదు, ఛాందోగ్యోపనిషత్తు గాయత్రీ మంత్రాన్ని బ్రహ్మమీద ఉపాసన చెయ్యటానికి నిర్దేశిస్తుంది. అందువల్ల గాయత్రి వేదంతో సమానం, బ్రహ్మతో సమానం. ఈ మంత్రంమీద విశ్లేషణ బ్రహ్మసూత్రాల్లో కూడా చూస్తాము. ఈ గాయత్రీ మంత్రం చాలా పవిత్రమైనది. దీన్ని ఋగ్వేదంలో, యజుర్వేదంలో, సామవేదంలో కూడా చూస్తాము.అందువల్ల ఛందస్సులలో పరమాత్మ గాయత్రీ ఛందస్సు.

**మాసానాం మార్గశీర్షోఽహమ్** – మాసాలలో నేను మార్గశీర్ష మాసాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే డిసెంబరు 15 నుంచి జనవరి 15 వరకూ. దీన్ని తమిళంలో మార్గళి మాసం అంటారు. మార్గశీర్ష మాసం అనేక విధాలుగా గొప్పది. అది మంగళకరమైన మాసం. అందువల్ల అనేక మతపరమైన కర్మలు ఆ కాలంలో చేస్తారు. వాతావరణం కూడా అప్పుడు బాగుంటుంది.

కొంతమంది భాష్యకారులు మార్గశీర్ష మాసంలో అనేక ధాన్యాలు పండుతాయి కాబట్టి, సస్యఫలంగా ఉంటుంది కాబట్టి దీనిని కృష్ణపరమాత్మ ఎన్నుకున్నాడు అంటారు. భూమి సస్యశ్యామలంగా ఉంటుంది. భాష్యకారులు చెప్పే ఇంకొక కారణం, ఈ నెల దేవతలకు సూర్యోదయకాలం అని. మన మనుష్యలోకంలో ఒక సంవత్సరం దేవతలకు ఒక రోజు. దేవతల రోజు సంక్రాంతి (సంక్రమణ రోజు)తో మొదలవుతుంది. రోజు మొదలయ్యే ముందు బ్రహ్మీముహూర్తం తెల్లవారుఝామున ఉంటుంది. అంటే 4.30 నుంచి 6.00 వరకూ సమయం. దేవతల రోజు జనవరి 15న మొదలవుతున్నదంటే, ఆ ముందు రోజులు దేవతలకు బ్రహ్మీముహూర్తంతో సమానం. బ్రహ్మీముహూర్తంలో సత్త్వగుణం ఉంటుంది. అందువల్ల అన్ని రకాల సాధనలకు, మతపరమైన సాధనలకు కూడా బ్రహ్మీముహూర్తం చాలా అనువైన సమయం. అంటే మార్గశీర్ష మాసం. అందువల్ల మాసాల్లో పరమాత్మ మార్గశీర్ష మాసం.

**ఋతూనాం కుసుమాకరః** – ఆరు ఋతువులలో నేను వసంతఋతువును అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ ఋతువుల పేర్లు వసంతఋతువు, గ్రీష్మఋతువు, వర్షఋతువు, శరదృతువు, హేమంతఋతువు, శిశిరఋతువు. ఇంగ్లీషులో నాలుగే ఋతువులున్నాయి. అవి స్ప్రింగ్, సమ్మర్, ఆటమ్, వింటర్. ఈ ఋతువులన్నిటిలోనూ వసంతఋతువు చాలా అందంగా ఉంటుంది. అన్ని రకాల పువ్వులు వికసిస్తాయి. పువ్వులను చూస్తే ఆహ్లాదకరంగా ఉంటుంది. అందువల్ల కృష్ణపరమాత్మ వసంతఋతువు అనకుండా కుసుమాకరః అంటున్నాడు. కుసుమాలు అంటే పువ్వులు. అందువల్ల ఋతువులలో పరమాత్మ వసంతఋతువు.

శ్లో. 36 **ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్ ।**
**జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్ ॥**
ద్యూతమ్, ఛలయతామ్, అస్మి, తేజః, తేజస్వినామ్, అహమ్,
జయః, అస్మి, వ్యవసాయః, అస్మి, సత్త్వమ్, సత్త్వవతామ్, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఛలయతామ్ | = వంచకులలో | జయః, అస్మి | = జయమును నేను |
| అహమ్, ద్యూతమ్ | = నేను జూదమును | (వ్యవసాయినామ్) | = నిశ్చయాత్మకులలో |
| తేజస్వినామ్ | = ప్రభావశాలురలో | అహమ్, వ్యవసాయః | = నిశ్చయమును నేను |
| తేజః, అస్మి | = తేజమును నేను | సత్త్వవతామ్ | = సాత్త్విక పురుషులలో |
| (జేతౄణామ్) | = విజేతలలో | సత్త్వమ్, అస్మి | = సాత్త్విక భావమును నేనే |

**ఛలయతామ్ ద్యూతమ్, తేజస్వినామ్ తేజః అహమ్ అస్మి,**
**జయః అహమ్ అస్మి, వ్యవసాయః (అహమ్) అస్మి, సత్త్వవతామ్ సత్త్వమ్ (అహమ్ అస్మి)।**

తా: వంచకులలో నేను జూదమును, ప్రభావశాలురలో తేజమును నేను, విజేతలలో జయమును నేను, నిశ్చయాత్మకులలో నిశ్చయమును నేను, సాత్త్విక పురుషులలో సాత్త్విక భావమును నేనే.

**ద్యూతం ఛలయతామస్మి** – మన విచక్షణా శక్తి కోల్పోయేలాగా చేసే వ్యసనాలలో నేను జూదాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. జూదం కూడా వ్యసనమే. త్రాగుడుకు, మత్తుమందుకు అలవాటు పడ్డవారు ఎలా వాటికి బానిసలు అయిపోతారో, అలా జూదానికి అలవాటు పడ్డవారు కూడా దానికి బానిసలు అయిపోతారు. పేకాట, గుర్రపు పందాలు మొదలైనవి కూడా జూదం కిందికే వస్తాయి.

భాగవతంలో ఒక కథ వస్తుంది. కలిదేవత నేను కొన్ని చోట్ల ఉండి, మనుష్యులను మోహంలో పడవేసి, వారి పతనం చూడాలి అని కోరుకున్నాడుట. అంటే భగవంతుడు కొన్ని ప్రాంతాలు సూచించాడుట. అక్కడ ఉండమన్నాడుట. అందువల్ల ఎవరైనా ఆ ప్రాంతాలకు వెళితే వారి పతనం ఖాయం. అలాంటిచోట్ల వారు తాగి, అరిచి, పోట్లాడి, గొడవలు చేస్తారు. అందువల్ల నేను ద్యూతం అన్నాడు కృష్ణపరమాత్మ.

నిజానికి మొత్తం మహాభారతమే మనకొక అద్భుతమైన పాఠాన్ని నేర్పిస్తుంది. మనం జాగ్రత్తగా ఉండకపోతే, జూదం లాంటి ఏ వ్యసనమైనా సరే, మనను అట్టడుగుకు లాగేస్తుంది. దానికి గొప్ప ఉదాహరణ యుధిష్ఠిరుడు. యుధిష్ఠిరుణ్ణి ధర్మరాజు అంటారు. ఎందుకు? ఆయన ధర్మానికి ప్రతీకగా నిలిచాడు. అంతటి ధర్మశాలికి కూడా ఒక్కటే ఒక బలహీనత ఉంది. ఏమిటది? పాచికలు ఆడటం. ఆ పాచికలను అడ్డం పెట్టుకుని, పాండవులతోనే పాచికలు ఆడాడు శకుని మామ. ఆ ఆట మైకంలో పడి ధర్మరాజు ధర్మాధర్మ విచక్షణ కోల్పోయాడు. జూదంలో తన భార్యనూ, తమ్ముళ్ళనూ కూడా పణంగా పెట్టాడు.

భార్యనూ, తమ్ముళ్ళనూ పణంగా పెట్టకూడదని అతనికి తెలియదా? అతను ధర్మానికి ప్రతీక. ధర్మశాస్త్రం క్షుణ్ణంగా తెలుసు. అయినా ఆ సమయంలో అతను విచక్షణ కోల్పోయాడు. ధర్మరాజంతటివాడే విచక్షణ కోల్పోతే, ఇంక మామూలు మనుష్యులం మనమెంత? అందువల్లనే మన పెద్దలు సరాదాగా కూడా పేకాట ఆడనివ్వరు. డబ్బు పెట్టి ఆడటం లేదన్నా కూడా ఒప్పుకోరు. అది ఒక వ్యసనం, అది పతనానికి దారితీస్తుంది. దానికి అంత బలమైన శక్తి ఉంది. ద్యూతం పదాన్ని అక్షరాలా తీసుకుంటే పాచికలు. కాని ఇక్కడ ఎటువంటి జూదాన్నైనా తీసుకోవచ్చు. అందువల్ల చెడు వ్యసనాలలో పరమాత్మ జూదం.

**తేజః తేజస్వినామహమ్** – ప్రతిభాశాలురలో నేను ప్రతిభను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇంతకు ముందే ద్యూతం చూశాము కాబట్టి తేజస్సు అంటే జూదమనే వ్యసనానికి బానిస కాకుండా, దాని వ్యామోహంలో పడకుండా ఉండే దృఢనిశ్చయం. ఎందుకంటే, ఏ వ్యసనం తీసుకున్నా, అంటే తాగుడు, సిగరెట్టు, మత్తుమందు జూదం ఏదైనా సరే, వాటికి మనం 'నో' అని తేలిగ్గా చెప్పగలిగేది మొదటిసారి మాత్రమే. ఒక్కసారి వాటిని రుచి చూశామా, అంతే సంగతులు. మెట్లమీంచి బంతి దొర్లుకుంటూ కిందపడ్డట్టుగా మనం కూడా పతనమవుతూ వస్తాము. దాన్నించి అంత తేలిగ్గా బయటపడలేము. అందువల్ల అలాంటి వ్యసనాలకు లొంగకుండా ఉండే దృఢనిశ్చయాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల తేజస్సులలో పరమాత్మ తేజస్సు.

**జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్** – సాత్త్విక పురుషులలో నేను సత్త్వగుణాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. సత్త్వగుణం ఆధ్యాత్మిక చింతనను సూచిస్తే, రజోగుణం లౌకిక విచారణను సూచిస్తుంది. రజోగుణం ఉన్నవారు అర్థకామాల వెంట పరుగులు తీస్తే, సత్త్వగుణం ఉన్నవారు ధర్మమోక్షాలకు విలువను ఇస్తారు. తమోగుణం ఉన్నవారికి వీటిల్లో దేనిమీద శ్రద్ధ ఉండదు.

అందువల్ల శాస్త్రం తమోగుణం ఉన్న వ్యక్తిని ముందు లౌకిక విషయాలమీద శ్రద్ధ పెట్టమంటుంది. అంటే ముందు అసలంటూ అర్థకామాల వెంట పరుగులు తీయటం అలవాటు ఉంటే, దాన్నించి ధర్మమోక్షాల వైపు తిరగగలుగుతారు. అంటే తమోగుణంనుంచి సరాసరి సత్త్వగుణానికి ఎదగలేరు. ముందు రజోగుణానికి వచ్చి, దాన్నించి ఇంకా పైకి ఎదగాలి.

సత్త్వగుణం ఉంటే ఆధ్యాత్మిక చింతన వస్తుంది. సత్త్వగుణం వ్యవసాయాత్మిక బుద్ధిగా వ్యక్తమవుతుంది. వ్యవసాయం అంటే గట్టి ప్రయత్నం, మొక్కవోని పట్టుదల, దృఢనిశ్చయం. ఆధ్యాత్మిక సాధన చెయ్యటానికి అంటే పంచమహాయజ్ఞాలు చెయ్యటానికి గట్టి ప్రయత్నం, దృఢనిశ్చయం ఉండాలి. ఎప్పుడైతే అంత పట్టుదలగా శ్రమిస్తాడో, అప్పుడే అది జయానికి దారితీస్తుంది. జయం అంటే విజయం. వెనకనుంచి వస్తే, సత్త్వగుణంనుంచి వ్యవసాయః, వ్యవసాయఃనుంచి జయః. సత్త్వగుణం అంటే ఆధ్యాత్మిక ఆలోచన; వ్యవసాయః అంటే ఆధ్యాత్మిక ప్రయత్నం; జయః అంటే ఆధ్యాత్మిక విజయం. ఈ మూడూ తానే అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల పరమాత్మ సత్త్వగుణం, వ్యవసాయాత్మికా బుద్ధి, విజయం.

దీన్నిబట్టి మనం ఒక విషయాన్ని గ్రహించాలి. మనం ఒకవేళ ఆధ్యాత్మికంగా ఎదిగితే, అంతా నా గొప్పతనమే అని విర్రవీగకూడదు. దాని వెనక భగవంతుని కృప ఉందని గ్రహించాలి. ఈ విషయాన్ని ఎన్నడూ మర్చిపోకూడదు. మనం ముందుకు వేసే ప్రతి అడుగు వెనక ఈశ్వర అనుగ్రహం ఉంది. ఫ్రీవిల్ ముందు ఉండి నడిపిస్తే, ఈశ్వర అనుగ్రహం వెనకనుంచి ముందుకు తోస్తుంది. ఫ్రీవిల్, ఈశ్వర అనుగ్రహం రెండూ జోడు గుర్రాలలాంటివి.

శ్లో. 37 **వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాండవానాం ధనంజయః ।**
**మునీనామప్యహం వ్యాసః కవీనాముశనా కవిః ॥**
వృష్ణీనామ్, వాసుదేవః, అస్మి, పాండవానామ్, ధనంజయః,
మునీనామ్, అపి, అహమ్, వ్యాసః, కవీనామ్, ఉశనా, కవిః ॥

| | | | |
|---|---|---|---|
| వృష్ణీనామ్ | = వృష్ణివంశజులలో | వ్యాసః | = వేదవ్యాసుడను నేను |
| వాసుదేవః | = వాసుదేవుడను నేను | కవీనామ్ | = అతీంద్రియ శక్తులున్న వారిలో |
| పాండవానామ్ | = పాండవులలో | | |
| ధనంజయః | = అర్జునుడను నేను | ఉశనా, కవిః, అపి | = శుక్రాచార్యుడను గూడ |
| మునీనామ్ | = మునులలో | అహమ్, అస్మి | = నేనే |

**వృష్ణీనామ్ వాసుదేవః, పాణ్డవానామ్ ధనఞ్జయః అస్మి,**
**మునీనామ్ అపి వ్యాసః (అహం), కవీనామ్ ఉశనా కవిః (అహమ్ అస్మి) ।**

తా: వృష్ణివంశజులలో వాసుదేవుడను నేను, పాండవులలో అర్జునుడను నేను, మునులలో వేదవ్యాసుడను నేను, అతీంద్రియశక్తులున్న వారిలో శుక్రాచార్యుడను గూడ నేనే.

**వృష్ణీనాం వాసుదేవోఽస్మి** – వృష్ణి వంశానికి చెందినవారిలో నేను వాసుదేవుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. వృష్ణి వంశం అంటే యదువంశం; కృష్ణపరమాత్మను యదువంశజుడు అంటారు. అందువల్ల యదువంశజులలో నేను వాసుదేవుణ్ణి అంటున్నాడు. వాసుదేవుడు అంటే వసుదేవుని పుత్రుడు. వృష్ణివంశానికి చెందినవాడు కాబట్టి కృష్ణపరమాత్మకు ఉన్న ఇంకొక పేరు వార్ష్ణేయ – వృష్ణివంశ సముద్భూతః.

కృష్ణపరమాత్మ నేను వృష్ణివంశస్థులలో గొప్పవాడిని అని చెప్పుకోవటం ఎందుకు? ఎందుకంటే వాసుదేవుడు సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారం కాబట్టి. ఆయన మామూలు మనిషి కాదు, సాక్షాత్తూ భగవంతుని అవతారం.

భగవంతుని అవతారాలు అనేకం ఉంటే, కృష్ణావతారాన్నే ఎందుకు పొగడాలి? దీనికి కూడా అనేక కారణాలున్నాయి కాని ఒక్క ముఖ్యమైన కారణాన్ని తీసుకోవచ్చు. అది ఈ ఒక్క అవతారంలోనే కృష్ణపరమాత్మ బ్రహ్మవిద్యా ఆచార్యుడు కూడా అయ్యాడు. మోక్షశాస్త్రాన్ని బోధించాడు. తక్కిన అవతారాలలో రాక్షసులని సంహరించి, అంతర్ధానమయ్యాడు. ఒక్క కృష్ణావతారంలోనే ఆత్మవిద్యాబోధ చేశాడు.

**వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనం**
**దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురమ్**

మన వేదాంతశాస్త్రంలో వేలకొద్దీ గ్రంథాలున్నాయి. కాని వాటన్నింటిలోనూ ముఖ్యంగా మూడు గ్రంథాలను ప్రాథమిక గ్రంథాలుగా భావిస్తారు. వాటిని ప్రస్థానత్రయం అంటారు. అవి వేదాంతానికి మూలస్థంభాలలాంటివి. అవి –

1. ఉపనిషత్తులు – శ్రుతి ప్రస్థానం
2. భగవద్గీత – స్మృతి ప్రస్థానం
3. బ్రహ్మసూత్రాలు – న్యాయ ప్రస్థానం

శ్రుతి, స్మృతి, న్యాయ గ్రంథాలు మూడింటినీ కలిపి ప్రస్థానత్రయం అంటారు. వీటిల్లో భగవద్గీత ఒకటి. అందువల్లనే కొన్ని వేల సంవత్సరాలు గడిచాక కూడా ఈ 21వ శతాబ్దంలో కూడా భగవద్గీతకు అంత

ప్రాముఖ్యత ఉంది. ఇప్పటికీ భగవద్గీతను ఉత్సాహంగా నేర్చుకుంటారు అందరూ. అటువంటి భగవద్గీతయొక్క ఆచార్యుడు కృష్ణపరమాత్మ కాబట్టి, గీతాచార్యునిగా ఆయన గొప్పవాడు. అందువల్ల యదువంశజులలో పరమాత్మ వాసుదేవుడు.

**పాండవానాం ధనంజయః** – పంచపాండవులలో ధనంజయుణ్ణి నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అర్జునుడే గొప్పవాడు అంటున్నాడు ఎందుకు? ధర్మానికి ప్రతీకగా నిలిచిన ధర్మరాజుని నేను అని ఉండవచ్చు కదా? దీనికి జవాబు చాలా తేలిక. గీత ప్రస్థానత్రయంలో ఒకటిగా అంత ప్రధానస్థానాన్ని పొందితే, దాన్ని మొట్టమొదటగా అందుకున్న అర్జునుడు కూడా గొప్పవాడే అవాలి కదా.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః।**
**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥**

ఉపనిషత్తుల సారమైన గీతాశాస్త్రాన్ని ముందుగా పొందినది ఎవరు? అర్జునుడు. మనం ఇప్పుడు అందుబాటులో ఉన్న గురువులనుంచి తర్వాత నేర్చుకుంటున్నాము. కాని అర్జునుడు సాక్షాత్తూ ఆ భగవంతునినుంచే నేర్చుకుంటున్నాడు. ఇంతకన్నా మహాద్భాగ్యం ఏముంటుంది?

**పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయమ్**

స్వయంగా భగవంతుడైన నారాయణునినుంచి పార్థుడు (అర్జునుడు) బోధను పొందాడు.

ఇంకొక ప్రశ్న, కృష్ణపరమాత్మ అర్జునునికే ఎందుకు బోధించాడు? దీనికి కూడా అనేక కారణాలు చెబుతారు కాని అసలు తేలికైన కారణం చెప్పవచ్చు. అది అర్జునునికే ఎందుకు చెప్పాడు అంటే అర్జునుడే అడిగాడు కాబట్టి.

**శిష్యస్తేఽహం శాధిమాం త్వాం ప్రపన్నమ్**

నీ శిష్యుణ్ణి, నిన్ను శరణు వేడుతున్నాను అని అర్జునుడు అన్నాడు కాని, ధర్మరాజు వేడలేదు, భీముడు వేడలేదు. అందువల్ల పాండవులలో పరమాత్మ అర్జునుడు.

**మునీనామప్యహం వ్యాసః** – మునులలో నేను వ్యాసాచార్యుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. వ్యాసాచార్యులు ఎందుకు గొప్పవారు? దీనికి కూడా కృష్ణపరమాత్మకు చెప్పిన కారణాన్నే చెప్పవచ్చు. కృష్ణపరమాత్మ బ్రహ్మవిద్యను బోధించిన గొప్ప గురువు; ఆయన బోధించిన భగవద్గీత ప్రస్థానత్రయంలో ఒకటి అని చూశాము కదా; అదే ప్రస్థానత్రయంలో న్యాయత్రయంగా పేర్కొన్న బ్రహ్మసూత్రాల కర్త వ్యాసాచార్యులవారు. అలా వ్యాసాచార్యులవారు కూడా కృష్ణపరమాత్మలా బ్రహ్మవిద్య ఆచార్యులు.

అంతేకాదు, వ్యాసాచార్యులవారు బ్రహ్మసూత్రాలను రచించటమే కాదు, కృష్ణపరమాత్మ చెప్పిన భగవద్గీతకు మూలమైన మహాభారతాన్ని కూడా రచించింది ఆయనే. అంటే కృష్ణపరమాత్మ గీతను బోధిస్తే, వ్యాసాచార్యులవారు ఆ గీతకు అక్షరరూపాన్ని ఇచ్చారు. ఆ విధంగా ప్రస్థానత్రయంలోని రెండు గ్రంథాలకు రచయిత వ్యాసాచార్యులవారు కాబట్టి ఆయన చాలా గొప్పవారు. అందువల్ల ఆయనమీద మనకంత గౌరవం ఉంది.

జంధ్యాల పౌర్ణమిరోజు ప్రత్యేక తర్పణం వదులుతారు. దీన్ని కాండఋషి తర్పణం అంటారు. అందులో ఋషి పరంపరకు తర్పణాలు వదులుతారు. అక్కడ కృష్ణద్వైపాయణుని పేర్కొంటారు. కృష్ణద్వైపాయణుడు వేరే ఎవరో కాదు, సాక్షాత్తూ వ్యాసమహర్షే. తక్కిన ఋషుల పేర్లు రావు. ఆది అని అనేస్తారు.

**కృష్ణద్వైపాయణాదయో యే ఋషయస్తాన్ ఋషీగ్ం తర్పయామి**

కృష్ణద్వైపాయణుణ్ణి వ్యాసమహర్షి అని అంటారు. ఆయన వేదాలను క్రోడీకరించారు. మొత్తం వేదాలను మనుష్యులు గుర్తు పెట్టుకోలేరని గ్రహించి, ఆయన నలుగురు శిష్యులను పిలిచి, ఒక్కొక్క శిష్యుణ్ణి ఒక్కొక్క వేదాన్ని పరిరక్షించమన్నారు. ఆయన అసలు పేరు కృష్ణద్వైపాయణుడు. ఆయన వేదాలను విభజించి, పరిరక్షించాడు కాబట్టి వేదవ్యాసుడు అనే పేరు వచ్చింది. అదే క్రమేపీ వ్యాసునిగా స్థిరపడింది. అందువల్ల మునులలో పరమాత్మ వ్యాసుడు.

**కవీనాముశనా కవిః** – త్రికాల దర్శకులలో నేను శుక్రాచార్యుడను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉశనా అంటే శుక్రాచార్యులవారు. ఈయన రాక్షసులకు గురువు. గొప్ప ఋషి. ఇక్కడ కవి అంటే నిజంగా కవి కాదు. త్రికాలజ్ఞుడు. క్రాంతదర్శి. అంటే భూత భవిష్యత్ కాలాలలోకి తొంగి చూడగలరు. అతీంద్రియ శక్తులున్నవారు. అంటే మన ఇంద్రియాలకు ఉన్న శక్తిని మించి శక్తి ఉన్నవారు. అలాంటి అతీంద్రియ శక్తులు ఉన్నవారిలో పరమాత్మ శుక్రాచార్యులవారు.

శ్లో. 38 **దండో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్ ।**
**మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్ ॥**
దండః, దమయతామ్, అస్మి, నీతిః, అస్మి, జిగీషతామ్,
మౌనమ్, చ, ఏవ, అస్మి, గుహ్యానామ్, జ్ఞానమ్, జ్ఞానవతామ్, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| దమయతామ్ | = శిక్షించువారిలో | మౌనమ్, అస్మి | = మౌనమును నేను |
| దండః, అస్మి | = దండించుశక్తిని నేను | చ | = ఇంకా |
| జిగీషతామ్ | = జయేచ్ఛ గలవారిలో | జ్ఞానవతామ్ | = జ్ఞానుల |
| నీతిః, అస్మి | = నీతిని నేను | జ్ఞానమ్ | = తత్త్వజ్ఞానమును |
| గుహ్యానామ్ | = గోప్యవిషయ రక్షణమున | అహమ్, ఏవ | = నేను |

**దమయతామ్ దణ్డః అస్మి, జిగీషతామ్ నీతిః అస్మి ।**
**గుహ్యానామ్ మౌనమ్, జ్ఞానవతామ్ జ్ఞానమ్ చ ఏవ అహమ్ అస్మి ।**

తా: శిక్షించువారిలో దండించుశక్తిని నేను, జయేచ్ఛ గలవారిలో నీతిని నేను, గోప్యవిషయ రక్షణమున మౌనమును నేను ఇంకా జ్ఞానుల తత్త్వజ్ఞానమును నేను.

**దండో దమయతామస్మి** – శిక్షించేవారిలో దండించే శక్తిని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. దండం అంటే కొట్టే కర్ర. ఎదుటి మనిషిని మార్చటానికి సామదానభేదదండోపాయాలను ఉపయోగిస్తారు. దండన చివరగా చెయ్యాలి.

మొదటి మూడూ పనిచెయ్యకపోతే దండించాలి. కాని చాలామంది మంచిమాటలు చెపితే వినరు. దండిస్తే టక్కున వింటారు. అందువల్లనే చాలామంది తల్లిదండ్రులు, స్కూళ్ళల్లో టీచర్లు దండిస్తుంటారు.

ఇప్పుడు పిల్లలను కొట్టకూడదనే నియమం వచ్చింది. అలా కొడితే వారు మానసికంగా దెబ్బతింటారు అంటారు. కాని కొట్టకుండా పిల్లలను మార్చాలంటే దానికి చాలా క్షమాగుణం కావాలి. ఎన్నో మంచిమాటలు చెప్పాలి. అవి చేసే పనిని ఒక్క దెబ్బ సాధిస్తుంది. అందువల్ల దండనే ఉపయోగిస్తారు చాలామంది. అందువల్ల శిక్షించేవారిలో పరమాత్మ దండన కర్ర.

**నీతిరస్మి జిగీషతామ్** – రాజులలో నేను రాజనీతిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. రాజులు విజయం సాధించాలంటే కొంత లౌక్యం పాటించాలి. ఆ లౌక్యాన్ని నీతి అంటున్నాడు కృష్ణపరమాత్మ. జిగీషతామ్ అంటే జయించాలనే ఇచ్ఛ ఉన్నవారు. అందువల్ల జయించాలనే ఇచ్ఛ ఉన్న రాజులలో పరమాత్మ రాజనీతి.

**మౌనం చైవాస్మి గుహ్యానామ్** – రహస్యాలన్నిటిలోకి మౌనం నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే రహస్యాన్ని ఎప్పుడైతే పలుకుతామో, అప్పుడింక అది ఏమాత్రం రహస్యం అవదు. అందువల్ల మౌనం ముఖ్యమైనది.

అంతేకాదు మౌనం బ్రహ్మను సూచిస్తుంది కూడా. మాండూక్యోపనిషత్తులో ఓంకార విశ్లేషణ వస్తుంది. ఓంకారంలో మూడు మాత్రలు ఉన్నాయి. అవి అకారం, ఉకారం, మకారం. ఓంకారాన్ని ఒకసారి ఉచ్చరించాక, రెండవసారి ఉచ్చరించే ముందు కొంత నిశ్శబ్దం ఏర్పడుతుంది. ఆ నిశ్శబ్దాన్ని **అమాత్ర** అంటారు. ఆ అమాత్ర బ్రహ్మను సూచిస్తుంది. నిశ్శబ్దంలో ఏం ఉంది? నిశ్శబ్దంలో ఏమీ లేదు అంటాము సాధారణంగా. కాని ఆ ఏమీ లేదుని సాక్షిగా చూసేది ఒకటి ఉంది. అది సాక్షిచైతన్యం. అందువల్ల మాండూక్యోపనిషత్తులో నిశ్శబ్దం అంటే బ్రహ్మ. అందువల్ల రహస్యాలలో మౌనం నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. మౌనం అంటే బ్రహ్మ కూడా వస్తుంది కాబట్టి బ్రహ్మను రాజవిద్యా రాజగుహ్యం అన్నారు భగవద్గీతలోనే. గుహ్యం అంటే రహస్యం. అందువల్ల రహస్యాలలో పరమాత్మ మౌనం.

**జ్ఞానం జ్ఞానవతామహమ్** – జ్ఞానులలో జ్ఞానాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞానుల గొప్పతనం వారి జ్ఞానంలో ఉంది. ఆ జ్ఞానం భగవంతుని స్వరూపం. అందువల్ల మనం జ్ఞానికి నమస్కారం చేస్తే, ఆ నమస్కారం జ్ఞానికి చెందదు. అది అతని జ్ఞానానికి చెందుతుంది. అతనిలోని జ్ఞానం నేను అని కృష్ణపరమాత్మ అంటున్నాడు కాబట్టి జ్ఞానికి నమస్కారం చేస్తే, ఆ నమస్కారం సాక్షాత్తూ భగవంతునికి చెందుతుంది. జ్ఞానికి కూడా ఆ విషయం తెలుసు. అందువల్ల ఎవరైనా తనకు నమస్కరిస్తే అతను ఆ నమస్కారాన్ని తనకు స్వీకరించడు. తెలివిగా భగవంతునికి అర్పిస్తాడు. అందువల్ల జ్ఞానులలో పరమాత్మ జ్ఞానం.

శ్లో. 39 **యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున ।**
**న తదస్తి వినా యత్ స్యాత్ మయా భూతం చరాచరమ్ ॥**
యత్, చ, అపి, సర్వభూతానామ్, బీజమ్, తత్, అహమ్, అర్జున,
న, తత్, అస్తి, వినా, యత్, స్యాత్, మయా, భూతమ్, చరాచరమ్ ॥

| | | | |
|---|---|---|---|
| చ | = ఇంకా | యత్ చరాచరమ్ | = ఏ చరాచర |
| అర్జున! | = ఓ అర్జునా! | భూతమ్ | = జీవరాశి |
| యత్ | = ఏది | మయా, వినా స్యాత్ | = నేను లేనిచో |
| సర్వభూతానామ్ | = సమస్త చరాచరప్రాణులయొక్క | తత్ | = అది (జీవరాశి) |
| బీజమ్ | = బీజమో (ఉపాదానకారణమో) | న, అస్తి | = ఉండనే ఉండదు |
| తత్, అపి, అహమ్ | = ఆ ఉపాదానకారణమును నేనే | | |

**హే అర్జున! చ సర్వ-భూతానామ్ యత్ బీజమ్ తత్ అపి అహమ్ (అస్మి),**

**యత్ చర-అచరమ్ భూతమ్ స్యాత్ తత్ మయా వినా న అస్తి ।**

తా: ఇంకా ఓ అర్జునా! ఏది సమస్త చరాచరప్రాణులయొక్క బీజమో (ఉపాదానకారణమో) ఆ ఉపాదానకారణమును నేనే. చరాచర జీవరాశి నేను లేనిచో, ఉండనే ఉండదు.

ఇక్కడితో తన విభూతుల గురించిన వర్ణనను ముగించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

**అర్జున అహం సర్వభూతానాం బీజమ్ (అస్మి)** – ఓ అర్జునా, అన్ని జీవరాశులకు బీజాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. బీజం అంటే ఉపాదానకారణం. ఎలాగైతే మట్టి అన్ని రకాల కుండలకు ఉపాదానకారణమో, ఎలాగైతే బంగారం అన్ని ఆభరణాలకూ ఉపాదానకారణమో, అలా భగవంతుడు సృష్టి అంతటకూ ఉపాదానకారణం.

ఉపాదానకారణం ఎప్పుడూ కార్యం అంతటా ఉంటుంది. నిజానికి ఆ కార్యానికి ఉనికి ఏర్పడేదే ఈ ఉపాదాన కారణంవల్ల. **ఆభరణం ఉంది** అంటే ఆ ఉందిలోని ఉనికి ఆభరణానిది కాదు, బంగారానిది. ఆభరణం నామరూపం మాత్రమే. దానికి విడిగా ఉనికి లేదు. అలాగే కుండ ఉనికి మట్టిది, కుండ నామరూపం మాత్రమే.

**వాచాఽఽరంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్** – ఛాందోగ్యం

బంగారం సత్యం, ఆభరణం మిథ్య అని ఎలా నిరూపిస్తాము? ఆభరణంనుంచి బంగారం తీసేస్తే, అక్కడ ఆభరణం మిగలదు. అందువల్ల ఆభరణానికి ఉనికిని ఇచ్చేది బంగారం. అలాగే జగత్తుకు ఉనికిని ఇచ్చేది బ్రహ్మ. బ్రహ్మ లేకపోతే జగత్తుకు విడిగా ఉనికి లేదు. బల్ల ఉంది, కుర్చీ ఉంది, ఫ్యాను ఉంది. ఇలా అన్నింటిలో చెప్పే 'ఉంది;' బ్రహ్మయొక్క ఉనికిని సూచిస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే సృష్టిలో సత్ అంశం అంటే ఉనికిని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ విభూతుల వర్ణన మొదలుపెట్టేముందు ఏమన్నాడు కృష్ణపరమాత్మ?

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః** – 10.20

అన్ని జీవరాశుల్లో నేను ఆత్మగా ఉన్నాను అన్నాడు. అక్కడ ఆత్మ అంటే చైతన్యం లేదా చిత్ అంశం. ఇక్కడ బీజం అంటే సత్ అంశం. ఈ జగత్తు మొత్తంలో పరమాత్మ సత్ అంశం.

**మయా వినా యత్ చరాచరం భూతం స్యాత్ తత్ న అస్తి** – నా దీవెన లేనిదే ఈ చరాచరప్రపంచంలో దేనికీ ఉనికి లేదు. బంగారు ఆభరణాలకు నేను లేకుండా వాటికి విడిగా ఉనికి లేదని ఎలాగైతే బంగారం చెప్పగలదో, అలా భగవంతుడు నా దీవెన లేనిదే ఈ చరాచరప్రపంచంలో నేను లేకుండా వాటికి విడిగా ఉనికి లేదని చెబుతున్నాడు. అందువల్ల ఎవరైనా భగవంతుడు ఎక్కడున్నాడు అని అడిగితే, ఎక్కడ లేడని ఎదురు ప్రశ్నించ గలగాలి. ఆ విధంగా చిత్‌తో మొదలుపెట్టి, సత్‌తో ముగిస్తున్నాడు. సత్, చిత్‌లు నిర్గుణ ఈశ్వరవిభూతులు, తక్కిన విభూతులు అన్నీ సగుణ ఈశ్వరవిభూతులు. విభూతి అంటే మహిమ అని మర్చిపోకూడదు.

శ్లో. 40 **నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।**
**ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా ॥**
న, అంతః, అస్తి, మమ, దివ్యానామ్, విభూతీనామ్, పరంతప,
ఏషః, తు, ఉద్దేశతః, ప్రోక్తః, విభూతేః, విస్తరః, మయా ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓ అర్జునా! | మయా | = నాచేత |
| మమ | = నాయొక్క | విభూతేః | = విభూతులయొక్క |
| దివ్యానామ్ | = దివ్యములైన | ఏషః | = ఈ |
| విభూతీనామ్ | = విభూతులకు | విస్తరః, తు | = విస్తరణ అయితే |
| అంతః | = అంతమే | ఉద్దేశతః | = సంక్షిప్తముగా |
| న, అస్తి | = లేదు | ప్రోక్తః | = చెప్పబడినది |

**హే పరన్తప! మమ దివ్యానామ్ విభూతీనామ్ అన్తః న అస్తి,**
**ఏషః తు విభూతేః విస్తరః మయా ఉద్దేశతః ప్రోక్తః ।**

తా: ఓ అర్జునా! నాయొక్క దివ్యములైన విభూతులకు అంతమే లేదు. నాచేత విభూతులయొక్క ఈ విస్తరణ సంక్షిప్తముగా చెప్పబడినది.

ఇక్కడ కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, 'ఓ అర్జునా, నేను నా విభూతుల గురించి చెప్పటం ఆపానంటే, దానికి కారణం అవి అయిపోయాయని కాదు. ఎందుకంటే వాటికి అంతం లేదు.'

**పరంతప మమ దివ్యానాం విభూతీనాం అంతః న అస్తి** – ఓ అర్జునా, నా విభూతులకు అంతులేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆయన విభూతులకు అంతు లేకపోతే కృష్ణపరమాత్మ పనిగట్టుకుని కొన్నింటిని వివరించటం ఎందుకు?

**ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా** – నాయొక్క విభూతులు చాలా ఉన్నాయి కాని, వాటిలోంచి కొన్నింటిని సంక్షిప్తంగా చెప్పాను అంటున్నాడు. ఉద్దేశితః అంటే సంక్షిప్తంగా చెప్పాడు. అయితే ఈ పట్టికను ఎలా విస్తారంగా చేసుకోవాలి? దానికి ఒక పద్ధతి చెబుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి ఈ పదవ అధ్యాయాన్ని తీసుకుని హెూమ్‌వర్క్ చెయ్యవచ్చు. దానికి ఒక పద్ధతిని చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 41 **యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥**
యత్, యత్, విభూతిమత్, సత్త్వమ్, శ్రీమత్, ఊర్జితమ్, ఏవ, వా,
తత్, తత్, ఏవ, అవగచ్ఛ, త్వమ్, మమ, తేజోఽంశసంభవమ్ ॥

| | | | |
|---|---|---|---|
| విభూతిమత్ | = మహిమ | తత్, తత్ | = ఆయా వస్తువులు |
| శ్రీమత్ | = ఐశ్వర్యము | మమ తేజోంశ | = నా తేజముయొక్క |
| వా | = ఇంకా | సంభవమ్, ఏవ | = అంశ నుండియే |
| ఊర్జితమ్ | = శక్తి | | సంభవించినవిగా |
| యత్, యత్, ఏవ | = ఏయే | త్వమ్ | = నీవు |
| సత్త్వమ్ | = వస్తువులందు కలవో | అవగచ్ఛ | = గ్రహింపుము |

**యత్ యత్ సత్త్వమ్ విభూతిమత్, శ్రీమత్ ఊర్జితమ్ ఏవ వా**
**(అస్తి), తత్ తత్ మమ తేజః అంశ-సమ్భవమ్ (అస్తి ఇతి) త్వమ్ అవగచ్ఛ ।**

తా: మహిమ, ఐశ్వర్యము ఇంకా శక్తి ఏయే వస్తువులందు కలవో ఆయా వస్తువులు నా తేజము యొక్క అంశ నుండియే సంభవించినవిగా నీవు గ్రహింపుము.

నువ్వు స్వంతంగా ఒక పట్టికను తయారు చేసుకోవచ్చు అంటున్నాడు.ప్రపంచంలో అనేక అద్భుతాలను చూస్తాము. కొన్ని వస్తువులు చూస్తే అలా నిశ్చేష్టులమై వాటికేసి చూస్తాము. అలా వచ్చినవే ప్రపంచంలోని ఏడు అద్భుతాలు. వాటికి భిన్నంగా ఇంకొక అద్భుతమైన వస్తువు కనిపిస్తే, దాన్ని ఎనిమిదవ వింత అంటాము. ఆ అద్భుతం సహజమైనది కావచ్చు, కృత్రిమమైనది కావచ్చు. అవి నా విభూతులుగా తెలుసుకో.

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా** – యత్ యత్ విభూతి – ఏ వస్తువును చూస్తే నీకు అద్భుతంగా అనిపిస్తుందో, అది చిన్న పురుగునుంచి పెద్దకొండవరకూ ఏదైనా కావచ్చు, అది నా విభూతి. శ్రీమత్ అంటే ఐశ్వర్యవంతంగా ఉండేది, అంటే చాలా విలువైనది. ఉదాహరణకు ఒక విలువైన వజ్రాన్ని తీసుకుంటే అది చాలా ఖరీదైనది, చాలా విలువైనది. కొన్ని లక్షల ఖరీదు చేస్తుంది.

ఆ విధంగా ఖరీదైనది కాని, శక్తివంతమైనది కాని, ఏది చూసినా అది నా విభూతే అంటున్నాడు కృష్ణపరమాత్మ. సూర్యుని కాంతి, శక్తి తీసుకోండి. ఎన్ని సంవత్సరాలుగానో మన భూమిమీదకు తన కాంతిని ప్రసరింపజేస్తున్నాడు సూర్యభగవానుడు. ఈ భూప్రపంచం మొత్తాన్ని పన్నెండు గంటలు విద్యుచ్ఛక్తితో కాంతివంతం చెయ్యాలంటే ఎంత ధనం ఖర్చు పెట్టాలి, ఎంత శ్రమ పడాలి? అటువంటి కాంతిని సూర్యుడు మనకు రూపాయి ఖర్చు లేకుండా సంవత్సరాల తరబడి ఇస్తున్నాడు. ఇప్పటికీ ఇస్తూనే ఉన్నాడు.

అంతేనా? నక్షత్రాలను చూడండి, మెరుపును చూడండి, జలపాతాన్ని చూడండి. ప్రకృతిలో శక్తివంతమైనది ఏది చూసినా ఎంత ఆశ్చర్యం వేస్తుంది! అంతేకాదు ఎన్ని అందాలు ఉన్నాయి ప్రకృతిలో. నిజంగా ప్రకృతిని

సరిగ్గా ఆస్వాదిస్తే దాని అందాలతో మైమరచిపోతాము. అటువంటి అందాన్ని, అటువంటి అద్భుతాన్ని చూసినప్పుడు దేవుని సృష్టి ఎంత అద్భుతం అని అనుకోకుండా ఉండలేము. మతపరమైన భావన ఉన్న వ్యక్తి అద్భుతమైనదాన్ని దేన్ని చూసినా దానికి నమస్కారం చేస్తాడు. అంతేకాదు, పూర్వకాలంలో ఒకవేళ ఏదైనా అటువంటి అద్భుతమైన వస్తువు ఎవరికైనా దొరికినా కూడా అతను దాన్ని ఉంచుకునేవాడు కాదు. ఇంత అద్భుతాన్ని నా దగ్గర పెట్టుకునే అర్హత నాకు లేదు అనుకునేవాడు. అది ఆలయంలో ఇచ్చేసేవాడు. ఎందుకు? అందులో అతను భగవంతుణ్ణి చూస్తాడు కాబట్టి.

**తత్ తత్ ఏవ అవగచ్ఛ** – అటువంటి అసాధారణ శక్తివంతమైన వస్తువు గాని, అటువంటి అసాధారణమైన అందమైన వస్తువు గాని నాయొక్క అనంతమైన విభూతులలో ఒకటి అని తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. అది నా విభూతి మొత్తం కాదు, నా విభూతిలో ఒక చిన్న అంశం మాత్రమే.

**మమ తేజోఽంశసంభవమ్** – అది నా తేజస్సులో ఒక చిన్న అంశం మాత్రమే అంటున్నాడు కృష్ణపరమాత్మ. తేజస్సు అంటే మహిమ. అంశం అంటే చాలా చిన్న భాగం. నా విభూతిలో చాలా చిన్న అంశం అది. అందువల్లనే మనం ప్రకృతిని ఆరాధిస్తాము.

శ్లో. 42 **అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।**
**విష్టభ్యాహమిదం కృత్స్నమ్ ఏకాంశేన స్థితో జగత్ ॥**
అథవా, బహునా, ఏతేన, కిమ్, జ్ఞాతేన, తవ, అర్జున,
విష్టభ్య, అహమ్, ఇదమ్, కృత్స్నమ్, ఏకాంశేన, స్థితః, జగత్ ॥

| | | | |
|---|---|---|---|
| అథవా | = అథవా | జగత్ | = జగత్తును |
| అర్జున! | = ఓ అర్జునా! | అహమ్ | = నేను (నా యోగశక్తియొక్క) |
| ఏతేన | = ఇలా | ఏకాంశేన | = ఒక్క అంశతోనే |
| బహునా, జ్ఞాతేన | = ఎక్కువగా తెలిసికొనుట వలన | విష్టభ్య | = ధరించి |
| తవ, కిమ్ | = నీకు కలుగు ప్రయోజనమేమి | స్థితః | = స్థితమైయున్నాను |
| ఇదమ్, కృత్స్నమ్ | = ఈ సమస్త | | |

**హే అర్జున! అథవా ఏతేన బహునా జ్ఞాతేన తవ కిమ్? అహమ్**
**ఇదమ్ కృత్స్నమ్ జగత్ ఏక-అంశేన విష్టభ్య స్థితః (అస్మి ఇతి త్వం విద్ధి) ।**

తా: అథవా ఓ అర్జునా! ఇలా ఎక్కువగా తెలిసికొనుట వలన నీకు కలుగు ప్రయోజనమేమి ఈ సమస్త జగత్తును నేను నా యోగశక్తియొక్క ఒక్క అంశతోనే ధరించి స్థితమైయున్నాను.

### 4. ఉపసంహారం: శ్లోకం 42

ఈ శ్లోకంతో ఈ అంశానికి ముగింపు పలుకుతున్నాడు. ఇప్పుడు 'ఓ అర్జునా, ఈ మొత్తం విషయాన్ని నువ్వు ఇంకొక కోణంలోంచి కూడా చూడవచ్చు,' అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఉదాహరణకు నీరు విషయం తీసుకుందాము. నీరు అంతటా ఉంది; అది చిన్న అలలో ఉంది, చిన్న బుడగలో ఉంది, నీటి చుక్కలో ఉంది అంటాము. నీరును చూసే ఒక మార్గం ఇది. ఇంకో విధంగా చూడాలంటే? నీరు అలలో, బుడగలో, చుక్కలో ఉండటం కాదు, నిజానికి నీటిలోనే ఈ చిన్నచిన్న వన్నీ అంటే – అల, బుడగ, చుక్క ఉన్నాయి అంటాము. అదే విధంగా భగవంతుడు అన్నింటిలో ఉన్నాడని ముందు చూశాము. ఇప్పుడు దాన్ని తిరగేసి భగవంతునిలోనే అన్నీ ఉన్నాయి అంటాము.

**అథవా** – ఇంకో విధంగా చెప్పాలంటే;

**బహునైతేన జ్ఞాతేన కిమ్** – ఇంత విస్తారమైన వివరణ ఎందుకు అర్జునా? నేను మునులలో వ్యాసాచార్యుణ్ణి, నదులలో గంగను, జ్ఞానులలో జ్ఞానాన్ని – ఇలా వరుసగా అన్నింటిలో నేను ఉన్నాను అని చెప్పుకుంటూ పోవటం ఎందుకు? నాలోనే అన్నీ ఉన్నాయి అని చెప్పదలుచుకున్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అహమ్ ఇదం కృత్స్నం జగత్ విష్టభ్య స్థితః** – నిజానికి సృష్టి మొత్తం నాలోనే ఉంది.

ఈ గదిలో ఆకాశం ఉందని చెప్పటం మొదటి మెట్టు. నిజానికి ఆకాశంలోనే అన్ని గదులూ ఉన్నాయని చెప్పగలగటం అసలు విషయం. అలాగే భగవంతుడు అన్ని జీవరాశుల్లోనూ ఉన్నాడు మొదటిమెట్టు. నిజానికి భగవంతునిలోనే అన్ని జీవరాశులూ ఉన్నాయని అర్థం చేసుకోవటం అసలు విషయం. భగవంతుడే వాటికి స్థితికర్త.

**ఏకాంశేన** – ఈ విశ్వం మొత్తం నాలో కేవలం ఒక చిన్న అంశం మాత్రమే అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఒక సముద్రంలో ఒక చిన్నబుడగలాంటిది, సముద్రమంత పరమాత్మలో ఈ విశ్వం. ఈ విధంగా తనలోనే విశ్వమంతా ఉందని, అది ఒక్క చిన్న అంశలాంటిదనీ చెప్పి తన విభూతి యోగాన్ని ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే విభూతియోగోనామ దశమోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీ మద్భగవద్గీతయందు, ఉపనిషత్తులందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు విభూతియోగము అనే దశమోధ్యాయము.

# అధ్యాయం 10 - విభూతియోగము సారాంశము

పదవ అధ్యాయం భగవద్గీత యొక్క మధ్యమషట్కంలో అంటే రెండవ షట్కంలో ఉంది. భగవద్గీతను మూడు షట్కాలుగా విభజించవచ్చు. అవి మొదటి షట్కము, రెండవ షట్కము, మూడవ షట్కము. ఆరేసి అధ్యాయాలను కలిపి ఒక షట్కము అంటారు.

| | | |
|---|---|---|
| మొదటి షట్కము | - 1-6 అధ్యాయాలు | - జీవస్వరూపం |
| రెండవ షట్కము | - 7-12 అధ్యాయాలు | - ఈశ్వర స్వరూపం |
| మూడవ షట్కము | - 13-18 అధ్యాయాలు | - జీవఈశ్వర ఐక్యం |

ఈ రెండవషట్కము ఈశ్వరస్వరూపాన్ని చర్చిస్తున్నది. దానివల్ల ఈశ్వరుని గురించి మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఈ అంశాన్ని ఏడవ అధ్యాయంతో ప్రారంభించి, దాన్ని నెమ్మదిగా విస్తరించుకుంటూ వచ్చి, పన్నెండవ అధ్యాయంతో ముగిస్తాడు కృష్ణపరమాత్మ.

ఏ ఆధ్యాత్మిక గ్రంథం చూసినా, ఈశ్వరుని నిర్వచనం దగ్గరికి వచ్చేసరికి సాధారణంగా ఆయనను జగత్కారణంగా అభివర్ణిస్తారు. అంటే భగవంతుడు సృష్టికర్త. సంస్కృతంలో కర్త పదం వాడతారు. అంటే జగత్తును సృష్టించినవాడు. ఇది వినేసరికి ఈశ్వరుణ్ణి గురించి మనం కొన్ని సిద్ధాంతాలను ఏర్పరచుకుంటాము. అవేమిటో చూద్దాము.

ఎ) **అనుమిత స్వరూపం** – శాస్త్రం ఏమంటున్నది? ఈశ్వరుడు సృష్టికర్త అంటున్నది. కాని మనకు ఎదురయ్యే మొట్టమొదటి సమస్య ఏమిటి? ఆ సృష్టికర్త ఎలా ఉంటాడో తెలియదు మనకు. ఆ మాటకొస్తే మన చుట్టూ ఉన్న వస్తువులలో దేన్ని చూసినా, దాని సృష్టికర్తను చూడలేము. బల్లకు సృష్టికర్త ఉన్నాడని తెలుసు, కాని అతను కనబడడు; ఈ గదికి సృష్టికర్త ఉన్నాడని తెలుసు కాని అతను కనబడడు. అంటే మామూలుగా కూడా సృష్టికర్త కనబడడు కాని అతను ఉన్నాడని తార్కికంగా తెలుసుకుంటాము.

ఈశ్వరుణ్ణి అనుమిత స్వరూపం అంటారు. అంటే ఈశ్వరుడు ప్రత్యక్షంగా కనబడడు. కాని అనుమానం అంటే తర్కంద్వారా తెలుసుకుంటాము. ప్రత్యక్షంగా కనబడని ఈశ్వరుడు ఉన్నాడని తర్కంద్వారా తెలుసు కుంటాము కాబట్టి ఆయనను పరోక్ష ఈశ్వరుడు అంటాము. అందువల్ల భగవంతుని గురించిన మొదటి సిద్ధాంతం – ఆయన ప్రత్యక్షంగా కనబడడు, పరోక్షంగా ఉన్నాడు అని ఊహించుకుంటాము.

బి) **కల్పితరూపం** – కంటికి కనబడని సృష్టికర్త ఎలా ఉంటాడు? ఈ బల్లను సృష్టించిన అతను ఎలా ఉంటాడు? అతన్ని నేను ఊహించుకోవాలి. అలాగే జగత్తును సృష్టించిన సృష్టికర్త ఎలా ఉంటాడో తెలియదు కాబట్టి ఆయన రూపాన్ని ఊహించుకోవాలి. దీన్ని కల్పితరూపం అంటారు. అంటే ఈశ్వరుడు అనుమిత స్వరూపం, పరోక్షం, కల్పితరూపం.

ఒకవేళ ఈ బల్లను సృష్టించిన వ్యక్తిని ఊహించుకోవాలంటే ఏం చేస్తాము? అతను ఖచ్చితంగా మనిషై ఉంటాడు అంటాము. ఎందుకు? జంతువులకు అంత తెలివితేటలు లేవు. మనిషి మాత్రమే బుద్ధిజీవి. అతనికే తెలివితేటలు ఉన్నాయి. అందువల్ల అతను తన బుద్ధిని ఉపయోగించి ఈ బల్లను సృష్టించి ఉంటాడు.

అదే విధంగా ఈ జగత్తుయొక్క సృష్టికర్తను ఊహించుకోవాలంటే, ఎవరిని ఊహిస్తాము? మానవాకారం ఉన్న భగవంతుణ్ణి. ఆ భగవంతుడు ప్రత్యక్షమా, పరోక్షమా? ఖచ్చితంగా పరోక్షమే. ఊహనుంచి వచ్చిన రూపమే. ఎందుకంటే భగవంతుడు కంటికి కనబడడు కాబట్టి. అందువల్ల భగవంతుణ్ణి మనిషికన్నా చాలా తెలివైన వ్యక్తిగా ఊహించుకుంటాము.

మామూలు మనిషి మామూలు విషయాలను సృష్టిస్తే, ఇంత అద్భుతమైన జగత్తును సృష్టించటానికి భగవంతునికి ఇంకెంత ఎక్కువ ప్రజ్ఞాపాటవాలు ఉండి ఉండాలి? అందువల్ల ఏం చేస్తాము? మనకు ఒక తల ఉంటే, ఆయనకు అనేక తలలు ఉన్నట్టుగా ఊహించుకుంటాము. అనేక తలలు అతను సర్వజ్ఞుడు అని సూచిస్తాయి.

అలాగే భగవంతుడు సర్వశక్తివంతుడు అయివుండాలి. ఒక మామూలు బల్లనో, గదినో సృష్టించటానికే కొంత శక్తి కావాలంటే, ఇంత అద్భుతాలతో కూడిన జగత్తును సృష్టించాలంటే ఇంకెంత శక్తి కావాలి? అందువల్ల చేతులను పెంచుతాము. భగవంతునికి అనేక చేతులు ఉన్నట్టుగా చూపిస్తాము.

అలా భగవంతునికి ఒక మానవాకారాన్ని ఇస్తాము. సృష్టికర్త అయిన భగవంతుడు మనిషి పోలికలతో ఉంటాడు అయినా మనకు ఇంకా పూర్తి వివరాలు తెలియవు. ఏ రంగులో ఉంటాడు భగవంతుడు? నల్లగా ఉంటాడా, తెల్లగా ఉంటాడా, పసుపువర్ణంలో ఉంటాడా, గోధుమవర్ణంలో ఉంటాడా? అంతేనా? ఈ సృష్టికర్త స్త్రీనా, పురుషుడా? అంతా అయోమయంగా ఉంది.

పోనీ శాస్త్రంలోకి తొంగిచూద్దామా అంటే శాస్త్రం అనేక రూపాలను ఇచ్చింది – రాముడు, శివుడు, విష్ణుమూర్తి, కృష్ణుడు. అలా ఎందరో ఉన్నారు. ఇంకా మన అయోమయం తీరదు. భగవంతుడు ఉన్నాడు, ఆయన కంటికి కనబడడు, మనం ఆయన రూపాన్ని ఊహించుకోవాలి; ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు. ఇంతవరకూ తెలుసు. ఆ భగవంతుడు ఒక్కరా, అనేకమా? అదృష్టం బాగుండి ఆ భగవంతుడు ఒక్కడే అంటున్నది శాస్త్రం.

కాని ఇంకా సమస్య తీరలేదు. భగవంతుడు ఒక్కడే – అంతవరకూ బాగానే ఉంది; కాని మనకు తెలిసిన ఈ భగవంతుని రూపాల్లో ఏ రూపం భగవంతునిది? భగవంతుని గురించి అనేక వర్ణనలు ఉన్నాయి. నీలమేఘశ్యాముడు అంటుంది; పీతాంబరధారి అంటుంది. ఈ రూపాల్లో ఏ రూపాన్ని తీసుకోవాలి? ఏది అసలు రూపం, ఏది ఆయన వేసుకున్న రూపం అంటే దీనికి కూడా జవాబులు భిన్నంగా వస్తాయి. విష్ణుభక్తుణ్ణి అడిగితే విష్ణుమూర్తి అసలు స్వరూపం, తక్కినవన్నీ వేషాలు అంటాడు. అదే శివభక్తుణ్ణి అడిగితే, శివుడే అసలు స్వరూపం, తక్కినవన్నీ వేషాలు అంటాడు. అదే దేవీభక్తుణ్ణి అడిగితే, దేవీ మాత్రమే అసలు స్వరూపం, తక్కినవన్నీ వేషాలు అంటాడు.

ఇప్పుడు మన సమస్య ఏమిటి? దేవుని అసలు స్వరూపం ఏమిటి? ఈ రూపాల్లో ఏది నిజమో మనకు తెలియదు. ఎందుకంటే ఇవన్నీ మనం ఊహించుకున్న రూపాలు. శాస్త్రమేమో ఈశ్వరదర్శనం అయితే మోక్షం కలుగుతుంది అంటుంది. ఇప్పుడు మనం ఆ ఈశ్వరదర్శనంకోసం ప్రయత్నించాలి. మనకు పరమేశ్వరుని దర్శనం ఎప్పుడవుతుంది? విష్ణుమూర్తిదర్శనం ఎప్పుడవుతుంది? అసలెప్పటికన్నా వస్తాడా లేదా? మన పురాణాలను చదివితే, కొందరు భక్తులకు భగవద్దర్శనం అయిందని చూస్తాము. త్యాగరాజుకు రామదర్శనం, మీరాబాయికి కృష్ణదర్శనం అయింది.

ఇప్పుడు మన సందేహం, మనకు కూడా ఎప్పటికైనా భగవద్దర్శనం కలుగుతుందా, లేదా? భగవద్దర్శనం కలగకపోతే మనకు మోక్షం కలుగుతుందా, లేదా? మనకు భగవంతుడనేవాడు ఒకడున్నాడని తెలుసు అంతవరకే. ఆయన గురించి అంతకన్నా వివరాలు తెలియవు; వస్తాడో రాడో తెలియదు; వస్తే మళ్ళీ వెళతాడో, లేదో తెలియదు. వెళ్ళకపోయినా భయమే.

ఇటువంటి అయోమయాలనుంచి కృష్ణపరమాత్మ మనను ఉన్నతస్థాయికి ఎదిగిలా చేస్తున్నాడు. భగవంతుని గురించిన మన సిద్ధాంతంలో మార్పు తెస్తున్నాడు. భగవంతుణ్ణి సృష్టికర్తగా తెలుసుకోవటం మంచిదే. కాని మనం మన సాధనలో ఇంకా ముందుకు వెళ్ళాలంటే, ఇప్పుడు మనకున్న జ్ఞానం సరిపోదు. ఏమిటా జ్ఞానం? ప్రస్తుతం మనకున్న జ్ఞానం, భగవంతుడు ఉన్నాడని; ఆయన పరోక్షమని అర్థం చేసుకుని ఆయనకొక కల్పితరూపాన్ని ఆపాదించాము.

ఈ జ్ఞానంనుంచి పైకి ఎదగాలి. గీతయొక్క మధ్యమషట్కంలో కృష్ణపరమాత్మ మనకు ఈశ్వరస్వరూపం వర్ణించటంద్వారా మనను ఉన్నతస్థాయికి ఎదిగిలా చేస్తున్నాడు. ఈశ్వరుణ్ణి కేవలం సృష్టికర్తగా తెలుసుకుంటే చాలదు. అక్కడితో ఆగిపోతే, మన జ్ఞానం అసంపూర్ణం అవుతుంది. జ్ఞానం అసంపూర్ణంగా ఉండిపోతే, అయోమయం తొలగదు, సాధన సాగదు; చీకట్లో తడుముకున్నట్టు అవుతుంది. దానికన్నా ఒక అడుగు ముందుకు వెయ్యాలి.

ఎలా వెయ్యాలి? భగవంతుడు సృష్టికారణం అంటున్నారు కదా, అయితే ఈ సృష్టికి ఉపాదానకారణం ఏమిటో తెలుసుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే దానికి ముడిసరుకు ఎక్కడ్నుంచి వచ్చింది? ఈ ప్రశ్న అడగనంతవరకూ మన జ్ఞానం అసంపూర్ణంగానే ఉంటుంది. కుమ్మరి కుండ సృష్టించాడంటే, ఆ కుండకు ముడిసరుకు మట్టి అని తెలుసు; కంసాలి ఆభరణాన్ని సృష్టించాడంటే, ఆ ఆభరణానికి ముడిసరుకు బంగారం అని తెలుసు.

భగవంతుడు ఈ జగత్తును సృష్టించాడంటే ఆయనకు ముడిసరుకు ఏమిటి?

**సదేవ సోమ్యేదమగ్రే ఆసీదేకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యం

సృష్టికి ముందు భగవంతుడు ఒక్కడే సత్ రూపంలో ఉన్నాడు. మరి దేవుడొక్కడే ఉంటే, ఆయనకు ముడిసరుకు ఎక్కడిది? ఈ ప్రశ్న అడిగి, దీనికి జవాబు తెలుసుకుని తీరాలి. లేదా అది అసంపూర్ణజ్ఞానం అవుతుందని చూశాము.

భగవంతుడు ఒక్కడే ఉంటే, ఆయనకు ముడిసరుకు ఎక్కడిది? అది కూడా ఆయననుంచే వస్తుందని కృష్ణపరమాత్మ చెప్పాడు. భగవంతుడు తప్ప, సృష్టికి ముందు ఏదీ లేకపోతే, భగవంతునికి ముడిసరుకు కూడా ఆయనే. అంటే భగవంతుడే సృష్టికర్త, భగవంతుడే ముడిసరుకు కూడా. పూజ్య స్వామీజీ **'మేకర్ అండ్ మెటీరియల్ ఆర్ రోల్డ్ ఇంటు వన్'** అంటారు. మేకర్‌ను నిమిత్త కారణం అనీ, మెటీరియల్‌ను ఉపాదానకారణం అనీ అంటారు. భగవంతుడే నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ కూడా. నిమిత్తకారణం చేతనతత్త్వం; ఉపాదానకారణం అచేతనతత్త్వం. అంటే భగవంతుడే చేతన–అచేతన తత్త్వం. దీన్నే పరా–అపరా ప్రకృతిగా ఏడవ అధ్యాయంలో చూశాము. ఇది వేదాంతబోధలో అతి ముఖ్యమైన అంశం.

భగవంతుడే సృష్టికి ముడిసరుకు కూడా అంటే ఆయన ఉపాదానకారణం కూడా; అంటే, దీన్నించి కొన్ని ఉపసిద్ధాంతాలను ఏర్పరచుకోవచ్చు. ఏమిటవి?

ఒక కార్యంయొక్క ఉపాదానకారణం, ఆ కార్యానికి భిన్నంగా ఉండదు. **ఉపాదానకారణం ఎన్నడూ కార్యానికి భిన్నంగా ఉండదు.** అంటే కార్యం అంతటా ఉంటుంది. బంగారం ఆభరణాలకు భిన్నంగా లేనట్టుగా; మట్టి కుండలకు భిన్నంగా లేనట్టుగా; కారణం ఎన్నడూ కార్యానికి భిన్నంగా ఉండదు. ఇప్పుడు ఒక ప్రశ్న. ఈ ఉపాదానకారణం కంటికి కనిపించే కారణమా, ఊహించే కారణమా? ఇప్పుడు నా కంటికి ఎదురుగా ఆభరణం ఉంది. దానికి ఉపాదానకారణం ఏమిటి? బంగారం. బంగారం కనిపిస్తుందా, మనం బంగారం ఉందని ఊహించుకోవాలా? బంగారం చక్కగా కనిపిస్తుంది. కార్యంలో కారణం చక్కగా కనిపిస్తుంది. ఉపాదానకారణాన్ని ఊహించుకోనవసరం లేదు. నిజానికి ఉపాదానకారణం లేకుండా కార్యానికి ఉనికి లేదు. అందువల్ల ఈశ్వరుణ్ణి ఊహించుకోనవసరం లేదు. ఆయన ఎక్కడో లేడు, ఈశ్వరుడు ప్రత్యక్షంగా కనిపిస్తాడు, ఈశ్వరుడు పరోక్షం కాదు.

ఇది వినేసరికి మన భావన పూర్తిగా మారుతుంది. ఈశ్వరుడు పరోక్షమా, ప్రత్యక్షమా? ఈశ్వరుడు ప్రత్యక్షసిద్ధం. ఆభరణాన్ని చేతిలో పెట్టుకుని నాకు స్వర్ణదర్శనం కావాలంటే ఎంత అర్థంలేని ప్రశ్న; కుండను చేతిలో పెట్టుకుని నాకు మట్టిదర్శనం కావాలంటే ఎంత అర్థంలేని ప్రశ్న. ఆభరణంలో బంగారం, కుండలో మట్టి ప్రత్యక్ష సిద్ధాలు. అలాగే జగత్తును ముందు పెట్టుకుని, నాకు భగవద్దర్శనం కావాలంటే అది కూడా అర్థంలేని ప్రశ్నే. అందువల్ల ఈశ్వరుణ్ణి కేవలం నిమిత్తకారణంగా చూస్తే, ఈశ్వరుడు పరోక్షం అవుతాడు; ఈశ్వరుణ్ణి ఉపాదాన కారణంగా తెలుసుకుంటే, ఈశ్వరుడు ప్రత్యక్షం అవుతాడు.

తర్వాత ప్రశ్న ఈశ్వరుని రూపం ఏమిటి? బంగారం రూపం ఏమిటంటే దానికి జవాబు ఏమిటి? అన్ని ఆభరణాల రూపాలూ బంగారంయొక్క రూపమే. గాజులో, గొలుసులో, ఉంగరంలో అన్ని రూపాల్లోనూ బంగారం ఉంది. ఇప్పుడు ఇంకొక ప్రశ్న. బంగారం కనిపిస్తోందా, లేదా? అక్షరాలా కనిపిస్తోంది.

అందువల్ల కృష్ణపరమాత్మ చెప్పాడు, ఇక్కడ కనపడే అన్ని రకాల రూపాలూ భగవంతుని రూపాలే. ఆ రూపాలన్నీ మన కళ్ళముందే ఉన్నాయి. అందువల్ల భగవంతునికి కల్పితరూపం ఇవ్వనవసరం లేదు.

ఈశ్వరునికి ప్రత్యక్షరూపం ఉంది. ఈశ్వరదర్శనం కావాలంటే మనం ఎన్ని రోజులు నామజపం చెయ్యాలి, ఎన్ని రోజులు తపస్సు చెయ్యాలి?

ఈశ్వరదర్శనం చెయ్యటంకోసం తపస్సు చెయ్యాలనుకుంటేనే, అది అసంపూర్ణజ్ఞానం కిందకు వస్తుంది అన్నాడు కృష్ణపరమాత్మ. అసంపూర్ణజ్ఞానం ఏమిటి? ఈశ్వరుణ్ణి కేవలం నిమిత్తకారణంగా తెలుసుకుంటే అది అసంపూర్ణజ్ఞానం. మరి సంపూర్ణజ్ఞానం ఏమిటి? ఈశ్వరుడు నిమిత్తకారణమే కాదు, ఉపాదానకారణం కూడా అని అర్థం చేసుకోవటం.

ఈశ్వరుడు ఉపాదానకారణం కూడా అని అర్థం చేసుకుంటే, నేను ఈశ్వరదర్శనంకోసం ఎదురు చూడనవసరం లేదు. ఎందుకు? ఏది చూసినా ఈశ్వరదర్శనం కలుగుతోంది. గాజు చూస్తే స్వర్ణదర్శనం అవుతోంది; ఉంగరం చూస్తే స్వర్ణదర్శనం అవుతోంది; గొలుసు చూస్తే స్వర్ణదర్శనం అవుతోంది; అంటే సర్వత్ర స్వర్ణదర్శనం. ఒకవేళ దేని గురించైనా ఆందోళన ఉండి తీరాలంటే, దేని గురించి ఉండాలి? ఈ జగత్తు మొత్తం భగవంతునియొక్క వ్యక్తరూపం అనే సత్యాన్ని మర్చిపోతానేమో అనే ఆందోళన ఉండాలి.

అందువల్ల మన ప్రార్థన ఎలా ఉండాలి? 'ఓ దేవా, నేను ఏది చూసినా నీయొక్క వ్యక్తరూపాన్నే అనే విషయాన్ని నేను మర్చిపోకుండా ఉండేలాగా చెయ్యి.' ఇలా జగత్తు అంతటా ఈశ్వరుణ్ణి చూడగలగటాన్ని **విశ్వరూప ఈశ్వరదర్శనం** లేదా **అనేకరూప ఈశ్వరదర్శనం** అంటారు. ఎప్పుడైతే ఇటువంటి ఈశ్వరదర్శనం అవుతుందో, అప్పుడే ఈ సృష్టిలో ఏ అద్భుతాన్ని చూసినా కూడా, అవన్నీ మనకు ఈశ్వరుని మహిమగాను చూపిస్తాయి.

### సర్వత్ర ఈశ్వర విభూతి దర్శనమ్ ఏవ భవతి

ఆ విధంగా, విశ్వరూపభక్తునికి ఏది చూసినా అది ఈశ్వరుని విభూతిగా తోస్తుంది. అలాంటప్పుడు అతను ఈశ్వరుని లీలలకోసం ఎదురుచూడడు. ఈశ్వరుడు ఏ దీర్ఘరోగాన్నో నయం చెయ్యాలి; అప్పుడే ఈశ్వరుని లీలను నేను గుర్తిస్తాను అనడు.

ఈశ్వరుని విభూతిని ఆస్వాదించటానికి, ఈశ్వరుడు ప్రత్యేకించి ఏమీ లీలలు చూపించనవసరం లేదు అన్నాడు కృష్ణపరమాత్మ. ఒక గురువు మాట్లాడగలిగితే అది ఈశ్వరవిభూతి, శిష్యుడు వినగలిగితే అది ఈశ్వరవిభూతి.

### జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ

మనలో రావాల్సిన మార్పు ఏమిటి? జగత్తును జగత్తుగా చూడకుండా, జగత్తును ఈశ్వరునియొక్క వ్యక్తరూపంగా అర్థం చేసుకోవటం. ఆభరణాలను చూసినప్పుడు వాటిల్లో ఉన్న బంగారాన్ని ఎన్నడూ ఎలా మర్చిపోమో, అలాగే జగత్తును చూసినప్పుడు కూడా ఈశ్వరుణ్ణి ఎన్నడూ మర్చిపోకూడదు.

ఈ భావననే కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలో మొదలుపెట్టి, విభూతియోగం పేరున్న ఈ పదవ అధ్యాయంలో కూడా కొనసాగించాడు. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయం సారాంశాన్ని చూద్దాము. పదవ అధ్యాయాన్ని ప్రధానంగా నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. ఈశ్వరస్వరూపజ్ఞానం – శ్లోకాలు 01 –11
2. అర్జునుని కోరిక – శ్లోకాలు 12 –18
3. ఈశ్వర విభూతిజ్ఞానం – శ్లోకాలు 19 –41
4. ఉపసంహారం – శ్లోకం 42

**1. ఈశ్వరస్వరూపజ్ఞానం: శ్లోకాలు 1-11**

1-11 శ్లోకాల్లో భగవంతునియొక్క ఈ నిర్వచనం ఇచ్చాడు. ఏమిటా నిర్వచనం?

భగవంతుడు నిమిత్తకారణమే కాదు, ఉపాదానకారణం కూడా.

**యథోర్ణనాభిః సృజ్యతే గృహ్ణతే చ** – ముండకం

శాస్త్రం సాలెపురుగును ఉదాహరణగా ఇస్తున్నది. సాలెపురుగు తానే నిమిత్తకారణం, ఉపాదానకారణం కూడా. తనలోంచే దారాన్ని తీసి తన సాలెగూడును కట్టుకుంటుంది. అదే విధంగా భగవంతుడు పరాప్రకృతి, అపరాప్రకృతి కూడా. పరాప్రకృతి అంటే నిమిత్తకారణం, అపరాప్రకృతి అంటే ఉపాదానకారణం. ఈ రెండింటినీ కలిపి శాస్త్రంలో ఇలా చెబుతాము –

**అభిన్న నిమిత్త ఉపాదాన కారణమ్**

కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో చెప్పాడు – బాహ్యప్రపంచమే నా వ్యక్తరూపం కాదు, అంతరప్రపంచం అయిన ఆలోచనలు కూడా నా వ్యక్తరూపమే. దీనికి స్వప్నం గొప్ప ఉదాహరణ. స్వప్నంలో నా మనస్సు చర అచర స్వప్నప్రపంచంగా వ్యక్తమవుతుంది. నా స్వప్నంలో కనిపించే కొండ, దాన్ని ఎక్కే మనిషి, కొండనుంచి వస్తున్న జలపాతం – అన్నీ నేనే. అలాగే జాగ్రద్ ప్రపంచంలో బాహ్య, అంతరప్రపంచం అంతా ఈశ్వరుడే. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి విరాట్‌భక్తుడు లేదా విశ్వరూపభక్తుడు అవుతాడు. అటువంటి విశ్వరూపభక్తునికి భగవంతుడు కేవలం ఆలయంలోనే లేడు. ఆ భక్తుడు భగవంతుణ్ణి అంతటా చూస్తాడు.

**అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।**
**ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః ॥** – 10.8

**మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।**
**కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥** – 10.9

విరాట్ భక్తుడు ఎవరిని చూసినా అతన్ని భగవంతునిగా భావిస్తాడు. **సహస్రశీర్ష పురుషః** – సహస్రశీర్ష పురుషః అంటే విష్ణుమూర్తిని వెయ్యి తలలతో ఉన్నట్టు ఊహించుకోకండి. ఎవరి తల చూసినా అది విష్ణుమూర్తిదే,

ఎవరి చేతులు చూసినా అవి విష్ణుమూర్తివే. అందువల్లనే మన సాంప్రదాయంలో చేతులు జోడించి నమస్కరిస్తాము. నమః తే అంటే నమస్తే. ఉపాధిపరంగా నువ్వూ, నేనూ వేరు కావచ్చు కాని ఇద్దరి ఉపాధులలోనూ ఉన్నది ఈశ్వరుడే. రూపాలు అనేకం, ఈశ్వరుడు ఏకం. అందువల్ల ఎదుటివ్యక్తి ఎటువంటివాడైనా కూడా అతనికి నమస్కారం చేస్తాము.

**మచ్చిత్తా మద్గతప్రాణా** అంటే ఏది చూసినా వారు దానిలో భగవంతుణ్ణే చూస్తారు. అంతేకాదు, ఇంకా ముఖ్యమైన విషయం, వారి జీవితంలో ఎటువంటి అనుభవం ఎదురైనా కూడా, దానిని కాదనరు; ప్రతిదీ ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తారు.

**మత్తః సర్వం ప్రవర్తతే** – వారికి వచ్చిన ఆనందకరమైన అనుభవాలూ ఈశ్వరునినుంచే వచ్చాయి, బాధాకరమైన అనుభవాలూ ఈశ్వరునినుంచే వచ్చాయి అనుకుంటారు. అన్నీ భగవత్ప్రసాదాలే.

**ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః.** – 10.8

ఈ విధంగా ఉపోద్ఘాతంలో కృష్ణపరమాత్మ విరాట్ స్వరూపం గురించి, విరాట్ భక్తుని గురించి మాట్లాడాడు. ఇది రెండవస్థాయి భక్తి. ఈ రెండవస్థాయి భక్తినుంచి కూడా ఎదగాలి. ఈ భక్తుడు విశ్వరూపభక్తినుంచి, నిర్గుణభక్తికి వస్తాడు. దీన్ని అరూపభక్తి అంటారు. అంటే ఒక భక్తుడు మూడు దశల్లో పయనిస్తాడు. ఏకరూపభక్తి నుంచి అనేకరూపభక్తికి వచ్చి, దాన్నించి చివరగా అరూపభక్తికి వస్తాడు.

అరూపభక్తికి ఎందుకు రావాలి? అనేకరూపభక్తి దగ్గరే ఎందుకు ఆగిపోకూడదు? అనేకరూప ఈశ్వరుడు కూడా అసంపూర్ణమే. ఎందుకంటే అందులో ఉన్న నామరూపాలన్నింటికీ దేశకాలపరిమితులు ఉంటాయి. విశ్వరూప ఈశ్వరునికి కూడా దేశకాలపరిమితి ఉంటుంది. అందువల్ల మిమ్మల్ని విశ్వరూప ఈశ్వరునికి అతీతంగా అరూపఈశ్వరునికి తీసుకువెళతాను అన్నాడు కృష్ణపరమాత్మ. అరూప ఈశ్వరుడు దేశకాల అతీతం; సత్ చిత్ ఆనంద స్వరూపం.

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥** – 10.10

వారికి నేను అరూప ఈశ్వరజ్ఞానం ఇస్తాను అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ అధ్యాయంలో విరాట్ ఈశ్వరుణ్ణి, విరాట్భక్తిని, విరాట్భక్తి ఫలాన్ని కూడా వివరించాడు.

### 2. అర్జునుని కోరిక: శ్లోకాలు 12–18

12–18 శ్లోకాల్లో అర్జునుడు కృష్ణపరమాత్మను ఒక కోరిక కోరాడు. అర్జునుడు తను అప్పుడే అరూప ఈశ్వరజ్ఞానానికి సిద్ధంగా లేడనుకున్నాడు. ఎందుకంటే ఏకరూపభక్తినుంచి అరూప ఈశ్వరునికి వెళ్ళాలంటే ఏకంగా పెద్దగెంతు గెంతాలి. అందువల్ల ఏకరూప ఈశ్వరునినుంచి అరూపఈశ్వరునికి రావటానికి మనకు

మధ్యలో ఒక స్థాయి కావాలి. ఏమిటది? అనేకరూప ఈశ్వరుడు. జగత్తును ఈశ్వరసృష్టిగా చూడగలగాలి. ఎప్పుడైతే జగత్తును ఈశ్వరసృష్టిగా చూస్తామో అప్పుడే మనలో ఉన్న రాగద్వేషాలు బలహీనమయిపోతాయి. ఈ రాగద్వేషాలు బలంగా ఉంటే, నిర్గుణబ్రహ్మకు రాలేము.

రాగద్వేషాలను పారద్రోలాలంటే అన్నీ భగవత్స్వరూపంగా చూడాలి. ఉన్నదంతా భగవంతుడే అని అర్థం చేసుకుంటే ఒకదానిని ఎలా ద్వేషించగలము? అంతా భగవంతునియొక్క సృష్టి. దేన్నీ ద్వేషించకూడదని తెలుసుకుంటాము. అంటే దీని అర్థం, నాగుపాముని చూస్తే దాన్ని చేతిలోకి తీసుకోమని కాదు, దానికి దూరంగా వెళ్ళి మనను రక్షించుకోవాలి; కాని అది కూడా భగవంతుని సృష్టిలోని ఒక జీవి అని మనస్సులో స్వీకరించాలి. ఆ విధంగా మనస్సు పరంగా దేన్నీ ద్వేషించకూడదు, దేన్నీ కాదనకూడదు.

అందువల్ల రాగద్వేషాలను పోగొట్టుకోవాలంటే ఏకరూప ఈశ్వరునినుంచి అనేకరూప ఈశ్వరధ్యానానికి ఎదగాలి. అందువల్ల అర్జునుడు, 'ఓ కృష్ణా, నాకు విశ్వరూప ఈశ్వరుని గురించి మరికొన్ని వివరాలు చెప్పు,' అన్నాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే విశ్వరూపవిభూతి వర్ణన చెయ్యమని కోరాడు అర్జునుడు.

ఎందుకు విభూతులు వర్ణించమన్నాడు? దానికి అర్జునుడే కారణం కూడా వివరించాడు. విశ్వరూపదర్శనం చాలా విస్తారంగా ఉంది. నా మనస్సు, ఇంద్రియాలశక్తి పరిమితంగా ఉంది. ఒకవైపు చూస్తే ఇంకొక వైపు చూడలేను. అలాంటప్పుడు విశ్వరూప ఈశ్వరధ్యానం చెయ్యాలంటే దేనిమీద ధ్యానం చెయ్యాలి? ఇదీ అర్జునుని సందేహం. మన భారతదేశానికి పూజ చెయ్యాలంటే ఎలా చేస్తాము. అది చాలా విస్తారంగా ఉంది. అందువల్ల జాతీయపతాకాన్నో, భారతమాతవిగ్రహాన్నో చూసి, వందనం చేస్తాము. అలాగే విశ్వరూప ఈశ్వరధ్యానం చెయ్యటానికి ఏదైనా ఆలంబనం కోరుతున్నాడు అర్జునుడు. సాలగ్రామంమీద విష్ణుమూర్తిని, పసుపుముద్దమీద వినాయకుణ్ణి ఆవాహన చేసినట్టుగా అర్జునుడు కొన్ని ఆలంబనలు తెలుసుకోవాలనుకున్నాడు.

**యాభిర్విభూతిభిర్లోకాన్ ఇమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి** – 10.16

**కథం విద్యామహం యోగిన్ త్వాం సదా పరిచింతయన్ ।**
**కేషు కేషు చ భావేషు చింత్యోఽసి భగవన్ మయా ॥** – 10.17

చింత్యోఽసి అంటే ధ్యానం చెయ్యటానికి.

### 3. ఈశ్వరవిభూతిజ్ఞానం: శ్లోకాలు 19–41

19–41 శ్లోకాల వరకూ కృష్ణపరమాత్మ తన విభూతులను వివరించాడు. విభూతి అంటే మహిమ.

జగత్తులో ఏ మహిమాత్మకమైన వస్తువును తీసుకున్నా కూడా అది నా విభూతే అన్నాడు కృష్ణపరమాత్మ. భూమి సస్యశ్యామలంగా ఉందంటే, భూమ్మీద జీవరాశులు ఉన్నాయి అంటే దానికి కారణం సూర్యభగవానుడు. అందువల్ల సూర్యభగవానునికి ప్రార్థించవచ్చు. అది సంధ్యావందనంలో మనం చేస్తాము కూడా. సూర్యుడు లేకపోతే అగ్ని సమక్షంలో చేస్తాము. అగ్ని, వాయువు, భూమి అన్నీ భగవంతుని విభూతులే.

అంతదాకా ఎందుకు? మన శరీరంలోని ఒక్కొక్క అంగమూ భగవంతుని మహిమ కాదా? మనం ఒక్క అంగాన్ని సృష్టించగలమా? మనకు భగవంతుడు ఇచ్చిన ఆ అంగాలను కాపాడుకోవటమే బ్రహ్మప్రళయం అయిపోతోంది. కన్ను ఎంత మహిమాన్వితమైనది?

**ఇన్ధో హ వై నామైష యోఽయం దక్షిణే అక్షన్ పురుషః** – బృహదారణ్యకం 4.2.2

కుడికంటిమీద ధ్యానం చెయ్యి అంటుంది ఉపనిషత్తు. ఏ సాంప్రదాయంలో ఇలా మన కన్నుని ఈశ్వరునిగా భావించటం చూస్తాము? ఇలాంటి విషయాలు తరచి చూసినకొద్దీ, అంతకంతకూ అద్భుతంగా అనిపిస్తుంది. కృష్ణపరమాత్మ అనేక విభూతులను పేర్కొన్నాడు – కొన్ని శాస్త్రంలోంచి, కొన్ని జగత్తులోంచి. వాటి వివరాలలోకి వెళ్ళటం లేదు మనము.

కాని ఈ విభూతులు చెప్పే ముందు, ముగించే ముందు రెండు ముఖ్యమైనవాటి గురించి చెప్పాడు. ఏమిటవి? ఆరంభించే ముందు మనలో ఉన్న చిత్ అంశం గురించి చెప్పాడు.

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః** – 10.20

ఈ శరీరం చైతన్యవంతంగా ఉందంటే దేనివల్ల? మహాత్మాగాంధీ విగ్రహంమీద కాకి వాలినా, ఆయన చేతిలో కర్ర ఉన్నా ఆ కాకిని ఆయన అదిలించలేరు. ఎందుకు? అది విగ్రహం కాబట్టి. అది జడం కాబట్టి.

ఆ విగ్రహానికీ, మన శరీరానికీ మధ్య భేదం ఏమిటి? చైతన్యం. ఆ చైతన్యమే నాయొక్క గొప్ప విభూతి అన్నాడు కృష్ణపరమాత్మ.

**యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున** – 10.39

ఒక్క చిత్ మాత్రమే కాదు, సత్ కూడా అన్నాడు చివర్లో. ఈ జగత్తుకి ఉనికి కూడా నేను అరువు ఇచ్చినదే అన్నాడు. ఆభరణానికి ఉనికి ఎలా ఆభరణానిది కాకుండా, బంగారానిదో, అలా జగత్తు ఉనికి జగత్తుది కాకుండా, భగవంతునిది. ఎలా నిరూపించగలము? ఆభరణంలోంచి బంగారం తీసి చూడండి. ఆభరణం నిలవలేదు. అలా జగత్తుకు ఉనికి భగవంతునినుంచి వచ్చింది. అంటే భగవంతుడు లేకపోతే జగత్తుకి ఉనికి లేదు. అలా చిత్ అంశతో మొదలుపెట్టి సత్ అంశతో ముగిస్తూ, మధ్యలో అన్నీ నా విభూతులే అన్నాడు.

కాని సమస్య ఏమిటంటే సత్, చిత్ అంశాలు నిర్గుణస్వరూపాన్ని సూచిస్తాయి. నిర్గుణస్వరూపధ్యానం కష్టం కాబట్టి ఏదైనా సగుణస్వరూపాన్ని తీసుకుని, దానిమీద ధ్యానం చెయ్యవచ్చు. నదిమీద ధ్యానం చెయ్యవచ్చు, ఆవుమీద ధ్యానం చెయ్యవచ్చు. ఆ మాటకొస్తే దేనిమీదైనా ధ్యానం చెయ్యవచ్చు. కృష్ణపరమాత్మ అనేకానేక విభూతులు చెప్పాక, ఈ విభూతులతో నీకు తృప్తి కలుగకపోతే, నీ స్వంతంగా నువ్వు కొన్ని కలుపుకోవచ్చు అన్నాడు. అలా విభూతులను ఎలా చూడాలో, కృష్ణపరమాత్మే ఒక సూచన కూడా ఇచ్చాడు.

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥** – 10.41

జగత్తులో అద్భుతమైనదాన్ని దేన్ని చూసినా అది భగవంతుని విభూతి, శక్తివంతమైనదాన్ని దేన్ని చూసినా అది కూడా భగవంతుని విభూతే. ఈ విభూతులు ఇన్నే అని చెప్పటానికి లేదు. ఎందుకంటే నా దివ్యవిభూతులకు అంతమే లేదని చెప్పాడు కృష్ణపరమాత్మ. చిన్న చీమను చూసినా, ఎగిరే పక్షిని చూసినా అద్భుతంగా ఉంటుంది. పక్షిని చూసి మనం కూడా ఎగరటానికి విమానాలను సృష్టించుకున్నాము. సాలెగూడు చూసి, సాలెపురుగుమీద కోపం తెచ్చుకునే బదులు దానిమీద ధ్యానం చెయ్యవచ్చు.

ఒక భక్తుడు అద్భుతంగా చెప్పాడు –

**అసితగిరిసమం స్యాత్ కజ్జలం సింధుపాత్రే**
**సురతరువరశాఖా లేఖనీ పత్రముర్వీ**
**లిఖతి యది గృహీత్వా శారదా సర్వకాలమ్**
**తదపి తవ గుణానామీశ పారం న యాతి** – శివమహిమ్న స్తోత్రం – 32

ఒకవేళ సాక్షాత్తూ సరస్వతీదేవే భగవంతుని మహిమలను రాయటానికి ప్రయత్నిస్తే ఎలా ఉంటుందో వర్ణిస్తున్నాడు ఇందులో. మన జ్ఞానం మిడిమిడి జ్ఞానం. కాని సరస్వతీదేవి జ్ఞానానికి అధిష్ఠానదేవత. ఆ మహిమలను రాయటానికి సరస్వతీదేవి కలాన్ని తీసుకుందిట. అలా రాయటానికి ఒక కలం చాలదు, ఒక్క చెట్టు చాలదు. అందువల్ల ఆవిడ దేవతావృక్షాలను తీసుకుందిట – సురతరువరశాఖా లేఖని.

కాగితం ఏమిటి? **ఉర్వీ –** మొత్తం భూభాగం ఆవిడ కాగితం. పూర్వం కలాన్ని ఇంకులో ముంచి రాసేవారు. ఆవిడకు ఇంకు ఏమిటి? మొత్తం సముద్రం. ఇంకు బరువు ఎంత? హిమాలయాలు – అసితగిరిసమం స్యాత్.

ఇవన్నీ తీసుకుని సరస్వతీదేవి రాయటం మొదలుపెట్టింది ఎప్పుడు? ఎప్పుడో! **లిఖతి యది గృహీత్వా శారదా సర్వకాలమ్**. సరస్వతీదేవి నిరంతరం రాస్తూనే ఉన్నా కూడా, **తదపి తవ గుణానామీశ పరం నయాతి** – సరస్వతిదేవి నీ గుణాల గురించి పూర్తిగా రాయలేదు.

అంత అనంతంగా గుణాలు ఉన్నాయి కాబట్టే, కృష్ణపరమాత్మ నేను నా గుణాల గురించి సంక్షిప్తంగా చెప్పాను అన్నాడు. నేను కొంత చెప్పాను, మిగతాది నువ్వు అల్లుకుపోవాలి అన్నాడు.

**4. ఉపసంహారం: శ్లోకం 42**

శ్లోకం 42లో ఈ విషయాన్ని ఇంకొక కోణంలోంచి కూడా చూడవచ్చు అన్నాడు కృష్ణపరమాత్మ.

**అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।**
**విష్టభ్యాహమిదం కృత్స్నమ్ ఏకాంశేన స్థితో జగత్ ॥** – 10.42

ఇంతవరకూ అనేక విభూతులు చెప్పుకొచ్చాడు. అనేక వస్తువులు చెప్పి, వాటిల్లో తాను ఉన్నాను అన్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడేమో నిజానికి వాటిలో నేను లేను, అవే నాలో ఉన్నాయి అన్నాడు.

ఆభరణాల్లో బంగారాన్ని చూస్తాము ముందు; తర్వాత ఆభరణాల్లో బంగారం లేదు, అసలు బంగారంలోనే ఆభరణాలు ఉన్నాయి అంటాము. నిజానికి ఆభరణాలు నామరూపాలు మాత్రమే. అవన్నీ ఏకమైన బంగారంలోనే ఉన్నాయి. అలాగే ఈ జగత్తు కూడా నామరూపాలు మాత్రమే. ఈ నామరూపాలన్నీ కూడా దానికి ప్రాథమిక కారణమైన జగత్తులో ఉన్నాయి అని అర్థం చేసుకోవాలి.

ఈ ఆఖరి శ్లోకం విశ్వరూపదర్శనయోగం అని తర్వాత వచ్చే అధ్యాయానికి బీజం.

**భగవంతుడు జగత్తులో ఉన్నాడు – విభూతియోగః**
**జగత్తు భగవంతునిలో ఉంది – విశ్వరూపదర్శనయోగః**

రెండూ ఆస్వాదించగలగాలి. అలలో నీరు చూడగలగాలి, అది ఒక రకమైన ఆస్వాదన. నీటిలో అన్ని అలలనూ చూడగలగాలి. అది ఇంకొక రకమైన ఆస్వాదన.

ఈ అధ్యాయంలో భగవంతునియొక్క అనేక విభూతుల గురించి కృష్ణపరమాత్మ చెప్పాడు కాబట్టి ఈ అధ్యాయానికి పేరు విభూతియోగః అని వచ్చింది. అంటే ఈ అధ్యాయము ఈశ్వరమహిమను వర్ణించింది.

## స్వామీజీ ఆణిముత్యాలు

నక్షత్రాలను చూడండి, మెరుపును చూడండి, జలపాతాన్ని చూడండి. ప్రకృతిలో శక్తివంతమైనది ఏది చూసినా ఎంత ఆశ్చర్యం వేస్తుంది! అంతేకాదు ఎన్ని అందాలు ఉన్నాయి ప్రకృతిలో. నిజంగా ప్రకృతిని సరిగ్గా ఆస్వాదిస్తే దాని అందాలతో మైమరచిపోతాము. అటువంటి అందాన్ని, అటువంటి అద్భుతాన్ని చూసినప్పుడు దేవుని సృష్టి ఎంత అద్భుతం అని అనుకోకుండా ఉండలేము. మతపరమైన భావన ఉన్న వ్యక్తి అద్భుతమైనదాన్ని దేన్ని చూసినా దానికి నమస్కారం చేస్తాడు. అంతేకాదు, పూర్వకాలంలో ఒకవేళ ఏదైనా అటువంటి అద్భుతమైన వస్తువు ఎవరికైనా దొరికినా కూడా అతను దాన్ని ఉంచుకునేవాడు కాదు. ఇంత అద్భుతాన్ని నా దగ్గర పెట్టుకునే అర్హత నాకు లేదు అనుకునేవాడు. అది ఆలయంలో ఇచ్చేసేవాడు. ఎందుకు? అందులో అతను భగవంతుణ్ణి చూస్తాడు కాబట్టి.